మార్చి-ఏప్రిల్ 2007

పేజీలు : 48

వెల : రు 10/-

అరుణతార

తెలుగు సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

సంపుటి 26 ● సంచిక 5 ● విజయవాడ



CI

KLVA101M137

అరుణతార
సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

2007
మార్చి, ఏప్రిల్
264

సంపాదకుడు
సి.ప్రసాద్

మేనేజర్
ఎస్. రవికుమార్
5-1307,
దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు,
కడప జిల్లా - 516 360.
సెల్ : 98660 21257

సంపాదకవర్గం
పాణి
కృష్ణాబాయి
వి.చెంచయ్య
మోహన్
నాగరాజు

రచనలు పంపవలసిన చిరునామా :
టి. కృష్ణాబాయి
9-19-3
CBM కాంపౌండ్
విశాఖపట్నం - 530 003.

సంపాదక లేఖ

సంప్రదాయ అర్థం ఏమైనప్పటికీ

రివిజనిజం అధికారంలోకి వస్తే ఫాసిజం అవుతుందని నందిగ్రామ్ నిరూపించింది. విచిత్రమేమంటే రివిజనిజం మీద మహత్తర క్రియాశీల పోరాటం జరిగిన తెలుగు నేలపై ఇవాళ ఈ మాట అనడానికి కొంచెం సంకోచించాల్సి ఉన్నా, అనక తప్పదు. ఎందుకంటే ప్రపంచ వ్యాప్తంగానే రివిజనిజానికి కాలం చెల్లి, కమ్యూనిస్టు ముసుగు కూడా భారమైపోయిన గత శతాబ్దపు చివరి దశాబ్దంలో ఇక్కడ రివిజనిజం నిలదొక్కుకుంది, ప్రగతిశీల ప్రదర్శనను ముమ్మరం చేసింది

అప్పటికి ఇరవై ఏళ్లకు పైగా విప్లవోద్యమం తాత్విక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో రివిజనిజాన్ని ఎదిరించడమే లక్ష్యంగా ఒక దశ కొనసాగింది. అది ఇంకా విస్తృతమై ప్రజానుకూలంగా కనిపించే వాదనలన్నిటిలోని రివిజనిస్టు ధోరణులపై పోరాటంగా పరిణమించిన సమయంలోనే రివిజనిస్టు పార్టీలు నిలదొక్కుకోగలిగాయి

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, హిందూ ఫాసిజం, యుద్ధం ముప్పేట అట్టడుగు ప్రజాజీవితాన్ని కబళించివేస్తున్న సమయంలో వీటికి వ్యతిరేకంగా గడ్డిపోచను కూడా వదలి పెట్టడానికి వీల్లేని స్థితిలో రివిజనిజం బలం పుంజుకుంది

బాబ్రీ విధ్వంసం, గుజరాత్ మారణకాండ, ఆఫ్ఘన్ - ఇరాక్ యుద్ధాలకు వ్యతిరేకంగా చరిత్ర కల్పించిన అనివార్యతలో ఐక్యతపాలు ఉన్నంతగా ఘర్షణ లేకపోయింది. మార్క్సిస్టు పార్టీకి నూతన ఆర్థిక విధానాల పట్ల నిజాయితీతో కూడిన నిరసన లేకపోవడం, వాటిని అమలుచేస్తున్న అధికార పార్టీలతో రాష్ట్రంలో, కేంద్రంలో సహజీవనం చేయడం, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో నిరాటంకంగా ప్రపంచీకరణ విధానాలను కొనసాగించడం గురించి ప్రగతిశీల విప్లవ శక్తులకు అప్రమత్తత ఉన్నా 1970లలో, 80లలో వలె రివిజనిజంపై పోరాటమే ఒక ప్రధాన ఎజెండా కాలేని స్థితి బలోపేతమైంది.

ఈ సంక్లిష్టతలో ప్రపంచీకరణను వ్యతిరేకిస్తున్నట్లు మాట్లాడే మార్క్సిస్టు పార్టీ సామ్రాజ్యవాద దోపిడీకి తానే ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటుకు సిద్ధమైంది. కాదన్నందుకు రైతులను మూకుమ్మడిగా కాల్చి చంపైనా సరే వాళ్ళ భూములను పెట్టుబడిదారులకు ధారాదత్తం చేద్దామనుకుంది.

అధికారంలో ఉన్న ఏ యితర పార్టీల కంటే మార్క్సిస్టు పార్టీ భిన్నమైంది కాదని, రివిజనిజమంటే సామ్రాజ్యవాదశక్తుల చేతికి అంది వచ్చే ఆయుధమని, అధికార బలంతో అది మాఫియాగా మారిపోతుందని నందిగ్రామ్ స్పష్టం చేసింది

ఒక్కమాటలో చెప్పాలంటే సమాజ ఉన్నతీకరణపట్ల భావజాల, రాజకీయార్థిక, సాంస్కృతిక రంగాల్లో మార్క్సిస్టు పార్టీకి సామ్రాజ్యవాద వ్యూహానికి భిన్నమైన ఆలోచనలేవీ లేవు. పైగా సామ్రాజ్యవాద విధానాల అమలుకోసం ఎంతటి మారణహోమానికైనా సిద్ధమే అని చాటిచెప్పుకుంది

ఇంత జరిగినా నందిగ్రామ్ ఘటన పట్ల తెలుగు సమాజం పెద్దగా ప్రతిస్పందించలేదు. ముమ్మరంగా నిరసనలేవీ జరుగలేదు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సెజ్‌ల విషయంలో వెనకడుగు వేయడంతో ప్రజాస్వామికవాదుల కోపమూ చల్లబడ్డట్టుంది

ఇదంతా రివిజనిజం ప్రాబల్యాన్నే, మార్క్సిస్టు పార్టీ పట్ల మిగిలివున్న భ్రమలనో సూచిస్తుందనుకోవాలా? అదే నిజమైతే సోషల్ ఫాసిజానికి సమ్మతి దొరుకుతుందనుకోవాలా?

భూస్వామ్య సామ్రాజ్యవాదాలకు, హిందూ ఫాసిజానికి - రివిజనిజానికీ వ్యతిరేకంగా పోరాడకపోతే వేరుపురుగు అనుకున్న ప్రమాదం ఇంతింత విధ్వంసంగా అందరినీ, అన్నింటినీ కబళించివేస్తుంది.

ఈ సంచిక వెల	: 10 రూ.	చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో
సంవత్సర చందా	: 100 రూ.	మేనేజర్‌కు పంపించండి. డి.డి.లను
జీవితచందా	: 1000 రూ.	ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.

ఈ సంచికలో...

కథలు
పేజి 3-10
ముక్కల దొంగలు : ప్రశాంత్
చదువు : మాధవి
వారధి : పాపినేని శివశంకర్

అజ్ఞాత హృదయం
నందె : టుంబ్రి

వ్యాసం
పేజి 11-26
ప్రశ్నించడం నేర్పిన వల్లంపాటి : పలమనేరు బాలాజి
సాహిత్య విమర్శ గురించి వల్లంపాటి : రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
ఆధునిక తెలుగు సాహిత్యం, వల్లంపాటి స్థానం : వివినమూర్తి
దండకారణ్యంలో నిర్బంధం, సాంస్కృతిక ఉద్యమం : శేషు
ప్రత్యేక ఆర్థిక మండళ్ల అభివృద్ధి ఎవరి ప్రయోజనాల కోసం : సుధాకర్ ఎస్.
చైనా కార్మికవర్గ స్థితిగతులు : రాబర్ట్ వీల్
తెలుగు : అరుణ్

కవిత్వం
పేజి 27-33
జమీన్, పచ్చల కిరణ్‌కుమార్, జంఝావతి, వడ్డెబోయిన శ్రీనివాస్, కె.రెడ్డెప్ప, శ్రీమన్న, ఉదయగీతిక, పిన్నిక శ్రీనివాస్, ఎం.ఎ.బాసిత్, ఎఱ్ఱమల్లె.

పుస్తక సమీక్ష
పేజి 34
నాయని కవితాత్మని ఆవిష్కరించిన చేరా : చలసాని ప్రసాద్

విమర్శ
పేజి 35-37
ప్రపంచీకరణ - రెండు కథలు : పాణి

సైన్స్ వ్యాసం
పేజి 38
కాలం-అవగాహన3 : కొడవటిగంటి రోహిణి ప్రసాద్

చర్చ
పేజి 39-40
'ఆమె తలాక్ అన్నది' కథలో లోపాలు, విమర్శలో లోపాలు : మద్దూరు లక్ష్మి

నివేదిక
పేజి 41-43
అమరావతిలో కథకుల సమావేశం

నవలిక
పేజి 44-48
శికారి - పాణి

ఇంకా పిల్లల ప్రపంచం కొత్త శీర్షిక, ఉత్తరాలు, ప్రకటనలు, స్వీకారం...

కవర్ పేజీలపై బొమ్మలు :
డాక్టర్ లక్ష్మి సుహాసిని

ఇవి సుహాసిని తయారు చేసిన పత్రచిత్రాలు. చెట్లపై, కొమ్మలపై మిసమిసలాడే ఆకుల అందాలను చూసి అందరం ఆనందిస్తాం, కానీ సుహాసిని ఎండిన ఆకుల్లో ఇన్ని అందాలుంటాయని, వాటితో ఇంత సౌందర్యాన్ని సృష్టించవచ్చునని చూపిస్తోంది. అందానికి కూడా చూసే దృష్టి కావాలి. సుహాసిని ఆకుల అందాల్లోంచి సందేశం వినిపించాలనుకుంది. ఆమె కళాదృష్టికి సామాజిక దృక్పథం తోడైంది. శ్రమైక జీవన సౌందర్యంలో ఎన్ని కష్టాలు, కన్నీళ్లు, ప్రతిఘటనలు ఉంటాయో కదా! సుహాసిని పత్ర చిత్రాల్లో ఇవన్నీ గొప్పగా కనిపిస్తాయి.

☆ ప్రశాంత్

ముక్కల దొంగలు

సాయంత్రం బల్ల అయిపోయింది. జగదీష్‌కు లైఫ్ పడిందన్న వార్త అందరినీ విషాదంలో ముంచింది. జగదీష్ అందరినీ బెదిరించుకుతింటాడన్న పేరున్నా నర్మదా బ్యారక్ చలించిపోయింది.

లాకప్ సమయం దగ్గర పడుతున్నది. బైట చెట్ల దగ్గర నేను, చిచ్చా, రఘునాథ్, డూమార్ కూర్చున్నాం. రోజూలాగే చిచ్చా 'అకేలే హై చలే ఆవో జావో హో తుమ్' లత పాట పాడాడు. పాత హిందీ పాటలైనా, పూరి జగన్నాథుని జానపద భక్తి పాటలైనా అద్భుతంగా పాడగలడు.

"బాబూ నాయుడు కా కిస్సా క్యాహై" అన్నాడు చిచ్చా.

అప్పటికే లాకప్ బెల్ అవడంతో ఆలోచిస్తూ బ్యారక్‌లోకెళ్ళాం. అంతకంటే మమ్మల్ని బాధించే విషయం అందరి దగ్గరా బీడీలు అయిపోయాయి. క్యాంటీన్ రావడం లేదు, ఇంటర్వ్యూలూ లేవు.

భోజనం తర్వాత బీడీలు ఉన్నవాళ్ల దగ్గర ఎంత ప్రాధేయపడుతున్నారో నాయుడు, ఉప్పరాపల్లి సత్తిబాబు ఇంకా చాలామంది.

లాకప్ తర్వాత ఈ భిక్షాటనా ఉండదు. సైగలే తప్ప అరుపులు వినబడవు. బ్యారక్‌ల మధ్య ఎడం ఎక్కువ. కోరుకొండ నాయుడికి ఇంటర్వ్యూలు రాక రెండు నెలలు దాటిపోతున్నది. ఎప్పుడూ నవ్వుతూ బ్యారక్‌లు తిరిగే నాయుడు కొన్నాళ్ళబట్టి అదోలా ఉంటున్నాడు.

బీడీ ముక్కల కోసం ఎంతమందిని ఎన్నిమార్లు ప్రాధేయపడతాడో చూస్తే మనసు వికలమౌతుంది. నాయుడే కాదు, ఈ జైల్లో ముక్కల దొంగలందరి స్థితీ ఇదే.

రెడ్డి మాత్రం ముక్కల దొంగలని నానా బూతులూ తిడతాడు. రెడ్డి ఉద్దేశంలో వీళ్ళందరూ నేరాలు చేసేవారనీ, చేయకుండా ఉండలేరని. వాస్తవమేంటో చెప్పడానికి ఎంత ప్రయత్నించినా వినేవాడు కాదు. నిజానికి రెడ్డి జీవితం కూడా అంతే బాధకరమైంది. ఎక్కడో మహబూబ్‌నగర్ జిల్లా ఆయనది. హత్యకేసుల్లో ఇరుక్కొని ఆ కేసుల నుండి బయటపడడానికి వకీళ్ళకు ఫీజులు కట్టడంకోసం విజయవాడ, విశాఖల్లో మోటార్ సైకిళ్ళ లిఫ్టింగ్ కేసుల్లో పడ్డాడు.

విశాఖ జైల్లో ఎక్కువ మంది ముక్కల దొంగలే ఉంటారు. అట్లాంటి ముక్కల దొంగల్లో నాయుడు కూడా ఒకడు. ఏ కారణం వల్లో కానీ తనకు ఎయిడ్స్ ఉందని ప్రచారం చేసుకొన్నాడు. రోజుల వ్యవధిలోనే గంగా, యమునా, కావేరి, స్నేహ సరోవరం అన్ని బ్లాకులలోకి పాకింది. నర్మదా సరేసరి. మధ్యాహ్నం ఒంటరిగా కూర్చున్నపుడు మైకులో ఈ నదుల పేర్లతో బ్యారక్‌లను పిలిచినపుడు ఒకవైపు నవ్వొచ్చేది. బాధా కలిగేది. సజీవ ప్రవాహాల పేర్లు బతుకును స్థాణువు చేసే కారాగారానికి పెట్టడమేంటా అనుకొనేవాణ్ణి.

ఎయిడ్స్ ప్రచారంతో నాయుణ్ణి అందరూ ఒకలా చూడ్డం మొదలుపెట్టారు. ఎస్కార్ట్ పోలీసులకు కోర్టు దగ్గర నాయుడు భార్య, తండ్రి కలిస్తే వాళ్ళకూ విషయం చెప్పడంతో ఇంటర్వ్యూలు పెట్టడం మానేశారు. దీంతో నాయుడు కూడా ఎవరూ పలకరించని బెంగాలీ ఇస్మాయిల్‌లాగా అయిపోయాడు. నాయుడు స్వభావాన్ని ఎరిగి ఉన్న వారెవరైనా ఆ వార్త అబద్ధమని తెలుసుకోవచ్చు కానీ, రోజూ జైలు హాస్పిటల్‌కు వెళ్ళడం మూలాన అందరికీ అనుమానం.

ఒకరోజు సాయంత్రం బల్ల తర్వాత బీడీ కోసం పూలచెట్ల మధ్య హడావుడిగా తిరుగుతున్నాడు. నాయుడుతో పాటు ముక్కల కేసు గోవిందూ ఉన్నాడు.

నాయుడి దగ్గరకెళ్ళి, "ఏంటీ ప్రచారం" అన్నాను.

"ముందో సిగరెట్టివ్వండి. లాకప్ కదండీ, రేపు తీరిగ్గా మాట్లాడదాం లెండి," అంటూ సిగరెట్ ముట్టించుకొని వెళ్ళిపోయాడు.

రెండునెల్ల బట్టి ఇంటర్వ్యూలు లేకపోయినా జైలు చేస్తున్నాడని, మాటకారి మనిషని గోవిందు లాకప్ తర్వాత జైలు కబుర్లలో చాలాసార్లు చెప్పాడు.

ముక్కల కేసు గోవిందుకు పదిహేనేళ్ళ పైనే జైలు అనుభవం ఉంది. పాతా కొత్త జైళ్ళ సంగతులు, వార్డర్లూ, జైలర్లూ సూపరింటెండెంట్‌ల సంగతులు చాలా చెప్పేవాడు.

***

సబ్‌జైలు మారి సెంట్రల్ జైలుకు వచ్చిన తర్వాత తోటి ఖైదీల పలకరింపుల్లో ఏం కేసు అనడిగితే, 'ముక్కల కేసండి' అనేవాళ్ళు. ఈ ముక్కల కేసులేంటో తెలియలేదు. స్నేహ సరోవరం బ్యారక్ మారి నర్మదా వచ్చిన తర్వాత హరికృష్ణ నాయుడు, గోవిందు ముక్కల దొంగతనం గురించి చాలా చెప్పారు.

ముక్కలంటే విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉండే ఇనుపముక్కలని, ఈ ఇనుపముక్కల్ని కొనడానికి చుట్టుప్రక్కల ప్రాంతాల్లో స్క్రాప్ కొట్లుంటాయని, ముక్కల దొంగల్ని చాలాసార్లు వాళ్ళే బెయిల్ పెట్టి విడిపిస్తారని చెప్పారు. గాజువాక చుట్టుప్రక్కల ప్రాంతాల్లోని యువకులు వందలాది మంది ఈ ముక్కల దొంగలై పోయారని చెప్పారు.

"నైట్ వెళ్ళామనుకో అనియా, పదిహేనొందలు, రెండు వేలు. బరువులు మోస్తే ఇంకా ఎక్కువే అనియా," అన్నాడు హరికృష్ణ. చాలా ఆశ్చర్యం అనిపించింది. ఇంత పెద్ద పరిశ్రమ, పరిశ్రమ అంటేనే అభివృద్ధికి నిదర్శనమైంది. అలాంటిది చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజల్ని ఎట్లా నేరంలోకి దించింది.

రోజూ లాకప్ తర్వాత చాలా కబుర్లు చెప్పుకొనేవాళ్ళం. వారించినా వినకుండా బూతు, అక్రమ సంబంధాల జోలి చెప్పంది ఉండేవాడు కాదు నాయుడు. ఆజ్యం పోసినట్టు చిరంజీవి బీడీ ఇచ్చి, వాయిదాకు వేసుకోవడానికి షర్టు, చెప్పులు ఇస్తానని చెప్పి మరీ చెప్పించుకొనేవాడు.

ఎంత మట్లాడినా అలసిపోయేవాడు కాదు నాయుడు. నిద్ర వస్తున్నా, జైలర్ తిట్టినా నవ్వేసి మళ్ళీ బీడీ ముట్టించి సంగతులు చెప్పేవాడు. బల్ల తర్వాత ఏ పనులూ ఉండవు కాబట్టి మరుసటి మధ్యాహ్నానికి నాయుడు విషయం మాట్లాడదామనుకొన్నాను. ఉదయం గిన్నీ, టిఫిన్ బల్ల, మేస్త్రీ అరుపులు చికాకైన వ్యవహారం.

మేస్త్రీ నాయుణ్ణి ఎంత తిట్టినా పట్టించుకోకుండా అందర్నీ నవ్విస్తూ, "ఏటి డాడీ నువ్వు తిట్టేస్తే ఎలాగా," అనేవాడు. చీపురు పట్టుకొని అలాగ తిరిగేవాడు.

మధ్యాహ్నం బల్ల అయిపోయింది. నా అలవాటు ప్రకారం చిచ్చా బ్యారక్‌కు వెళ్ళాను. బీడీ ముట్టించి ఖైనీ కోసం చిచ్చాకు ఒకటిచ్చాను. పాటందుకొన్నాడు.

"సుహానీ చాందనీ రాతే! హమే సోనే నహీ దేతే" ఇంతలో నాయుడు ఊడిపడ్డాడు.

"ఏటండీ మీరేదో సిగరెట్టిస్తారనుకుంటే మీరూ బీడీయే," అన్నాడు నిరాశగా.

"రెండు రోజులైంది నాయుడూ క్యాంటీన్ లేదు, సిగరెట్లూ లేవు," అన్నా.

అప్పటికే చిచ్చాలేచి, "బేటా ఆప్ బాత్ జారీ రఖో మై జరా లేట్ తాహు," అంటు దిమ్మెపై పడుకొన్నాడు.

చిచ్చా పేరు గౌరి ప్రసాద్ పట్నాయక్, ఒరిస్సా. ఆర్ద్రమైన మనిషి పేదరికం వల్ల అత్యాశకు పోయి పంచలోహ విగ్రహాల కేసులో ఇరుక్కొన్నాడు. ఇంటర్వ్యూలు ఉండవు కానీ బల్ల తర్వాత ఇంటర్వ్యూల అనౌన్స్‌మెంట్ వినడానికి అదేపనిగా వెళ్ళి చెట్ల కింద కూర్చునేవాడు.

"ఎందుకు చిచా, నీ కోసమైతే ఎవరూ రారు కదా. ఎందుకంత శ్రద్ధగా

కూర్చుంటావ్," అంటే,

"నై బేటా, మేరాతో కోయి ఆయెగానై. ఓతో పక్కా హై. కోయి ఇన్‌సాన్‌కా తో ఆయేగా, అగర్ ఓ నై సునాతో హమ్ బోలేంగే, ఓ ఖుషీ హోజాయేగా," అనేవాడు. "పర్‌సొంత్ బాబు ఇంత్‌జార్ కా పల్ బహుత్ కఠిన్ హోతా హై," రోజుకు ఎన్నిసార్లు ఈ మాట అనేవాడో.

నాయుడు వచ్చి పిచ్చాపాటి మొదలు పెట్టేసరికి మధ్యాహ్నం ఒంటిగంట, చాయ్ టైమైంది. బందురాజు నాకు, నాయుడికి టీ పట్టి తెచ్చాడు.

చాయ్ బీడీ కాంబినేషన్‌తో మాటలు మొదలు పెట్టాం. నేనే అన్నాను, "ఏంటి నాయుడు ఈ ఎయిడ్స్ ప్రచారం," అని.

"అధో పెద్ద స్టోరీలెండి. మరది చెప్పాలంటే చాలా బీడీలౌతాయండి," అన్నాడు.

తప్పదు, "సరే," అన్నాను.

రొమాంటిక్ కట్టుకథలు చెప్పి, బీడీలు సంపాదించుకొని పని గడుపుకొనే మనిషని కొంచెం పరిశీలించినా తెలిసిపోతుంది.

"ఏళ్ళ బట్టి జైలు చేస్తున్నానండి, చేసిన నేరాలు కొన్ని, చేయనివి కొన్ని. ఎప్పుడూ ముక్కల కేసే. ఇంకోటేదీ లేదండి. మా గాజువాకలో చాలా మందిమి ఉన్నామండి ముక్కల దొంగలం. నాకు తెల్దుగాని కొన్ని వేలమంది అనుకుంటానండి. ఈ గోవిందుగోడు మా పెద్ద సీనీరండి. ఆడి పెళ్ళాం కూడా ముక్కల కెళ్తుందండి. పట్టేసుకున్నారనుకోండి. అలాగ పని జరుపుకుని బయటపడుతుందండి గుంటది. గోవిందుగోడు పది, పదిహేనేళ్ళ బట్టి పప్పే. రాడం, పోడం ఇదేనండి.

మరదేం చేస్తుందండి. నేనూ పాజైలు చేసానండి. ఏడెనిమిదేళ్ళ బట్టి పప్పు తింటున్నానండి. ఆర్నెల్ల బట్టి పప్పే. ఎవరూ రాట్లేదండి. మా నాన్న రాడు, నా పెల్లామూ రాదు. ఏటి సేత్తాం సెప్పండి. బెయిలు మాట అలాగొదిలీండి, బీడీలైనా ఇవ్వాలి కదండి, అదీలేదు. ఎవడో సినిమా డైరెక్టర్ వచ్చాడండి. ఆడికలాగా సొల్లు సెప్పేసి బోల్తా కొట్టిస్తే ఆడొచ్చాడండి ఇంటర్వ్యూకి.

ఎలాగుంటాది సెప్పండి. అందుకే మండిపోయి ఎయిడ్స్ ఒచ్చేసిందన్నానండి. అలాగైనా బెయిల్ పెట్టేసి తీస్తారేమో అనీసి. ఇదిగో ఇక్కడె సిక్కొచ్చేసిందండి. నా పెళ్ళాముంది కదండి, ఆ గుంటది అళ్ళమ్మగారింటికెళ్ళిందండి. ఆడు మా నాన్న రాలేదండి. జైల్లో ఇంతేసి ప్రచారం మాత్రం జరిగిపోయిందండి. ఏటి సేత్తాం సెప్పండి," అన్నాడు.

"అయినా ఏటుందండీ కేసులూ, జైలు చేయడం, ఒళ్ళీ ముక్కలు. ఏం సుకం లేదండి. గాజువాక పోలీసులున్నారు కదండి, నంజీకొడుకులు నెలలు నెలలు లాకప్పుల్లో పెట్టేసి కొట్టేస్తారండి. ఏం సుకం లేదండి," ఈ మాట అంటున్నపుడు నాయుడు ముఖంలో నిరాశ, కసి కనిపించాయి.

సాయంత్రం బల్ల వరకు చాలా విషయాలు చెప్పాడు. ముక్కల దొంగతనం ఎంత సాహసంతో కూడుకొన్నదో చెప్పాడు.

ప్లాంట్‌లోకి వెళ్ళే రన్నింగ్ గూడ్స్ ఎక్కి భోగీల మధ్య దాక్కొని లోపలికెళ్ళడం, ముక్కలేసుకొని బండి ప్లాంట్ దాటిన తర్వాత బ్రేక్ వాక్యూమ్ తీసి దూకడం ఎంత ప్రమాదకరంగా ఉంటుందో చెప్పాడు. సిఐఎస్ఎఫ్ పోలీసుల్ని గమనించాలి, లేదంటే కేసులు, ఒళ్ళు హూనం. అట్లా ప్రమాదాల్లో, పోలీసుదాడుల్లో చనిపోయిన వాళ్ళను గుర్తు చేసుకొన్నాడు.

"మీరో సారి రండీ, పాత గాజువాకలోని అయిల్‌గాడెక్కడంటే చెప్పేస్తారండి. నన్ను ఆయిల్‌గాడంటేనే తెలుస్తుంది. మా ముక్కలోళ్ళందర్నీ పరిచయం చేస్తాను. రన్నింగ్ గూడ్స్‌లో ప్లాంట్‌లోకెళ్దాం."

"ఈ ముక్కల్లో ఏటొస్తుంది చెప్పండి. వచ్చిందంతా ముండలకీ, ముందుకి, పోలీసులకే పోతుందండి. మళ్లీ వాయిదాలు, వారెంట్లూ. ఈ ఇన్ఫర్మేషన్ గాళ్ళతో చిక్కు. మా ముక్కలోళ్ళే ఇన్ఫర్మేషన్ గాళ్ళండి. రెండేసినెల్లు, మూడేసి నెల్లు లాకప్పుల్లో ఉంటాం కదండి. అలాగ ఇన్ఫర్మేషనగాళ్ళవుతారండి. ఏటిసేత్తాం పని గడవాలి కదండి. జైల్లోనూ ఇన్ఫర్మేషన్ గాళ్ళెక్కువేనండి. అందులోని మన నర్మదాలో ఇంకా ఎక్కువండి. ఇన్ఫర్మేషన్ కోసమే కేసులు పెట్టేసి పంపిస్తారండి," ఇలా మాట్లాడుకొంటూనే బయటికెళ్ళాం. అటూ ఇటూ తిరుగుతూ మాటలు కొనసాగించాం. మధ్యలో ఆకులమద్ది వెంకటరమణ కలిస్తే బీడీ కాల్చేసి నేనూ, చిచ్చా, రఘునాథ్ స్నానానికెళ్ళాం.

స్నానమయ్యేసరికి బల్ల వచ్చేసింది.

డైనింగ్ హాల్లో గొడవ, అరుపులు. స్పెషల్ బెల్లం కోసమో, చపాతి ముక్కల కోసమో. రొట్టె తినే ప్రాంతాలవాళ్ళు జైలుకొస్తే రోజూ నాలుగేసి చపాతీలిస్తారు.

హిందీవాళ్ళకు చపాతి వస్తుందని మిగతావాళ్ళకు కోపం. అట్లా జైల్లో హిందీవాళ్ళు, తెలుగువాళ్ళ మధ్య విభజన. ఘర్షణ కొనసాగేది. బల్ల దగ్గర బెంగాల్ బబ్లూ శర్మ ఆధిపత్యం ఉండేది. దాంతో ప్రతిరోజూ గొడవ.

చిచ్చాతో ఉంటే, "ఏటండీ హిందీవోల్లతో ఉంటారు?" అనేవాడు గోవిందు.

బల్ల అయిపోగానే నేనూ, చిచ్చా, రెడ్డి ముగ్గురం ఆవరణలోకొచ్చాం.

అప్పటికే చిరంజీవి చెట్ల మధ్య కూర్చుని బీడి కాల్చుతున్నాడు. "ఏంటి చిరంజీవి ఆలోచిస్తున్నావ్," అంటే, "ఏముంటాయండి, జైలు బాధలు. నా లవ్వు రాలేదండి ఇంటర్వ్యూకి. ఈ పూట వస్తుందనుకొన్నా. గోవిందుగోడి పెల్లామురాలేదుటండీ బాధపడిపోతున్నాడు" అన్నాడు.

"వచ్చేటప్పుడు దాంతో గొడవ పడ్డాడటండీ" అంటూ ముగించాడు.

లాకప్ అయ్యింది. రోజూలాగే హరికృష్ణతో మాట్లాడుతూ కూర్చున్నా. హరికృష్ణ మాటల్లో తాత్వికత ధ్వనించేది. ఎంత ఇబ్బందికరమైన పరిస్థితినైనా చాలా సులభంగా, ఒత్తిడికి గురి కాకుండా పరిష్కరించేవాడు.

నేను బ్యారక్‌లోకెళ్ళిన మొదటిరోజు హరికృష్ణే ఆహ్వానించాడు. "రా కూర్చో అనియా, మేమూ మీలాగే," అన్నాడు మెత్తగా.

అప్పటి నుంచి మా ఇద్దరి మధ్య స్నేహం కుదిరింది. అన్‌లాకప్ సమయాల్లో నాకు తెలిసిన సంగతుల్ని లాకప్ తర్వాత హరికృష్ణతో రూఢీ చేసుకొనేవాణ్ణి. నాకెందుకో నమ్మదగ్గ మనిషిలా కనిపించాడు. వచ్చిన కొత్తలో తన వ్యక్తిగత విషయాలు కొన్ని అబద్ధం చెప్పినా రాను రాను వాటి వెనకాల వాస్తవాలేమిటో చెప్పసాగాడు. మొదట్లో తనకు పెళ్ళి కాలేదన్నాడు, తర్వాత అయిందన్నాడు. ఆ తర్వాత, 'లేదనియా, జ్యోతి అని గుంటుంది. అది మా ఫ్రెండ్ భార్య. అలాగ సంబంధం ఏర్పడిందనియా, ఏటిసేత్తాం,' అన్నాడు.

హరికృష్ణేకాదు ఈ జైల్లో చాలా మందికి పెళ్ళిళ్ళు కాలేదు కానీ వాళ్ళతో సంబంధమున్న వాళ్ళు ఇంటర్వ్యూల కోసం వస్తుంటారు.

రెడ్డి ఒక రోజు అన్నాడు, "దొంగ కొడుకులకు గూడ వొస్తరాబై, వీళ్ళకేం ప్రేమలు బై" అనేవాడు.

రాను రాను జైల్లోని మనుషులు గొప్ప ప్రేమికులుగా, అద్భుతమైన మనుషులుగా కనిపించారు.

***

రాత్రి పదకొండు దాటుతున్నది. జైలర్ రంగనాయకులు రౌండ్‌కు వస్తున్నట్టు బూట్ల చప్పుళ్ళు వినిపించగానే హరికృష్ణ అన్నాడు, "దొంగనాకొడుకనియా, పడుకో"

అంతసేపూ ముక్కల దొంగతనం గురించి, గోవిందు జీవితం గురించి, తన అక్రమ సంబంధాల గురించి చాలాసేపు మాట్లాడాడు.

జైలుకు వెళ్ళిన కొత్తల్లోనే నేను గమనించింది జైలులో అసలు గడియారం ఉండదు. ఉదయంపూట అయితే వార్డర్ ద్వారా లేకపోతే నీడ ద్వారా టైమ్ తెలుసుకోవాలి. రాత్రి జైలర్ బూట్ల చప్పుడో, బ్యారక్ ముందు చార్ట్ పెట్టే వార్డర్ ప్రతి గంటకొకసారి సంతకం చేస్తాడు, అదైనా తెలుపుతుంది. ఒక్కోసారి ఆ చార్ట్ కూడా కనిపించనంత దూరంలో ఉంచితే సమయం తెలియకపోవడం హింసగా ఉంటుంది. ఒక్కోసారి బాగా ఆలోచిస్తే తెలిసేది - సమయం తెలియకపోవడం మాత్రమే మానసిక ఇబ్బందికి కారణం కాదు, మనం

అనుకొన్నది చేయలేని స్థితివల్ల అని.

పడుకొనే ముందు హరితో అన్నాను, "గోవిందు అడిగితే చెబుతాడా," అని. ఆయన జీవితం గురించి అన్నాను.

"అడుగనియా" అన్నాడు. మరుసటిరోజే వాయిదా కావడం వల్ల తీరుబాటు కాలేదు. రెండురోజుల తర్వాత గోవిందుని పలకరించి ఎప్పుడు కూర్చుందామని అడిగితే కళ్ళలో నీళ్ళు నింపుకొని మళ్ళీ తనే తమాయించుకొని, "లాకప్ అయిపోద్ది కదండి. మాట్లాడదాం లెండి, చాలా ఉన్నాయి లెండి. ఓ పూటతో అయిపోవు కదండి," అన్నాడు.

"నంజీ కొడుకు కృష్ణమూర్తిగాణ్ణి చూశారండి ఇళ్ళు దోసేసి నేరాలు సేసీసీ పప్పు తింటూ పిల్లి సచ్చిపోతేనూ పూడ్చేసి పూలేసి ప్రార్థన చేశాడటండీ," అన్నాడు.

దర్జాగా డెక్కన్ క్రానికల్ చదివే కృష్ణమూర్తికి ఇరవై మూడేళ్ళు ఉంటాయి కావచ్చు. సంవత్సరకాలం బట్టి నర్మదాలో ఉంటున్నాడు. పిల్లికి ఆరోగ్యం బాగుండక చెట్ల పాదల్లోనో, బాత్‌రూముల దగ్గరో పడుకొంటున్నప్పటి నుండి దాని ఆలనా పాలనా చూశాడు. అది చనిపోయిన తర్వాత పూడ్చి, పూవులేసి ప్రార్థన చేసొచ్చాడు. జైలులో పూజలు, ప్రార్థనలు, నమాజ్‌లు చేసేవాళ్ళు చాలా మందే ఉన్నారు. జైల్లోని తోటలో రంగు రంగుల పూలు పూసేవి. వాటిని అందంగా అలంకరించి పూజలు చేసేవారు.

సిమెంట్ శివలింగం తయారుచేశారు. బబ్లూ శర్మ పూజ చేస్తే ఇస్మాయిల్ దండ గుచ్చేవాడు. ఇస్మాయిల్ తన దగ్గరున్న పలకపై మసీదు బొమ్మ గీసుకొని దాని ముందు నమాజ్ చేసేవాడు.

మామూలుగా జైల్లో మునిమాపనగా ఇంటర్వ్యూలు అయిపోతాయి. దాదాపు అటూ ఇటూగా లోకల్ కోర్టులు వచ్చేస్తాయి. ఔట్ కోర్టులు లాకప్ తర్వాత వస్తాయి.

ఒకరోజు ఔట్ కోర్టులకు వెళ్ళిన చిత్రసేన్ రెడ్డి, ఎరుకల అబ్బులు వస్తారని ఆ బ్లాకుల ... అన్నం పట్టారు. చిత్రసేన్ రెడ్డి వచ్చాడు కానీ, అబ్బులు రాలేదు. అందరిలో గుసగుసలు మొదలయ్యాయి. అబ్బులకు లైఫ్ పడే ఉంటుందన్న అభిప్రాయం చాలామందిలో ఉంది.

జగదీష్ లైఫ్ పడ్డప్పటి నుండి అబ్బులు అందరికీ దూరంగా, మౌనంగా ఉంటున్నాడు.

ఊచల మధ్య నుంచి బయటకు చూస్తూ, బీడీలు కాలుస్తూ ఇదే విషయం మాట్లాడుతున్నాం నేను, గోవిందు.

"ఏటండీ చీమలమో, పిల్లులమో అయి పుట్టి ఉంటే బెయిల్, శిక్ష ఏవీ ఉండేవి కాదు గదండీ. అలా దూరేసీ పారిపోదుము. జంతువుల్లా పుట్టకపోయామా. అయినా మనిషిని మనిషి బంధించడం ఎంత దుర్మార్గమండీ," అన్నాడు.

గోవిందు మాటలు దుఃఖపెట్టాయి. ఈ గోడలు దాటాలని ఈ మనుషులు ఎన్ని ఆలోచనలు, ఊహాలూ చేస్తారో అనిపించింది. మళ్ళీ అన్నాడు, "పక్షులమైతే ఇంకెంత హాయోనండి."

ఇంతలో అడ్మిషన్ అరుపు వినిపించి అటువైపు చూశాడు. ఆయనా ముక్కల దొంగే. ఆయన గురించి చెప్పడం మొదలు పెట్టి తన జీవితంలోకి వెళ్ళిపోయాడు.

"సరిగ్గా పదేళ్ళవుతుందండి. నేను మా బామ్మర్ది, ఇప్పుడొచ్చాడు కదండి కొత్త అడ్మిషను, ముగ్గురం కలిసి నేరం చేయడానికెళ్ళామండి. ప్లాంటుకు అటింకా పైకి. పెద్ద పెద్ద ముక్కలు తీశామండి. బాడుగ ఆటో మాట్లాడాం. ముక్కలన్నీ ఏసేసాం. చివరి ముక్క ఉండిపోయింది. మా బామ్మర్ది గాడెళ్ళాడండి, తేడానికని. ఇంతలో నేవీ వాళ్ళొచ్చి ఫైర్ చేసారండి. ఆడు పడిపోయాడు. మమ్మల్ని పట్టేసుకుని సుబ్బరంగా బాదేసి ఎటెమ్ప్ట్ మర్డర్ కేసు పెట్టేసి పప్పు కోసం పంపించేశారండి. ఇదిగో ఆ కేసేనండి ఇప్పుడు పప్పు తినిపిస్తుంది. పదిహేనేళ్ళ బట్టి చాలా నేరాలు చేశానండి. ముక్కలేననుకోండి. ఇంకేటి లేదు. పాజైలు, కొత్త జైలు అన్నీ చూశానండి. ఏం సుకం లేదండి. మీరేటండీ మేమూ సూసాం ఎన్‌కౌంటర్లూ," అంటూ భోరున ఏడ్చేశారు.

"ఇదిలాగుంది కదండి, నా పెళ్ళాం ఇంకోడితో సంబంధం పెట్టుకుని లెగిసిపోయిందండి. నా బామ్మర్ది ఇంటిది, ఎవడూ నేవీ వోళ్లు కాల్చేసారు కదా ఆడు. అది ముండల్లో కలిసిపోయి గోపాలపట్నం, ఎన్ఏడి జంక్షన్‌లో తిరగడం మొదలెట్టేసింది. ఏట్రా యిలగైపోయిందనుకుని అలాగా తాగుతూ ఉండిపోయాను. తప్పదు కదండి. మళ్ళీ పప్పు కోసం తినీడానికికొచ్చేసీ అలాగ ఎనిమిదేసి నెల్లుండి కేసు కొట్టేస్తే బయటపడ్డానండి. ఇంకేటండీ మళ్ళీ ముక్కలు. ముక్కలు దొంగతనం చేస్తున్నప్పుడే గాజువాకలోని- ఏది నేను సేసుకున్నాను కదండి గుంటది అది తగిలింది. అలా దాన్ని దువ్వేసి ఇంట్లో పెట్టేసుకున్నానండి. దాని భాషనాకు రాదు. నా భాష దానికర్థం కాదు. అదీ ముక్కలకొచ్చేది. భాష రాకపోయినా పిల్లలకేటండి. పిల్లలయ్యారండి. ముగ్గురు. ఇంకేటి సేస్తాం. దాన్నింట్లో పెట్టేసీ ముక్కలకెళ్ళేవోణ్ణండి. చాలా మంచిదండి. ఇప్పుడు సూడండి నేను పప్పుకొచ్చేసి ఆరేసి నెల్లయిందండి. పిల్లల్ని అదే సూస్తుంది, మళ్ళీ ఇంటర్వ్యూలూ పెడుతుందండి. అదైనా ఎంతకని వొస్తుందండి. రెండు నెల్లబట్టి రాట్లేదు."

మనసులో ఇంత వున్నా బయటికే మాత్రం కనిపించనివ్వడు గోవిందు. ఎక్కువ మాట్లాడకుండా ఎప్పుడూ బ్లాకుల మధ్య వరండాలోనో, పూవుల చెట్ల దగ్గరో దీర్ఘంగా ఆలోచిస్తూ పచార్లు చేస్తాడు. గోవిందు, హరికృష్ణ నాయుడు, పోలయ్యే కాదు ఈ బ్యారక్‌లో ఉన్న దాదాపు వందమందిలో అందరి స్థితీ ఇదే. ఎవరూ బయటికి కనిపించనివ్వరు.

***

ఉగాది పండుగకు ముందో తరువాతో సరిగా గుర్తులేదు, లాకప్ అయిన తర్వాత మాట్లాడుతూ కూర్చున్నాం నేనూ, గోవిందూ, హరికృష్ణ చిరంజీవి బ్యారక్‌లోనే పచార్లు చేస్తున్నాడు. రాత్రి పది దాటింది. బయట వెన్నెల కురుస్తున్నది. జైలు చుట్టూ పచ్చని కొండలు. ఆవరణంతా ఎర్రమట్టి నేల కావడం వల్ల వెన్నెల నేలపై పడి చిత్రమైన కాంతి పులుపుకున్నది. అద్భుతమైన దృశ్యం.

హరికృష్ణ అన్నాడు, "అనియా బయట కూర్చుని అలాగ బీడీ కాల్చుకుంటూ ఆసుకేసు కుంటూ పాటలు పాడుకుంటే బలేగా ఉండేది కదనియా," అని.

ఇంతలో చిరంజీవి, "తాళికట్టు శుభవేళ మెడలో కల్యాణమాల" పాట పాడితే,

గోవిందు చిరాకు పడుతూ, "ఒరే ఆపరా ఏడుపుగొట్టు పాటలు," అన్నాడు.

చిరంజీవి ఆ పాటలోని "ఏనాడు ఏ జన్మకో రాసి ఉంటాడు విధి ఎప్పుడో" చరణమే ఎక్కువ పాడేవాడు.

"ఏటండీ, ఈ జైలేటి, ఈ ముక్కలేటి ఈ బాదలేటి. మనకూ ప్లాంట్‌లో ఏదో పనిస్తే నేరాలెందుకు సెప్పండి, ఏటో...."

ప్లాంట్ పెడుతున్నపుడు పోయిన ఊళ్ళలోని వాళ్ళందరికీ ఏ ఉపాధి దొరకలేదు. ప్లాంట్ పడ్డ తర్వాత వాళ్ళంతా దొంగలైపోయారు. "అనియా సంవత్సరంలో మూడు మాసాలు బయట, తొమ్మిది మాసాలు పప్పు. ఒక నేరం చేస్తే పది పోలీసులు పెట్టేస్తారు. ఏటి సేస్తాం. మా ముక్కల నేరాలన్నీ ఇంతే అనియా" అన్నాడు హరికృష్ణ.

చిచ్చాపాటందుకొన్నాడు.

"బాగ్‌తో జల్‌గయా

ఎక్ కలీ రహెగయా

యాద్ దిల్‌మే కోయీ / అధ్ జలీ రహెగయా"

పదకొండు దాటింది కావచ్చు. నైట్ రౌండ్ జైలర్ బూట్ల చప్పుడుకు అందరం పడుకుండిపోయాం.

*

☆ మాధవి

చదువు

సరోజక్క మహిళా సంగపోళ్ళతో మాట్లాడాలని కబురు పెట్టింది.

ఆ రాత్రి నేను, సుక్కు గుట్ట దగ్గరికి పోయినం.

గుట్టమొదట్లో వున్న సెంట్రీ అక్క మమ్మల్ని గుర్తు పట్టింది. సరోజక్క వాళ్ళు వున్న గుట్ట మీదికి దారి చూపించింది. మేం గుట్ట మీదికి పోయేసరికి అక్కలు, అన్నలు అన్నాలు తింటున్నారు. మా యిద్దర్ని కూడా తినమని అడిగినారు. మేం ఆ వరకే అన్నాలు తిని బయలుదేరినం. మేం అక్కలకోసం తీసుకుపోయిన మొక్కజొన్న బూరెలు సరోజక్కకు ఇచ్చినం. వాళ్ళు అన్నాలు తిన్నంతసేపు పిచ్చాపాటి కబుర్లాడుతూ కూర్చున్నాం.

అక్కడ అయిదుగురు అక్కలు యిద్దరు అన్నలు ఉన్నరు. అన్నాలు తినడం కాంగనే సరోజక్క మా యిద్దర్ని పక్కకు పిలుచుకుపోయింది. మేం ముగ్గురం మా యిళ్ళల్లో మంచి చెడులు, గూడెం మంచి చెడులు మాట్లాడుకున్నం. మహిళా సంగం పనితీరుపై సరోజక్క వివరంగా అడిగి తెలుసుకుంది. యీ మధ్యన దళం జాడ చెప్పమని గూడేనికి పోలీసులు వచ్చి అందరిని అడిగిపోతున్న సంగతి చెప్పినం. దళం అజ చెప్పకపోతే సంగపోళ్ళందరిని జైల్లపెడతాం అని బెదిరించిన సంగతి చెప్పినం. అయినా మా మహిళా సంగం బాధ్యులందరు నిబ్బరంగానే వున్న సంగతి చెప్పినం. యీలోపు రాదక్క కూడా మాతో వచ్చిచేరింది. రాదక్క వాళ్ళ అవ్వ, అయ్యా సంగతులు అడిగింది. వాల్లు బాగానే వున్నరని చెప్పినం. రాదక్క కోసం వాళ్ళ గూడేనికి పోలీసులు చాలాసార్లు వస్తుండ్రని జాగ్రత్తగుండమనీ వాళ్ళ అయ్య చెప్పిన సంగతి చెప్పినం.

దళంలో మిగిలినోళ్ళు సర్దుకోవడం అయిపోగనే బయలు దేరండని హెచ్చరించినారు. రాదక్క, సరోజక్కలను యిడిచిపెట్టలేక యిడిచిపెట్టి యెనక్కి తిరిగినం. ఆరుగురు అక్కలు, మధ్యన మందులన్న, చివరన చిన్నన్న నడుచుకుంటా అడివిలోపలికి పోయింండ్రు. మందులన్న పని బాగలేదు. నడవలేక నడుస్తుండు. వాళ్ళు కనిపించినంతలెక్క చూసి నేను, సుక్కు యెనక్కి తిరిగినం.

గూడెం మొదట్లో తాగుబోతు బాలిగాడు తగిలిండు. మా చేతుల్లల్లో చెంబులు చూసి యిరోచనాలా అని ఎకసెక్కెం చేసినాడు. వాడితో యెందిలే అని యెవురి గుడిసెకు వాళ్ళం చేరుకున్నాం. గుడిసెకు చేరిననే గాని మనసంత గుబులుగుంది. యీ మధ్యన పోలీసులు గూడెంలో తాగుబోతు యెదవలందరిని చేరదీసిండ్రు. వాళ్ళను పట్నం తీసకపోయి తిన్నంత, తాగినంత తాగబోయిస్తుండ్రు. చేతినిండ డబ్బులిస్తుండ్రు. యీ తాగుబోతు యెదవలను మచ్చికచేసుకొని పోలీసులు గూడెం యిసయాలు సంగం సంగతులు గుంజుతుండ్రు. అక్కడికి గూడెపోల్లు, సంగపోల్లు యీ ఎదవల సంగతి వొక కంట కనిపెడతనే వున్నారు. మా మహిళా సంగపోళ్ళం కూడా ఆ యెదవలను వేయి కళ్ళతో కాసుకు సూస్తనే వున్నం. అక్కోళ్ళకు యీ సంగతీ చెప్పినం. అయినా మనసులో ఆదుర్దాగుంది. దళం క్షేమంగుండాలని అడివి తల్లికి మొక్కుకున్న. పక్కపరుసుకు సంటోడ్ని పక్క లేసుకొని పడుకున్న.

కంటి మీద కునుకు పట్టల. సుక్కపొడిసే యేళ. సంటోడు మసులుతుంటే వొంటేలుకు పోయించనీకి గుడిసె బయటికి తీసుకపోయిన. బయట యెన్నెల యిరగకాసినట్టుంది. చల్లటిగాలి. చల్లగాల్లో యేదోవాసన ముక్కుకు తగిలింది. అది తెలిసిన వాసన లెక్కుంది. మెల్లంగ దడికాడికి పోయిన. బయిటికి తొంగిచూసిన. వొక్కసారి గుండె ఆగింది. గుంపులు గుంపులు పోలీసోల్లు, తుపాకులు బుజానేసుకొని చెట్లనీడల సాటుగ పోతుండ్రు. యే తాగుబోతునాయాలన్నా అక్కల సంగతి పసిగట్టి జేరేయలేదుకదా అని అనుమానం వచ్చింది. తోడేళ్ళ గుంపు లెక్కపోతున్న పోలీసోళ్ళను చూస్తే నడవలేక నడుస్తున్న మందులన్నే కళ్ళల్లో మెదిలిండు.

పోలీసోళ్ళ సంగతి అక్కలకు చేరేయాలన్న ఆదుర్దా పెరిగింది.

చప్పున చంటోన్ని మంచంలో పండబెట్టిన. బయటికొచ్చిన. దడిచాటుగ చుట్టూ చూసిన. యెటుచూసినా పోలీసోళ్ళే. బయిటికెల్లేదారి కనిపించల. దొడ్డికి పోతున్న లెక్క ఆవులించుకుంట చెంబట్టక బయలుదేరిన. అట్టన్న గుట్టకాడికి పోవచ్చన్న ఆశ. వొక్కసారిగ పదిమంది పోలీసులు చుట్టు ముట్టినరు. చల్ యెక్కడికే అంటూ గుడిసెదాక తరిమిండ్రు. కాలుకాలిన పిల్లిలెక్కన గుడిసెల తిరగబట్టిన. మనసంత వొకటే కంగారు. వొళ్ళంత సెవులు మొలిసిన లెక్కుంది.

సుక్కుకు నిదరబట్టలేదల్లే వుంది. మెల్లంగ గుడిసెల కొచ్చింది. యిద్దరికి ఆదుర్దాగుండింది. అనుకున్నంత అయింది. దూరంగా తుపాకుల మోత ధనధనమంటు యినిపించింది. కూలబడి పోయిన. యిద్దరం నేలనబడి యేడుస్తున్నాం. సప్పుడు సేయకుండ మహిళా సంగపోళ్ళు వొక్కరొక్కరే చేరుకుండ్రు.

బారెడు పొద్దెక్కె. యెవ్వరం నీళ్ళు పుక్కిలించల. టపాసుల మోత యినిపించె. గుడిసె బయిటికి తొంగి చూసినాం. పోలీసుళ్ళు సంబరం లెక్క యెగురుకుంటొస్తుండ్రు. అందరు టపాసులు కాలుస్తుండ్రు. స్వీట్లు తింటుండ్రు. అందరికి ముందు పోలీసు దొర బొర్ర యిరుసుకుంట నడుస్తుండు. వొకటే పకపకలు. వచ్చిన పోలీసులు గుడిసెలు సుట్టు ముట్టిండ్రు. ఆడోళ్ళెవరు గుడిసె బయటి రావద్దని హెచ్చరించిండ్రు.

మగోళ్ళను వొకచోట జమచేసి అడివిలకు తోలుక పోయింండ్రు. గుడిసెల కాడ కొందరు పోలీసులు కాపల కాస్తుండ్రు. గుడిసెల నుండి ఆడోల్ల తిట్లు శాపనార్థాలు యినిపిస్తనే వున్నాయి. యేడుపులు మొత్తుకోళ్ళతో పగలు గడిచిపాయె. పొద్దు గూకేలకు పీక్కపోయిన మొకాలతో మొగోళ్ళు తిరిగొచ్చిరి. మొత్తం ఆరుగురక్కలను, యిద్దరన్నలను సంపేసిండ్రని చెప్పిరి. శవాల సూడనీకి కూడ పోనీ లేదంట. పోలీసు పెద్ద హెలికాప్టరులో వచ్చేటందుకు అడవి నరికించి బాగు చేయించినారంట.

అక్కలు చల్లంగుండాలనే మా ఆశ కొండెక్కె. గూడెం బిడ్డ చచ్చిన తల్లి లెక్కుంది. యెవరి గొంతుల గంజిదిగలా. గూడెం చుట్టుతా పోలీసోల్ల కాపల. రెండురోజులైపాయె. మూడోరోజున పోలీసోల్లు మల్ల గుడిసెలకొచ్చిండ్రు. శవాలు మోయాలని మగోల్లను మల్లీ అడివిలోకి తోలుకపోయిండ్రు. శవాల మూటలు ముందు యెనక పోలీసులు గూడెం దాటినరు. గూడేనికి ప్రాణం వచ్చింది. పిల్ల, జెల్లతో సుద్ద అందరం గుట్టలకాడికి పరిగెత్తినం. యేడు గుట్టల మద్దెన అంతా బీబత్సంగుండాది. నేలంత నెత్తురు. అన్నం, టీ కలగా పులగంగుంది. పళ్ళాలు, గ్లాసులు చిందరబందరగ పడుండాయి. మందులన్న కళ్ళజోడు కాళ్ళకింద నలిగి పోయింది. పోలీసులు అక్కోళ్ళ పుస్తకాలను పిచ్చి, పిచ్చిగ చించి పడేసినరు. యీ బీబత్సం చూస్తంతోనే జరిగింది తెలిసిపోయింది. అందరం యేడుస్తనేవున్నం. నేను పోలీసులు చింపి పారేసిన కాగితం ముక్కలు యేరుకున్న. ఆ కాగితం ముక్కలను అక్కల ఆనవాలుగా నా బిడ్డ తలకింద దాసిపెడదమనుకున్న. నా బిడ్డ పెరిగి పెద్దోడైనంక యీ కాగితాలు చదవాలి. దళం గురించి తెలుసుకోవాలి. అక్కల బాట నడవాలన్నది నా ఆశ. రాదక్క రాత వున్న కాగితం ముక్కలు కనిపించినయి. వాటిని చూడంగనే మరింత దుక్కం వచ్చింది.

నాలుగేళ్ళనాటి మాట. అప్పటికే మా గూడెంలో సంగాలు వెలిశాయి. రాదక్కది మా గూడెమే. మంచికళగా వుండేటిది. గూడెంలో మంచి పనిమంతురాలన్న పేరు. నాకుమల్లెనే అక్క బడిమొకం చూడలేదు. వొక రోజు మా గూడెం జులాయి లచ్చుముడు రాదక్క వాళ్ళ గుడిసెలో దూరిండు. రాదక్క అయ్యకు వోలిడబ్బులు యిచ్చిండు. అది మొదలు తనకు రాదక్క పెళ్ళామని

లచ్చుముడు వూరంతా చాటింపేసిండు. అక్కకు ఆడంటే యిష్టం లేదు. ఆడితో పెళ్ళి అనలిష్టంలేదు. యెంత వద్దని మొత్తుకున్నా అక్కమాట యినిపించుకున్నోడు లేడు. కుల కట్టు మరి.

అప్పుడు సరోజక్క, శాంతక్క మా వూరికొచ్చినరు. గూడెం ఆడోల్లందరిని పొద్దుగూకేళకు స్కూలు దగ్గరకు రమ్మని గుడిసె గుడిసెకు తిరిగి చెప్పినరు. మా అవ్వ మీటింగులకు పోతే యింటిపని యేంగాను అని సణుగుడు మొదలు బెట్టె. నేను మీటింగుకు పోవలె అని వురుకులు పరుగుల మీద యింటి పనంత చేసిన. నేను స్కూలు దగ్గరికి చేరుకునే సరికే గూడెం ఆడోళ్ళందరు అక్కడున్నరు. రాదక్క- సరోజక్కకు తనగోడు చెప్పుకునె, ఆడోళ్ళంతా వొక్కమాట లెక్క ఆ పెళ్ళి అన్యాయం అని చెప్పిరి. విషయం అంతా విని సరోజక్క రాదక్క అయ్యను, లచ్చుముడిని స్కూలు కాడికి పిలిపించినది. మొగోళ్ళు ఆరునూరయ్యేది కులాచారం తప్పగూడదని తెగేసి చెప్పినరు. సరోజక్క మొగోళ్ళిద్దరికి నయాన బయాన నచ్చచెప్పినది.

చివరికి యిద్దరు దిగివచ్చినరు. రాదక్క అయ్య లచ్చుముడి వోలి డబ్బులు తిరిగి యిచ్చేటట్టు లచ్చుముడు రాదక్క జోలికి పోకుండే విధంగా తీర్మానం అయింది.

అది మొదలు శాంతక్క సరోజక్క మా గూడెం వచ్చిపోతుండిరి. మా గూడెంలో మహిళా సంగం పెట్టుకున్నం. మా సంగం నెమ్మదిగ పని మొదలు బెట్టింది. మా గూడెంకు అన్నలు వచ్చి పోతుండిరి. జొరాలు యిరోచనాలు వచ్చే యేళకు మందులన్న గూడెం వచ్చెటోడు. అందరికి మందులిచ్చి జాగ్రత్తగుండమని చెప్పెటోడు. సరోజక్క వచ్చిన ప్రతిసారి మా మహిళా సంగపోళ్ళకు చదవడం, రాయడం నేర్పేటిది. నేను, రాదక్క మెల్ల మెల్లగా కూడ బలుక్కుంట పేపరు చదివెటోళ్ళం. రాదక్క మొదట్లో తనకి చదవడం నచ్చదని చెప్పేటిది. కాని రాదక్కే అందరికన్న తొందరగ చదవడం, రాయడం నేర్చుకుంది. మందులన్న వచ్చిన ప్రతీ తడవ మాకు పరీచ్చ పెట్టెటోడు. రాదక్క ప్రతీసారి వందకు వంద మార్కులు తెచ్చుకొనేటిది. మందులన్నే యేసిన మార్కులు పెట్టిన సంతకాలు చూసి రాదక్క మురిసిపోయేటిది. మందులన్న యెప్పుడు వొక మాట అనేటోడు, రాయిని సానబెడితే రత్నం అవుతది. వుద్యమం సానబెట్టి మనిషిని గ్నానిని చేస్తదని.

ఆ కాలంలో మా మహిళా సంగం బాగపనిచేసేటిది. మైదానం నుంచి మా గూడెం వలసొచ్చిన వలసోళ్ళ వివరాలు మొత్తం సంపాదించినం. సంగం నిలబడి వలసోళ్ళు అక్రమంగా సంపాదించిన అధిక భూమి వందెకరాలు గుంజుకుంది. గూడెంలో భూమి లేనోళ్ళకు పంచింది. మేం మహిళా సంగం పెట్టక ముందు డ్వాక్రా సంగంలో వుండెటోళ్ళం. డ్వాక్రా మహిళలకు గౌర్మెంటు రెండువేలు అప్పిచ్చుద్దని చెప్పినారు. మా గూడెంనుంచి యిరవైమంది ఆడోళ్ళం కాగితాలు పెట్టుకున్నం. అయిదు మైళ్ళు నడుసుకుంట ఆఫీసు పోయెటోళ్ళం. అక్కడవొక్కడు మాకు సమాధానం చెప్పటోడు కాదు. గజ్జికుక్క లెక్క చీదరించుకొనెటోళ్ళు. చదువుకున్నోళ్ళ కాళ్ళు గడ్డాలకు మొక్కి రాయించకపోయిన కాగితాలను చెత్తకుప్పల పారేసేటోళ్ళు.

నెలరోజులు తిరిగి తిరిగి పౌరుషం వచ్చి తిరుగుడు మానేసినం. యెప్పుడైతే సంగం మా గూడెంల భూమి పంచినదో అప్పుడు గౌర్మెంటోళ్ళు వురుక్కుంట మా గూడెం వచ్చి పడ్డారు. డ్వాక్రా అప్పులు అడిగినోల్లకు అడగనోల్లకు అందరికి యిస్తమన్నరు. మాకప్పుడు సంగబలం తెలిసొచ్చినది. సంగం మాకు హక్కులు సాధించుతదని అర్థమయింది.

సంగం బలం పెరిగిన కొద్ది పోలీసుల రాకడ. బెదిరింపులు పెరిగినయి. రాదక్కను పోలీసుల వొకసారి పట్టుకపోయినరు. మా మహిళా సంగపోళ్ళం మండలంకెల్లి గొడవ చేసినం. దాంతో వారానికి యిడిసిపెట్టినరు. పోలీసోల్లకు చిక్కకూడదని రాదక్క, సరోజక్కోళ్ళు గూడెం వచ్చినప్పుడు వాళ్ళతో కలిసి యెల్లిపోయింది. తరువాత రాదక్క గూడెం అప్పుడప్పుడు వచ్చేటిది. వచ్చినప్పుడల్లా గూడెం ఆడోల్లను కూడేసి చరిత్రని, బూగోలం అని, అర్థశాస్త్రం అని, తత్వశాస్త్రం అని చాలా సంగతులు చెప్పేది. అయన్ని అర్థం కాకపోయిన యేదో మంచి సంగతులనిపిచ్చేది. ఆడోల్లం హీనంగా వుండని రోజుల గురించి మాట్లాడేటిది. ఆడోల్లంతా తలెత్తుకు తిరిగే సమాజం గురించి చెప్పేటిది. ప్రపంచయిప్లవమని, యెర్రసైన్యమని చెప్పేటిది. యెప్పుడు యిద్దరు గెడ్డపు ముసలోల్లు, వొక గెడ్డంలేని ముసలోని బొమ్మలు చూపెట్టేటిది. రాదక్క మాటలు పెద్ద పెద్ద చదువులు చదుకున్నోల్లను మించిపోయి వుండేటివి. యేదన్నా సమస్యను రాదక్కతో చెపితే చిటికలో తీరుస్తదని గూడెల్లో మంచిపేరు. అక్కమాటలో నడకలో యెంతో విశ్వాసం కనిపించేటిది. సంగం అక్కకు చదువు నేర్పించింది. తుపాకి పట్టిపోరాడ్డం నేర్పించింది. గూడెం బతుకులు మార్చడం కోసం, గూడెం మనుషుల హక్కుల కోసం అక్క నక్సలైటయింది.

గూడేలోల్లు అక్కను బూదేవి లెక్క, అడివితల్లి లెక్క చూసేటోల్లు. పోలీసోల్లకు అక్క కంటోకారం లెక్కయింది. అక్కను పట్టివ్వమని గూడెసోల్లను కొట్టినా లాభం లేకపాయె. కొట్టుడు లాబం లేదని పోలీసులు డబ్బులు యిరజిమ్మి తాగబోయించి గూడేల్లో యెదవనాయాల్లను తయారు చేసిరి. కాగితం ముక్కలు చేత్తో పట్టుకు ఆలోచనల్లో మునిగున్న నన్ను సుక్క యీపు మీన ఒక్కటి సరిసింది. యీ లోకంలో పడ్డాను. అప్పటికే సగంపోల్లందరు వొక తావున జేరిర్రు. గూడెం బతుకుల కోసం వీరురాలోలే పానాలిచ్చిన గూడెపు బిడ్డ రాదక్కను గూడెపు మన్నులనే కలపాలని, యెంత కష్టమొచ్చిన యెనక్కి తగ్గకూడదని, రాదక్క బొందమీద యెర్రజెండ పాతాలని తీర్మానించినరు. యెర్రజెండా రాదక్క బదులు మాకండైతదని అనుకున్నం. అందుకోసంగనే పక్క గూడెంపోయి రాదక్క అయ్యను పిలుసుకురావడం కోసరం సుక్క,నేను యేడుగుట్టలు దాటుక బయలుదేరినం. *

స్వీకారం

1. **గజ ఉఃతరాలు**
   గౌరుసు జగదీశ్వర్ రెడ్డి కథలు
   ఎన్.కె.పబ్లికేషన్స్ వెల : రూ. 40/-

2. **ధిక్కారం**
   సామ్రాజ్యవాద వ్యతిరేక కవిత్వం - సద్దాం కోసం
   వరంగల్ రచయితల సంఘం ప్రచురణ
   సంపాదకులు : వడ్డెబోయిన శ్రీనివాస్
   నల్లెల్ల రాజయ్య
   వెల : రూ.25/-

3. **నందిగ్రామ్**
   మరో జలియన్ వాలాబాగ్
   వెల : రూ.10/-
   రచయితలు, కళాకారులు, బుద్ధిజీవులు

4. **నగరానికొచ్చిన వాగళ్ళు**
   విద్యాసాగర్ కవిత్వం వెల : 50/-
   ఎమెస్కో ప్రచురణలు

5. **పావాది**
   ఎం.డి. అహ్మద్ కవిత్వం వెల : 30/-
   మంజీర రచయితల సంఘం ప్రచురణ

6. **షహీద్ సద్దాం హుస్సేన్‌కీ యాద్‌మే**
   పరవస్తు లోకేశ్వర్ దీర్ఘ కవిత
   గాంధీ ప్రచురణలు వెల : 10/-

7. **అన్నం గుడ్డ**
   సుంకోజి దేవేంద్రాచారి కథలు
   యుక్త ప్రచురణలు వెల : 50/-

8. **మాటల్లేని వేళ**
   పలమనేరు బాలాజి కవిత్వం
   పవిత్ర & ప్రణీత ప్రచురణలు వెల : 25/-

ఇవి అన్ని పుస్తకాల షాపుల్లో దొరుకుతాయి

కథ

☆ పాపినేని శివశంకర్

వారధి

అంధక దేశాన్ని బంధక మహారాజు పరిపాలించే కాలంలో వరుసగా మూడో యేడు భయంకరమైన కరువు వచ్చింది. 'నెలకు మూడు వానలు' అనే నానుడి అబద్ధమై పోయింది. ఆషాఢమాసంలో రాలిన నాలుగు చినుకులు తప్ప రాజ్యం మీదకి మబ్బులు తొంగి చూడలేదు. రాగులు, వరిగెలు లాంటి మెట్ట పంటలు గూడా దక్కలేదు. ప్రజలు తిండి దొరక్క చివరికి ఆకులు, అలాలు మేయటం మొదలుబెట్టారు. ఆకలి చావులు మెండయ్యాయి. పాడి పశువులన్నీ నీళ్ళు, మేత లేక ఈసుకు పోయాయి. ఆస్థానకవి వామనభట్టు గంటానికి పని తగిలింది.

"వచ్చింది వచ్చింది తప్పుడు కరువు
వచ్చి ఎవరిస్తారిప్పుడు కాణీ అరువు"

అంటూ తక్షణమే ఒక విషాద కవిత రాసేశాడు. ('కాణీ' అన్నచోట 'చిల్లికాణీ' అంటే యింకా కరుణ రస పూరితంగా ఉంటుందని అతనికి తర్వాత తోచింది).

అంత తీవ్ర పరిస్థితిలోను మహామంత్రి తంత్రానందుడు చలించలేదు. ప్రకృతివైపరీత్యాలు సహజమే అన్నాడు. 'కరువులు కరువులే - పన్నులు పన్నులే' అన్న సిద్ధాంతం అవలంబించి, ప్రజల గోళ్ళూడగొట్టి అయినా పన్నులు వసూలు చెయ్యండి అని ఆదేశించాడు. పన్నులు కట్టలేని ఆపన్నులు పొరుగుదేశాలకి వలస వెళ్ళసాగారు. ప్రజల ఆక్రందనలు చివరికి కోటగోడల అంతఃపురం దాకా మారు మోగాయి. మహారాజు కాస్త విచారపడ్డాడు. మంత్రి, సామంత, సేనాధిపతులతో ప్రత్యేక సమావేశం జరిపాడు.

"విధి బలీయం మహారాజా!" అన్నాడు మహామంత్రి గంభీరంగా, ఏ క్లిష్టమైన సమస్యనైనా విధికప్పగిస్తే తీరిపోతుందని అతనికి తెలుసు. అతనితో సదవగాహన గల సేనాధిపతి శూరసేనుడు "అవునవును, బలీయం మహారాజా!" అని సమర్థించాడు. కాని కొత్తగా మంత్రి వర్గంలో చేరిన కుర్రమంత్రి కుమార వర్మ అడ్డు చెప్పాడు.

"ప్రభూ! అతివృష్టి, అనావృష్టి ప్రకృతి సహజమే. అయితే వాటివల్ల ఎప్పుడైనా కరువు కాటకాలు ఏర్పడతాయనే ముందు యోచన వుండాలి. ముందుగానే తగినంత ధాన్యం నిలవుంచినట్లయితే కొంత ఈ ఉపద్రవం తప్పేది. అంతేగాదు, ఇటువంటి సందర్భాల్లో పన్నుల పోటు తగ్గిస్తే అన్నదాతల ఆత్మహత్యలు కొన్ని అయినా తగ్గుతాయి" అన్నాడు చురుగ్గా.

రాజుగారికి ఏ విషయం తెలియగూడదనుకొన్నాడో అదే విషయం బట్టబయలయ్యేసరికి మహామంత్రి ముఖం జేవురించింది. "హుఁ కుర్రతనం" అన్నాడు హుందాగా గడ్డం సవరించుకొంటూ.

"అవునవును, కుర్రతనం, హుఁ" అన్నాడు సేనాధిపతి, సవరించుకోవటానికి గడ్డం లేనందుకు ఇబ్బంది పడుతూ.

"హౌరా! మా రామరాజ్యంలో హన్నదాతల హాత్మహత్యలా? హవమానం! మహా హవమానం!!" ఆసనం నుండి పైకిలేస్తూ ఉద్రేకపడ్డాడు బంధక మహారాజు "మరి యింత జరుగుతుంటే మహా మంత్రుల వారేంజేస్తున్నట్టు?" అడిగాడు కోపంగా.

"చి... చి... చిత్తం" అన్నాడు తంత్రానందుడు కంగారుగా. "పరిస్థితి మరీ తీవ్రంగా లేదు మహారాజా! అయినా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఆత్మహత్య శవాన్ని చూపించినను, లేదా శవం ఆత్మహత్యను చూపించినను సదరు శవబంధువులకు మణుగు కట్టెలు మంజూరు చేస్తున్నాం. అదే ఒక కుటుంబంలో రెండు ఆత్మహత్యలు జరిగితే ఇతోధికంగా రెండేసి గజాల బహు తెల్లటి మల్లుగుడ్డ కూడా ఇస్తున్నాం ప్రభూ! ఇక శ్మశానాల్లో తొక్కిసలాట జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాం. పరిస్థితి యింకా విషమిస్తే రైతులకు వారి 'వారి పొలాల్లోనే... నే...నే..." అని సగంలో ఆగిపోయాడు తంత్రానందుడు కుమార వర్మ అడ్డం పడటంతో.

"అది సమస్యకు పరిష్కారం కాదు మహారాజా! అసలు రైతులు ఆత్మహత్యలెందుకు చేసుకోవాల్సి వచ్చింది?"

"అవును, ఎందుకు వచ్చింది?" అడిగాడు కుతూహలంగా మహారాజా.

"మన అధికారులు 'కరువులు కరువులే, పన్నులు పన్నులే' అని పదే పదే తీవ్రంగా వేధించటం చేత".

"కాదు, మరియు లేదు" అన్నాడు. తంత్రానందుడు గట్టిగా, పెద్ద గొంతుతో. "అవునవును. కాదు మరియు లేదు" వత్తాసుపలికాడు సేనాధిపతి.

మహారాజు అయోమయంలో పడ్డాడు. "ఇంతకీ ఎంతమంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నారు?"

"వెయ్యిన్నొక్క....." అని చెప్పబోతున్న ఆస్థాన కరణాలను వారించిన వాడై మహామంత్రి "...ఆఁ... అదే...., వెయ్యిన్నొక్క విధాలుగా గణించినా మృతుల లెక్క నూటొక్కటిమించలేదు ప్రభూ! అదియునుంగాక రైతన్నలు జీవిత విరక్తిచేగాక, రాజభక్తిచే పరలోక గతులగుచున్నారని సమాచారము".

"అదెట్లు?" బంధకుడి భ్రుకుటి ముడిపడింది.

"కష్టకాలములో ఏలినవారికి భారము కాలేక యిష్టపూర్వకముగా, గొప్ప విశ్వాసముతో, ఆత్మ త్యాగము చేసిరని విశ్వసించుటకు తగిన సాక్ష్యములున్నవని విశ్వసించుచున్నాము" అని విన్నవించాడు వినయంగా తలవంచి.

బంధక మహారాజు మొహం వికసించింది. "ఇది బహులెస్సగానున్నది. పరలోక గతులైన రాజభక్తులకు మా శుభాకాంక్షలు. ఇక సభను చాలించి బసకు పోయెదముగాక" అంటూ సెలవు తీసుకొన్నాడు మహారాజా.

"శుభాకాంక్షలా?" తెల్లబోయాడు కుర్రమంత్రి కుమార వర్మ.

2

అయితే మహారాజు మనస్సు ఎందుకనో అంతటితో శాంతించలేదు. మాటి మాటికి సంభవిస్తున్న ఈతిబాధల్ని రూపుమాపే ఉపాయమేదైనా ఆలోచించమని మరునాటి సభలో అడిగాడు. అడగటమే ఆలస్యంగా, కొంతకాలం నుంచి అగ్రహారాది సత్కారాలు లేక అలమటిస్తున్న ఆస్థానకవి అందుకొన్నాడు.

"ప్రభువుల వారు చిత్తగించాలి. 'కాదిది కాటకం, విధి ఆడే నాటకం!' ఇదంతా శనిగ్రహ మహిమ ఏతద్దోష నివారణార్థం - తమ ఆనతి తలదాల్చి - నేను శనైశ్వర మహాత్మ్యం రచించి, తమకు అంకితం చేసుకొంటాను. ఇకపై అంటాను - 'కాచుకో శనీ! అయిపోయింది నీ పని!' ఆ పైన ప్రజలకు శని పీడ విరగడవుతుంది. మహారాజా! అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్పంబూనిన ఇమ్మహా గ్రంథంబునకు ప్రారంభం బెట్టెదనిన..." అంటుండగానే ఆస్థాన జ్యోతిష్యుడు వరాహచంద్రుడు అడ్డం పడ్డాడు.

"వామనభట్టుగారు భేషైన కవులే గాని, ఈ విషయంలో నా సందేహం నాది. వారి గ్రంథ మహిమ చేత ప్రజలను వదలిపెట్టిన ఆ శనేదో గ్రహపాటున ప్రభువుల వారిని పట్టుకొంటేనో?"

బంధకుడు ఉలిక్కిపడ్డాడు. తన ప్రయత్నానికి అడ్డుపడిన వరాహచంద్రుడిని మింగేసేటట్టు చూశాడు వామనభట్టు. కించిత్ మందహాసంతో వరాహచంద్రుడు మహారాజుగారికి తన ప్రతిపాదన విన్పించాడు.

"మహాప్రభూ! ఇంతకాలంగా ఈతిబాధలు మన రాజ్యాన్ని పట్టి పీడించటం మామూలు విషయంగాదు. ఈ సందర్భంగా, గ్రహతారకల గతులన్నీ గణించి గుణించి మరియు గుణించి గణించగా, మన రాజ్యంపై దైవానుగ్రహం తప్పిందని తేలింది. అందుకు కారణం పరిశీలించాను.

చంద్రవంశ క్షత్రియులైన తమ తాతలు, ముత్తాతలు భద్రానది కవతలి గట్టున తరిగొండపై వెలసియున్న సోమేశ్వర స్వామిని నిష్ఠతో సేవించేవారు. ఈశ్వరుడు చంద్రశేఖరుడు గదా! కావున తమ చంద్ర వంశపాలన చల్లగా సాగింది. అప్పుడు దేశంలో క్షేమం తప్ప క్షామం లేదు. ధాన్యం తప్ప దైన్యం లేదు. ఎందువల్లనో తమ ఏలుబడి నాటికి ఆ ఆచారం తప్పింది. తత్ఫలితమే యిప్పటి అనర్థమని శాస్త్రం శతవిధాల ఘోషిస్తున్నది. కనుక ఆ దైవానికి యథాపూర్విగా పూజా పురస్కారాలు జరిపించినట్లాయెనా ఈ అరిష్టాలన్నీ హరిస్తాయని నాకు గట్టినమ్మకం కలిగింది".

రాజుగారి మనస్సు శాంతించింది. అయితే ఇంతలో సభ చివర కూర్చున్న కుమారవర్మ లేచాడు.

"ప్రభూ! ఇహలోక సమస్యలకు ఆదిభౌతిక కారణాలేగాని ఆధ్యాత్మిక కారణాలుండవు. వాటిని సరిగ్గా గుర్తించి సమస్యకు పరిష్కార మార్గం ఆలోచించాలి" అని సూచించాడు.

మహారాజుకా మాటలు బోధపడక బిక్కమొహం పెట్టాడు. తంత్రానందుడు అతని చెవి దగ్గర చేరి "ప్రభూ! ఇతని వాలకం చూస్తుంటే నాస్తికుడేమో అన్పిస్తోంది. నాస్తికో వేదనిందకః - ఆపై తమ చిత్తం" అన్నాడు. రాజు ఉలిక్కిపడ్డాడు. ఆస్థాన జ్యోతిష్కుని మాటను - ఒకరిద్దరు మౌనం వహించిన సభ్యులు మినహా - అంతా ఆమోదించారు. ఈ వ్యవహారానికి నిరసనగా కుర్రమంత్రి సభ నుంచి వెళ్ళిపోయాడు. అయితే యిప్పుడు భద్రానది శుష్కించి వున్నా రేపు వానాకాలం వస్తే ఉప్పొంగే నది కవతల కొండ మీది కైలాసవాసునికి కైంకర్యం ఎట్లా జరుగుతుందనే మీ మాంస కలిగింది.

"అయితే సత్వరం వానలు రాక ముందే నదిపై వారధి కట్టించండి" ఆదేశించాడు బంధక మహారాజు ఉత్సాహంతో.

రాజాజ్ఞ శరవేగంతో అమలయింది. అస్మదీయులైన మహామంత్రి మేనల్లుడు మరియు సేనాధిపతి బావమరుదులకు వంతెన నిర్మాణ బాధ్యత అప్పజెప్పబడింది. అందుకు అక్షరాల లక్షవరహాలు వెచ్చమయ్యాయి. వంతెన పని నాణ్యత గురించి అధికార వర్గాల్లో గుసగుసలు సాగాయి.

ఆషాఢమాసంలో వరుణుడు కరుణించాడు. కొద్దిగా జల్లులు పడటంతో నేలంతా పచ్చగిల్లింది.

"చూశారా మహా ప్రభూ! తమ ఆశీస్సులతో మన చిరంజీవులు వంతెన పని ముగించారో లేదో దైవం కరుణించాడు. ఇక తమరు పూజా పురస్కారాలు ప్రారంభిస్తేనా... దైవకృప 'వరదలై పారటం' తథ్యం" అన్నాడు తంత్రానందుడు. అవునవును. మాదీ అదేమాట. బలపరిచాడు సేనాధిపతి, "లెస్సగా పలికితిరి మహామంత్రి!" అన్నాడు రాజు ఉబ్బితబ్బిబ్బు అవుతూ...

శ్రావణమాసంలో వానలు దండిగా పడ్డాయి. ఎక్కడెక్కడ వలసపోయిన కాపులంతా కన్న ఊరు చేరుకొన్నారు. నేల పదునైంది. అరకలు సాగాయి. వెదలుపడ్డాయి. పైర్లు పచ్చగా మొలిచాయి. ఆస్థాన జ్యోతిష్కుడు అన్నీ గుణించి తరిగొండ మీద సోమేశ్వర స్వామికి నూతన పూజా ప్రారంభానికి శుభ ముహూర్తం పెట్టాడు. శ్రావణ శుద్ధ ఏకాదశి మూలానక్షత్రంలో బ్రాహ్మీముహూర్తంలో యజ్ఞపురస్సరంగా దైవపూజ ప్రారంభిస్తే ప్రజలు సుఖ సౌభాగ్యాలలో ఓలలాడతారు. భద్రానది శరవేగంతో పారుతోంది. కుర్రమంత్రి మనస్సెందుకో కీడు శంకించింది.

నాటి రాత్రి దేశం దేశమంతా ఉత్సాహంతో ఉరకలేసింది. సేవకులు ముందు దివిటీలు పట్టి నడుస్తుండగా మహారాజు పట్టపుటేనుగు మీద తరిగొండకు బయల్దేరాడు. ఆపై రాణివాసం, చిన్నారి యువరాజు, మంత్రి సేనాపతులు రథాలపై అనుసరించారు. ప్రముఖులంతా వారధి దాటారు.

చుక్కల వెలుగులో వంతెన కింద భద్రానది ఉరకలెత్తుతోంది. ఎగువనెక్కడో కురిసిన కుంభవృష్టికి క్షణక్షణం నీటిమట్టం పెరుగుతోంది. పూజా కార్యక్రమానికి బయల్దేరిన రెండవ దళంలో ఆస్థాన జ్యోతిష్కుడు వరాహచంద్రుడు, ప్రధాన పురోహితులు, భజన కోలాటాలలో మై మరచి పోయిన అశేష భక్త బృందం ఉన్నారు. అంతా వంతెన మీద ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా భద్రానది ఉప్పొంగింది. అంతలావు వారధి అగ్గిపెట్టెలాగా వరదతాకిడికి కొట్టుకుపోయింది. ఏం జరిగిందో గ్రహించేలోపుగానే నూట పదిహేను మంది భక్తులు నీటిపాలయ్యారు. బొటనవేలుతో చిటికెనవేలును గణిస్తున్న భంగిమలో ఆస్థాన జ్యోతిష్కుని కళేబరం మైలు దూరంలో తేలింది తెల్లగా తెల్లారిన తర్వాతగాని రాజుగారికి, అధికారగణానికి దుర్వార్త అందలేదు. మహారాజు ఖిన్నుడయ్యాడు.

దేశమంతటా హాహాకారాలు చెలరేగాయి. ఒక్కవానకే బ్రహ్మాండమైన వంతెన ఆయుపు, అజ లేకుండా కొట్టుకుపోయిందంటే అది ఖచ్చితంగా నాసిరకం నిర్మాణమేనని, ఈ అవినీతి భాగోతాన్ని ప్రభుత్వం వెంటనే విచారించాలని బాధిత కుటుంబాల వారు, మేధావులు ఆందోళన చేశారు. మహారాజు తక్షణమే స్పందించాడు. ఒక విచారణ సంఘాన్ని నియమించి, దోషుల్ని శిక్షించాల్సిందిగా మహామంత్రిని ఆదేశించాడు.

ఆ రాత్రికి తంత్రానందుకు, శూరసేనుడు చాటుగా సమావేశమయ్యారు. వంతెన నిర్మాణంలో చిరంజీవుల అవినీతి బయటపడితే ప్రమాదం. గండం గట్టెక్కటానికి జాముసేపు మల్లగుల్లాలు పడ్డారు. మరునాడు 'నదీ ప్రమాద విచారణ సంఘం' ఏర్పడింది. అందులోని ముగ్గురు సభ్యుల్లో ఇద్దరు అస్మదీయులుండేట్టు చూశాడు తంత్రానందుడు.

మరోవైపు కుర్రమంత్రి కుమార వర్మ నలుగురు మిత్రుల్తో కలిసి ప్రమాద స్థలానికి వెళ్లి పరిశీలించాడు. వంతెన శిథాలాల్ని సేకరించాడు. ప్రజాభిప్రాయం తెలుసుకున్నాడు. తర్వాత స్వయంగా మహారాజును కలిశాడు. వంతెన నిర్మాణంలో ఇసుక తప్ప సున్నం వాడలేదని, లక్షవరహాలు ఖర్చుచేసిన ఆ నిర్మాణం నిజానికి పాతికవేలకు మించి విలువచెయ్యదని, కనుక నాసిరకం నిర్మాణం చేసి ప్రమాదానికి కారకులైన మంత్రి, సేనాధిపతుల బంధువుల్ని కఠినంగా శిక్షించాలని, నీటిపాలైన కుటుంబాల వారిని ఆదుకోవాలని విన్నవించాడు. "విచారణ సంఘ నివేదిక కూడా రానివ్వండి, చూద్దాం" అన్నాడు మహారాజు గంభీరంగా.

సోమేశ్వరస్వామి ఆలయం వద్ద మరో శుభదినాన 'నదీ ప్రమాద విచారణ' ప్రారంభమైంది. వంతెన లేకపోవటం వల్ల సామాన్యులెవరూ నీటి ఉరవడిలో ఈదుకుంటూ వచ్చి సాక్ష్యం చెప్పలేకపోయారు. అది ముందుగా ఊహించే తంత్రానందుడు ఆ ఏర్పాటు చేశాడు. విచారణ మహామంత్రితోనే మొదలైంది.

"మంత్రాంగ పరులైన ఓ మహామంత్రీ!
వంతెన కూలినవైనమేమండీ!"
అని అధికారి అడగగానే తంత్రానందుడు తడుముకోకుండా
"నేనెరుగ నేనెరుగ సేనాధిపతినడుగు" అన్నాడు.
"అరివీర మర్తాండ ఓ శూరసేనా!
వంతెన కూలిన వైనమేమండీ?"
"నేనెరుగ నేనెరుగ నా మరిది నడుగు"
"వంతెన కట్టిన ఓ మరిదిగారూ!
వంతెన కూలిన వైనమేమండీ?"
"నేనెరుగ నేనెరుగ గంగమ్మ నడుగు"
"గలగలా పారేటి గంగమ్మ తల్లీ!
వంతెన కూలిన వైనమేమమ్మా?"
"నేనెరుగ నేనెరుగ తరిగొండ నడుగు"
"కొండల పెనుగొండ ఓ తరిగొండా!
వంతెన కూలిన వైనమేమండీ?"
"నేనెరుగ నేనెరుగ నా మీద శివునడుగు"

(మిగతా 17వ పేజిలో....)

నందె

అజ్ఞాత హృదయం

☆ టుంబ్రి

> కొందరు మనుష్యులు బయటికి కనిపించరు. చాలా చిన్నపనులు చేస్తున్నట్టు ఉంటారు. మామూలుగా వాటికి గుర్తింపు వుండదు. కానీ విప్లవంలో అత్యంత కీలకంగా ఉంటాయి. కంటికి కనిపించని మర మొత్తం యంత్రం నడపడానికి కారణమవుతుంది. అలాంటి వ్యక్తుల ఆలోచనలు, శ్రమ బయటి సమాజానికి తెలియకపోవచ్చు. కాని ఉద్యమాలు వాళ్ళ పాత్రను గౌరవనీయంగా తలచుకుంటాయి. తెలియని వాళ్లు తెలుసుకుంటే ఉద్వేగం కలుగుతుంది. ఆ తెలుసుకోవడం కథ రూపంలో అయితే ఇంకా గాఢంగా తాకుతుంది. మనం అనేక అజ్ఞాత హృదయాలను దగ్గరిగా చూచి సంభ్రమానికి గురవుతూ ఉంటాము. అలాంటి వాళ్ళ గురించి, వాళ్ల ఆచరణ గురించి కథలుగా రాసి పంపండి. ఈ శీర్షికను ఇలా కొనసాగించుకుందాం. సం.

"ఆలెరీ, దట్ రీ, దట్" ("పదండీ, పదండి") నందె హుషారు చేస్తూ అంది.

"మాటు వాయోమ్. (మేము రాము) అని చాలా గొంతులు ఒక్కసారిగా అన్నాయి.

"బారి వావిరి? బాలె అత్త మీకిన్" (ఎందుకు రారు? ఏమైంది మీకు) అడిగింది, వాళ్లు అలా అంటారని వూహించని నందె. ఎందుకంటె సంఘం మాటను ఊరివాళ్లు ఎప్పుడు తిరస్కరించలేదు.

"అగ్గ పోలీసేర్ ఉద్దింతోర్"(అక్కడ పోలీసులు కూచుంటారు) సోమె అన్నది.

"ఇప్పటికి మూడు రోజులవుతుంది. ఎవరూ కూచోర్లే. పదండి" నందె

"మూడు రోజులయినా, ఎన్ని రోజులయినా, మనం అక్కడికి పొయ్యి వచ్చేటప్పుడు పోలీసులు అంబుష్ కూచుని మనలను పట్టుకుంటారు" రామాల్ అన్నడు.

"అవును. ఫైరింగ్ అయినా చేస్తారు" రామాల్‌ను సమర్థిస్తూ కోసాల్.

"సామాన్లే కద. పోతే పోనియ్. ప్రాణాలు పోతే మళ్లా వస్తయా" బిమల. నందెకు ఏం చేయాలో పాలుపోవటం లేదు. ఏమి మాట్లాడలేక వాళ్లను ఎలా ఒప్పించాలో తెలియక అయోమయంలో వాళ్లు చెప్పేది వింటూ వుండి పోయింది.

నందె ఏమి మాట్లాడకపోవడంతో మిగతావాళ్లు కూడా తలా ఒకరు తమ అభిప్రాయాన్ని, భయాన్ని వ్యక్తం చేయడం మొదలుపెట్టారు.

"ఇప్పటికే దాదలకు సహాయం చేస్తున్నారని మొన్ననే కద ఐడిమాల్‌ను పట్టుకొని కొట్టీ కొట్టీ చంపారు పోలీసోళ్లు"

"అక్కడ దాదల దగ్గరికి పోయిన భీమాల్‌ను కూడా పట్టుకొని తప్పల జేసి చంపిరి".

"ఆ... వాడి చేతిల తుపాకి వుందా ఏమన్ననా"

"అవును. తుపాకులున్నా లేకున్నా జంగల్‌ల కనిపిస్తే కాల్చిచంపుతున్నారు" ఇలా తలా ఒకమాట మాట్లాడారు.

"మరి ఇట్ల ఎన్ని రోజులని భయపడుతూ వుంటామే" నందె.

"ఎన్ని రోజులంటె కొద్ది రోజులు అయినాక పోదాం" ఒకరు.

"ఇంకా కొద్ది రోజులు ఆగితే సామానంత పాడైపోతది. నిన్న వాన కూడా వచ్చింది. అన్ని తడిసిపోయి వుంటయ్" నందె ఆందోళన

"వాళ్ళకేంది (దాదలనుద్దేశించి) పొమ్మని చెప్తారు" ఎవరో తన అసహనాన్ని వెలిబుచ్చారు.

"ఏహే అంత భయమెందుకు? పోలీసోడు ఎక్కడ అంబుష్ కూచుంటాడో మనకు అర్థం కాదా ఏంది? గొడ్డళ్లు పట్టుకొని అడవికి కట్టెలకు పోయినట్టు పోదాం" నందె. ఎవ్వరూ మేము రామంటె మేము రాము అన్నారు. ఇక చెప్పేదేమీ లేనట్టు ఒకరి తర్వాత ఒకరు లేచి వెళ్లిపోయారు. నందెకు మాత్రం ఎలాగైనా 'ఆ సామాను'ను భద్రపరచాలని వుంది.

నందె వయసు ఇరవై సంవత్సరాల వరకూ వుంటది. గుండ్రటి ముఖం. సాయనలుపు. ఆదివాసీ అమాయకత్వం, స్వచ్ఛత, పట్టుదల కలగలసి వుంటాయి. మధ్య పాపిడి నిలువుగా తీసి నూనె పెట్టి నున్నగా దువ్వుకొని ముడి వేసుకుంటది. ముక్కుకు ముక్కుపుల్ల, చెవులకు జుంకాలు, చేతికి పట్టెడ వుంటాయి. చీర, జాకెట్టు కట్టుకొని, పొడవుగా చక్కగా వుంటుంది. చూడగానే ఆకర్షించే రూపం. అంతకు మించి స్వచ్ఛమైన నవ్వు మనలను కట్టిపడేస్తుంది.

దాదలు (నక్సలైట్లు) అంటే ఎనలేని అభిమానం. వారు పడే కష్టాలు, చెప్పే రాజనీతి ఆమెను ఎంతో ఉత్తేజితురాలిని చేస్తాయి. పూర్తికాలం దళంలోకి పోలేని బలహీనత.

ఊర్లో మహిళా సంఘం నాయకురాలు, పోలీసులు ఆ ఊరి వ్యక్తినే మూడు రోజుల కింద పట్టుకొని హింసించి చంపారు. విపరీతంగా కూంబింగ్ చేస్తున్నారు. గ్రామం అంచున తనపొలంలో పని చేసుకుంటున్న యువతి చేయిపట్టి లాగాడు ఒక పోలీసోడు. ఆ అమ్మాయి గట్టిగా ఏడ్వడంతో తల్లి కౌతుల్‌లోంచి బయటుకు వచ్చి పోలీసుల మీద అరవడంతో వదిలిపెట్టి వెళ్లిపోయారు. దాంతో ఊర్లోని యువకులంతా లోపలి అడవిలోకి వెళ్ళి దాక్కున్నారు.

అంతేగాక ఆ మూడు రోజుల క్రితమే ఆ ఊరి అంచునే మకాం వున్న దాదల మీద ఇన్ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు కాల్పులు జరిపారు. దాదల దగ్గర వున్న అమాయకుడైన ఆదివాసీ యువకుడు లచ్చాలును పట్టుకొని, హింసించి కాల్చి చంపారు.

ఆ ఫైరింగ్‌లోనే సామాన్లు తీసుకుపోలేని దాదలు చాలా వరకు మకాంలోనే వదిలిపెట్టి ఫైరింగ్ చేస్తూ రిట్రీట్ అయ్యారు.

లచ్చాలు శవాన్ని అతని బ్యాగును ఒక నీళ్ళ డబ్బాను పోలీసులు ఊరి జనం చేతనే మోయించారు. దాంతో సామానంతా పోలీసులు తీసుకుపోలేదనీ అసలు మకాం దగ్గరికే వాళ్లు రాలేదనేది అర్థమైంది దాదలకు. అదే విషయం రిట్రీట్ అయిన తర్వాత ఇంకో ఊరి జనం ద్వారా తెలుసుకున్న నక్సలైట్లు మకాంలో చాలా సామాను వదిలివచ్చామని చెప్పిపంపారు.

ఆ కబురు పక్క ఊరు వాళ్ల నుండి నందె వాళ్ల ఊరికి కూడా అందింది. ఊర్లో యువకులు ఎవరూ లేరు. ఏం చేయాలా అని ఆలోచించి మీటింగు వుంది రమ్మని కబురు చేస్తే జనమంతా పోగయ్యారు. ఆ మీటింగులో ఆ సామాను భద్రపరుద్దామని, మకాం దగ్గరికి పోదామని నందె తాపత్రయం. ఊరివాళ్లు తన మాట వినలేదు. ఎలాగైనా దాదల సామాను దాయాలని వుంది. ఏం చేద్దునా అని మధ్యాహ్నం వరకు ఆలోచిస్తానే వుండి పోయింది. ఏ పని చేయ బుద్ధికాలేదు. స్థిమితంగా వుండలేపోయింది. చివరికి ఒక ఐదుగురు చిన్న అమ్మాయిలను అందరూ పదేళ్లలోపువారే, ఒక్కమ్మాయి మాత్రమే పన్నెండేళ్లది. ఐదుగురు పిల్లలు, తనూ మొత్తం ఆరుగురు కలిసి కట్టెలు కొట్టుకుంటూ, నారతీసుకుంటూ మకాం చుట్టూ తిరిగి చూసుకున్నారు. ముందూ, వెనకాల, పక్కలకు, నీళ్ల దగ్గర అంతటా కట్టెలు ఏరుతూ చూసారు. కొద్దిసేపు కోతులను గెదిమారు. అంతా చెక్ చేసుకుని చుట్టుపక్కల ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక మకాంలోకి అడుగుపెట్టారు.

"ఆలెరీ, ఎంత సామాను" ఆశ్చర్యపోయారు. ఈ సామానంత గుట్టకు పెట్టడం మనవల్లకాదనుకొని ఇద్దరు అమ్మాయిలతో ఊరికి కబురు పంపింది నందె.

అంతా బాగానే వుందని, పోలీసులు లేరనీ, సామాను చాలా వుందని, రమ్మని చెప్తే అప్పుడు ఆడవాళ్లు మగవాళ్లు కలిసి ఓ ఇరవై మంది దాకా వెళ్లి సామానంతా గుట్టకు భద్రపరచి వెళ్లిపోయారు.

ఆ తర్వాత దళం వాళ్ల ఊరికి పోయినపుడు ప్రతీ వస్తువు తెచ్చి అప్పజెప్పారు.

నందె తెగువను, ప్రేమను, పట్టుదలను చూసి దాదలు ఎంతో ఉత్తేజాన్ని పొందారు. అవును. ప్రజల అండ వుంటే ఎంతటి నిర్బంధాన్నైనా చేపల్లాగా ఈదెయగలం అనుకున్నారు. నందెకు లాల్‌సలామ్ అంటూ కృతజ్ఞతతో చేతులు కలిపారు.

*

ప్రశ్నించటం నేర్పిన వల్లంపాటి

వ్యాసం

✩ పలమనేరు బాలాజి

తెలుగులో గొప్పవనిపించుకున్న ఇరవై కథలకి విమర్శ రాయాలనుకున్న సంకల్పం, తెలుగు సాహిత్యంపై అత్యంత ప్రభావం చూపిన ప్రధాన పాత్రలపైన వ్యాసం రాయాలన్నకోరిక, రాయలసీమ కథా సాహిత్యం యొక్క ప్రత్యేకతల్ని వివరిస్తూ ఇంగ్లీషులో రాద్దామనుకున్న వ్యాసం, ఇంగ్లీషుతో సహా ఇతరత్రా భాషల్లోకి ఎప్పుడైనా, ఎవరైనా అనువదించటానికి వీలుగా రూపొందించాలనుకున్న కథల జాబితా, మిత్రులకు బదులు రాద్దామనుకున్న ఉత్తరాలు, చదవాల్సిన పుస్తకాలు, పంచుకోవాలనుకున్న జ్ఞాపకాలు, చెయ్యాల్సిన చాలా పనుల్ని వదిలి, సాహిత్యలోకాన్ని విడిచి వల్లంపాటి వెంకట సుబ్బయ్య వెళ్ళిపోయారు.

కులమత ప్రాంతీయ వయో బేధాల్లేకుండా, భేషజాలకు పోకుండా తెలుగు సాహిత్యాన్ని, సాహిత్యకారుల్ని ప్రేమించిన నిత్య ఉత్సాహి, మానసిక యవ్వనవంతుడు, స్నేహశీలి అయిన వల్లంపాటి దూరం కావటం సాహిత్య లోకానికి, ఆయన కుటుంబానికి తీరని లోటు.

ఆయన చిత్తూరు జిల్లా రొంపిచర్లలో 15-03-1937లో జన్మించారు. ఎం.ఎ., బి.ఇడి., పి.జి.డి.టి.ఇ విద్యార్హతలు. సీఫెల్ నుంచి The Role of Indian Sensibility in the teaching of English Literature అన్న విషయంపై పట్టా పొందారు. ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేసి మదనపల్లె బి.టి.కాలేజిలో 1995లో పదవీ విరమణ చేసారు.

నవలాశిల్పం (1995), కథాశిల్పం (1996), వల్లంపాటి సాహిత్య వ్యాసాలు (1997), విమర్శా శిల్పం (2002), రాయలసీమలో ఆధునిక సాహిత్యం - సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ (మార్చి 2006) అనే గ్రంథాల్ని వెలువరించారు. చివరిది 'A Socio - economic Analysis of Modern Telugu Literature in Rayalaseema' యుజిసి వారి Major Research Project లో భాగంగా అధ్యయనం చేయబడింది. ఈ పుస్తకం రాయటానికి వల్లంపాటి ఎంతో శ్రమపడ్డారు. తన జీవితకాలంలో ఈ పుస్తకం ఆవిష్కరణ జరగకపోవటం విచారకరం. అయినప్పటికీ 15-03-2007న వల్లంపాటి జన్మదినోత్సవం నాడు కడప సి.పి.బ్రౌన్ పరిశోధనా కేంద్రంలో వారి సతీమణి పద్మ చేతుల మీదుగా సాహిత్యాభిమానుల మధ్య ఆవిష్కరణ జరిగింది. స్థల కాలాలకు, సంస్కృతి, సంప్రదాయాలకు సాహిత్యానికి చెందిన ఈ రకమైన పరిశోధన రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు, సాహిత్యానికి సంబంధించి కూడా జరగాల్సి వుంది. వల్లంపాటి సాగించిన పరిశోధన సామాన్యమైందీ, సాధారణమైందీ కాదు. యూనివర్శిటీలు కూడా చేయలేని పనిని వల్లంపాటి చేయగలిగారు.

సాహిత్య విమర్శకుడుగా ప్రసిద్ధుడైనప్పటికీ వల్లంపాటి కథారచయిత, నవలా కారుడు, అనువాదకుడు కూడా.

మిత్రుడు, కథారచయిత మధురాంతకం రాజారాం ప్రోత్సాహంతో తాను కథా రచన ప్రారంభించినట్లు వల్లంపాటి స్వయంగా పేర్కొన్నారు. 72 కథలు రాసినప్పటికీ ఎందుకనో కథాసంపుటి వేసుకునే ప్రయత్నం చెయ్యలేదు. ఆయన రాసిన కథల్లో ప్రణయసేతువు, గాయపడిన దేవత, బండి కదిలింది, రానున్న శిశిరం ముఖ్యమైనవిగా స్వయంగా పేర్కొన్నారు. బండికదిలింది (మార్చి, ఏప్రిల్ 1992), బంధాలు (డిసెంబర్ 92) కథలు (ఇండియా టుడే) చివరివి.

ఈ కథలు కాక క్రింది కథలు ప్రస్తుతం లభ్యమవుతున్నాయి. మిగతా కథల్ని సేకరించాల్సి వుంది. "పరిష్కారం, వాన, జీవన విపణి, నేనింకా నిరుద్యోగినే, బడబాగ్ని, అల్పసంతోషులు, ప్రతిధ్వనులు, పరిధి, కళారహస్యం, మిథ్య, ఘట్టికుటికా ప్రభాతం, జాలరి బాల, తీరని ఋణం, విముక్తి, జీవిత విలయం, ధర్మనిలయం, పరాజితుడు, ఎదురు చూడని క్షణం, అందని పళ్లు, మిత్రత్రయం, ఆగంతుక, సమాంతరాలు, అన్యధా శరణం నాస్తి, తెచ్చుకున్న ముప్పు, రామనాథం ట్యూషన్లు, దీపో పునర్జ్వలతి, కోరిక తీరిన వేళ". వీరి మొదటి కథ అన్యధాశరణం నాస్తి ఆంధ్రప్రభలో 1958లో ప్రచురితమైంది.

ఆంధ్రజ్యోతి ఆదివారం సంచికలో 'రానున్న శిశిరం' కథకు సంబంధించి వల్లంపాటి రాసిన కథానేపథ్యం, కథను చదవటం ఎలా అన్నవ్యాసం ముఖ్యమైనవి.

ఇంద్ర ధనస్సు (1962), దూరతీరాలు (1964), మమతలు - మంచుతెరలు (1972), జానకిపెళ్ళి (1974) వల్లంపాటి నవలలు. ఆయన రాసిన మొదటి నవలకే (ఇంద్ర ధనస్సు) ఆంధ్రప్రభ నవలల పోటీలో ద్వితీయ బహుమతి లభించడం విశేషం.

నాటి కవులు (1963), అనుశీలన (1985), వ్యాస సంకలనాల్ని వెలువరించారు.

వల్లంపాటి చేసిన అనువాద రచనలు :-

బతుకంతా - దేవనూరు మహాదేవ (కన్నడం - 1994), లజ్జ - తస్లీమా నస్రీన్ (1996) చరిత్ర అంటే ఏమిటి (1983), చరిత్రలో ఏం జరిగింది (1985), ప్రపంచ చరిత్ర (1986), ప్రాచీన భారతదేశ చరిత్ర (ఆర్.ఎస్. శర్మ 2002), నవల - ప్రజలు (1992), ఆయన అనువాద రచనలు.

భారతీయ, ఆంగ్లసాహిత్యానికి సంబంధించిన 15 పరిశోధనా పత్రాల్ని Literary Criterion, Literary Endevour, Literary Half yearly, Indian Review, Indian Literature, Pratibha India లాంటి పత్రికల్లో ప్రచురించారు. తెలుగు రచనలు [illegible] గురించి సైతం ఆసక్తికరమైన పరిశోధనా వ్యాసాలను ఆంగ్లంలో వెలువరించారు.

హెమింగ్వే A Farewell to Arms మొదలు సాల్మన్ రష్దీ The Midnight's Children వరకు తెలుగు రచయితలు తప్పకుండా చదవాల్సిన వంద ఆంగ్ల నవలల జాబితాను 1998లోనే రూపొందించారు. తెలుగు రచయితలు ఈ నవలల్ని చదవాలనే ఆశను పలు సందర్భాల్లో వ్యక్తం చేసారు. ఆంగ్లభాషలో గొప్పవనిపించుకున్న చాలా పుస్తకాల్ని చదివిన చాలా తక్కువ మంది తెలుగు సాహిత్యకారుల్లో వల్లంపాటి ముఖ్యులు.

వీరి సాహిత్య కృషికి గానూ తాపీ ధర్మారావు అవార్డు (1993), కొండేపూడి సాహిత్య సత్కారం (1995), తెలుగు యూనివర్శిటీ అవార్డు (1997), గజల మల్లారెడ్డి అవార్డు (2000), కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు (2000)లు లభించాయి.

కథాశిల్పం, నవలా శిల్పం పుస్తకాలు రచయితలెందరికో స్ఫూర్తిని చైతన్యాన్ని కలిగించాయి. వస్తు శిల్పాలు సమన్వయం గురించి సులభంగా అర్థమయ్యేలా ఈ పుస్తకాలు పాఠాలు చెపుతాయి.

వందలాది ఇంగ్లీషు, తెలుగు, కన్నడ పుస్తకాల మధ్య టీ తాగుతూ ఆయనతో సంభాషించటం ఏ రచయిత మిత్రుడికైనా ఒక అపూర్వమైన అనుభవం. కాలం ఎంతైందీ ఎప్పుడూ తెలిసేది కాదు వారి సమక్షంలో.

కుల ప్రాంతీయ వర్గ దురభిమానాలు ఆయనకు బొత్తిగా లేకపోవటం వల్ల, మొహమాటాలు, దాపరికాలు, ముఖస్తుతి మాటలు ఆయనకు నచ్చకపోవటం వల్ల చాలా మందికి ఆయన దగ్గర కాలేకపోయాడు. అదే కారణాల వల్ల చాలా మందికి ఆయన దగ్గరయ్యాడు.

సామాన్యంగా ఆయన ఎంత సున్నితంగా మాట్లాడుతారో, అవసరమైనప్పుడు అంత పదునుగానూ, నిక్కచ్చిగానూ మాట్లాడుతారు, రాస్తారు.

కథాశిల్పంపై ఆంధ్రప్రభ వార పత్రికలో రెండు వారాల వక్ర విమర్శా సమీక్ష వచ్చినప్పటికీ ఆయన ఎంతమాత్రం చలించలేదు. కేంద్ర సాహిత్య అకాడమి

అవార్డు ప్రధాన కార్యక్రమంలో మార్క్సిజంకు వ్యతిరేకంగా అకాడమి అధ్యక్షుడు వ్యంగ్యంగా ప్రసంగిస్తే, వల్లంపాటి దాన్ని ఖండిస్తూ సవివరంగా, సోదాహరణంగా ఒక మంచి వ్యాసాన్ని తన స్పందనగా రాసారు. మార్క్సిజాన్ని అర్థం చేసుకోవటానికి ఈ వ్యాసం ఎంతగానో ఉపకరిస్తుంది. ఇది ఆయన ధైర్యానికి ఒక ఉదాహరణ మాత్రమే.

సంయమనం కోల్పోకూడని సందర్భాలూ వల్లంపాటికి తెలుసు. స్పందించాల్సిన సందర్భాలూ ఆయనకు తెలుసు.

రాయటంలోనే కాదు, మాట్లాడ్డంలోనూ వల్లంపాటిది ప్రత్యేకమైన, ఆసక్తికరమైన శైలి. ఆయన మంచి చదువరి. మంచి వక్త. అన్నింటికీ మించి ఆయన మంచి శ్రోత.

గతంలో మదనపల్లెలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ బస చేసిన బి.టి.కాలేజి క్వార్టర్‌కు ఠాగూర్ కాటేజ్ అని పేరు. 28.2.1919లో The morning song of India రూపుదిద్దుకుంది అక్కడే. స్వంత ఇల్లు నిర్మించుకునేంత వరకూ దాదాపు 23 సంవత్సరాలు (1970-93) వల్లంపాటి నివసించింది కూడా ఠాగూర్ క్వార్టర్స్‌లోనే కావటం వారికి సంతోషాన్నిచ్చే జ్ఞాపకాల్లో ఒకటి.

వల్లంపాటి సాహిత్యాన్ని ఎంతగా అభిమానించారో అంతగానూ కుటుంబాన్ని, స్నేహితుల్ని అభిమానించారు.

***

పద్మమ్మ, ప్రసాద్, కరుణ, అరుణలకు (భార్య, కొడుకు, కుమార్తెలు) వల్లంపాటి గారంటే విపరీతమైన ఇష్టం, గౌరవం. వారికి ఎంతో విలువైన సృజన, సంస్కారం, సహృదయతల్ని తన వారసత్వంగా అందించివెళ్ళారు. వారి వారసత్వాన్ని సాహితీలోకం మొత్తం అందుకోవాల్సి వుంది.

తెలుగు భాషాభివృద్ధికి, కళలు, సంస్కృతి, సాహిత్యానికి సంబంధించి ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలు చేయాల్సినంత నిర్మాణాత్మకంగా కృషి చేయకపోవటాన్ని వల్లంపాటి నిరసించేవారు. తెలుగు పాఠ్యాంశాల రూపకల్పన, పరిశోధనాంశాల ఎంపిక ప్రక్రియల్లో విప్లవాత్మకమైన మార్పులు రావాల్సిన అవసరాన్ని గురించి ఆయన పదేపదే తన అభిప్రాయాల్ని వెలువరించారు. ఇతర భాషా సాహిత్యాల్లోని అభివృద్ధిని వివరంగా తెలియజెప్పి ఉత్సాహం కలిగించాలనుకునే వారు.

ఏ ప్రాంతం వారైనా సరే యువ రచయితలతో చర్చించటం, వారిని ప్రోత్సహించటం, వారి సాహిత్య కృషి గురించి వివరాలు తెలుసుకోవటం వల్లంపాటికి ఇష్టమైన విషయం. కొత్తగా ఎవరు రాస్తున్నారు? ఏం రాస్తున్నారు? అనే విషయాల్ని వల్లంపాటి వాకబు చేసేవారు. కొత్త తరాన్ని కొత్తదనాన్ని ఆయన ఎప్పుడూ ఇష్టపడేవారు.

రచయితల్లో సాహిత్యంతోపాటు జీవితం పట్ల కూడా సరైన దృక్పథం, నిజాయితీ ఉన్నాయా లేవా అని వల్లంపాటి సునిశితంగా పరిశీలించేవారు.

కథా సాహితి వారి కథ 2005 కోసం రాసిన 'రాయలసీమలో కథా విస్తరణ' (12.8.2006) వల్లంపాటి చివరి రచన. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథా సంపుటికి రాసిందే చివరి ముందుమాట. "బంధాలు" ఆయన చివరికథ (1992). తీవ్ర అనారోగ్యంతో కృంగిపోతున్న దశలో,ఆయనకు ఆయన కుటుంబానికి ఊరట కలిగించిన చివరి ఉత్తరం మాత్రం ఎ.వి.రెడ్డి శాస్త్రి గారిది మాత్రమే. తన సమస్యల్ని, అనారోగ్యాన్ని పక్కన బెట్టి మిత్రుడి కుటుంబానికి ధైర్యం చెపుతూ ఎ.వి.రెడ్డి శాస్త్రి రాసిన ఉత్తరం, అతడిచ్చిన ఓదార్పు గొప్పవి. ఆ ఉత్తరం వల్లంపాటికి ఊరట కలిగించిన ఉత్తరాల్లో ముఖ్యమైందీ, చివరిదీ. డాక్టర్ మనోహర్, డాక్టర్ జ్ఞానేశ్వర్ (మదనపల్లె), రాయుడు, డాక్టర్ రజనీకాంత్ (బెంగళూరు) మొదలైన వారిచ్చిన ధైర్యం. ఓదార్పు విస్మరించలేనిది.

***

వివిధ సందర్భాల్లో వల్లంపాటి వ్యక్తం చేసిన అభిప్రాయాల్ని ఒకసారి పరిశీలిద్దాం.

1. "అభిప్రాయ భేదాలను సహించగల సౌజన్యం తెలుగు సాహిత్యంలో ఏనాడూ లేదు. వాటిని స్నేహానికి అడ్డం రాకుండా చూసుకోగల సంస్కారాన్ని మనం ఇంకా నేర్చుకోవలసి ఉంది".

"అయ్యా శాస్త్రిగారూ (ఎ.వి.రెడ్డి శాస్త్రి). సత్యం చెప్పటం మన ధర్మం. చెప్పాల్సిందే. ఇతరులకు మనమంటే మంట కలిగేటంగా చెప్పాలని కాదు. సత్యం చెప్పాలని మాత్రమే. సత్యాన్ని సౌమ్యంగా చెప్పినంత మాత్రాన వాళ్ళకు నచ్చుతుందంటారా? (రచన జనవరి 97).

2. "సత్యవతి కథలు నిశ్చల నిశ్చితాలను ఆదర్శీకరించవు. కుహనా ఆదర్శాలను ప్రతిపాదించవు. సమాజ పరిణామశీలతను తిరస్కరించవు. జీవిత సమస్యను పరిణామం నుంచీ వేరు చేసి చూడవు. స్త్రీ కళ్ళలోకి చూడగల సాహసం లేక మనం తప్పించుకు తిరుగుతున్న ప్రశ్నల్ని ఈ కథలు మనం నడుస్తున్న బాటలో నాటుతాయి. ఈ ప్రశ్నలు మనల్ని ముందుకు అడుగువేయనీవు. మనల్ని చూసి వ్యంగ్యంగా నవ్వుతాయి. మనలో రెండు విభిన్న వ్యక్తిత్వాల మధ్య, మన ఆత్మవంచన పరవంచనల మధ్య నిటారుగా నిలబడి మనకళ్ళలోకి చూస్తూ నవ్వుతాయి. మనల్ని అల్లరి పెడతాయి. మనల్ని సుఖంగా ఉండనివ్వక అల్లరిపెట్టే ప్రశ్నల్ని అడిగే సత్యవతి కథలు గొప్పవి కాక మరేమౌతాయి?" (సాహిత్యనేత్రం 9వ సంచిక)

3) "ఒక కాలంలో గొప్పరచన అనిపించుకున్నది సర్వకాలాల్లో గొప్ప రచన కానవసరం లేదు. ఏ కాలం సాహిత్యానికైనా పునర్మూల్యాంకనం అవసరం. చక్కని శైలి శిల్పాలతో, వస్తువూ రూపాల సమన్వయంతో, సమాజానికి ఉపకరించే విలువలూ, విషయాల గురించి నిజాయితీగా చెప్పు, సామాజిక వాస్తవాలను నిజాయితీగా చిత్రించడం గొప్ప రచన లక్షణం".

"కొనసాగుతున్న లేక ముమ్ముందు కూడా కొనసాగగల ఉద్యమాల నుంచే మంచి సాహిత్యం వస్తుంది. నిజమైన యుద్ధాలు జరగడానికి ముందు, ఆ యుద్ధాలు సాంస్కృతిక, కళారంగాల్లో జరుగుతాయి".

"మన సంస్కృతిలో మనం కొనసాగించవలసిన అంశాలతోపాటు నిర్ద్వంద్వంగా తిరస్కరించవలసిన అంశాలు కూడా ఉన్నప్పుడు వాటిని చారిత్రక దృష్టితో ఎప్పుడైనా విశ్లేషించారా? చరిత్ర అంటే కొంతమంది ఆదర్శ పురుషుల గురించి రాయడం మాత్రమేనా లేక సమాజానికి అందులో చోటేమైనా ఉందా"?

(చర్చ - ఇండియాటుడే 1994 వార్షిక సాహిత్య సంచిక)

4) పద్యాన్నీ, గేయాన్నీ, బ్రతుకునూ, కవితనూ, ఆవేశాన్నీ, ఆలోచననూ తగినపాళ్ళలో తనలో ఇముడ్చుకున్న ఉన్నత శ్రేణి కావ్యం పెన్నేటి పాట. ఇరవయ్యవ శతాబ్దంలో కండగల కావ్యభాషను సృష్టించుకున్న చాలా తక్కువ కావ్యాలలో పెన్నేటి పాట ఒకటి. కవితావేశంలో మహా ప్రస్థానంకు దీటు రాగలిగిన కావ్యం 'పెన్నేటి పాట' (అక్షర - డిఆర్ అభినందన సంచిక)

5) "ఈనాటి రష్యన్ కథారచయితలు కథా వస్తువుకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తే అమెరికన్ కథారచయితలు కథనానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. రష్యన్ రచయితలు సామాజిక జీవితాన్ని గురించి ఎక్కువగా రాస్తే, అమెరికన్ రచయితలు మానవుని ఏకాంత, మానసిక జీవితాన్ని గురించి ఎక్కువగా రాస్తున్నారు. మరికొందరు కథానికను శైలిలో, శిల్పంలో ఖండకావ్యానికి దగ్గరగా తీసుకుపోతున్నారు. ఎన్ని రూపాంతరాలు పొందినా, నడకలో ఎన్ని వయ్యారాలు పోయినా జీవితాన్ని ప్రమాణంగా కలిగి, వాస్తవికత కథన పద్ధతిగా కలిగిన కథానికకున్న గౌరవం ఉండనే ఉంది. - ముఖ్యంగా మనదేశంలో, మన భాషలో".

(28.11.1987 చిలుకూరి దేవపుత్ర ఆరుగ్లాసులు కథా సంపుటికి రాసిన ముందుమాట)

6) జీవితానుభవం భావం (Idea) రూపంలోకానీ, భావోద్రేకం (Emotion) రూపంలో కానీ ఉంటుంది. భావాన్ని తర్కం ఆధారంగా, బుద్ధి ప్రధానంగా నేరుగా Communicate చేయవచ్చు.

కానీ భావోద్రేకాన్ని అలా Communicate చేయటం సాధ్యం కాదు. దానికి ఏదో ఒక పరోక్ష విధానాన్ని ఎన్నుకోక తప్పదు. భావాన్నిప్రత్యక్షంగా Commu-

nicate చేయటానికి ప్రయత్నిస్తే వ్యాసం పుడుతుంది. భావోద్రేకాన్ని పరోక్షంగా Communicate చేయడానికి ప్రయత్నిస్తే కథ (లేక నవల) పుడుతుంది. కాబట్టి కథలోని ఒక పాత్ర బాధపడుతోంది అని చెప్పి పాఠకునిలో బాధను కలిగించటం సాధ్యం కాదు. పాఠకునికి ఆ బాధ అర్థం కావచ్చు. కానీ ఆ బాధను అనుభవిస్తున్న పాత్ర మీద సహానుభూతి కలగదు. సహానుభూతిని కలిగించాలంటే పరోక్షపద్ధతులు అనుసరించక తప్పదు. దాన్నే కల్పనా సాహిత్య విమర్శలో కథనశిల్పం (Narrative technique) అంటారు".

(26.2.05 మధురాంతకం నరేంద్ర కథా సంపుటి).

7) "జీవితాన్ని కథగా అల్లుకునే నేర్పరితనం కథలు రాస్తున్నంత కాలమూ కథారచయితకు ఉండాలి. జీవితంలో రచయితను ఆకర్షించిన ప్రతి సంఘటనా కథగా రూపొందక పోవచ్చు. వాటిలో కొన్ని కవితలు కావచ్చు. కొన్ని నాటకాలు కావచ్చు. కొన్ని నవలలు కావచ్చు. కొన్ని కథలు కావచ్చు. మరికొన్ని వ్యాసాలు మాత్రమే కావచ్చు. ఏ సంఘటనలు లేదా భావాలు ఏ సాహిత్య రూపంగా బలంగా రూపొందగలవో రచయిత గ్రహించగలిగి వుండాలి.

విస్తృతి తక్కువగా ఉండి, లోతు ఎక్కువగా ఉండవలసిన సాహిత్య ప్రక్రియ కథ".

(కాట్రగడ్డ దయానంద్ 'పండుటాకు'కు ముందుమాట)

8) "కథ భిన్న స్వరాల కూడలిగా వాటిలో నుంచి కథా వస్తువు సహజంగా, తనంతకు తానుగా రూపొందాలి. రచయిత స్వరం ఇతరుల స్వరాలను మింగివేస్తున్నంత బిగ్గరగా వినిపిస్తూ తన అభిప్రాయాలను బలవంతంగా రుద్దుతున్నట్లుగా వినిపించకూడదు".

(తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథా సంపుటికి రాసిన ముందుమాట)

9) రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతికి విశ్లేషణ పుస్తకం నుండి (మార్చి 2006)

"పల్నాటి వీర చరిత్రను శ్రీనాథుడు రాసి ఉండే అవకాశం చాలా తక్కువని నా అనుమానం, ఆ కావ్యంలో శ్రీనాథుని పద ప్రయోగాలు అక్కడక్కడ కనిపించే మాట వాస్తవమే. కానీ శ్రీనాథుడు చిత్తవృత్తికీ, ఆ కావ్య హృదయానికీ చాలా దూరం వుందని నా నమ్మకం".

"కర్ణాటక ప్రభుత్వం ఆంధ్ర ప్రాంతంలోకి ప్రవహించే నదులకు, కాలువలకు అడ్డుకట్టలు కట్టి వాటిని ఇసుక పర్రలుగా మార్చివేయటం - ఈ విషయాన్ని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు 1956లోనే గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిన్ననో, మొన్ననో గుర్తించింది".

"నిజమైన స్వాతంత్ర్యం అభివృద్ధి లేకుండా సాధ్యంకాదు. అలాగే అభివృద్ధి లేకుండా నిజమైన స్వాతంత్ర్యం రూపొందదు. అభివృద్ధికీ, స్వాతంత్ర్యానికీ మధ్య విడదీయరాని సంబంధం ఉంటుంది. అభివృద్ధిని సాధించాలంటే పారతంత్ర్యానికి మూలకారణాలైన పేదరికాన్నీ అణిచివేతనూ తొలగించాలి మరోరకంగా అభివృద్ధి లేకపోవటం చేత రాయలసీమలో పేదరికమూ, అణచివేతా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇన్ని కారణాల కలగాపులగపు ఫలితంగా రాయలసీమలో సాధారణ ప్రజాజీవనం ప్రజాస్వామికీకరణ పొందలేదు. ఇక్కడ ఫ్యాక్షనిజం ప్రభావం అధికంగా వున్న ప్రాంతాలను గురించి ఆర్థిక విశ్లేషణ చేస్తే, అభివృద్ధీ, ప్రజాస్వామికీకరణ తక్కువగా ఉండటం చేతనే ఫ్యాక్షనిజం ఎక్కువగా ఉందన్న సత్యం బయటపడుతుంది. అభివృద్ధిని సాధించకుండా, సమాజాన్ని ప్రజాస్వామికీకరణం చేయకుండా రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని నిర్మూలించటం సాధ్యంకాదని ప్రభుత్వాలు గుర్తించటం లేదు. ఫ్యాక్షనిస్టు హింసను తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అన్ని పార్టీలూ బహిరంగంగా ఉపయోగించుకుంటున్నాయి".

".....రాయలసీమకు ఒక ప్రత్యేక చరిత్ర లేకపోయినా, ప్రత్యేకత ఉన్న చరిత్ర మాత్రం ఉంది".

"..... ఎంతో పరిశోధన చేసి "కరువు కాటకాల కన్నీటి కోననేటి రాయలసీమ (ఒక చారిత్రక పరిశీలన), "కరువు జిల్లాలో కొత్త పాలెగాళ్ళు" "ప్రార్థనలు ప్రభువుకు ప్రసాదం పాలెగాళ్ళకు" వంటి గ్రంథాలను ప్రచురించిన విప్లవోద్యమ సంస్థలూ, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘమూ ఈ లోగా రాయలసీమ సమస్యలమీద చూడవలసినంత శ్రద్ధ చూపటం లేదు".

"ఉత్తర కోస్తాకు వంగపండు ప్రసాదరావు, తెలంగాణాకు గద్దర్, వల్లంపట్ల, గోరటి వెంకన్న ఉన్నట్లుగా రాయలసీమకు అఖిలాంధ్ర ఖ్యాతి గడించిన గాయక - ప్రదర్శకులు లేరు. ఈ లోటు సాధ్యమైనంత త్వరగా తీరవలసివుంది.

వంగపండులాగా, గద్దర్‌లాగా రాయలసీమ మాండలికాన్ని ఎవరూ పాటకు మలుచుకోలేదు. రాయలసీమ ఉద్యమాలను నడిపిన వారు కూడా ఈ అంశాన్ని గుర్తించలేదు.

ఏది ఏమైనా రాయలసీమ భాషలో, రాయలసీమ జీవితాన్ని గురించి పాటలురాసి, కాలికి గజ్జకట్టి రంగస్థలం మీద ఆడే కళాకారుని కోసం మనం మరెంతకాలం వేచి ఉండాలో అర్థం కావటం లేదు".

".... రాయలసీమకు కరువులు కొత్తకాదు. కానీ ఆత్మహత్యలు కొత్తే, సరళీకృత విధానంలో సరళమైపోయింది ఆత్మహత్యలు మాత్రమే..."

తెలుగు కథా తీరుతెన్నుల గురించి కథా వార్షిక 2002 ప్రచురణ సందర్భంగా 23.2.2003న వల్లంపాటి చర్చాగోష్ఠిలో నిక్కచ్చిగా వెలువరించిన అభిప్రాయాలు చూద్దాం.

"విమర్శ దృష్టిలోంచి చూస్తే ఇంకా మనం చాలా సాహిత్య విషయాల్ని గురించి ఓపెన్‌గా చర్చించే వాతావరణాన్ని సృష్టించుకోలేదని తెలుస్తుంది. మేం ఇన్ని కథలు చదివాం. ఇందులో ఇవి మంచికథలు కావు. అందువల్ల మా సంకలనంలో వెయ్యలేదు. ఫలానావాదాన్ని ఫలానా ప్రాంతాన్ని ఫలానా కారణం వల్ల పట్టించుకోలేదు. - అని చెప్పేంత స్పష్టతను, ఓపెన్‌నెస్‌ను పెంచుకోవలసి వుంది".

* * *

వల్లంపాటి కథలు, నవలలు, సమీక్షలు, వ్యాసాలు, ముందుమాటలు, ప్రసంగాలు, చర్చలు పుస్తక రూపంలో తేవటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. చాలా విలువైన చాలా వ్యాసాలు పుస్తకంగా అందాల్సి వుంది.

విమర్శల్ని సహృదయంతో స్వీకరించి, అధ్యయనం, అభ్యసనం ద్వారా, రచనా నైపుణ్యాన్ని మెరుగుపరచుకునే అలవాటును పెంపొందించుకోవలసిందిగా వల్లంపాటి సూచిస్తూ వచ్చారు. తన పుస్తకాల పైన చర్చ జరగాలని, ఆ తర్వాత అక్కడి నుండి పరిశీలనా, పరిశోధన మరింత ముందుకు వెళ్ళాలని వల్లంపాటి ఆశించారు. ఎన్నో గురుతరమైన బాధ్యతల్ని సాహిత్యకారులకు వదిలి వల్లంపాటి వెళ్ళిపోయారు.

వల్లంపాటి తెలుగు విమర్శనా రంగానికి తన నిరంతర కృషిద్వారా కొత్త చేర్పుల్ని అందించి జవజీవాల్ని కల్పించి దీపధారి అయినారు. వల్లంపాటి ఆగమనానికి ముందు తెలుగు సాహిత్య విమర్శనా రంగంలో నెలకొన్న స్తబ్దతే నేడు కొనసాగడం విషాదకరం, విచారకరం. ఈ పరిస్థితిని సాహిత్యరంగం అధిగమించాల్సి వుంది.

సంయమనం, సత్యదృష్టి, సహృదయత, నిజాయితి కలిగిన నిరంతర అధ్యయన శీలి అయిన విమర్శకుల కోసం తెలుగు సాహిత్యరంగం ఆశగా ఎదురు చూస్తోంది.

"నేనేం పాపం చేసానయా? చదవమని చెప్పి చాలా మందికి దూరమయ్యాను" - అని వల్లంపాటి చాలాసార్లు బాధపడ్డారు.

రచయితలు విస్తృతంగా చదువుకోవాలని, అధ్యాయాంశాల్ని మెరుగైన అవగాహనతో చర్చించుకోవాలని, సత్ సాహిత్యాన్ని సృష్టించాలని వల్లంపాటి ఆశపడ్డారు. ఆయన ఆశల్ని, ఆకాంక్షల్ని, మనపై వుంచిన బాధ్యతల్ని మనం నెరవేర్చాల్సి ఉంది. అదే వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారికి మనం సమర్పించే నిజమైన నివాళి. *

సాహిత్య విమర్శ గురించి 'వల్లంపాటి'

☆ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

వల్లంపాటి సాహిత్య విమర్శా రంగంలో చేసిన కృషిని మూడు భాగాలుగా విభజించుకోవచ్చు. 1. సాహిత్యాన్ని గురించి ఆయన ఏమి చెప్పారు? 2. దీని వెలుగులో విభిన్న రచయితల్ని గురించి ఏమి చెప్పారు? 3. సాహిత్య విమర్శను గురించి ఏమి చెప్పారు? ఈ వ్యాసంలో ఈ మూడో అంశాన్ని గురించి మాట్లాడుకుందాం.

తెలుగులో సాహిత్య విమర్శ చాలా తక్కువ వచ్చిందనే అభిప్రాయం వెలువడుతున్న నేపథ్యంలో ఆలోచిస్తే తెలుగువాళ్ళు సాహిత్య విమర్శను గురించి చేసిన చర్చ మరీ తక్కువ అనిపిస్తుంది. ఈ చర్చ ఎంత చిన్నదైనా దీన్లో వల్లంపాటి పాత్ర చెప్పుకోదగినంతగా ఉంది.

వల్లంపాటి 1980లో 'ఆధునిక సాహిత్య విమర్శా పద్ధతులు', 1981లో 'సాహిత్య విమర్శ ప్రయోజనం', 1996లో 'సమాజం - సాహిత్యం - సాహిత్య విమర్శ' అనే వ్యాసాలు రాశారు. ఈ వ్యాసాలలోని అభిప్రాయాలను విస్తరించి ప్రాచ్యపాశ్చాత్య కావ్యమీమాంసలను సమీక్షిస్తూ 2002లో 'విమర్శాశిల్పం' రాశారు. ఇవి ఆధారంగా సాహిత్య విమర్శను గురించి వల్లంపాటి అభిప్రాయాలను ఆలోచిద్దాం.

సాహిత్యం జీవితాన్ని వ్యాఖ్యానిస్తే సాహిత్య విమర్శ సాహిత్యాన్ని వ్యాఖ్యానిస్తుందనే అవగాహనతో వల్లంపాటి సాహిత్య విమర్శను చర్చించారు. సాహిత్య విమర్శ వ్యాఖ్యానానికి వ్యాఖ్యానం అని ఆయన అభిప్రాయం. ఇది చాలా మందిలో ఉన్న అభిప్రాయం కూడా. దానినే మర్లో రకంగా సాహిత్య విమర్శ డెరివేటివ్ టు డెరివేటివ్ అని ఆంగ్లీకరించారు. జీవితం సాహిత్యాన్ని ప్రభావితం చేస్తే, సాహిత్యం విమర్శను ప్రభావితం చేస్తుందని, ఒక్కోసారి సాహిత్య విమర్శ సాహిత్యాన్ని, సాహిత్యం జీవితాన్ని ప్రభావితం చేస్తాయని చెప్పారు. ఈ రకంగా సమాజ సాహిత్య, సాహిత్య విమర్శల మధ్యగల గతితార్కిక సంబంధాన్ని గుర్తించారు వల్లంపాటి.

'ప్రయోగ శరణం వ్యాకరణం' అన్నట్లుగానే, వల్లంపాటి సాహిత్య విమర్శను కూడా ప్రయోగశరణంగానే గుర్తించారు. మొదట సాహిత్యం, తర్వాతనే సాహిత్య విమర్శ పుడతాయన్నది వల్లంపాటి అవగాహన. సాహిత్యం, సాహిత్య విమర్శ రెండూ సామాజికాంశాలే అని గుర్తించడం వల్ల సమాజం అన్నిటికీ ప్రమాణం అనే సూత్రాన్ని వల్లంపాటి ఆమోదించినట్లైంది. అందుకనే సాహిత్యమూ, సాహిత్య విమర్శ సూత్రాలూ - రెండూ జీవితంలోంచే పుడతాయన్నారు. అంతేకాదు మెరుగైన జీవితంపట్ల సాహిత్యం ఎరుక కలిగించినట్లే సాహిత్య విమర్శ కూడా కలిగిస్తుందనడం దీనికి కొనసాగింపే. కొడవటిగంటి కుటుంబరావులాగే మంచి సాహిత్య విమర్శలేకుంటే మంచి సాహిత్యం రాదని వల్లంపాటి కూడా నొక్కి చెప్పారు. సాహిత్య విమర్శ ఒక ప్రాపంచిక దృక్పథం కలిగిన విమర్శకుడు నిర్వహించే సామాజిక బాధ్యతగా నిర్వచించి, వల్లంపాటి సాహిత్య విమర్శ ఔన్నత్యాన్ని చాటారు. సాహిత్య విమర్శ ప్రయోజనాలేమిటి? అనే ప్రశ్నకు సమాధానం సాహిత్య ప్రయోజనమేమిటి? అనే ప్రశ్నకు మనం చెప్పుకొనే సమాధానం మీద ఆధారపడి ఉంటుందని వల్లంపాటి ఖచ్చితంగా చెప్పారు. పాఠకుని అభిరుచిని విమర్శకుడు సరిదిద్దడం సాహిత్య విమర్శ ప్రయోజనాలలో ఒకటని ఆయన అభిప్రాయం. సాహిత్య విమర్శకుడు చెయ్యవలసిన పని రచనకూ పాఠకుడికి, పాఠకుడికీ రచయితకూ మధ్య అనుసంధానం చెయ్యడమేనని పేర్కొన్నారు. సాహిత్య విమర్శ రచనను వివరించి విశ్లేషించి ఆగిపోకుండా, రచనకు విలువకట్టడం కూడా చెయ్యాలని నిర్దేశించారు వల్లంపాటి. రచనకు విలువ కట్టకపోతే సాహిత్య విమర్శ ప్రయోజనం సమగ్రంగా నెరవేరదని ఆయన అభిప్రాయం.

సాహిత్య విమర్శకు సాహిత్య ప్రమాణాలు, సాహిత్యేతర ప్రమాణాలు అని రెండుంటాయని, మొదటిది ఇంట్రిన్సిక్ అని రెండవది ఎక్స్ట్రిన్సిక్ అని జి.వి. సుబ్రహ్మణ్యం చేసిన విశ్లేషణను స్వీకరించి, వల్లంపాటి, ఇవి రెండూ స్వయం సంపూర్ణాలు కావని, ఇవి రెండూ పరస్పర పూరకాలుగా ఉన్నప్పుడే సమగ్ర విమర్శా సిద్ధాంతం పుట్టుతుందని పేర్కొన్నారు.

సాహిత్య విమర్శ మూల్యాంకనమూ పునర్మూల్యాంకనమూ రెండూ చెయ్యాలని వల్లంపాటి గట్టిగా అభిప్రాయపడ్డారు. రచనను విలువ కట్టడం మూల్యాంకనమైతే, మారిన సామాజిక సందర్భంలో కొత్త విమర్శా సూత్రాలతో ఆ రచనను తిరిగి అంచనా కట్టటం పునర్మూల్యాంకనమని నిర్వచించారు. పునర్మూల్యాంకనం లేకపోతే సాహిత్య విమర్శ స్తబ్దతకు లోనౌతుందని పరోక్షంగా సూచించారు.

రచన చేసే రచయితకు ఒక దృక్పథముంటుంది. విమర్శ చేసే విమర్శకునికీ ఒక దృక్పథముంటుంది. ఇలా ఉన్నప్పుడు రచనను ఎవరి దృక్పథం నుండి విలువ కట్టాలి అన్న ప్రశ్నను వల్లంపాటి చర్చించారు. ఒక దృక్పథం కలిగి ఉండడానికి రచయితకు ఎంత అర్హత ఉందో విమర్శకుడికి కూడా అంత అర్హత ఉంది అని స్పష్టం చేస్తూ రచనను రచయిత దృక్పథం నుంచి అర్థం చేసుకుని, విమర్శకుని సామాజిక ఆర్థిక దృక్పథం నుంచి విలువ కట్టాలి, అది విమర్శకుని బాధ్యత అని స్పష్టంగా చెప్పారు. రచనను అర్థం చేసుకునేంతవరకు రచయిత దృష్టికోణాన్ని విమర్శకుడు గౌరవించకతప్పదని కూడా ఆయన చెప్పారు. ఆ తర్వాత రచనను విలువ కట్టేటప్పుడు విమర్శకుడు తప్పకుండా తన దృష్టి కోణాన్నే ఉపయోగించడం అవసరమని నొక్కి చెప్పారు. మార్క్సిస్టు సాహిత్య విమర్శకుల మీద అసహనం ప్రకటించేవాళ్లు వల్లంపాటి అభిప్రాయాన్ని అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది.

సాహిత్య విమర్శలోని రకాలను వివరించడానికి వల్లంపాటి 1980లోనే 'ఆధునిక సాహిత్య విమర్శ పద్ధతులు' అనే వ్యాసం రాశారు. ఇందులో రూప, మానసిక, మార్క్సిస్టు విమర్శ పద్ధతులను పరిచయం చేశారు. కెవిఆర్ నరసింహంకన్నా స్పష్టంగా వాటిని వల్లంపాటి పాఠకులకు పరిచయం చేశారు. మార్క్సిజం వస్తువుకు ప్రాధాన్యమిచ్చినా రూపాన్ని నిరాదరించలేదని, కొందరు మార్క్సిస్టులలోని పిడివాదం మంచిదికాదని అభిప్రాయపడ్డారు. 2002 నాటి 'విమర్శా శిల్పం' గ్రంథంలో సమాజ, రచయిత, రచనా, పాఠక కేంద్రిత విమర్శా విధానాలను విశ్లేషించారు. ఇవి చాలా వరకు సాధారణ తెలుగు సాహిత్య విమర్శకులకు తెలియనివే. ఇక్కడ కూడా మార్క్సిస్ట్ సాహిత్య విమర్శకులలో తాను ఆమోదించని కొన్ని అంశాలను ఎత్తిచూపారు. 'విమర్శాశిల్పం' గ్రంథం చివర్లో కూడా ఆయన మార్క్సిస్ట్ విమర్శకులను అనేక విషయాల్లో హెచ్చరించారు. దానిని గురించి మార్క్సిస్టు సాహిత్య విమర్శకులు ఆలోచించాలి.

సాహిత్య విమర్శ కళా శాస్త్రమా అనేది విశ్వవిద్యాలయాల ఒక పాఠ్య ప్రణాళికలో ఒక పాఠ్యాంశంగా ఉంది. వల్లంపాటి విమర్శ సంపూర్ణమైన కళకాదు, శాస్త్రమూకాదు, కళగా ప్రారంభమై శాస్త్ర లక్షణాలను సంతరించుకుంటూ ఉన్న సాహిత్య ప్రక్రియ అని నిర్వచించారు. ఇది ఆలోచించాల్సిన అంశం.

సాహిత్య విమర్శకుడు అనివార్యంగా రచయిత కావలసిన అవసరం లేదని పేర్కొంటూ, విమర్శకుడు ఉత్తమ పాఠకుడు, ఉత్తమ విద్వాంసుడు, మంచి శాస్త్ర జ్ఞాని మాత్రం తప్పకుండా కావాలని తేల్చి చెప్పారు. రచయిత అభిప్రాయాలతో ఏకీభవించడమే సహృదయత అయితే అది అన్ని సమయాల్లోనూ కుదరదని కూడా వల్లంపాటి పేర్కొన్నారు. సహృదయ సిద్ధాంతం ఇవాళ కొంత వరకే పనికి వస్తుందని వివరించారు.

వల్లంపాటి చర్చించిన మరొక ముఖ్యమైన అంశం ఉంది. అది సాహిత్య సిద్ధాంతం, సాహిత్య విమర్శ ఒక్కటి కాదు, వేరు వేరు అన్నది. సాహిత్య సిద్ధాంతం సాహిత్యం ఎలా ఉండాలో చెప్పేదని, సాహిత్య విమర్శ సాహిత్యం ఎలా ఉందో చెప్పేదని వివరించారు. ఈ బేధాన్ని సంప్రదాయ సాహిత్య విమర్శకు, కొంత వరకు ఆధునిక సాహిత్య విమర్శకు భారతీయ అలంకార శాస్త్రాలను

అన్వయించే వాళ్ళు గుర్తించవలసి ఉంది. మన ప్రాచీనాలంకార శాస్త్రం అలాగే అరిస్టాటిల్‌ను కొంత వరకు మినహాయిస్తే పాశ్చాత్య అలంకార శాస్త్రం - ఇవి సాహిత్య సిద్ధాంతాలే తప్ప సాహిత్య విమర్శలు కావు అని తేల్చి చెప్పారు. 19వ శతాబ్ది ఉత్తరార్థంలో పాశ్చాత్య సాహిత్య విమర్శతో సంపర్కం కలిగిన తర్వాతనే భారత దేశంలో సాహిత్య విమర్శ ప్రారంభమైందన్నారు.

ఈ అవగాహనతో వల్లంపాటి భారతీయ అలంకార శాస్త్రం మీద చాలా తీవ్రమైన అభిప్రాయాలు వ్యక్తం చేసారు. వాటిని ఇలా క్రోడీకరించవచ్చు.

1. మన ప్రాచీనాలంకారికులెవరూ సమాజానికీ సాహిత్యానికీ ఉన్న వివిధమైన సంబంధాలను గురించి చర్చించలేదు.

2. సమకాలీన వాస్తవిక జీవితం పట్ల అనాదరణ భారతీయ అలంకారిక సంప్రదాయం.

3. మన ప్రాచీన అలంకార శాస్త్రం ప్రధానంగా సాహిత్య సిద్ధాంతమే.

4. భరతుని వద్ద నుంచీ జగన్నాథ పండితరాయల వరకూ మన ప్రాచీన ఆలంకారికులెవరూ ఒక కావ్యాన్ని తీసుకొని అందులోని వస్తుశిల్పాలనూ వాటి సామంజస్యాన్ని ప్రయోజనాన్నీ సమగ్రంగా చర్చిస్తూ కావ్య విమర్శ చేయలేదు. (విమర్శా శిల్పంలోనివి ఈ అభిప్రాయాలు)

5. అలంకార శాస్త్రాన్ని ఆలోచనా రహితంగా సృజనాత్మక సాహిత్యం మీద రుద్దటం చేత మన సాహిత్యానికి జరిగిన అపకారాన్ని సమీక్షించాలి. సాహిత్యాన్ని అర్థం చేసుకోవటానికీ విలువ కట్టటానికీ సహకరించవలసిన అలంకార శాస్త్రం క్రమక్రమంగా రచయిత సృజన శక్తికి సంకెలగా తయారయింది.

6. అలంకార శాస్త్రాన్ని సాహిత్యం మార్గదర్శకంగా అంగీకరించడం వల్ల రచయితకు తనకు నచ్చిన కావ్య వస్తువును తీసుకొని దాన్ని తనకు నచ్చిన వ్యక్తిగత దృష్టికోణం నుంచి పరిశీలించే స్వాతంత్ర్యం దాదాపు లేకపోయింది. రచయిత సృజనశక్తి ఈ విధంగా మేకుబందీ అయిపోవటం చేత, తన వ్యుత్పత్తిని చాటుకోవటం తప్ప అతని కీర్తికి మరో దారిలేకపోయింది.

(1980 నాటి 'ఆధునిక సాహిత్య విమర్శ పద్ధతులు'లోని అభిప్రాయాలు)

భారతీయ అలంకార శాస్త్రం పట్ల ఇలాంటి క్రిటికల్ అభిప్రాయాలు గలిగిన వల్లంపాటి, మరో వైపు వాటిని సాహిత్య విమర్శలో కొంతవరకు ఉపయోగించుకోవచ్చనే అభిప్రాయాన్ని మొదటి నుంచీ కలిగున్నట్లు ఆయన వ్యాసాలు తెలియజేస్తాయి. వాటిని చదివితే రచయితల సృజనాత్మకతకే సంకెలగా రూపొందిన అలంకార శాస్త్రం సాహిత్య విమర్శకు ఎలా ఉపయోగపడుతుందని వల్లంపాటి అనుకున్నారా? అనిపిస్తుంది. "ఆధునిక సాహిత్య విమర్శ పద్ధతులు" వ్యాసంలో "ఆధునిక సాహిత్యాన్ని కూడా అలంకార శాస్త్ర సూత్రాలతో సంపూర్ణంగా విలువ కట్టవచ్చునన్న భ్రమలోపడి గురజాడ వంటి కవులను విశ్వనాథాదులు తక్కువగాను, తప్పుగాను అంచనా వేసి పొరపాటు చేశారని అభిప్రాయపడ్డారు. అదే వ్యాసంలోనే "రచన దృష్టితో చూచినప్పుడు అలంకార శాస్త్రంలో రసం, ధ్వని సిద్ధాంతాలకు చాలా ప్రాముఖ్యముంది. రసం వస్తువుకూ, ధ్వని రచనా పద్ధతికీ సంబంధించిన ప్రధానమైన సూత్రాలని కె.ఎస్.కుప్పుస్వామి శాస్త్రి భావించారు. ఈ సిద్ధాంతాలలోని అనవసరమైన వర్గీకరణలను విస్మరించి జాగ్రత్తగా ఉపయోగిస్తే ప్రాచీన సాహిత్యాధ్యయనానికి ఇవి పరిమితంగా పనికి రావచ్చు అన్నారు. అలంకార శాస్త్రం సాహిత్య సిద్ధాంతమేగాని, సాహిత్య విమర్శ సిద్ధాంతం కాదనుకున్న తర్వాత దానిని సాహిత్య విమర్శలో సాహిత్యాధ్యయనంలో ఏ కొంచెమైనా ఎందుకు ఉపయోగించు కోవాలి? అలాగా అలంకార శాస్త్రం కళాశాస్త్రమేగాని, సమగ్ర విమర్శా పద్ధతికాదని తెలిసీ, అలంకార శాస్త్ర సంప్రదాయంలో స్వీకరించవలసింది ఏమిటో, విసర్జించవలసింది ఏమిటో నిక్కచ్చిగా తేల్చుకోవటం ఎంతైనా అవసరం అని అనుకోవలసిన అవసరం ఏమిటి?

1980ల నాటి వ్యాసంలోని అభిప్రాయాలనే 'విమర్శాశిల్పం' గ్రంథంలో కూడా పునరుక్తి చేశారు వల్లంపాటి. ఈ మధ్యకాలంలో త్రిపురనేని మధుసూదనరావు సంస్కృతి సాహిత్యం ఆధారంగా వచ్చిన అలంకార శాస్త్రాలను ప్రాచీన తెలుగు సాహిత్యానికి అన్వయించడాన్ని వ్యతిరేకించారు. మరోవైపు ముదిగంటి సుజాతారెడ్డి రస సిద్ధాంతాన్ని నవలకు అన్వయించే ప్రయత్నం చేశారు. త్రిపురనేని ఆనంద వర్ధనులు అభినవ గుప్తుడు తమ ధ్వని సిద్ధాంతం ద్వారా సాహిత్యాన్ని ప్రజల నుంచి పూర్తిగా దూరం చేశారని కూడా అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో వల్లంపాటి ఇరవై శతాబ్దాల కాలం జరిగిన కృషి అదే సర్వస్వమని, అది పూర్తిగా పనికిరాదని వాదించడం చారిత్రక వ్యతిరేకమన్నారు. అలాగే మారిన సామాజిక సందర్భంలో పాత అలంకార శాస్త్రం యథాతథంగా పనికివస్తాయని, లేదా అది పూర్తిగా తిరస్కరించవలసిన విషయమని వాదించడం మూర్ఖత్వమన్నారు. అలాగే రసం వస్తువును, ధ్వని శిల్పానికి సంబంధించిన అంశాలని పునరుద్ఘాటించారు. రసాన్ని భావోద్రేకమని ఆధునిక పరిభాషలో చెప్పవచ్చన్నారు. రసం వస్తువైతే, వస్తువు భావోద్రేకమా (ఆధునిక పరిభాషలో) అనే ప్రశ్నపుడుతుంది. ధ్వని శిల్పానికి సంబంధించిన అంశమన్న వల్లంపాటి, వెంటనే ధ్వని భాష మీద ఆధారపడ్డ సాహిత్య సిద్ధాంతమన్నారు. ధ్వనులలో ప్రబంధ ధ్వని భారతీయ అలంకార శాస్త్రంలో అపురూపమైన సిద్ధాంతమని, అది సాహిత్య సిద్ధాంతం సరిహద్దుల్ని దాటి, సాహిత్య విమర్శా సూత్రంగా ఉపయోగపడగల శక్తి ఉందని, ఇది గొప్ప సాహిత్య విమర్శా సూత్రంగా అభివృద్ధి చెందకపోవటం భారతీయ అలంకార శాస్త్రంలోని విషాదమని అభిప్రాయపడ్డారు.

సంప్రదాయ అలంకార శాస్త్రాన్ని ఆధునిక సాహిత్యానికి అన్వయించి విశ్వనాథాదులు పొరపాటు చేశారన్న వల్లంపాటి "రసం" అన్నచోట 'వస్తువు' అని మార్చుకొని ఈ సిద్ధాంతాన్ని ఆధునిక తెలుగు సాహిత్యానికి అనువర్తింప జేసి విశ్లేషించవలసిన అవసరం ఉంది. వాచ్యం తక్కువగా ఉండి సూచన అధికంగా ఉండేది ఉత్తమ సాహిత్యం. దానిని సమకాలీన నవలలకూ కథలకూ పద్యాలకు అనువర్తింప చేసి విశ్లేషించే విమర్శలు వచ్చినప్పుడు ఈ సూత్రం ఎంత ప్రయోజనాత్మకంగా ఉంటుందో తెలుస్తుందని వల్లంపాటి నిర్ధారించారు.

వల్లంపాటి ప్రకారం భారతీయ అలంకార శాస్త్రంలో పైరు ఉంది, కలుపు ఉంది. అయితే ఆధునిక విమర్శకులు కలుపుతో పాటు పైరును కూడా పెరికి పారేయడం తగదన్నారు. ధ్వని భాష మీద ఆధారపడిందన్న వల్లంపాటి ధ్వని సిద్ధాంతం చేసిన మన అలంకారికులకు ప్రజల భాషపట్ల సానుభూతి కూడా లేదని, వాళ్ళు సమకాలీన జీవితాన్ని నిరాదరించారని, ప్రతిభ నవనవోన్మేషశాలిని అని చెబుతూనే అలంకార శాస్త్రం రచయితల ప్రతిభ బహుముఖంగా వికసించటానికి ప్రతిబంధకంగా నిలిచిందని అన్నారు.

సాహిత్యవిమర్శా శాస్త్రంకాని అలంకార శాస్త్రాన్ని, రచయితల సృజనాత్మకతను చంపిన అలంకార శాస్త్రాన్ని, ప్రాచీన సాహిత్యాన్ని అర్థం చేసుకోడానికి కూడా కొంతవరకు మాత్రమే ఉపయోగపడే అలంకార శాస్త్రాన్ని, భారతీయ వేదాంతంలోంచి ఆత్మవాదులలో పుట్టిన అలంకార శాస్త్రాన్ని, సమాజానికి సాహిత్యానికీ ఉన్న వివిధ సంబంధాలను గుర్తించని అలంకార శాస్త్రాన్ని, సమకాలీన వాస్తవిక జీవితం పట్ల అనాదరణ గల భారతీయ అలంకార శాస్త్రాన్ని, ఒక కావ్యాన్ని మొత్తంగా విమర్శించే ప్రయత్నమే చెయ్యని అలంకార శాస్త్రాన్ని, రచయితతో మమేకం పొందటాన్ని పాఠకునికి అనివార్యం చేస్తున్న అలంకార శాస్త్రాన్ని ఆధునిక సాహిత్య విమర్శకుడు కూడా ఉపయోగించాలని వల్లంపాటి భావించడంలోని పరమార్థం ఏమిటో తెలియటం లేదు. 1980 నుండి వల్లంపాటిలో భారతీయ అలంకార శాస్త్రం పట్ల ఈ సాఫ్ట్ కార్నర్ ఉన్నా ఆయన ఎక్కడా దానిని అన్వయించి విమర్శరాయలేదు. ఇది వైరుధ్యమో, విచారమో చెప్పుకోడానికి ఇప్పుడు ఆయన మనముందు లేరు.

"సాహిత్య విమర్శ ఎంత నిశితమైన ఆయుధమో అంతనాజూకైన పువ్వుకూడా"
"రచయితకు లాగే విమర్శకుడికి కూడా నిబద్ధత ఉంటుంది"
"విమర్శకునికి అవసరమైనంత చదువు రచయితకు అవసరం లేదు".

*

వ్యాసం

ఆధునిక తెలుగు సాహిత్యం 'వల్లంపాటి స్థానం'

☆ వివినమూర్తి

ఆధునిక తెలుగు సాహిత్యకారునికి ఇప్పుడిప్పుడే నూరేళ్ళు వచ్చాయి. ఇంకా చాలా ప్రయాణం ఉంది. ఆంగ్లవిద్య వల్ల, వారి సాహిత్యంతో, భౌతిక సామాజిక శాస్త్రాల సంపర్కంతో క్రైస్తవ మతం ఏకేశ్వర భావనవల్ల ఆదిలో ప్రభావితులైన వ్యక్తులు స్వంత వివేచనతో తన సమాజాన్ని పరిశీలించటానికి ప్రయత్నించటంతో ఆధునిక తెలుగు సాహిత్యకారుడు పుట్టాడు. చెదురు మదురుగా ఉన్న వ్యక్తులు కొద్ది కాలంలోనే గుంపు కట్టడం మొదలు పెట్టారు. నవ్య సాహిత్యం పేరుతో ఈ గుంపుదనం కొంతకాలం సాగింది. 'సామాజిక దృక్పథం' ఉండవలసిన అవసరం తీర్చలేకపోవటంతో ఈ గుంపు వెనకబడింది.

సకల మానవజాతి సమస్యల మధ్య ఒకసాధారణతను అధ్యయనంచేసి, అది నడిచి వచ్చిన గతిని పట్టుకొని, చేరుకోబోయే లక్ష్యాలను అంచనా కట్టడానికి ప్రత్నించిన మార్క్సిస్టు తత్వశాస్త్రం ప్రపంచమంతటినీ ప్రభావితం చేసినట్టే ఆధునిక తెలుగు సాహిత్యకారుడినీ ముట్టుకుంది. కమ్యూనిస్టు పార్టీ పుట్టింది. రచయిత సామాజిక దృక్పథాన్ని నిర్వచించబోయింది. అభ్యుదయ సాహిత్య భావనల వెనక రచయితలు నడిచారు. గుంపుకూడారు. అరసం వెలిసింది. ఆదిలో వ్యక్తులుగా సృష్టించిన సాహిత్యానికి పునర్మూల్యాంకనం జరిగింది. సామాజిక మార్పుల కోసం పరితపించిన రచయితలను గుర్తించింది. వారిని కీర్తించింది. వారి రచనలను భద్రపరచింది. భవిష్యత్తరాలకు అందుబాటులో ఉంచింది. సాహిత్య సృజనకు ఉద్యమ స్వభావాన్ని కలిగించబోయింది. ఈ ఉద్యమ స్వభావం వ్యక్తి 'స్వంత వివేచన'ను కొంత వెనక్కినెట్టింది. గతాన్ని గత సాహిత్యాన్ని గత సాహిత్య విమర్శనా పద్ధతులన్నింటినీ దాదాపు నిరాకరించబోయింది.

ఈ ఉద్యమ స్వభావానికి 'దృక్పథం' సరిపోలేదు. రచయితల ఆచరణను కోరింది. విరసం పుట్టింది. కొన్ని కొత్త ప్రశ్నలను లేవనెత్తింది. అందులో ప్రధానమయినది నిబద్ధత - నిమగ్నత. ప్రజాపోరటాల పట్ల సానుకూల స్పందన, మద్దతు రచయితలకు విమర్శకులకు ఒక కొలబద్ద అయింది. రచయితల రచనలలో ఉండవలసిన వస్తువు మీద, రచనా విధానం మీద, కనబరచవలసిన ఉద్వేగాలమీద చర్చలు సాగాయి. రూపం - సారంలను బట్టి రచనల శ్రేణిని అంచనా వేయ్యటం విమర్శలో ప్రముఖాంగం అయింది. ఈ ప్రయత్నాలలో మాండలికాలు గ్రంధస్తమై భాష సుసంపన్నమైంది. అన్ని రకాల జన జీవితాలూ నోరు విప్పాయి.

ఈ పరిణామాలకు నిశ్శబ్ద సాక్షి వల్లంపాటి వెంకట సుబ్బయ్య. చాలా గుండెదిటవుతో అనునయంతో, స్పష్టతతో కూడిని గొంతును సాధన చేసారు. ప్రతి విషయాన్ని పరిశీలించారు. తన పరిశీలనను ఆలోచనాపరుల ముందు ఉంచారు. ఆరోగ్యకరమైన చర్చని అనేక చోట ఆహ్వానించారు. ఆశించారు. అభిప్రాయాలు చెప్పారు. సలహాలు యిచ్చారు. ప్రమాణ వ్యాకరణానికి కృషి చేసారు. రచయితగా సుఖజీవితాన్ని వదులుకుని విమర్శకునిగా ఒక బాటను వెయ్యబోయారు. ఎవరినీ వ్యక్తిగతంగా కించపరచటానికి తన కలాన్ని వాడలేదు. తను నమ్మిన ప్రయాణాలకు నిలబడని రచనలు, ఎంతటి వారివైనా చెప్పటం మానలేదు. అంటరాని 'రసం', సహృదయం వంటి భావనలను తిరిగి వివరించి ఆధునిక రచనకు అవి ఎంతవరకూ పనికొస్తాయో ఎంతవరకు పనికి రావో పరిశీలించారు. వాటిని గురించి రాసారు.

ఆయన అరసంకి దగ్గరనుకున్న విరసం వారినీ, విరసానికి దగ్గరనుకున్న అరసంవారినీ చూసాను. పాత విషయాలమీద, పూర్వ ఆలోచనాధోరణుల మీద వల్లంపాటి తన ఆలోచనలు చెపుతున్నపుడు చాదస్తుడు అన్నట్లు చూపిన ఆధునికులూ, 'నక్సలైట్' అన్నట్లు చూసిన సనాతనులూ ఉన్నారు.

తెలుగు సాహిత్య చరిత్ర యుగ విభజనలలో జాగ్రత్తగా గమనిస్తే 'భావజాలా'న్ని బట్టి జరిగే విభజనలే ప్రముఖంగా కనిపిస్తాయి. వ్యక్తుల పేర్లని బట్టి కనిపించే విభజనలలో శ్రీశ్రీ ముందూ తర్వాతా అనటం కనిపిస్తుంది. విమర్శలకు పేర్లనిబట్టి పద్ధతులని బట్టి అటువంటి విభజన కనిపించదు. సాంప్రదాయ విమర్శలూ మార్క్సిస్టు విమర్శకులూ స్థూలంగా రెండు పరస్పర వ్యతిరేక ధోరణుల వాళ్ళుగా కనిపించినా అవి రెండు కాలాలను విడివిడిగా ప్రభావితం చేసినట్టు కనిపించదు.

విమర్శను బట్టి, విమర్శకుని బట్టి ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర యుగ విభజనకు ప్రయత్నించాలనుకునేవారికి తప్పనిసరిగా కనిపించే కొండగుర్తు వల్లంపాటి వెంకట సుబ్బయ్య

ఎందుకంటే -

ఆధునిక విమర్శ ఒక రచనకో, ఒక పుస్తకానికో ఒక రచయిత సృజనకో ఒక భావజాలపు రచనలకో పరిమితం కాలేదు. మొత్తం సాహిత్యాన్ని ఒక సంపూర్ణంగా తీసుకుని దాని పుట్టుకనుంచి ఈనాటి వరకూ నడిచిన గతిని తర్కించారు. అలాగని ఆయన కేవలం సాహిత్య చరిత్ర రాయలేదు. అందులోనూ ఆధునిక ప్రక్రియలయిన నవల, కథలను. ఆ ప్రక్రియలు ఈనాటి రూపుకి తొలి కారణాలయిన ఆంగ్ల నవల కథలను వాటి గురించి ఆంగ్లంలో వెలువడిన విమర్శారీతులనూ పక్కపక్కన ఉంచి పరిశీలించారు. తెలుగు సాహిత్యపు ప్రత్యేకతలను తెలుగు సమాజపు ఆర్థిక సాంస్కృతిక, రాజకీయ వాతావరణాల ప్రభావాలలో పట్టుకోటానికి ప్రయత్నించారు. ఒక తాత్విక పునాదిపై ఇంత విస్తృమైన సమగ్రమైన ప్రయత్నం ఇంతవరకూ జరగలేదనే అనొచ్చు. వల్లంపాటి తాత్విక పునాది ఏమిటి? దానిని తెలుగు సాహిత్య విమర్శ రంగాలు వినియోగించుకుంటాయా? కొత్త తాత్విక చర్చలు మొదలవుతాయా? ఆయన ప్రారంభించిన చర్చ ఆగిపోతుందా? - ఇలాంటి ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి.

కనక - విమర్శకుడిబట్టి తెలుగు సాహిత్య చరిత్ర యుగ విభజన చేయదలచుకుంటే వల్లంపాటికి ముందూ వెనకా అనక తప్పదని నేను అనుకుంటున్నాను.

ఈ సందర్భంలో రచయితలను విమర్శకులను ఆలోచించమని ఆయన చెప్పిన కొన్ని విషయాలను గుర్తు చేసుకోవడం అవసరం.

" ఏకాలంలోనయినా సాహిత్య గొప్పదనం సమకాలీన పరిణామాలకు రచయిత ప్రతి స్పందనలోని నిజాయితీమీద ఆధారపడి ఉంటుంది." (నవలా శిల్పం)

" మంచి నవలా రచయిత కళాకారుడు మాత్రమే కాక ఆలోచనాపరుడు కూడా. ఆలోచనాపరుడుకాని రచయిత వద్ద నుంచి గొప్పనవల కానీ, కథ కానీ వచ్చే అవకాశం లేదు". (నవలాశిల్పం)

"లబ్ద ప్రతిష్టలు తమని తామే అనుకరించుకోవటమూ, యువతరం రచయితలు తమ రచననీ, చదువునీ చూసి సంతృప్తి పడటమూ మానుకోవటం అవసరం. రచయిత జీవితానికే కాదు. సాహిత్యానికి కూడా నిత్య విద్యార్థిగా ఉండకపోతే అతనిలో ఎదుగుదల ఆగిపోతుంది. అతడు ఊబిలాంటి ఆత్మసంతృప్తిలో కూరుకుపోతాడు. ఈ రెండు ప్రమాదాలనుంచీ తప్పించుకుని తెలుగు కథ ఉజ్జ్వలంగా ముందుకు సాగుతుందని ఆశిస్తున్నాను". (కథాశిల్పం)

"తమ మాండలికానికే ప్రత్యేకమయిన పద ప్రయోగాన్నీ, వాక్యనిర్మాణాన్నీ, అభివ్యక్తి వైచిత్రినీ, నుడికారాన్నీ రచయితలు కథల్లోకి తీసుకురావాలి. మాండలికాన్ని ఇతర ప్రాంతాలకు అర్థమయ్యే పద్ధతిలో

(మిగతా 26వ పేజీలో.....)

పిల్లల లోకం

పేరుకి చిన్న పిల్లలే కాని పిల్లల ప్రపంచం చాలా పెద్దది. చాలా మంది పెద్దవాళ్ళ ప్రపంచం వలె చిన్నదీ, ఇరుకుదీ కాదది. హద్దులూ, అంక్షలూ వున్న ప్రపంచం కాదది. కళ్ళముందు సెలయేర్లను ఊహించుకుని వెన్నెలలో చేసిన పడవలపై చుక్కల పువ్వుల వనాలలోంచి విహరించి రాగలరు. పావురపు రెక్కల కింద గుడ్లు ఎన్నడు పిల్లలుగా మారి కువకువమంటూ వస్తాయో అని పెద్ద పెద్ద కళ్ళతో ఎదురు చూస్తారు. ఆకాశమార్గన ఊరించి వెళ్ళే నల్లటి మేఘాల చల్లదనాన్ని ఊహించి అనుభవించగలరు.

ఎల్లలు లేని లోకాల్లో తిరిగే పిల్లల కోసం కొన్ని కథలు, పాటలు, కవితలు, జ్ఞాపకాలు ఇక నుంచి నెలనెలా అందిస్తాం. పిల్లలూ పెద్దలూ అందరూ ఈ శీర్షికకు రచనలు పంపించొచ్చు.

- సంపాదకవర్గం

అందమైనది

హద్దులు లేని ఆటస్థలంలా వున్న ఆకాశంలోకి నల్లటి నీటి మేఘాలు రీవిగా కదిలివచ్చేయి. గున్న ఏనుగుల మందలవలె బేఫికర్‌గా ఉరికేయి. ఎక్కడెక్కడివో ఒక చోట చేరేయి. వాటి అరుపులు అల్లరితో ఆకాశమంతా నిండిపోయింది. ఆటలు ఆడిఆడి అలసిసొలసి ఆగేయి. చమటలు ధారాపాతంగా కారుతున్నాయి. ఆటలు ఆడి ఆయాసపడుతున్న నల్లటి మబ్బుల్ని చూసి సూర్యుడు ముచ్చట పడ్డాడు. మురిపెంగా వెచ్చటి వెలుతురుతో మబ్బుల్ని తాకాడు. అప్పుడు మబ్బుల స్వేదం వింతగా వెలిగింది. వెలిగి వెలిగీ ఇంద్రధనస్సొకటి ఆకాశానికి ఒక మూల ఏడురంగుల పుష్పమైన పూసింది.

వినువీధిలో మొగ్గ తొడిగిన ఇంద్రధనుస్సు సమస్త లోకాన్ని వింతగా చూసింది. బోల్డంత సంతోషించింది. వెంటనే తనను తాను చూసుకుంది. ఎంతో పొంగిపోయింది. "నా అంత గొప్ప వస్తువుగాని, దృశ్యముగాని ఈ విశ్వంలో లేదుగదా" అని అనుకుంది. పక్కనే ఎవరో వున్నట్టనిపిస్తే అటుచూసింది. పక్కనే నల్లనల్లటి మేఘాలు కనిపించేయి. తలతిప్పుకుంది. అసహ్యంగా చూస్తూ ."ఛీ ఛీ! మీరుపొండి దూరంగా వెళ్ళిపొండి" అంది కోపంగా ఇంద్రధనస్సు, తన వళ్ళంతా చూసుకుంది, నల్లరంగేమైనా అంటుకుందేమోనని.

మేఘాలు చిన్న బుచ్చుకున్నాయి. బాధపడ్డాయి. కానీ తొందర్లోనే ఆలోచించడం మొదలుపెట్టేయి. "మా వల్ల కదా అసలు ఉనికిలోకి వచ్చింది. మా చమటపై సూర్యుడి కిరణాలు పడితే కదా ఇది పుట్టిందసలు. మా శ్రమవల్ల కదా దీనికంత మెరుపు వచ్చింది" అని ఆలోచించేయి.

అంతే నలనల్లటి మేఘాలు కోపంతో ఎరఎర్రటి సూరీళ్ళయ్యారు. ఎడతెరిపిలేని వర్షం కురిపించేరు. భూమీ, ఆకాశం కలిసిపోయినట్టు కుంభవృష్టి కురిసింది. అప్పటిదాకా ఫోజుగొట్టిన ఇంద్రధనస్సు ఆనవాళ్ళే లేకుండా కొట్టుకుపోయింది.

వర్షంపడ్డ తెల్లవారి భూమిని తొలుచుకుని వరి నారు పైకొచ్చింది. పొలాల గట్లమీద గడ్డిపూలు హాయిగా వూగేయి, మేఘాలకు కృతజ్ఞత చెప్తున్నట్టుగా. శ్రమించి అలిసిపోయిన మబ్బులకది వేయి ఇంద్రధనస్సులకంటే అందంగా సొగసుగా కనిపించింది.

కె.వి.కూర్మనాథ్

(....9వ పేజి తరువాయి)

"దేవాదిదేవుడా! ఓ పరమేశుడా!
వంతెన కూలిన వైనమేమయ్యా?"
"వారిని వీరిని ప్రశ్నించనేలరా?
కట్టినా కూల్చినా కర్త నేనేగదా?"

ఈ విధంగా సాక్షాత్తు 'పరమేశ్వరుని సాక్ష్యంతో' విచారణ నిర్విఘ్న పరిసమాప్తి చెందింది. అధికారులు మల్లగుల్లాలు పడి, అరవై పుటల నివేదిక మహామంత్రి 'చేతుల మీదుగా' మహారాజుకు సమర్పించారు. నిండుసభలో ప్రధాన విచారణాధికారి నివేదిక మొత్తం చదివి విన్పించాడు.

".... ఏవంవిధ సాక్ష్యాధారములన్నియు సావధానముగా పరిశీలించిన పిమ్మట తేలిన సారాంశమేమనగా - ఏతత్ వారధి నిర్మాణమునందు అధికారులు, నిర్మాణకారుల అవినీతి లేదా అలసత్వము లేశమైనను లేదు. ఇది దైవ చిద్విలాసమే గాని మానవ దోషము గాదు. (చూడుము : సాక్ష్యము -6; పత్ర సంఖ్య - 16). ఆ కైలాసవాసునకు గడచిన శ్రావణమాస శుక్రవారమునాడు సాక్షాత్తు తన లోకమునందే భక్తులచే పూజలు స్వీకరింప తలంపు గలిగినది. తత్ఫలితమే ఈ మహత్తర ఘటన. ఆ యొక్క మహాభక్తులు ఈ కారణముగా గంగామాత ద్వారా కైలాసగతులైనందున మోదము తప్ప ఖేదమునకు తావులేదు. వారి రాజభక్తి మరియు దైవభక్తి అభినందనీయములు".

బంధక మహారాజు ఆనంద పరవశుడయ్యాడు "ఇది బహులెస్సగానున్నది. దివగంతులైన మహాభక్తులకు మా శుభాభినందనలు" అని అభిభాషించాడు. ("దివంగతులైన" అని చెవిలో సవరించాడు తంత్రానందుడు. 'కాదు, దివగంతులే అని మా అభిప్రాయము' అన్నాడు మహారాజు అపవారిస్తూ).

సభ్యులంతా కరతాళధ్వనులతో 'నదీ ప్రమాద నివేదిక'కు తమ ఆమోదం తెల్పారు.

ఆ మరునాడే 'అవిధేయుడైన' కుర్రమంత్రి కుమారవర్మ పదవి ఊడిపోయింది!

(ఆకాశవాణి, విజయవాడ సౌజన్యంతో) *

దండకారణ్యంలో నిర్బంధం
సాంస్కృతిక ఉద్యమం

☆ శేష | వ్యాసం

ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యప్రేరేపిత ముఠాలు, గ్రేహౌండ్స్ ముఠాలు కలసి కట్టుగా పనిచేస్తూ రాజ్య టెర్రరిస్టు సంస్థలుగా పనిచేస్తున్నాయి. కవులను, కళాకారులను, విప్లవకారులను, ప్రజలను రకరకాల పద్ధతుల్లో చంపివేస్తుంది. రాజ్యమే ఒక టెర్రరిస్టుగా మారి కవులను కళాకారులను వేధించడమే కాదు. పాటపై, కలలపై అప్రకటిత నిషేధం కొనసాగిస్తున్నది. కవుల కళాకారుల కుత్తికలపై కత్తులు వేలాడుతున్నాయి... ప్రపంచ బ్యాంకు నమూనాను అభివృద్ధి పేరుతో మన ముందుంచుతున్న వైయస్ఆర్‌కు కవులు కళాకారులంటే ఎంత భయమో విప్లవ రచయిత సంఘం నిషేధమే అందుకు మచ్చుతునక... గడిచిన 35 సంవత్సరాలుగా పీడిత ప్రజల పక్షాన నిలబడి ఈ దోపిడి వర్గ ప్రభుత్వాల రంగు బహిరంగం చేస్తూ తమ కలాలతో, గళంతో పోరాడుతున్న సంస్థ.... అలాంటి సంస్థను నిషేధించడం అంటే ప్రభుత్వం, దాని స్పాన్సర్డ్ సంస్థలు కొరివితో తలగోక్కున్నట్టే అయింది. ప్రజల, ప్రజాస్వామిక వాదుల, విప్లవ మేధావుల ఒత్తిడితో నిషేధం ఎత్తివేయక తప్పిందికాదు.... విప్లవోద్యమ అవసరాల రీత్యా ఉత్తర తెలంగాణా నుండి దండకారణ్యంలోని పశ్చిమ బస్తర్‌కు వెళ్ళాము... అక్కడ ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం సాయుధ బలగాలను దించి దండకారణ్యాన్ని సాయుధ బలగాల పద ఘట్టాల కింద నలగ దొక్కుతుంది. దీనికి తోడు ఆదివాసులలో వున్న పెత్తందార్లను, భూస్వాములను, గుండాలను చేరదీసి సల్వాజుడుం (సల్వా- శాంతి, జుడుమ్- సమూహిక వేట) ప్రారంభించింది. అక్కడ శాంతి (సల్వా) లేదు. జుడుమే కొనసాగుతుంది. ఆదివాసుల గూడెంలో ఎన్నో అగ్నికి ఆహుతి చేయబడ్డాయి... సంఘ నాయకులను, ప్రజారాజ్యాధికార సంస్థల నాయకులను అత్యంత పాశవికంగా రాజ్య సాయుధ బలగాల అండతో హత్యలు చేసారు. స్త్రీలను చంపడమే కాదు. అత్యాచారాలు చేసి మర్మావయాలను బండకత్తులతో కోసి హత్యలు చేసారు. సల్వాజుడుమ్ గుండాలకు లొంగిన ఆదివాసులను సాయుధ పోలీసుల క్యాంపులలో వుంచి మానవ కవచాలుగా వాడుకుంటున్నారు. ఆ క్యాంపులలో వున్న స్త్రీలపై సల్వాజుడుం గుండాలు, సాయుధ పోలీసులు అత్యాచారాలు చేసి గర్భవతులుగా మార్చారు. అవి ఒక నరక కూపాలు స్త్రీలపాలిట. కొందరిని ఆ కాన్‌సెంట్రేషన్ క్యాంపులలోనే రాత్రులు చంపివేసి బయట పడవేస్తున్నారు. అవి గుర్తు తెలియని శవాలుగా కుళ్ళిపోతున్నాయి. రాత్‌ల్ శిబిరాలనే ముద్దుపేరుతో పిలువబడుతున్న ఈ కాన్‌సెంట్రేషన్ క్యాంపులన్నీ రోడ్డుల మీదనే నెలకొల్పారు. దండకారణ్యంలో సల్వాజుడుమ్ గుండాలు రాజ్య సాయుధ బలగాలు వెలగబెట్టుతున్న నిర్వాకం అక్షరాలకు అందని స్థాయిలో కొనసాగుతుంది. సరిహద్దులను దాటి ఆంధ్రప్రదేశ్‌లోని గ్రేహౌండ్స్ బలగాలు ఆదివాసులను ఎన్‌కౌంటర్స్ పేర కాల్చి చంపుతున్నాయి. గడిచిన డిసెంబర్ 10 మంది ఆదివాసులను ఎన్‌కౌంటర్స్ పేర దక్షిణ బస్తర్‌లో కాల్చి చంపాయి.

ఛత్తీస్‌ఘడ్ రాజ్యమే ఒక టెర్రరిస్టు సంస్థగా పనిచేస్తుంది. ఇలాంటి స్థితిలో ఆదివాసులు తమ పిల్లాజెల్లతో సాయుధమై అడవులలో తల దాచుకుంటున్నారు. మనకు ఇప్పుడు అక్కడ ఆదివాసి గూడేలు కనిపించవు కాని అడవులలో తలదాచుకుంటున్న ఆదివాసీలలో తమ జనతా సర్కార్ అంగాలు దృఢంగా ప్రజలను అంటిపెట్టుకొని పనిచేస్తున్నాయి. చేతనా నాట్యమంచ్ (సిఎన్ఎం) సాంస్కృతిక సంస్థ చాలా చక్కటి ప్రచారంతో ఆదివాసులను చైతన్యవంతం చేస్తున్నది. "ప్రజలు అనే తరగని గని (మావో) నుండి అనేక కళారూపాలు తీసుకొని వాటిని విప్లవీకరించి ఆచరణాత్మకంగా ప్రదర్శించి చూపెడుతున్నాయి....

పశ్చిమ బస్తర్‌లో చేతనా నాట్యమంచ్ డివిజన్ కమిటి సమావేశం సందర్భంగా ఆ డివిజన్‌లో వున్న సిఎన్ఎం దళాలు కలిసాయి. ఆ సందర్భంగా మేము సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వమని అడిగాము. చాలా ఉత్సాహంతో ఆ కామ్రేడ్స్ ప్రదర్శనలు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. మాకు నార్త్ తెలంగాణాలో రాజ్య టెర్రరిజం మూలంగా ఎలాంటి కళా ప్రదర్శనలు చూసే అవకాశం లేదు. ఇలాంటి స్థితిలో మేము మాకు చిక్కిన ఈ చిన్న అవకాశాన్ని జార విడుచుకోవడానికి సిద్ధంగా లేము...

అక్కడికి వచ్చిన కామ్రేడ్స్‌కు ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న నిర్బంధం తీవ్రత తెలుసు కాబట్టి మా కోరికను వాళ్ళు ఆమోదించారు.

సిఎన్ఎం కామ్రేడ్స్ వాళ్ళ ప్రోగ్రామ్ అంతా ఆదివాసి బాషలోనే కొనసాగించారు. మొదటగా రెండు మూడు పాటలు' పాడారు.. తర్వాత సల్వాజుడుంపై చిన్న నాటికను ప్రదర్శించారు. వాళ్ల వాయిద్యాలు ఒక స్టీలు బిందె, ఒక చిన్న డప్పు మాత్రమే... వీటితోనే ప్రదర్శనలు ఇచ్చారు. ఒక ముసలామె, ఒక ముసలతను భార్యభర్తలు. వీళ్ళకు కావల్సిన బట్టలు, వుప్పు మిరపకాయలు కొని తెచ్చుకోవడానికి సంతకు వెళ్ళుతారు. భార్యభర్తలు ఇద్దరు కల్లు త్రాగుతారు... సంతలో సామాన్లు కొంటూవుంటే సల్వాజుడుమ్ గుండాలు, పోలీసులు కలసి ఆ సంతపై దాడి చేసి వ్యాపారస్తులను కొట్టి సామాగ్రినంత లూటీ చేస్తారు. ఆ ముఠాలో వున్న ఒకడు ఈ ముసలి భార్య భర్తలను గుర్తించి వీరి కొడుకు, కూతురు దళంలలో పనిచేస్తున్నారని పోలీసులకు తెలియజేస్తారు. పోలీసులు, జుడుమ్ గుండాలు ముసలి భార్యభర్తలను చుట్టుముట్టి విపరీతంగా కొట్టుతూ సరెండర్ చేయించాలంటారు. పైగా వారిని రేపు ఫలానా గ్రామంలో సల్వాజుడుమ్ మీటింగ్ వుంది, ఆ మిటింగ్‌లో వాళ్ళు లొంగిపోవాలి, మీకు అన్ని సదుపాయాలు కలిపిస్తామని కొట్టి హెచ్చరించి వదలివేస్తారు...

దెబ్బలు తిన్న ఆ ముసలివాళ్ళు జోగుతూ జోగుతూ ఇంటికి వస్తారు.... మరునాడు ఉదయాన్నే ముఠాలు పోలీసుల సహాయంతో దాడి చేసి గూడెం వాళ్ళను కుప్పవేసి మళ్లీకొట్టుతారు... గ్రామాన్ని లూటీ చేసి వెళ్ళిపోతారు. పోలీసులు, గుండాలు వస్తున్నారన్న సమాచారం అందుకున్న యువత గ్రామం నుండి అడివిలోకి పారిపోతారు. ఆ ముఠాకు దొరికేది ముసలివాళ్ళే....

ఆ ముసలివాళ్ళ కొడుకు కూతురు తల్లిదండ్రులను చూడడానికి ఇంటికి వస్తారు. జుడుమ్ గుండాల దెబ్బలకు వేధింపులకు తట్టుకోలేని ఆ ముసలివాళ్ళు కొడుకును కూతురును లొంగిపోవాలని కోరుతారు... వాళ్ళ మధ్య సంభాషణ రూపంలో పాట కొనసాగుతుంది.

ముసలివాళ్ళు కొడుకును కూతురును పట్టుకొని మీరు లొంగిపోతే అన్ని సదుపాయాలు ప్రభుత్వం కలిపిస్తుందట. మీరు లొంగపోండి మా బాధలు తప్పుతాయి అంటారు.

ఇవ్వాళ ప్రభుత్వం అంటుంది ఈ మాట. కాని ఇన్ని రోజులు ఆదివాసులు అడవులలో రారు? వాళ్ళను పట్టించుకున్న పాపాన పోలేదు. మనపై తెగపెత్తందార్ల, భూస్వాముల దోపిడి గతంలో లేకుండెనా - అవి ఇప్పుడు పోయెనా లేదా! మన పార్టీ రావడంతో, అని చెప్పుతూ సల్వాజుడుమ్ ప్రారంభించిన మహేంద్ర కర్మ పెద్ద భూస్వామి, పెద్ద మోసగాడు. ప్రభుత్వంతో పెట్టుబడిదార్లతో కలసి మన ఆదివాసీలకు అడవిపై హక్కు లేకుండా చేసి, అడవిలోని ఆదివాసీలను అడవుల నుండి తరిమి వేసి, ఇక్కడ సంపదలను దోచుకుపోవడానికి ప్రయత్నం చేస్తున్నాడు - సామ్రాజ్యవాదులలో దళారీ పెట్టుబడిదారులతో మిలాఖత్ అయి, సాయుధ పోలీసులలో కలిసి సల్వాజుడుమ్ గుండాలను తయారు చేసి, ఆదివాసీలను వేటాడుతున్నాడని సమాధానం చెప్పుతారు.

ఇది అంతా నిజమే అని ముసలివాళ్ళు అంగీకరిస్తారు. మనకు రక్షణగా ప్రజాగెరిల్లా సైన్యం వుంది. దాని అండతో ఈ రాజ్యానికి వ్యతిరేకంగా గుండాలకు వ్యతిరేకంగా పోరాడదాం అంటారు.

ఆ ముసలి వాళ్ళు మహా సంతోషంగా పోరాడ్డానికి తమ బిడ్డల వెంట

ప్రత్యేక ఆర్థిక మండళ్ళ అభివృద్ధి ఎవరి ప్రయోజనాల కోసం?

☆ సుధాకర్. ఎస్

వ్యాసం

ప్రత్యేక ఆర్థిక మండళ్ళ(సెజ్) చట్టం 2005 వ సంవత్సరం మే నెలలో భారత పార్లమెంటులో ఆమోదం పొంది జూన్ నెల నుండి అమలులోకి రావడం జరిగింది. భారత ఆర్థిక వ్యవస్థను ప్రధానంగా భారత రైతాంగాన్ని తీవ్రస్థాయిలో అలజడికి, ఆందోళనలకు గురిచేస్తున్న ఈ అంశం ప్రధాన చర్చనీయాంశంగా మారింది. 50 సంవత్సరాల భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రయోగాన్ని అపహాస్యం చేస్తూ ముందుకొస్తున్న ఈ ప్రత్యేక ఆర్థిక మండళ్ళ స్థాపన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, నూతన ఆర్థిక విధానాల అమల్లో మరో కీలకమైన ప్రజావ్యతిరేక మలుపు అని చెప్పక తప్పదు.

ప్రత్యక్ష విదేశీ పెట్టుబడుల ఆకర్షణ, అంతర్జాతీయ ఎగుమతులకు సంబంధించిన నాణ్యత - పోటీ లక్ష్యంగా ఎలాంటి నియంత్రణ గానీ మానవీయ విలువలకు చోటుగాని లేని అంతర్జాతీయ లాభనష్టాల వ్యాపార సంస్కృతి కేంద్రాలుగా ప్రత్యేక ఆర్థిక మండళ్ళ స్థాపన జరుగుతుందని సెజ్ చట్టం చెబుతోంది. భారత భూభాగంలో 600లకు పైగా ఈ సెజ్‌ల పేరుతో స్థాపించే పరిశ్రమల ఉత్పత్తి, క్రయ-విక్రయ, కార్యనిర్వహణ కార్యకలాపాల్లో చట్టబద్ధమైన తనిఖీ, నియంత్రణలుగానీ, న్యాయ -పరిపాలనా వ్యవస్థల జోక్యంకానీ ఉండడానికి వీలులేదు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఆధునిక జమిందారీలు, జాగీరులు, సంస్థానాల రూపంలో ఈ దేశ సార్వభౌమత్వాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని గేలిచేస్తూ ఈ నేలపై పోరాడి సాధించుకున్న సర్వ 'హక్కుల్ని' విదేశీ అవసరాలనిమిత్తం తాకట్టు పెట్టడానికి సెజ్‌ల రూపంలో సర్వం సిద్ధమై పోతోంది.

భారత దేశంలో పాడుబడ్డ, నీటి వసతి లేని భూములు లక్షలాది ఎకరాలుండగా రైతులు సాగుచేసుకుంటున్న పచ్చటి పంటపొలాలు, అందమైన పూదోటలు, పండ్ల తోటలనే సెజ్‌ల స్థాపనకు అనుకూలమైనవని నిర్ధారించి ప్రభుత్వాలు బలవంతంగా సేకరించడం ఆశ్చర్యం గొల్పుతున్న అంశం. పోనీ వీటిని నిర్మూలించి అక్కడ ఆహార పదార్థాన్ని ఉత్పత్తి చేస్తారంటే అదికూడా లేదు. అక్కడ తయారయ్యేవి ఎగుమతికి అనువైన వజ్రవైఢూర్యాలు, స్వర్ణాభరణాలు, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ఎలక్ట్రానిక్, లెదర్, టెక్స్‌టైల్, కార్లు, షికార్లకు అవసరమయ్యే ఉత్పత్తులు మాత్రమే. సెజ్‌ల స్థాపనకు పచ్చటి పంటపొలాల్ని ఎంచుకోవడానికి కూడా సెజ్‌ల చట్టంలోనే స్పష్టమైన సమాధానం ఉంది. సెజ్‌ల నిర్మాతలకు చట్టంలో అనేక వసతులు, రాయితీలు, గ్యారంటీ చేయబడ్డాయి. లక్షలాది ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించి అప్పజెప్పడమే కాకుండా నిర్మాణ వసతులకింద (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) నీరు, కరెంటు, రోడ్డు, విమాన, జల రవాణా సౌకర్యాలు కల్పిస్తామని వాగ్దానం చేయడం జరిగింది. పాడుబడ్డ బీడు భూముల్లో ఈ వసతులన్నీ కల్పించడం ఖర్చుతో కూడుకున్నపని. దశాబ్దాలు, శతాబ్దాలుగా పంటలు పండిస్తున్న పచ్చటి పొలాల చుట్టూ ఈ వసతులు పుష్కలంగా లభిస్తాయి. అన్నిటిని మించి వాటి నిర్మాణానికి రాళ్లుమోసే కూలీలు, వాటి ఉత్పత్తుల్లో చౌకగా చాకిరీ చేయడానికి అవసరమైనన్ని మానవ కళేబరాలు ఆ పొలాల చుట్టూ పుష్కలంగా లభిస్తాయన్న సత్యం కూడా వాళ్ళకు బాగా తెలుసు. చట్టం నుండి దూరం చేయబడ్డ మనుషులు ఏ నాగరిక దేశంలోనైనా జీవచ్ఛవాలతో సమానం. సంస్థానాధీశులకు, జాగీర్దారులకు కప్పం కింద కమీషన్లు చెల్లించడం తప్ప చట్టబద్ధంగా కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలు, సర్వీస్ టాక్స్, సేల్స్ టాక్స్‌లు చెల్లించడాలు అసలే సాధ్యంకాదు. అందుకే సెజ్‌ల చట్టంలో అవన్నీ అధికారికంగానే రద్దుచేయడం జరిగింది. అలాగే అక్కడ నిరసన హక్కు, సమ్మె హక్కు, మెరుగైన వేతనాలు, పని గంటలు, పని భద్రత, యూనియన్‌లు, లేబర్ కమిషన్లు, పెన్షన్లు, ప్రావిడెంట్ ఫండ్, విశ్రాంతి, ఆరోగ్యం లాంటి వేటినీ చట్టబద్ధంగా నైనా అడిగేహక్కు ఉండదు. ఎందుకంటే సెజ్ చట్టంలో వాటికి ప్రత్యేక సొంతన్యాయస్థానాలుంటాయి. సొంత భద్రతా వ్యవస్థలుంటాయి. అవి భా;రత రాజ్యాంగానికి అనుబంధంగా పని చేయాల్సిన అగత్యం కానీ, అవసరం కానీ ఉండదు. 50 సంవత్సరాల భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్వచ్ఛందంగానే తన సార్వభౌమత్వ హక్కును సెజ్‌ల నిర్మాతలకు నైవేద్యంగా అర్పిస్తోంది.

దేశవ్యాప్తంగా అన్ని వర్గాల మేధావులు, అధికార- ప్రతిపక్ష రాజకీయ పార్టీలు సెజ్‌ల నిర్మాణంతో నష్టపోతున్నది కేవలం రైతులు- కార్మికులే కనుక వారిని ఆదుకోవడానికి అన్ని రకాలుగా ప్రభుత్వాలు చర్యల్ని చేపట్టాలని సూచనలు, విమర్శలు, ఉద్యమాల రూపంలో ఉధృతంగానే ముందుకొస్తున్నారు. బహుశా 50 సంవత్సరాల స్వతంత్ర భారత చరిత్రలో ఇంతగా మనల్ని మనం మోసం చేసుకుంటున్న సందర్భం మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే, ఈ దేశంలో ప్రత్యేక ఆర్థిక మండళ్ళ స్థాపనతో వాస్తవంలో నష్టపోతున్నది కేవలం, రైతులు, కార్మికులు మాత్రమేనా అన్నది కీలకమైన ప్రశ్న. ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానాన్ని వెదకాలంటే 15 సంవత్సరాల క్రితం

కదులుతారు. ఆదివాసులంతా తమకు అందుబాటులో వున్నా ఆయుధాలతో సాయుధమై సల్వాజుడుమ్ గుండాల మీటింగ్‌కు పోయి వారిని తరిమికొట్టుతారు... ఇది ఆ చిన్న నాటిక సారాంశం.

సిఎన్‌ఎం కామ్రేడ్స్ ఈ చిన్న నాటికను అడవిలో గెరిల్లా మధ్య ప్రదర్శించారు. నేచురల్‌గా సాగిన ఈ ప్రదర్శన ప్రేక్షక గెరిల్లాల గుండెల్లో నిల్చిపోయేలా సాగింది. నాటిక చూసే ప్రేక్షకులకు తర్వాత ఏమి జరుగుతుందో అనే ఉత్కంఠత నెలకొంది.

బూటకపు ఎన్‌కౌంటర్‌లను ఖండిస్తూ 1982లో గోదావరిఖనిలో ఒక పెద్ద బహిరంగ సభ జరిగింది - అందులో జననాట్యమండలి కళాకారులు గద్దర్ నేతృత్వంతో రగల్ జెండా బ్యాలేను ప్రదర్శించారు. అది ఆదివాసీలను షావుకార్లు, ప్రభుత్వాధికారులు ఆదిలాబాద్‌లో ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని దోపిడీలకు పాల్పడుతూ లంచాలు ఎలా తింటారో చక్కగా ప్రదర్శించారు. ఆ రోజుల్లో రగల్ జెండాబ్యాలే ప్రదర్శన కార్మికవర్గాన్ని, విద్యార్థి, యువజనులను ఉద్రూతలు ఊగించింది... అది ఇప్పటకీ మరిచిపోలేని ఒక గొప్ప అనుభవం.

చాలా సంవత్సరాల తర్వాత... పశ్చిమ బస్తర్‌లో సల్వాజుడుమ్‌పై సిఎన్‌ఎం కార్యకర్తలు వేసిన ఈ చిన్న ప్రదర్శన చాలా సంవత్సరాల తర్వాత ఆదివాసీ ప్రాంతాలలో ఆదివాసీలపై రాజ్య సాయుధ గుండాల దాడిని కళ్ళకు కట్టినట్టు ప్రదర్శించారు. ఒక గొప్ప అనుభూతిని కలిగించింది.

దండకారణ్యంలో చత్తీస్‌ఘడ్ రాజ్య టెర్రరిజం ఆదివాసులపై టెర్రర్ చేస్తున్నది. ఇలాంటి తరుణంలో నిర్బంధాల మధ్యనే చేతనా నాట్యమంచ్ ప్రదర్శనలిస్తున్నది. రాజ్యం యొక్క పాశవికతను ఆచరణాత్మకంగా ఆదివాసులకు అర్థం చేయిస్తూ చైతన్యవంతం చేస్తూ విప్లవానికి పురికొల్పుతున్నది. ఆ కళాకారులకు, అక్కడి ఆదివాసులకు మద్దతునిస్తు హార్థికంగా బాసటగా నిలువవల్సిందిగా కోరుతూ...

ప్రజాకళలు వర్ధిల్లాలి

సాహితీ సాంస్కృతిక విప్లదళాలు చిరకాలం వర్ధిల్లాలి

*

ప్రారంభమై కొనసాగుతున్న ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, నూతన ఆర్థిక విధానాల అమలు, ఆచరణల్లో, దాగిన తాత్విక భూమికను సూక్ష్మస్థాయిలో అధ్యయనం చేయక తప్పదు. వ్యాపార ముసుగులో అనేక వలసదేశాలు చేసిన దురాక్రమణకు గురై 400 సంవత్సరాలుగా భారతీయులు అనుభవించిన కష్టాలు, కడగండ్లకు వ్యతిరేకంగా 100 సంతవ్సరాలపాటు కొనసాగిన భారత స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి దాని ఫలితంగా ఆవిర్భవించిన వ్యవస్థను సర్వసత్తాక సార్వభౌమ ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ప్రకటిస్తూ ఈ దేశ పౌరులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని (జస్టిస్), తాము నమ్మిన భక్తి విశ్వాసాల్ని ఆచరించటానికి భావప్రకటనా స్వేచ్ఛను (లిబర్టి) కల్పిస్తూ తరతమ స్థాయీ భేదాలకతీతంగా అందరికీ భూమ్మీద సమానత్వాన్ని (ఈక్వాలిటీ), సౌభ్రాతృత్వాన్ని (ఫ్రెటర్నిటి), వ్యక్తి వికాసంతో కూడుకున్న జాతీయ ఐక్యతను సాధిస్తామని ప్రతిజ్ఞ చేస్తూ భారత ప్రజలమైన మనం, మన పూర్వీకులు నిర్మించుకున్న భారత రాజ్యాంగ స్ఫూర్తి యీ అధ్యయానికి గీటురాయి కావాలి. 12 షెడ్యూళ్ళతో, 440కిపైగా ఆర్టికల్స్‌తో డాక్టర్ అంబేద్కర్ నాయకత్వంలో నిర్మితమైన భారత రాజ్యాంగ సౌధంలో నెలకొన్న ఎన్నో సుందరమైన ప్రాకారాలు, మరెన్నో ప్రహరీలతో కూడుకున్న అడ్డు గోడలు, పిల్లలు, స్త్రీలు, వృద్ధులు సేదతీరడానికి నిర్మితమైన ఉద్యానవనాలు, కార్మికులు, కర్షకులు, దళిత, బహుజన ఆదివాసీ, మైనారిటీ వర్గాల రక్షణకు ఉద్దేశించిన దుర్భేధ్యమైన కోటలు, సకల స్వేచ్ఛలతో, సూత్రీకరణతో జాతి యావత్తు వికసించటానికి అనువుగా రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగ ప్రాభవం ఈనాడేమయ్యింది? ఎక్కడుంది? అన్న ప్రశ్న ఆ అధ్యయనానికి గీటురాయి కావాలి.

50 సంవత్సరాల భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో జరిగిన ప్రయోగాలన్నీ పూర్తి స్థాయిలో చిత్త శుద్ధితో ఈ దేశ ప్రజల సంక్షేమం కొరకే జరక్కపోయినా, పూర్తిగా ప్రజల పేరుతో, ఎంతో కొంత ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వారినుద్దేశించి జరిగిన ప్రయోగాలేనన్నది అక్షర సత్యం. ఆ క్రమంలో రాజ్యాంగం పార్లమెంటుద్వారా తన్నుతాను నిర్వచించుకుంటూ అనేక సామాజిక, రాజకీయ, ఆర్థిక, సంక్షేమ చట్టాల్ని రూపొందించడం జరగింది. సంస్థానాలు, రాజభరణాలు రద్దు మొదలుకొని బ్యాంకుల జాతీయకరణ, భారీస్థాయిలో ప్రభుత్వ రంగంలో పరిశ్రమల స్థాపన, భూ సంస్కరణల - పట్టణ భూపరిమితి చట్టాలు, కుల నిర్మూలన, జాతీయ భద్రతకు సంబంధించిన ప్రత్యేక చట్టాలు, విద్య, వైద్య, గృహ, స్త్రీ, శిశు, శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక రంగాలకు సంబంధించిన సంక్షేమ చట్టాలు అనేకంగా రూపొందాయి. ఈ చట్టాలకు తూట్లు పొడవడం మూలంగా ప్రజలు అనేక నష్టాల్ని, కష్టాల్ని ఎదుర్కోవడం జరిగిందే కానీ పనికట్టుకుని ప్రజల్ని కష్టాలు, నష్టాలు ఊబిలోకి నెట్టడానికి దేశంలో చట్టాలు, శాసనాలు గత దశాబ్దం క్రితం వరకు జరగలేదన్నది వాస్తవం. ఆ కష్టాల్ని, నష్టాల్ని ఉద్యమాలతో ఎదుర్కొన్న ప్రజానీకాన్ని జాతీయ భద్రత పేరుతో ప్రత్యేక చట్టాన్ని రూపొందించి, హింసా అణచివేతలకు గురిచేయడం ఈ సందర్భంలో ఒక మినహాయింపుగానే పరిగణించక తప్పదు.

ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, నూతన ఆర్థిక విధానాల దురాగతాలు ఒక్క భారత దేశానికి మాత్రమే సంబంధించిన అంశం ఎంతమాత్రం కాదు. అది అంతర్జాతీయంగా సంభవించిన అనేక పరిణామాల కొనసాగింపు మాత్రమే. 1960 నుండి 1980 వరకు అమెరికన్ సామ్రాజ్యవాదులు, రష్యన్ సోషల్ సామ్రాజ్య వాదుల మధ్య నెలకొన్న ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణంలో ప్రపంచ దేశాల్లోని ప్రజలు, పాలక రాజకీయ పక్షాలు రెండు శిబిరాలుగా తమ మనుగడ సాగించేవి. భారత దేశం ఊగిసలాడుతూనైనా రష్యన్ సోషల్ సామ్రాజ్యవాద శిబిరంలో కొనసాగడం చరిత్ర. 1990 దశాబ్దంలో తీవ్రమైన అంతర్గత కలహాలు, బలమైన అంతర్గత వైరుధ్యాలతో సతమతమైన రష్యా, తూర్పు ఐరోపా సోషలిస్టు దేశాలు అక్కడి ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఒక రాజకీయ పరిష్కార మార్గాన్ని రూపొందించికోవడంలో జరిగిన వైఫల్యంతో రష్యన్ సోషల్ సామ్రాజ్యవాద శిబిరం కుప్ప కూలిపోవడం జరిగింది. దాంతో ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం తొలగిపోయి అమెరికన్ సామ్రాజ్యవాదం ఎదురులేని మొనగాడుగా ముందుకొచ్చి, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, నూతన ఆర్థిక సంస్కరణా విధానాల ముసుగులో ప్రపంచ ప్రజల జీవితాన్ని తన మార్కెట్ ప్రయోజనాలకు అనుగుణంగా సాధ్యమైన దేశాల్లో ఆర్థికంగా, సాధ్యంకాదనుకున్న దేశాల్లో సైనికంగా శాసించే క్రమాన్ని ప్రారంభించింది. దాని కొనసాగింపే భారత దేశంలో తెరమీదకొచ్చిన ప్రత్యేక ఆర్థిక మండళ్ళ నిర్మాణం.

భారత దేశంలో పి.వి. నరసింహారావు, మన్మోహన్‌సింగ్‌ల నాయకత్వంలో ప్రారంభమైన ఈ ప్రక్రియ మొదట తేనె పూసిన కత్తిలాగా చాలా మందికి ఎంతో తియ్యగానే అనిపించింది. ఎందుకంటే చరిత్రలో దోపిడీ పాలక వర్గాలు ప్రజల్ని వంచించడానికి ఎన్నుకునే మార్గం ప్రారంభంలో ఎప్పుడూ తియ్యగానే ఉండాలన్నది వారి తాత్విక ధృక్పధంలో భాగం. అందుకే దశాబ్దాలుగా సుపరిచితమైన భావనల (కాన్సెప్ట్) నిర్వచనాలు తారుమారైపోతున్నా వాటి వెనుక దాగిన కుటిలత్వాన్ని మనం గ్రహించి ప్రజానీకాన్ని జాగృతం చేయడంలో విఫలం చెందడం జరిగింది. ప్రజల కొరకే అభివృద్ధి అన్న నినాదం కాస్తా డెవలప్‌మెంట్ విత్ హ్యూమన్ ఫేస్ గా రూపాంతరం చెందింది. అంటే దాని వెనుక దాగిన అసలు అర్థం ఇప్పటికి గానీ మనకు స్పష్టంగా బోధపడడం సాధ్యం కాలేదు. ఉదాహరణకు పశ్చిమ బెంగాల్ అభివృద్ధి చెందాలంటే నందిగ్రామ్ లో కెమికల్ హబ్ నిర్మాణం జరగాల్సిందే. ఆ అభివృద్ధికి నందిగ్రాం రైతులు, ప్రజలు అడ్డంకిగా ఉన్నారు కాబట్టి వారిని తొలగించక తప్పదు. ఆ అభివృద్ధికీ నందిగ్రాం ప్రజలకూ ఏ మాత్రం సంబంధం లేదు కాబట్టి వారిని తొలగించే విషయంలో పాలక వర్గాలు హ్యూమన్‌ఫేస్ అనే బురాఖాను ధరించాలి. అప్పుడు నందిగ్రాంలో పోలీస్ కాల్పులు, రైతుల మరణాలు, రక్తపుటేరులు అనేవి ప్రత్యక్ష పద్ధతుల్లో కాకుండా మూడోకంటికి కూడా తెలియని పద్ధతుల్లో నందిగ్రాం రైతుల పొలాలకు సంబంధించిన అద్రస్సుల వారి శవాలకు కూడా తెలియకుండా తారుమారైపోవాలి. అలాగే, ప్రజల కొరకే శాస్త్ర సాంకేతిక విజ్ఞానం అన్న నిర్వచనం సైన్స్ విత్ హ్యూమన్ ఫేస్‌గా రూపాంతరం చెందింది. ఇప్పుడు మన కళ్ళముందు సాక్షాత్కరిస్తున్న కంప్యూటరైజ్డ్ హైటెక్ శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం అంతా అదే. పట్టెడన్నం కరువై ఆకలి చావుల్ని, ఆత్మహత్యల్ని, ఆశ్రయిస్తున్న కోట్లాది మంది వ్యవసాయ కార్మికుల్ని, చేతివృత్తుల వారిని ఆదుకోవల్సిన శాస్త్ర విజ్ఞానం, కొద్ది మందికి మాత్రమే కోట్లాది రూపాయల లాభాలు, జీతభత్యాలుగా మారి వాటిని అందుకోవడానికి తమతో పోటీ పడమని, అందుకు మీ గ్రామాల్ని సైతం కంప్యూటరీకరించడానికి ఉదారంగా సహకరిస్తామని అంటున్నారంటే అందులో హ్యూమాన్ ఫేస్ లేదనగలిగిన సాహసం చేయగలమా? ఇప్పుడు కొత్తగా ప్రజలయొక్క, ప్రజలచేత, ప్రజల కొరకు పరిపాలన అన్న భావన కాస్త ఇ - గవర్నెన్స్ విత్ హ్యూమన్ ఫేస్‌గా రూపాంతరం చెందడంలో దాగిన విషాదాలు ఎలా ఉంటాయన్నది భవిష్యత్తులో అనుభవించి తెలుసుకోవాల్సిందే. మొత్తం పరిపాలనను ప్రైవేటు వ్యక్తుల మరియు స్వచ్ఛంద సంస్థల పరం చేయడానికి జరుగుతున్న కుట్రలో భాగమే ఇ- గవర్నెన్స్ తప్ప మరేమీ కాదు.

మళ్ళీ కాస్త వెనక్కి వెళ్ళి అసలు విషయానికొస్తే ఈ ప్రైవేటీకరణ, నూతన ఆర్థిక విధానాల అమలుకు సంబంధించిన ఆచరణ ఎలా పరిణామం చెందుతూ వచ్చిందన్న అంశాన్ని కూడా సూక్ష్మ స్థాయిలో లోతుగా పరిశీలించక తప్పదు. ఒక కుక్కను నువ్వు చంపదలచుకుంటే అది పిచ్చిదని ముందుగా ప్రచారం చెయ్యి అన్నది సామెత. 1990లలో భారత సన్ ఎట్‌సెన్‌గా ప్రగతి శీల ప్రజాస్వామిక వాదిగా పేరు పొందిన అరుణ్ శౌరి గారి నాయకత్వంలో ఈ సామెతను ఆచరణలో నిజం చెయ్యడానికి భారత దేశంలో కేంద్ర స్థాయిలో ఆవిర్భవించిన మంత్రిత్వ శాఖే డిజన్వెస్ట్‌మెంట్ మినిస్ట్రీ. అప్పటికి పబ్లిక్ రంగ

సంస్థల స్థాపన, అభివృద్ధి, విస్తరణల్ని పర్యవేక్షించే మంత్రిత్వ శాఖల్ని మాత్రమే చూసిన ప్రజలు ఇలా నిర్మూలించడానికి కూడా మంత్రులా? అని గగ్గోలు పెట్టడం ప్రారంభిస్తే ఆ మంత్రిత్వ శాఖనుండి వెలువడ్డ సమాధానంతో అనేక మంది నోళ్ళు మూసుకు పోవడం జరిగింది. వారి మాటల్లోనే ఆనాటి వారి సమాధానం 'భారత ఆర్థిక వ్యవస్థకు గుదిబండగా మారి నష్టాల ఊబిలో నడుస్తున్న పబ్లిక్ రంగ సంస్థల్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మి, భారత ఆర్థిక వ్యవస్థ ప్రగతిని మళ్ళీ అభివృద్ధి పట్టాలపై నిలబెట్టడమే డిజిన్వెస్ట్‌మెంట్ మంత్రిత్వ శాఖ ప్రధాన లక్ష్యం అని ప్రకటించడం జరిగింది. అలా నష్టాల ఊబిలో పరిశ్రమలు కూరుకు పోవడానికి కారణాలేమిటన్న సమీక్ష కనీస స్థాయిలో కూడా జరక్కపోవడం యాదృచ్చికమేమీ కాదు. అలా వందలాది పబ్లిక్ రంగ సంస్థలను 4 సంవత్సరాల పాటు కోలాహలంగా వేలం వేశారు. ఈ దశలోనే ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పబ్లిక్ రంగ సంస్థల కార్మికుల్ని, ప్రభుత్వోద్యోగుల్ని సోమరిపోతులుగాను, దొంగలు, లంచగొండులుగాను చిత్రించడంలో ఒక క్రొత్త వరవడికి శ్రీకారం చుట్టడం జరిగింది. 50 సంవత్సరాల స్వతంత్ర భారత దేశ చరిత్రలో అదొక దౌర్భాగ్యమైన తిరోగమన దశ. అలా ప్రారంభమైన సంస్కరణలప్రక్రియ 4 సంవత్సరాల అనంతరం నష్టాలతో నడుస్తున్న పరిశ్రమల్ని ప్రైవేట్ వ్యక్తులు కొనడానికి ముందుకు రావడం లేదని, వారికి బోనస్‌గా లాభాల్లో ఉన్న పబ్లిక్ రంగ సంస్థల్ని కూడా అమ్మడం అనే ప్రక్రియగా పరిణామం చెందడం కూడా ముందుగా వేసుకున్న పథకం ప్రకారం సాగిందేనన్నది ఇప్పుడు స్పష్టంగానే అర్థమవుతుంది. ఆ తదుపరి దశలో గణనీయంగా కొనసాగిన అభివృద్ధి ప్రక్రియలో ఊళ్ళు ఆక్రమించి, ఇళ్ళు కూలగొట్టి నిర్మించిన మెగా హైటెక్ రోడ్లు, అంతర్జాతీయ విమానాశ్రయాలు ప్రధానమైనవిగా సాగాయి. ఆధునిక యుగంలో ఉనికిలోకొచ్చిన చట్టబద్ధ రాజ్యాంగ ప్రభుత్వ వ్యవస్థలకు భూమి మీద సర్వహక్కులు బదిలీ కావడం జరిగింది. ఏ ప్రభుత్వ వ్యవస్థలోనైనా వ్యక్తులకు సంబంధించి భూమిమీద పట్టా రూపంలో సంక్రమించే హక్కు కేవలం క్రయ, విక్రయ భుక్తిసంబంధమైన షరతులతో కూడుకున్నదే కానీ సర్వకాల శాశ్వతహక్కు ఎంత మాత్రం కాదు. అందుకే ప్రజాప్రయోజనాలకు అవసరమైనప్పుడు ప్రభుత్వం ఎవరి హక్కు భుక్తమైన భూమినైనా, తిరిగి స్వాధీనం చేసుకునే హక్కును కలిగి ఉంటుంది. ఇక్కడ వ్యక్తుల ప్రయోజనాలు కాక ప్రజా ప్రయోజనాలు అన్న నియమం ఉల్లంఘించడానికి వీలు లేదు. ఈ పద్ధతి భారతదేశంలోనే కాక శతాబ్దాలుగా గణనీయమైన స్థాయిలో ప్రపంచ వ్యాప్తంగా అమలౌతున్న ఒక చట్టబద్ధ నియమం. భారతదేశంలో ప్రత్యేక ఆర్థిక మండళ్ళ స్థాపనతో ఈ చట్టబద్ధనియమానికి కూడా గండికొట్టి నేటి పాలకులు ప్రైవేటు వ్యక్తుల, సమూహాల వ్యాపార లావాదేవీలకు రైతుల హక్కు భుక్తమైన పచ్చటి పొలాల్ని దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవడమే కాక యాజమాన్య హక్కుల్ని బదలాయించడమన్నది అసాంఘికమైన అనాగరిక చర్యగా మిగిలి పోతుంది.

ప్రస్తుత దశ నిర్మాణాత్మకమైన ఏ రంగంలో కూడా ప్రభుత్వ ప్రమేయం కానీ, జోక్యంకానీ, అసాధ్యం, అనాలోచితం అన్న స్థాయికి చేరుకుంది. అందినకాడికి కమీషన్లు పుచ్చుకోవడం, కాంట్రాక్టులు ఖరారుచేయడం అన్న ఏకైక కార్యక్రమం మాత్రమే నేటి భారత పాలక పక్ష రాజకీయ పార్టీల ఎజెండాగా మిగిలింది. అన్నిటికన్నా విషదకరమైంది, ప్రస్తుతం భారత దేశంలో అస్తిత్వంలో ఉన్న పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయ పక్షాల్లో ప్రధానమైన 3 కూటాల్లో (యు.పి.ఏ, ఎన్.డి.ఏ, వామపక్షాలు) ఏ ఒక్క కూటమీ కూడా ఈ చట్ట వ్యతిరేక, అప్రజాస్వామిక పద్ధతుల్ని, విధానాల్ని సూత్రబద్ధంగా వ్యతిరేకిస్తున్న దాఖలాలు మచ్చుకైనా కనిపించకపోవడమే కాక వారి గత చరిత్రను కూడా మరచి, ప్రవర్తించడం జరుగుతోంది. యు.పి.ఏ. కూటమికి నాయకత్వం వహిస్తున్న నేటి కాంగ్రేస్ పార్టీ గతంలో సంస్థానాలు, రాజభరణాలరద్దు మొదలుకొని భూసంస్కరణలు, పట్టణ భూగరిష్ఠ పరిమితి లాంటి చట్టాల రూపకల్పనకు నాయకత్వం వహించిందన్న స్పృహకూడా లేకుండా ప్రవర్తిస్తుంటే మరోవైపు భూస్వాముల, జాగీరుదారుల కబంధహస్తాల్లో చిక్కుకున్న వేలాది ఎకరాల భూమిని విముక్తం చేయడానికి దున్నేవాడిదే భూమి హక్కు అంటూ దేశ వ్యాప్తంగా మహత్తరమైన త్యాగాలతో పోరాటాల్ని నడిపిన చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీలు వామపక్ష కూటమికి నాయకత్వం వహిస్తున్నాయి. వీటి మధ్య అధికారం కొరకు ఆబగా అర్రులు చాస్తున్న ఎన్.డి.ఏ కూటమికి నాయకత్వం వహిస్తున్న భారతీయ జనతాపార్టీకి గతంలో నినదించిన భారతీయుడిగా బ్రతుకు - భారతీయులు తయారుచేసిన వస్తువులనే కొని వినియోగించు (బి ఇండియన్ బై ఇండియన్) అన్న నినాదాలు యీ నాడు కనీస స్థాయిలో కూడా గుర్తుకు రాకపోవడం మరీ ఆశ్చర్యం గొలిపే అంశం. ఈ అన్ని కూటముల ఆరాటం, పోరాటమంతా కూడా ఆ రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు ఎవరు నాయకత్వం వహించాలన్నదే కావడం మరింత విషాదకరమైన వాస్తవం.

గతాన్ని విస్మరించి భవిష్యత్తును నిర్మించడమన్నది ఎలా సాధ్యంకాదో అలాగే ప్రారంభాన్ని మరచిపోయిన వాడు గమ్యాన్ని చేరడం కూడా సాధ్యం కాదు. భారత సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థ ఇంతటి సంక్లిష్టమైన సంక్షోభంలో కూరుకుపోవడానికి చారిత్రక కారణాలేమైనా ఉన్నాయా? అన్నది చర్చనీయాంశం. బహుశా ఇన్ని అవస్థలకు కారణమైన వ్యవస్థ స్వరూప స్వభావాల్ని విశ్లేషించుకోవడంలోనూ, నిర్వచించుకోవడం లోనూ జరుగుతున్న వైఫల్యం కూడా ఆ సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తోందేమోనన్న అనుమానం కూడా సత్యమైనదే. నేటికీ భారత వ్యవస్థ భౌతికంగానూ, భావజాలపరంగానూ, ప్రధానంగా భూస్వామ్య వ్యవస్థగానే కొనసాగుతోందన్నది ఒక వాదం. అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఐరోపా దేశాల్లో భూస్వామ్య సమాజానికి వ్యతిరేకంగా కొనసాగిన ప్రజాస్వామ్య పోరాటాలు విజయవంతమై ఆ సమాజాలు ఎంతోకొంత ప్రజాస్వామికీకరణకు నోచుకోవడం సాధ్యమైంది. భారతదేశంలో 1850వ సంవత్సరంలో ప్రారంభమై 1950 వరకు కొనసాగిన స్వాతంత్రోద్యమం అధికార మార్పిడితో అర్థాంతరంగా ఆగిపోవడం మూలంగా ఈ దేశంలో ప్రజాస్వామిక విప్లవం, దాని కొనసాగింపుగా జరగాల్సిన ప్రజాస్వామికీకరణ అర్థాంతరంగానే నిలిచిపోవడం జరిగింది. మాటల్లో మనం చెప్పుకుంటున్న భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఒక ఆకాంక్షగానే మిగిలిపోయింది. దాన్ని మనం ఇంకా సాధించుకోవడం అన్నది జరగాల్సి ఉంది. భారత సమాజాన్ని శాసిస్తున్న వర్గాలు, పాలిస్తున్న శక్తులు భౌతికంగానూ, భావజాల పరంగానూ భూస్వామ్య శక్తులే. వారికి వ్యతిరేకంగా కలిసొచ్చే అన్ని జాతీయ శక్తులు, వర్గాలు ఐక్యమై మరో స్వాతంత్ర్య సంగ్రామంగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాగించందే భారత సమాజాన్ని ప్రజాస్వామికీకరణ చేయడం సాధ్యం కాదు. అలాంటి పరిపక్వమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నెలకొల్పుకోలేనంత కాలం ప్రజలకు ఈ కష్టాలు, నష్టాలు తప్పవేమో.

*

రచయితలకు విజ్ఞప్తి

అరుణతారకు రచనలు పంపండి.

కథలు, కవిత్వం, పుస్తక సమీక్షలు, విమర్శా వ్యాసాలు, సామాజిక రాజకీయ సిద్ధాంత వ్యాసాలు, యితర భాషల్లోనుండి తెలుగు పాఠకులకు అవసరమైన అనువాదాలు పంపించండి.

అరుణతారలో అచ్చవుతున్న రచనలపై ఉత్తరాలు రాయండి. రచనలను మెచ్చుకునే ఉత్తరాలకంటే గుణదోషచర్చ చేయగల ఉత్తరాలు పత్రిక ప్రమాణాలు పెంచుతాయి. పాఠకుల విమర్శనాత్మక ఉత్తరాలు పత్రికా నిర్వహణకూ తోడ్పడుతాయి.

మీ రచనలు అరుణతార సాహిత్య, సిద్ధాంత స్థాయిని పెంచుతాయని నమ్ముతూ - - సంపాదకవర్గం

చైనా కార్మిక వర్గ స్థితిగతులు

☆ రాబర్ట్ వీల్
తెలుగు : అరుణ్

వ్యాసం

'మంత్లీ రివ్యూ' జూన్ 2006 సంచిక నుండి

పరిచయం :-

నేనూ, అలెక్సిడే మరియు చైనా విధానాలపై అధ్యయనం చేస్తున్న మరొక విద్యార్థితో కలిసి 2004 వేసవిలో కార్మికులతో, రైతాంగంతో, నిర్వాహకులతో, వామపక్ష కార్యకర్తలతో కలసిన చాలా సమావేశాల ఆధారంగా ఈ వ్యాసం రాస్తున్నాను. మా సమావేశాలు, ప్రధానంగా బీజింగ్ చుట్టూ, జిలిన్ జిల్లాలోనూ, జెంగ్‌జావో, కైఫెంగ్ నగరాలలో జరిగాయి. మావో మరణానంతరం చైనా విప్లవాత్మక సోషలిస్టు విధానాలను పూర్తిగా విడనాడాక, మూడు దశాబ్దాల అనంతరం జరిగిన విస్తృత మార్పుల ఫలితాలను మా సమావేశాలు నగ్నంగా కళ్ళముందుంచాయి - కార్మికవర్గాన్ని అవి యిబ్బందికరమైన పరిస్థితులలోకి నెట్టుతూ 'పెట్టుబడిదారి పంథా'కు మరలడం స్పష్టంగా కన్పడింది. అత్యంత సర్వ సమానత్వంగల సమాజంలో సంపద కల్గిన ఉన్నత వర్గాలకు - దినదినం క్షీణిస్తున్న జీవనస్థితులలో వున్న. కార్మికుల, రైతాంగానికి మధ్య విభజన త్వరత్వరగా పెరుగుతూ వస్తూంది. ప్రపంచ వ్యాప్త బిలియనీర్లలో చైనాలో ఏడుగురు, హాంకాంగ్‌లో ఒకరున్నారనే 2006 ఫార్చ్యున్ నివేదిక పై విషయాల్ని రుజువు చేస్తుంది. అమెరికా సంపన్నులతో పోలిస్తే, చైనా సంపన్నుల ఆస్తులు ఎక్కువగా లేకపోవచ్చు. కాని పూర్తి పరిణతి చెందిన చైనా పెట్టుబడిదారి వ్యవస్థకు వారు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వాధికారుల, పరిశ్రమల మేనేజర్ల మధ్య అవినీతి అనే దృఢమైన బంధాన్ని ఏర్పరచింది. - గత 50 సం.రాలలో యెన్నడూ లేని విధంగా కార్మిక వర్గం దోపిడీకి గురవుతుంటే, నూతనంగా అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ వర్గంపై మూడు వర్గాల మధ్యగల సంబంధాలవల్ల మరింత సంపన్న మవుతుంది.

మేం మాట్లాడిన కార్మికులు - ప్రభుత్వ రంగసంస్థల నుండి తొలగింపబడిన లక్షలాది మందిలో కొందరు - ఆ సంస్థలు ఒకానొక కాలంలో ఆర్థిక వ్యవస్థకు మూల స్థంభాల్లాంటివి. ఉద్యోగం నుండి తొలగింపబడ్డ ఈ కార్మికులు ఉపాధి కోల్పోవడమేగాక, గృహవసతి, విద్య, ఆరోగ్యరక్షణ, పెన్షన్ అనేక సామజిక సంరక్షణ సేవలనూ కోల్పోయారు - ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రైవేట్ పెట్టుబడిదారులకు పూర్తిగా అమ్మడం వల్ల, లేక మేనేజర్లు, ప్రభుత్వ, పార్టీ అధికారులు వాటిని కొంతభాగం ప్రైవేటీకరణ చేయటం వల్ల, అవి లాభాలను తెచ్చిపెట్టే కార్పోరేషన్లుగా మారాయి. ఇక ఈ క్రమంలో అవినీతి మామూలే.

బలవంతాన గ్రామీణ కమ్యూన్లనురద్దుచేయడం ప్రతికుటుంబానికి కొంత భూమిని కేటాయిస్తూ కుటుంబ బాధ్యత పద్ధతిని ప్రవేశపెట్టడంతో, వాటి దీర్ఘకాలిక ప్రభావాలతో రైతాంగం సతమతమవుతున్నదని మేం కలసిన రైతాంగం ద్వారా తెల్సింది. ఇక రైతులకు తగినంత నష్టపరిహారం యివ్వకుండా, ప్రాంతీయ అధికారులు, రైతుల భూముల్ని, పారిశ్రామిక వేత్తలకు, రియాల్టర్స్‌కు అమ్మడంతో కోట్లాది మంది జీవనోపాధి కోల్పోయారు. అంతేగాక, రైతాంగం సామూహిక సామాజిక మద్దతును, గతంలో పొందినట్టుగా పొందలేకపోయారు. దాదాపు వారిలో ఒక 10 లక్షల మంది గృహ నిర్మాణపనులలో, ఎగుమతి ప్రధాన ఉత్పత్తి పరిశ్రమలలో, కనీస మౌలిక వసతుల్లేని ఉద్యోగాలలో ఉపాధి వెతుకుతూ నగరాలకు వలసవెళ్ళారు. అలా వలసవెళ్ళిన వారి పరిస్థితి క్రమంగా దిగజారుతోంది. నగరవాసుల మధ్య శాశ్వతంగా సెటిల్‌కావడం, అదే సమయం చాలా మంది వయసుపైబడటం, అనారోగ్యంతో యిబ్బందుల పాలవుతున్నారు.

అయితే, పోరాటాల ద్వారా, త్యాగాల ద్వారా దశాబ్దాలకాలంగా తాము పొందిన హక్కులను కోల్పోవడం, నిత్యం దిగజారుతున్న పరిస్థితులను చైనా కార్మికవర్గం సహించడం లేదు. గత దశాబ్దాల కాలంలో మునుపెన్నడూ చూడని స్థాయిలో వర్గ సంఘర్షణ, సామాజిక అలజడి కన్పడుతున్నది. కార్మికులు, రైతాంగం, వలస వచ్చిన వారు నేడు ప్రపంచంలో యెక్కడ చూడలేని మహత్తర ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. వీటిలో లక్షలాది మంది పాల్గొనడమేగాక, అవి అధికారులతో ఘర్షణకు దారి తీశాయి కూడా. ప్రజా సంరక్షణ మంత్రి ప్రకటించిన వివరాల ప్రకారమే ఈ ప్రదర్శనలో దాదాపు 74,000 మంది (2004లో) పాల్గొన్నారు. ఈ సామాజిక అస్థిరత, పార్టీ నాయకత్వానికి ప్రభుత్వ అధికారులకు ఒక సవాలుగా మారింది. ఈ పరిస్థితి మరింత క్లిష్టంగా మారకముందే దాన్ని యెదుర్కొనడానికి కొన్ని విధాన మార్పులు జరిగాయి. దశాబ్దాల కాలం యెంతో అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థతో లాభపడిన ఉద్యోగస్థులు, మేనేజర్లు, వేగంగా విస్తృతమవుతున్న కాలేజీ విద్యార్థి శ్రేణుల మధ్యతరగతి విచ్ఛిన్నమవుతున్నది. ఈ మధ్యకాలంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగాలు లభించడం కష్టమయింది. మావోకాలంలో ఉచితంగా లభిస్తున్న కాలేజీ విద్య నేడు చాలా ఖర్చుతో కూడుకున్నదయింది. (మరీ ముఖ్యంగా కార్మిక వర్గానికి) అంతో యింతో సంపన్నులైన వారిపైన కూడా మార్కెట్ వ్యవస్థ ఒత్తిడి పెరిగింది. ఆర్థికాభివృద్ధి తెచ్చిన ప్రయోజనాలు, వినిమయ వస్తువులు, ఆహారం విస్తృతంగా అందుబాటులో వుండటం, పైకెదిగే అవకాశాలు పెరగడం, ఉద్యోగ అవకాశాలు పెరగడం ఒకవైపు వుంటే, వీటన్నిటినీ తోసిరాజని లక్షలాది మంది ప్రజలకు పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, అభద్రత కన్పడుతుంది. దీని ఫలితంగా, చైనా అంతసులువుగా పరిష్కారం కాని, తీవ్రమవుతున్న వర్గ సంఘర్షణ, రాజకీయ అభద్రతలోకి ప్రవేశిస్తున్నది. కార్మిక వర్గానికి ముందుదారి చాలా కష్టమైనది, వామపక్షాల పునర్నిర్మాణం చాలా ప్రాముఖ్యత కల్గినదైనా, యింకా తొలిదశలోనే వుంది. ఈ వ్యాసం పై పరిస్థితులలోని అవకాశాలను, యిబ్బందుల గురించి పరిశీలిస్తుంది. రక్షణకోసమై నేను (రచయిత) వ్యక్తుల, సంస్థల పేర్లను రహస్యంగా వుంచాను.

సంఘర్షణ, ఐక్యత

పెట్టుబడిదారి మార్కెట్ సంస్కరణల వల్ల చైనా తలుపులు ప్రపంచ ఆర్థిక శక్తులకు బార్లా తెరవడం ద్వారా తమను దోపిడీ చేస్తున్న వారికి వ్యతిరేకంగా, పట్టణ ప్రాంతకార్మికులు, వలస వచ్చినవారు, రైతాంగం అంతేగాక నూతన మధ్యతరగతికి చెందిన వారు ఐక్యంగా సంఘర్షించడానికి తగిన పరిస్థితులున్నాయని పైకి చూడడానికి కన్పిస్తాయి. అయితే, ఇలాంటి పరిస్థితులే వున్న అమెరికా మరియు ఇతర ప్రాంతాలవలె, కార్మికవర్గపు ఐక్యత ఊహించినంత సులువుకాదు. పాత అపనమ్మకాలు, ముఖ్యంగా పట్టణ ప్రాంత చైనీయులకు రైతాంగం పట్ల గల చిన్న చూపు అంత త్వరగా పోయేవి కావు. గ్రామీణ ప్రాంతం నుండి ఉపాధికై వలస వచ్చిన వారు పట్టణ ప్రాంత కార్మికులతో పోటీపడటంవల్ల ఆ అపనమ్మకాలు మరింత దృఢపడ్డాయి. ఇక, అధికారంలో వున్న వారు పై పరిస్థితులను ఆసరాగా తీసుకొని 'విభజించి పాలించు' విధానం అమలు చేస్తున్నారు. ఉదాహరణకు, ఒక కార్యకర్తను, 'వలసవచ్చినవారి వల్ల తమ ఉద్యోగాలు కోల్పోతున్నామనే భావన పీకింగ్ కార్మికులకు వుందా' అని అడిగితే, 'నిజమే, మరీ ముఖ్యంగా ఉద్యోగాల నుండి తొలగింపబడ్డవారికి', అనే సమాధానం వచ్చింది. వలస వచ్చిన కార్మికుల పట్ల పట్టణ ప్రాంత కార్మికులకు చిన్నచూపువుంది. వలస వచ్చినవారు యెలాంటి పనికైనా, యెంత తక్కువ వేతనంకైనా చేస్తారని పట్టణ ప్రాంత కార్మికుల వ్యాఖ్యానం. ఇక వలస వచ్చిన వారు తొలగింపబడిన కార్మికులకు తగిన శాస్తి అయ్యిందని వ్యాఖ్యానిస్తారు.

-అంతేగాక, ప్రభుత్వం వలస వచ్చిన వారికిచ్చే కొన్ని రాయితీలను పట్టణ ప్రాంత కార్మికులు నిరశిస్తారు. ఇక వీరి మధ్యగల విభేధాలు మరింత పెద్దవి చేస్తూ, ప్రచార సాధనాలు ప్రచారం చేస్తున్నాయి. అంతేగాక ఈ విభిన్న కార్మిక వర్గాల ఆదాయాల మధ్యగల అంతరాలు 3.3:1, వారి మధ్య విభేధాలను మరింత

రెచ్చగొడుతున్నాయి.

ఈ విభేదాలు పతాకస్థాయి చేరడం 2001లో జింగ్‌జెన్‌లోని విద్యుచ్ఛక్తి ఫ్యాక్టరీ కార్మికుల అనుభవం మనకు రుజువు చేస్తుంది. ఆ ఫ్యాక్టరీని అమ్మడం వల్ల నిరసన తెల్పిన కార్మికులను అరెస్టు చేసి, యంత్ర సామాగ్రిని రాత్రి పూట దొంగలవలె పోలీసులు తరలించారు. దీనికై వారు రోజా 50 యువాన్లు చెల్లించి ఉపాధికై వలసవచ్చిన రైతాంగాన్ని వినియోగించారు. పోలీసులు తమపై ప్రజల నిరసన వ్యక్తం కాకుండా దాదాపు 500 మంది పేద రైతాంగ సహాయం తీసుకున్నారు. జూలై 24, 2001న కార్మికులకు రైతాంగానికి మధ్య అదొక యుద్ధంగా మారింది. ఇతర కర్మాగారాల నుండి కార్మికులు రావడంతో, ఆ రోజు కార్మికులు విజయం సాధించారు. 8 మంది కార్మికులు అరెస్టయ్యారు. సంస్కరణలకు ముందు కాలంలో వున్న కార్మికుల హక్కులను మననం చేసుకుంటూ, ఒక కార్మికుడు మా చట్టాలు, మావోచట్టాలు పరిరక్షింపబడ్డాయి అన్నాడు.

పెద్దయెత్తున కార్మిక వర్గం కదలడంతో, అధికారులు కొంతకాలం మౌనం వహించారు. అయితే, పెట్టుబడిదారుల ఒత్తిడులవల్ల కార్మికులు మరల అరెస్టు చేయబడ్డారు, కోర్టుల నుండి యిబ్బంది రాకుండా, ఈ అరెస్టులను పబ్లిక్ సెక్యూరిటీ పోలీసులు చేసారు. వారు రైతాంగాన్ని కార్మికులపై పురికొల్పి 5,650 మందిని తొలగించి, ఫ్యాక్టరీని మొత్తం అమ్మారు. ఆ తర్వాత, కర్మాగారపు భవనాన్నేగాక, కార్మికుల యిండ్లనూ కూలగొట్టి, రియల్‌ఎస్టేట్ డీలర్‌కు ఆ స్థలాన్ని విక్రయించారు. ఇప్పుడు వుండేందుకు యిండ్లులేక, ఉపాధి కరువై ప్రతి కార్మికుడు పోరాటం కొనసాగించేందుకు భయపడుతున్నాడు. పోలీసులు సాధారణ దుస్తులలో వచ్చి కత్తులు, కటార్లలో కార్మికులపై దాడిచేసి, గూండాలవలె ప్రవర్తించారు. ఒక కుండల తయారీ ఫ్యాక్టరీ వద్ద కార్మిక నాయకున్ని చచ్చేంతవరకు కొట్టినా, అధికారులు పట్టించుకోలేదు. వారిచ్చిన ఫిర్యాదును నిర్లక్ష్యం చేసారు.

ఈ విధంగా, పోలీసు, ఇతర ప్రభుత్వ ఏజెన్సీలు కార్మికులపై ప్రత్యక్షంగా దాడి చేయడమే గాక, కార్మిక వర్గాలలోనే ఒకరిపై ఒకరు దాడి చేసేటట్టుగా పురికొల్పారు. ఐక్యత అవసరమైన చోట ఇప్పటికే వివిధ కార్మిక వర్గాల మధ్యనున్న విభేదాలను, అనుమానాలను, పై సంఘటనలవల్ల అధిగమించడం వారికి కష్టమవుతుంది. ఎలెక్ట్రికల్ కంపెనీ కార్మికుడు "రైతాంగం మరియు కార్మికులు ఒక కుటుంబంగా బతకాలి. వారితో కొట్లాడాల్సిందే, కాని మేం కలసి పనిచేయాలి". అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. వర్గాలు రెండు తమ తక్షణ ప్రయోజనాలకై పనిచేస్తున్నారు. చివరకు ఆ ఫ్యాక్టరీ దగ్గర వున్న ఒక హెడ్ పోలీసు కూడా, తను చేసినపని (కార్మికుల అణచివేత) తాను చేయకుండా వుండాల్సిందని బాధపడ్డాడు. కాని, పై అధికారుల ఒత్తిడికి లొంగక తప్ప లేదన్నాడు. ఒక కార్మికుడు ఆ పోలీసును అతడొక కుక్క అంటే, దీనికి జవాబుగా ఆ పోలీసు నిజమే, నేను మిమ్మల్ని కరవకపోతే, వాళ్లు నాతోలు తీస్తారు అన్నాడు. ప్రభుత్వ రంగసంస్థల స్థానంలో ప్రైవేట్‌రంగం అభివృద్ధి జరగడంతో, ఈ విభజనలు మరింత పెరిగాయి. ఆప్రాంతాలలో కొత్త కర్మాగారాలు నెలకొల్పబడ్డా, వారు తమ కర్మాగారాలలో తక్కువ వేతనానికి పనిచేసే గ్రామీణ వాసులను నియమించుకొనేవారు. వారికి గృహవసతి, మరి యెలాంటి సదుపాయం కల్పించాల్సిన అవసరం వుండదు. అమెరికాలోవలె గాక, యెవరైనా కార్మికుడు పని నుండి తొలగింపబడితే, వానికి సేవారంగంలో కూలి పని దొరకదు. కారణం, వలస వచ్చిన గ్రామీణరైతాంగం తక్కువ వేతనాలకు పనిచేయడమే. రైతాంగానికి, కార్మికులకు కలిసి పనిచేయాలని వున్నా ఉపాధి వేటలో పోటీ యిరువర్గాల మధ్య ద్వేషానికి దారితీసింది.

అటువంటి విభజనలు, ఘర్షణలు వున్నప్పటికీ, పట్టణ ప్రాంత కార్మికుల మరియు రైతాంగం మధ్య, అంతేగాక వీరితో ఇంకా గ్రామాల్లో వ్యవసాయం చేస్తున్నవారితో, వలస వచ్చిన వారి మధ్య సఖ్యత సాధించడానికి ప్రయత్నాలు జరుగుతూనే వున్నాయి. జెన్‌జావో కాగితపు, వస్త్ర, విద్యుచ్ఛక్తి సామాగ్రి తయారీ పరిశ్రమల వద్ద జరిగిన ప్రదర్శనలు గాని, 1997లో 13,000 టాక్సీ డ్రైవర్ల సమ్మె సందర్భంగా గాని, వేలాది కార్మికులు ప్రైవేటీకరణకు ఉద్యోగాల రద్దుకు పెరిగిన పన్నులకు వ్యతిరేకంగా జరిగిన సమ్మెలకు మద్దతునిచ్చారు. అయితే, చైనాలో విడివిడి కర్మాగారాలలో పనిచేస్తున్న కార్మికులు తమకై తామే వారి యాజమాన్యంతో, ప్రభుత్వ అధికారులతో పోరాడటం సర్వసాధారణ విషయం. తరచుగా, యిటువంటి పోరాటాలు, 'రాస్తారోకో', కార్యాలయం దిగ్బంధించడం వంటివి వారికి కొంత స్వాంతన చేకూర్చే నిధుల చెల్లింపులను సాధించి పెడతాయి. అయితే, అది యే విధంగానూ వారి దీర్ఘకాలిక సమస్యల్ని పరిష్కరించదు. విడివిడిగా జరుగుతున్న ఈ ఉద్యమాలు ప్రైవేటీకరణ, నిరుద్యోగం, ఉద్యోగాల రద్దు లాంటి వాటిని నిలువరించలేదని కార్మికులు గ్రహించారు. దాంతో జెంగ్‌జావ్‌లోని వివిధ కర్మాగారాల కార్మికులు తమ ఉద్యమాలను సమన్వయం చేసుకోవడం మొదలెట్టారు. ఈ మధ్యనే వివిధ కర్మాగారాల్లో ఉద్యోగాలు కోల్పోయినవారు (1,00,000), ఉద్యోగాల్లో వున్నవారు కలిసి సమావేశమై కలసికట్టుగా నిరసన కార్యక్రమాలు నిర్వహించడం మొదలెట్టారు. వాళ్లు సమీపకాలంలో నగరంలో అన్ని ఫ్యాక్టరీల కార్మికులతో కలసి సంయుక్తంగా ఒక పెద్ద ప్రదర్శన నిర్వహించాలను కుంటున్నారని మేం మాట్లాడిన కార్యకర్తల వల్ల తెల్సింది.

అయితే అలాంటి ఐక్యపోరాటపు అవకాశాలు తక్కువే. పట్టణ ప్రాంత కార్మికుల మధ్య ఆర్థిక, తరాల, రాజకీయ విభజనలున్నాయి. కొంతమంది ప్రభుత్వ సంస్కరణలను సమర్థిస్తుంటే మరికొందరు సోషలిస్టు దృక్పథంతో వున్నారు. కార్మిక వర్గ జిల్లా మధ్యలో వున్న జెంగ్‌జవ్ పార్క్ కూడా భౌతికంగా దక్షిణపక్ష, వామపక్ష గ్రూపులుగా విడిపోయింది. పగటిపూట మొదటి తరహా కార్మికులు కొన్ని ప్రాంతాలపై ఆధిపత్యం వహిస్తే, ఇతర ప్రాంతాలలో వామపక్ష కార్మికులు, ముఖ్యంగా రాత్రుళ్ళలో ఆధిపత్యం వహిస్తున్నారు. ప్రతిరోజు అక్కడికి విశ్రాంతికై కొందరు వెళుతుంటారు. వారి మధ్య జరిగే చర్చలు చాలా తీవ్రంగా వుండటమేగాక ఒకొక్క మారు బెదిరింపులతో వుండేవి. కలిసి పని చేయాలనే కోరిక వున్నా, వారి పరిస్థితులలో వున్న తేడావల్ల, వారిపట్ల ప్రభుత్వం ప్రవర్తించే తీరులోగల తేడాలవల్ల అలాంటి ఐక్యత భంగ మయ్యేది.

సంస్కరణలవల్ల కొంతమేరకు వారి ఆదాయాల్లో మార్పు వచ్చింది. నగరాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో కూడా, మావో నాటి సోషలిస్టు వ్యవస్థలోకన్నా, కొంతమంది రైతాంగం, పట్టణ నివాస కార్మికులకన్నా మెరుగ్గా వున్నారని తెల్సింది. ఆ రైతాంగం, యింకనూ పేదలేగావచ్చు. బతుకుతెరువు కోసం యిబ్బందులు పడుతూ వుండవచ్చు, కాని వారికి కనీసం కొంత ఆహారం పండించుకొనేందుకు కొంతపొలముంది. అతి పేద అయిన వలస కూలీ కూడ, నగరంలో ఉపాధి దొరకనపుడు గ్రామానికి తిరిగి వెళ్ళవచ్చు. కాని నైపుణ్యంలేని పట్టణ కార్మికుని, మరీ ముఖ్యంగా ఉద్యోగం నుండి తొలగింపబడ్డవానికి అలాంటి అవకాశాలు లేవు. వారు, ఉత్పత్తి సాధనాలకు దూరమై, బయటి నుండి యెలాంటి సహాయం పొందలేక ఆకలితో చావాల్సిందే. దాంతోపాటు, ఆ కార్మికునికి రోగగ్రస్తుడైన తల్లిదండ్రులుంటే, లేక ఫీజులు చెల్లించాల్సిన స్కూల్ పిల్లవాడుంటే వాని పరిస్థితి చెప్పాల్సినవసరం లేదు. ఏదైనా వృత్తిలో నైపుణ్యంగలవారు లేక చిన్న చిన్న వ్యాపారాలు చేయగలిగే స్థోమత గలవారు మాత్రమే భూమి కల్గిన రైతులతో సమాన స్థాయి కల్గివున్నారు.

తత్ఫలితంగా పై రెండు వర్గాల మధ్య ఐక్యత సాధించడం అంత సులువైన విషయం కాదు. తరచుగా యిరువర్గాలు నిరసనలు, ప్రదర్శనలు విడివిడిగా జరుపుతూనే వున్నాయి (ఉపాధి కోల్పోయిన కార్మికులు, తను భూమిని రోడ్ల నిర్మాణాలకై ప్రభుత్వ స్వాధీనం చేసుకుందని రైతులు) కాని ఈ నిరసన ప్రదర్శనల మధ్య సమన్వయం లేదు

అంతేగాక, ఈ రెండు వర్గాల నిరసన పట్ల ప్రభుత్వం స్పందిస్తున్న

తీరులో కూడా తేడా వుంది. నగరప్రాంత కార్మికుల ఆందోళనలు చాలా బహిరంగంగా, పట్టణ ప్రాంత అధికారవర్గాన్ని ప్రశ్నిస్తూ, సంస్కరణల మూలాన్నే సవాలు చేస్తూ, పరిశ్రమల ప్రైవేటీకరణ, నూతన పెట్టుబడిదారీ వర్గ రూపకల్పనను అడ్డుకుంటూ జరుగుతాయి కాబట్టి ప్రభుత్వ అణచివేత తీవ్రంగా వుంటుంది. తాను తనలాంటి వారు చాలా ఆగ్రహంతో వున్నారని, కలసి తిరుగుబాటు చేయాల్సిన అవసరముందని, అయితే వారు తమ పరిస్థితుల గురించి బయటకు చెప్పుకునేందుకు వీలు లేదని ఒక కార్మికుడు బాధపడ్డాడు. అయినా పోయేదేమీలేదు గనుక, చావుకు భయపడటం లేదని చెప్పాడు. అందువల్ల వాళ్లు పోరాటాలను కొనసాగిస్తూనే వుంటారు.

చైనా అంతటా పెద్ద యెత్తున కార్మికోద్యమాలు జరుగుతున్నాయి. ఒక్కొక్క మారు స్థానికంగా విజయాలు సాధిస్తున్నాయి. అయితే, చాలామార్లు ఉద్యమనాయకుల అరెస్టులు, జైలు శిక్షలతో ముగుస్తున్నాయి. దీనికి విరుద్ధంగా, ప్రభుత్వం గ్రామీణ ప్రాంత అభివృద్ధి తన విధానంగా చెప్పుకుంటున్నా, అది ప్రకటనలకే పరిమితమయింది. రైతాంగ నిరసనలు మరింత క్రూరంగా అణచివేయబడుతున్నాయి. కాని, ఆ విషయం ప్రజలందరి దృష్టికి రావడం లేదు. డిసెంబర్, 2005లో గువాన్‌డంగ్ జిల్లాలో, విద్యుచ్ఛక్తి ప్లాంట్ నెలకొల్పటానికి రైతుల భూమిని స్వాధీనం చేసుకున్నారు. సరైన నష్టపరిహారం చెల్లించలేదని రైతులు తిరగబడ్డారు. ఆ నిరసనకారులపై కాల్పులు జరిపినపుడు డాంగ్‌జన్‌లో 20 మంది గ్రామీణులు మరణించారు. ఇలాంటి సంఘటనలు మాత్రమే అందరికీ తెలుస్తున్నాయి. ఒకవైపు తమ పరిస్థితులు దిగజారిపోవడంతో రైతాంగం ఆగ్రహంతో వుంది. తమ పరిస్థితి పట్టణ ప్రాంత కార్మికుల పరిస్థితులకు భిన్నంగా లేదని అర్థం చేసుకుంటుంది. మరోవైపు వలసకార్మికులు తమ పరిస్థితులు రోజురోజుకు దిగజారుతుండటం గమనిస్తున్నారు. అందువల్ల వీరి మధ్య యెన్ని విభేదాలున్నా, పట్టణ ప్రాంత, గ్రామీణ ప్రాంత కార్మికులు కలసి పనిచేసేందుకు పద్ధతులు త్వరలోనే కనుక్కోవచ్చు. కార్మిక వర్గం సంఘటిత పడటానికి సహాయం చేస్తున్న కార్యకర్తలు వివిధ ఉద్యమాలను సమన్వయం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. కాని అది ఒక దీర్ఘకాల, క్లిష్టమైన క్రమం. ఇప్పుడిప్పుడే వారి మధ్యగల విభేదాలు తగ్గించడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

వామపక్షాల పునఃప్రవేశం

మార్క్సిజం, లెనినిజం - మావో ఆలోచనా విధానం గురించి అవగాహన కల్గిన వారు, చైనాలో సోషలిస్టు వ్యవస్థ కొరకు జరిగిన పోరాటాల అనుభవమున్నవారు, రైతాంగంలో, వలసవచ్చిన వారిలో, పట్టణ ప్రాంత కార్మిక వర్గంలో వుండటంతో, వారి మధ్య ఐక్యతకు అవకాశాలున్నాయనుకోవచ్చు. ఈ చారిత్రక వారసత్వం చైనా వామపక్షాల పునర్నిర్మాణానికి మౌలిక ప్రాధాన్యత కల్గి వుంది. ఒక రెడ్‌గార్డు చెబుతున్నట్టుగా, "రెండు పంథాల మధ్య ఘర్షణను, విప్లవానంతర సోషలిజంకు, నేటి సోషలిజంకు మధ్యగల స్పష్టమైన విభజన రేఖను నేడు కార్మిక వర్గం తనకు తానై అర్థం చేసుకుంటున్నది. కేవలం మేధావుల నుండి ఆ అవగాహన రావడం లేదు. ఆ అవగాహన అవినీతి వ్యతిరేక ఉద్యమం రూపం తీసుకుంటున్నది. అది కేవలం ఆర్థిక నేరాల, లంచగొండి తనమనే చిన్నవిషయాలకే పరిమితం కావడం లేదు. ప్రభుత్వ మరియు కమ్యూనిస్టు పార్టీ నేతల మధ్య, మేనేజర్ల మరియు పారిశ్రామిక వేత్తల మధ్యగల కూటమి నేడు ఉత్పత్తి సాధనాలను కొత్తగా రూపొందుతున్న పెట్టుబడిదారీ వర్గపు స్వంత ఆస్తిగా మార్చడం, విప్లవకాలంలో కార్మికులు, రైతాంగం సాధించుకున్న సోషలిస్టు ప్రయోజనాలను రద్దుచేయడం లాంటి ప్రయత్నాలను నిరోధించేందుకు కార్మిక వర్గ ప్రయత్నాలు జరుగుతున్నాయి. 1920 తొలిదశలో కమ్యూనిస్టు ఉద్యమాలకు కేంద్రాలయిన జెంగ్‌జన్ మరియు ఇతర ప్రాంతాలలో విప్లవ సిద్ధాంతం సారాన్ని, (Sprit) ఆచరణను అక్కడ కార్యకర్తలు సజీవంగా వుంచారు. మావో వారసత్వం అక్కడ సజీవంగా వుంది. కార్మిక చైతన్యం ఉన్నతస్థాయిలో వుండి రెండు పంథాల పోరాటానికి దారితీస్తూ వుంది.

అక్కడి కార్మికులతో మేం చేసిన చర్చలలో కొట్టవచ్చినట్టు కన్పడిందేమిటంటే, కార్మికులకు వారు పనిచేసిన కర్మాగారాలపట్ల గల బంధం. ప్రభుత్వ రంగ సంస్థలలో వారికున్న సామాజిక యాజమాన్యం, భాగస్వామ్య హక్కులు ఎంత పరిమితం గలవైనా, డెంగ్ సంస్కరణలవల్ల అవి తగినంతలేకున్ననూ, కార్మికులు తాము పనిచేస్తున్న కర్మాగారాలు తమవిగా భావించారు. విద్యుచ్ఛక్తి పరికరాల ఉత్పత్తి ఫ్యాక్టరీ 'తమ చెమటతో కట్టామని', దాన్ని ప్రైవేటీకరించి పెట్టుబడిదారుల చేతిలో పెట్టడం తామంగీకరించమని ఒక కార్మికుడు వాపోయాడు. ఆ ఫ్యాక్టరీ మొత్తం దేశపు సొత్తు. మొత్తం కార్మిక వర్గపు సామూహిక ఆర్థిక సంచయంలో ఒక భాగం. మావోకాలంలో, ఫ్యాక్టరీల పైన కార్మికులకు కొంత అధికారం వుండేది. "వారు సలహాలు యిచ్చేవారు. వారి సలహాలు స్వీకరించబడేవి". ఈ పద్ధతి సాంస్కృతిక విప్లవకాలంలో పతాకస్థాయికి చేరింది. అప్పుడు, వారేనాయకులు, కార్మిక వర్గం తనకుతానే ప్రాతినిధ్యం వహించేది - కాని యిప్పుడు ఎవ్వరు వారి మాట వినడం లేదు. ఈ పరిస్థితినంతా సైద్ధాంతిక సందర్భంలో వివరిస్తూ "నేటి - బ్యూరోక్రటిక్ పెట్టుబడిదారీ వ్యవస్థ" ఆర్థికపరమైన సమస్య కాదు. అది మౌలికంగా రాజకీయ సమస్య, అని జెంగ్‌జావో కార్మికుడు వివరిస్తాడు. ఆ మాటలు లెనిన్ "ఏం చేయాలి?" What to be doneలో "పైకి చూడడానికది ఆర్థిక సమస్యగా కన్పడుతుంది. కాని వాస్తవంగా అది పెట్టుబడిదారి వ్యవస్థకు సోషలిస్టు విధానానికి మధ్య ఘర్షణే" అన్నమాటలు జ్ఞప్తికి తెస్తాయి. చైనా సోషలిస్టు వ్యవస్థను యేనాడు ఎరగని అమెరికా లాంటిదికాదు - వృద్ధ కార్మికులు ఈ చారిత్రక సందర్భాన్ని అర్థం చేసుకున్నారు. వారిలో చాలా మందికి మావోకాలపు, సాంస్కృతిక విప్లవకాలపు అనుభవాలున్నాయి. వారితరం చైనాను "మావో పంథా"కు తేవాలనుకుంటున్నది. సోషలిస్టు పంథాను రక్షించడానికి అంతర్జాతీయంగా జరుగుతున్న ఘర్షణలో అది ఒక భాగమే.

సోషలిస్టు పంథాకు తిరిగి వెళ్ళడమనేది ఒక దీర్ఘకాలిక పోరాటమని ఆ కార్మికునికి తెలుసు అయితే, చైనా కార్మికులు నెమ్మదిగా ఆ పంథావైపు మరలుతారని, చివరకు విజయం సాధిస్తారని అతడు ఆశిస్తున్నాడు. అదే సమయంలో, ప్రస్తుత కార్మికోద్యమాన్ని ఉన్నత స్థాయికి త్వరలోనే చేర్చకపోతే, యువకార్మికులు ఈ ఉద్యమాన్ని "మెరుగైన పరిస్థితుల" కోసం చేస్తున్న ఆర్థిక పోరాటంగా భావించే ప్రమాదముందని హెచ్చరిస్తాడు. ఇది సోషలిస్టు వ్యతిరేక సంస్కరణల వారసత్వం. - అంతేగాక డెంగ్‌షియాసింగ్ యొక్క బోధనలు యువ కార్మికులపై తప్పుడు ప్రభావాన్ని చూపుతున్నాయి. 'చాలామంది (కార్మికులు) సమావేశమయ్యేందుకు పై విషయాలు చర్చించేందుకు కూడా భయపడుతున్నారు' - ఇలాంటి అభిప్రాయాల్ని మేం వృద్ధ కార్మికుల నుండి చాలా మార్లు విన్నాం.

పై కారణంవల్ల సోషలిస్టు వ్యవస్థ కోసం ఉద్యమించాలనుకొన్నవారు తమ చైతన్యాన్ని, అనుభవాన్ని యితరులకందజేయడానికి కొత్త పద్ధతులు కనుగొన్నారు. విప్లవపు వారసత్వాన్ని సజీవంగా వుంచడానికేగాక, దాని కొత్త తరానికందజేయడానికి కేవలం రాజకీయ, ఆర్థిక రూపాల ద్వారానేగాక, సాంస్కృతిక కార్యక్రమాలనూ నిర్వహిస్తున్నారు. జెంగ్‌జాన్‌లోని కార్మికులు అధికంగా వుండే జిల్లాలో ఒక పార్క్‌లో, కార్మికులు, వారి కుటుంబాలు కలసి ప్రతిరాత్రి పాత విప్లవపాటలు పాడటం చూశాం. వారాంతపు రోజున పదవీ విరమణ చేసినవారే గాక, యువకులు, పిల్లలు వందలకొద్ది ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఒక కార్మికుడు, ఈ పాటలు పాడటంలో వ్యక్తమయ్యేది కమ్యూనిస్టుపార్టీపట్ల, అది నేడు యెలా వుందనే దాని పట్ల మా వ్యతిరేకత, దాన్ని యెదుర్కొనడానికి మావో ఆలోచనా విధానాన్ని వినియోగించడం, చైతన్యాన్ని పెంపొందించుకొనడానికని అన్నాడు.

ఇలాంటి ఉత్సాహం నగరంలోని ఉద్యమాలలో కూడా వ్యాపించింది. 2000సం.లో పేపర్‌మిల్లు సమ్మెకాలంలో, (అదప్పటికీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రతిఘటనకు నమూనా మాత్రమే) కార్మికులు "సాంస్కృతిక విప్లవ"

పద్ధతులను పాటించారు. వారు మేనేజర్లను కర్మాగారం నుండి బయటికి తోసి, ఫ్యాక్టరీని ఆక్రమించి, కర్మాగారపు సామాగ్రిని బయటకు తరలించకుండా నిరోధించి, దాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత యెన్నో మలుపులు తిరిగాక, కర్మాగారపు కొంతభాగం యింకనూ కార్మికుల చేతిలో వుంది. అయితే మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో గల యిబ్బందుల వల్ల ఆర్థికంగా అధికారులు దాన్ని దెబ్బతీసే ప్రయత్నాల వల్ల ఆ కర్మాగారాలు నిలదొక్కుకోవడానికి యిబ్బందులు పడుతోంది. జైలు నుండి తిరిగి వచ్చిన ఒక కార్మిక నాయకుడు పైన తెల్పిన పద్ధతులనే అవలంభిస్తున్నామని పారిస్ కమ్యూన్ విధానాలు ఎప్పటికీ సజీవంగా వుంటాయని అన్నాడు. అలాంటి దృక్పథమే విద్యుచ్ఛక్తి సామాగ్రి ఉత్పత్తి చేసే కర్మాగారపు పోరాటాల్లో కన్పడుతుంది. వారి నినాదాల్లో, "కార్మికులు ఉత్పత్తి చేయాలని, జీవించాలని వాంఛిస్తున్నారు" అనేది ఒకటి. అదే సమయంలో, మావో ఆలోచనా విధానాన్ని సమున్నతంగా ఎత్తిపడుతాం అనే బ్యానర్ కన్పడుతోంది. కార్మికుల ఇతర చర్యలు బహిరంగంగా మరింత రాజకీయరూపం సంతరించుకున్నాయి.

పేపర్ మిల్లు కార్మికులు మిల్లును ఆక్రమించిన సంవత్సరంలోనే, మావో వర్ధంతి ఉత్సవాలు మొదలయ్యాయి. 2001లో దాదాపు లక్షలాది ప్రజలు గుమిగూడారు. పదివేల మంది పోలీసులు వారిని చుట్టుముట్టారు. పెద్ద సమ్మె ఘర్షణ జరిగింది. మావో వర్ధంతినాడు గాని జయంతినాడు గాని మావో విగ్రహం దగ్గరికి కార్మికులు వెళ్ళడం నిషేధించబడింది. కాని, నిషేధాజ్ఞలను ఉల్లంఘించి కార్మికులు వెళ్ళారు, పోలీసులతో ఘర్షణపడ్డారు. సెప్టెంబర్ 9, 2004న జాంగ్ జెన్‌గావో అనే కార్మిక కార్యకర్త కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వం కార్మిక వర్గ ప్రయోజనాలను విస్మరించిందని, అవినీతిలో కూరుకపోయిందని విమర్శిస్తూ ఒక కరపత్రం ప్రచురించాడు. అంతేగాక, పెట్టుబడిదారీ వ్యవస్థ పునరుద్ధరణను ఖండిస్తూ, మావో అనుసరించిన "సోషలిస్టు పంథా"కు తిరిగివెళ్ళాలని పిలుపునిచ్చాడు. పోలీసులు అతనిని, అతని సహచర రచయిత జింగ్ రుక్సాన్‌ను అరెస్టు చేసారు, వారి యిండ్లను సోదా చేశారు. వారు చైనాలో అత్యంత ప్రాముఖ్యత గలవాళ్ళయ్యారు. డిసెంబర్, 2004లో వారిని కోర్టులో విచారించినపుడు అన్ని ప్రాంతాల నుండి చాలా మంది వామపక్ష వాదులు జెంగ్‌జాన్‌కు వెళ్ళి కోర్టు బయట నిరసన ప్రదర్శనలు జరిపారు. కరపత్రాలు ప్రచురించిన వారిద్దరికీ 3సం. జైలుశిక్ష విధించబడింది. వీరితోపాటు, వీరికి కరపత్రాల రచన, ప్రింటింగ్‌లో సహాయం చేసిన గెలియింగ్ వాంగ్ జాన్క్సింక్‌లు ఉమ్మడిగా "జెంగ్ జావ్4"గా పేరొందినారు.

అమెరికాలో చొరవ తీసుకోబడ్డ ఒక విజ్ఞాపన పత్రం 200 సంతకాలతో. (చైనా నుండి వంద సంతకాలు, బయటిదేశాల నుండి వంద సంతకాలు) పై కార్యకర్తలను విడుదలచేయాలని చైనా అధ్యక్ష ప్రధానమంత్రులకు అందజేయబడ్డది. ఇది యెంతో ప్రమాదంతో కూడినది. కాని చైనా మేధావులతో, కార్యకర్తలను వారి అంతర్జాతీయ సహచరులతోను ఐక్యం చేసిన ఈ ప్రయత్నం గతంలో యెన్నడూ ఎరగంతగా వామపక్ష కార్మికులకు మద్దతు ప్రకటించింది. పై విజ్ఞాపనకు ప్రభుత్వంనేరుగా స్పందించక పోయినా, జాంగ్ రుక్సాన్‌ను అనారోగ్యకారణం పేరిట జైలు నుండి విడుదల చేసారు. కాని, ఆ విడుదలకు ఆ విజ్ఞాపన పత్రం ద్వారా వచ్చిన ఒత్తిడి మరియు వామపక్ష వెబ్‌సైట్స్ ద్వారా విస్తృత ప్రచారంలాంటి యితర సంఘీబావ ప్రకటనలు కూడా కారణాలని కొంతమంది కార్యకర్తల నమ్మకం.

ప్రభుత్వం, పార్టీ మద్దతున్న కొత్త విధానాలను కార్మికులు మౌనంగా అంగీకరించరనే విషయానికి జెంగ్‌జావ్4 ప్రాతినిధ్యం వహిస్తారు. వారు కార్యకర్తలలో కొనసాగుతున్న వామపక్ష భావజాలం, సమాజం, యితర దేశాల నుండి దినదినం పెరుగుతున్న మద్దతుకు వారు ప్రతినిధులు. కాని, ఈ సంఘటన చైనా వామపక్షాల పునరుద్ధరించబడిన బలాన్నేగాక విభేదాలను బయటపెట్టింది. ఈ విజ్ఞాపన పత్రాన్ని తయారు చేయడానికి, సంతకాలు చేయడంలో ముఖ్యంగా యువ వామపక్షవాదులు చొరవ తీసుకున్నారు. వారు కొంత వెనక్కు తగ్గిన వారి పెద్దలను విమర్శించారు. ఈ యువతరానికి, సరైన పంథాను అనుసరించడం కన్నా, పై కార్యక్రమానికి మద్దతునిచ్చిన అందరినీ కలుపుకపోవడమే ముఖ్యం. కాని, వృద్ధ వామపక్షవాదులకు గత విభేదాలు, సైద్ధాంతిక ఘర్షణలు, విధానాల విభేధాలు ఉమ్మడి చర్చకు అడ్డంకి. వారి విషయంలో నేటి నూతన పరిస్థితుల నెదుర్కొనడానికి చారిత్రక ఘర్షణలను పక్కకు నెట్టడం కష్టతరమైనది.

ఇలాంటి విభిన్న దృక్పథాలు, చైనా వామపక్షవాదులను మూడు ప్రధాన గ్రూపులుగా విడదీస్తాయి. 1. పాతతరం వామపక్షవాదులు : వీరు పార్టీ శ్రేణుల నుండి వచ్చినవారు. తొలుత కొంతమేరకైనా డెంగ్ సంస్కరణలను అంగీకరించి, ఆ తర్వాత ఆ విధానాల పెట్టుబడిదారి స్వభావం స్పష్టమవడంతో వ్యతిరేకించారు. 2.మావోయిస్టులు:- మొదటి నుండి మావో నాయకత్వం, విప్లవకాలంనాటి చైనా సోషలిస్టు పంథాకు కట్టుబడి వుండినవారు. వీరికి మద్దతు ప్రధానంగా రైతాంగంలో కార్మికులలో వుంది. 3. నయావామపక్షవాదులు పశ్చిమ దేశాల్లోని 1960 కాలం నాటి నయా వామపక్షవాదులతో పోలినవారు. ముఖ్యంగా యువతరం. వీరి కేంద్రం విశ్వ విద్యాలయాలు, నయా స్వచ్ఛంద సేవా సంస్థలు, రకరకాల మార్క్సిస్టు సిద్ధాంతాలతో, సోషియల్ డెమొక్రటిక్ ధోరణులు కల్గినవారు. కానీ, వీరు పాతతరం వామపక్షవాదులకన్నా యెక్కువగా మావో అనుచరులతో జతకట్టేవారు. అయితే వీరి మధ్య విభజన రేఖ అంత దృఢమైనది కాదు. "పాతతరం" వామపక్షవాదులు సమాజంలో అంతటా ప్రభుత్వం లోపల బయట కన్పిస్తారు. మావోయిస్టులు, నయా వామపక్షవాదులు పార్టీలో, ప్రభుత్వంలో భాగస్వాములుగా వున్నారు - వీరివి. పశ్చిమ దేశాలలోని వామపక్షవాదులతో పూర్తిగా పోల్చడం సమంజసం కాదు. వారందరికీ చైనా ప్రత్యేక లక్షణాలున్నాయి. 2001లో మాజీ రెడ్‌గార్డ్ నాయకుడొకడు జెంగ్‌జాన్‌లో ఒక అసాధారణ సమావేశం ఏర్పాటు చేశాడు. చైనాలో సంస్కరణలు ప్రారంభమయ్యాక అతను చాలా సంవత్సరాలు నిర్బంధానికి గురయ్యాడు కూడా. ఇప్పటికీ కార్యకర్తగా కొనసాగుతున్న అతని సమావేశానికి నాలుగు రకాల రాజకీయ ధోరణులు గల వారు హాజరయ్యారు. వారి మధ్య సంస్కరణల విధానాలను అంగీకరించాలా లేదా అనే విషయంలో విభేదాల పెట్టుబడిదారి విధానాన్ని పునరుద్ధరణ చేస్తున్న డెంగ్ జయాసింగ్‌ను విమర్శించే విషయంలో మాత్రం ఏకాభిప్రాయముంది.

ఈ మధ్యకాలంలోనే బహుళ ప్రాచుర్యంగల వివిధ సంస్థల, విశ్వవిద్యాలయాల ఉన్నతస్థాయి కార్యకర్తల వేదిక ఒకటి చైనా నేటి పరిస్థితిపై మార్క్సిస్టు విశ్లేషణను అభివృద్ధి పరచాలనీ సమావేశమయ్యారు. ఈ సమావేశానికి బీజింగ్ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు ప్రారంభోపన్యాసం ఇచ్చారు. ఈ సమావేశ ఏర్పాటుకు వెనుకవున్న పాత పార్టీ సభ్యులు. ఉన్నతస్థాయి మద్దతు లేకుండా ఈ సమావేశం జరిగి వుండేది. కాదని అభిప్రాయపడ్డారు. జెంగ్‌జాన్‌లో, వామపక్షాల, 'ఉదారవాదుల' (వీరు పశ్చిమ ఉదారవాదులతో పోలిస్తే చాలా ప్రగతిశీలురు) నాయకత్వంలో పైన చెప్పబడినటువంటి వేదిక ఒకటి గత దశాబ్దంగా సమావేశమవుతూ విభిన్న అభిప్రాయాలు గల వారిని ఒక దగ్గర చేరుస్తున్నది. వారందరి ఏకాభిప్రాయమేమిటంటే నేడు చైనా అనుసరిస్తున్న పంథా అధికార విధానాలు యెక్కువకాలం మనజాలవు. వారి నేపథ్యం అనుసరించే పద్ధతులు విభిన్నంగా వున్నా చాలా మంది పైన చెప్పబడిన మూడు కేటగిరిల "పాతతరం", "మావోయిస్టులు" "నయా వామపక్షవాదులు" కింద వస్తారు. వారు పార్టీ, ప్రభుత్వం లోపల, బయటా వున్నా. వారి అభిప్రాయాలేగాక, వారి వివిధ వేదికలు, సమావేశాలు, ఒకదానితో ఒకటి అంగీకరిస్తాయి, ప్రభావితం చేస్తున్నాయి కూడ. అంతేగాక, వారి భావనలను అంగీకరించని వారిని కూడా ఆకర్షిస్తున్నాయి. కొత్త స్వచ్ఛంద సేవా సంస్థలలోని కొంతమంది బలమైన వామపక్షభావాల పునాది వుంది. వారు ప్రజలకవసరమైన

పనులు, గ్రామాల్లో పాఠశాలలు నడుపడం, కార్మిక రైతాంగంచే నడవడే సొసైటీలను ప్రోత్సహించడంలాంటివి చేస్తున్నారు. వామపక్షభావాలవైపు యిలాంటి తిరుగు ప్రయాణం, కార్మిక ప్రజా ఉద్యమాలకు పెరుగుతున్న బలాన్ని సూచిస్తుంది. దానివల్ల చైనాలో సామాజిక సంక్షోభాన్ని, అది మరింత తీవ్రమయ్యే పరిస్థితిని (ప్రభుత్వం ప్రస్తుత విధానాలలో మౌలిక మార్పులు చేయకుండా) యింకెంత మాత్రం పట్టించుకోలేని పరిస్థితి వుంది. ఈ పరిస్థితి, నేడు సుదూరంగా కన్పడుతున్నా, మావోకాలంనాటి విప్లవాత్మక సోషలిజం సాధ్యమవడానికి తిరిగి తలుపుతెరుస్తూంది.

పై సూచికను కొట్టవచ్చినట్టు కన్పడే ఉదాహరణ. హు జింటావో (ప్రధాని)కు "సీనియర్ కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, కార్యకర్తలు, సైనికులు, మేధావులు" అక్టోబర్ 2004 "నేటి రాజకీయ పరిస్థితిపై మా ఆలోచనలు - అభిప్రాయాలు" పేరుతో రాసిన ఉత్తరం. జెంగ్‌జావో4 ప్రకటనతో పోలిస్తే ధ్వనిలో సరళంగా కన్పించినా, సంస్కరణను కొంతమేరకు మెచ్చుకున్నా ఉత్తర సారాంశం, ప్రకటన సారాంశంతో పోలి వుంది. దాని పిలుపు, సరిదిద్దు చర్యలు, సోషలిస్టు పంథాకు తిరిగి మరలడం, పెట్టుబడిదారీ పంథా నుండి తొలగడం లాంటివి ప్రస్తుత పరిస్థితిని తీవ్రంగా విమర్శించేవిగా వున్నాయి. పై రెండింటినీ (ప్రకటన - ఉత్తరం) మధ్య యేమైనా ప్రత్యక్ష సంబంధముందా అనే విషయం స్పష్టం కాలేదు. కాని, చైనాలో వామపక్షవాదులు జెంగ్‌జావో4కు మద్దతుగా సంతకాలు సేకరిస్తూనే వున్నారు. కొంతమంది "నయా" వామపక్షవాదులు 'మావోయిస్టు' చర్యలను సమర్థిస్తున్న విధానం, 'పాతతరం' వామపక్షవాదులు తమ విమర్శను మరింత బలంగా నెట్టడానికి అవకాశం కల్పించింది. గతకాలపు విప్లవాత్మక పోరాటాలకు చెందిన అనుభవజ్ఞులు ఈ విధంగా ప్రస్తుత విధానాలకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా బహిరంగంగా రావడం, ఉత్పన్నమవుతున్న నూతన వాతావరణానికి కొలమానంగా చెప్పవచ్చు. 1999 నాటి వరకు కూడా పాతతరపు వామపక్ష వాదులతో మేం చర్చించినపుడు, అప్పుడు నెలకొన్న సంస్కరణ పరిస్థితులలో, వారు చాలా సంయమనంగా వుండాల్సిన విషయాన్ని చెప్పారు. ప్రస్తుతం గతకాలపు నాయకులలో చాలామంది, అలాంటి స్థితిలో వున్న చాలా మంది తమ అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేయడానికి స్వేచ్ఛ పొందినట్లు ఆదుకుంటున్నాడు. కేవలం సైద్ధాంతిక విషయాల్లోనేగాక, ఆచరణతో కూడి గతం వర్తమానానికి సందేశం అందించడంగాక. ఒక తరహా వామపక్షవాదుల చర్యలు మరొకరిపై ప్రభావం చూపుతున్నాయి.

కొన్నివిషయాలలో, మావోకాలంనాటి సోషలిస్టు సంస్థలు (సంఖ్యలో కొద్దిగావున్న ప్రభావంలో మిక్కుటమైన) నేటికి ఆచరణలో వున్నాయి. అయితే నేటి మార్కెట్ వ్యవస్థ కనుగుణంగా తప్పనిసరిగా మార్పుచెందిన రూపంలో కన్పడుతాయి. ఆవిధంగా ఈనాటికి 1% గ్రామాలలో కమ్యూన్లు సజీవంగా వున్నాయి. అలాంటివి వేల సంఖ్యలో వున్నాయని చెప్పవచ్చు. మరి కొన్ని, డెంగ్ సంస్కరణలు అమలుచేసినవికూడా, తిరిగి సహకార ఉత్పత్తి వైపు మరలినాయి. అని గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రత్యామ్నాయాన్ని వెదకడంలో నమూనాలుగా నిలబడ్డాయి. సోషలిస్టు కాలంనాటి లక్ష్యాలు, పద్ధతులు నిలబెట్టుకోవడంలో ప్రధాన నమూన, హెనాన్ జిల్లాలోని 'మావో' పట్టణంగా పిలవబడుతున్న నాంజీకన్ (దక్షిణ వీధి గ్రామం). అది సహకార పద్ధతిని దాదాపు 15-20 సంవత్సరాల క్రితం మొదలుపెట్టింది. అది యిప్పటికీ సభ్యులకంతా కమ్యూన్ రూపంలో కొనసాగుతుంది. అక్కడ ఉచిత గృహ వసతి, ఆరోగ్య రక్షణ, విద్య - (యువకులకు కాలేజి ఫీజులు చెల్లించడంతో సహా) లాంటి కార్యక్రమాలు అమలవు తున్నాయి. అక్కడ సోషలిస్టు కాలంనాటి సమానత్వం అమలు చేయబడుతుంది. పరిపాలనాధికారులకు ఒక నైపుణ్యమున్న పనివారలకు వచ్చినంతవేతనమే చెల్లించబడుతుంది. అంతేగాక ఆ గ్రామం మావో రాజకీయ లక్ష్యాలకు నిబద్ధత కల్గింది. గ్రామం నిండా మావో ఫోటోలతో సహా మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్ ఫోటోలు ప్రదర్శింపబడుతున్నాయి. ఇక్కడ అన్ని సౌకర్యాలు గల గృహవసతి, శుభ్రమైన వీధులు, ఉద్యానవనాలు పిల్లలకు ఆకర్షణీయమైన పాఠశాల, పిల్లల సంరక్షణ కేంద్రం వున్నాయి. అలాంటి దృశ్యం పట్టణవాస ధనవంతుల గృహాలవద్ద తప్ప చైనాలో యెక్కడా కన్పడదు.

అలాంటి విజయాల్ని సాధించినా, నాంజికన్ గ్రామాల్లో అమలవుతున్న కార్యక్రమాల్లో చాలా వైరుధ్యాలున్నాయి. తను ద్రవ్య అవసరాలకు విదేశీ పెట్టుబడులను స్వీకరిస్తుంది. చుట్టుప్రక్కల వున్న గ్రామీణ రైతాంగాన్ని పొలం పనులకై వినియోగించు కుంటుంది. వారికి నుంచి గృహ వసతి కల్పించినా, ఆ గ్రామ కార్మికుల గృహాలతో పోలిస్తే కూలీల గృహ వసతులు పోతున్నవే ఆ పట్టణ పరిశ్రమలు పూర్తిగా నూతన పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థతో కలసిపోయాయి. అయితే, ఈ మధ్యకాలంలో నూతన, పరిచయంలేని ఉత్పత్తి రంగాలకు విస్తృతి చెందాలనుకోవడంతో ఆర్థిక ఇబ్బందులకు ఆ గ్రామం గురైందని తెలియవచ్చింది. అయితే, తనను పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థ చుట్టుముట్టడం వల్ల, నిలదొక్కుకోవడానికి, మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో పోటీ పడాల్సిరావడం వల్ల నాంజికన్ గ్రామం అలాంటి వాటి అమలు చేయాల్సినవసరం తప్పలేదు. అయినా కూడా, గ్రామీణ చైనాకు యింతర పంథా సాధ్యమని యింకా భావించేవారికి ఆ గ్రామం కేంద్ర బిందువయింది. అక్కడ సహకార ఉత్పత్తి పంపిణీ యెలా జరుగుతుందో తెలుసు కొనడానికి యెంతో మంది రైతులు, కార్మికులు ప్రతిరోజు ఆ గ్రామానికి వెళుతుంటారు అంతేగాక, అది హెనాన్ జిల్లా అధికారుల మద్దతు పొందింది. 2004లో హుజింటాకు వామపక్ష కార్యకర్తలు రాసిన ఉత్తరంలో నాన్‌జికన్‌ను ఒక ఆదర్శగ్రామంగా పేర్కొన్నారు. అలా మావోకాలపు వారసత్వం ప్రధాన... కాని చోట కూడా, ఆ కాలంనాటి అనుభవాలు, భావనలు నేపథ్యంలో వుండనే వున్నాయి. ఆనాటి పరిస్థితులలో నేటి పరిస్థితులను తరచుగా పోలుస్తున్నారు, విశ్లేషిస్తున్నారు.

(మిగతా వచ్చేసంచికలో...)

(....16వ పేజి తరువాయి)

రాస్తూనే. అంతే కాని ఉచ్చారణే మాండలిక భాష ప్రత్యేకత అనుకోకూడదు. అలాగనుకుంటే మాండలికం పేరుతో ఉచ్చరణ దోషాలకు మాత్రమే ప్రాధాన్యత వస్తుంది". (సాహిత్యవ్యాసాలు)

"మార్క్సిస్టు పద్ధతిని అనుసరిస్తున్న చాలామంది విమర్శకుల్లో తాను అనుసరిస్తున్నదే సరియైన మార్క్సిస్టు మార్గమని, ఇతరులది కానే కాదనే తత్వముంది. కాబట్టి వీరు (తెలుగు మార్క్సిస్టు విమర్శకులు) సమిష్టి ప్రయోజనం కంటే తమ గుంపు ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. మరికొందరు మార్క్సిస్టు తత్వశాస్త్రానికి, మార్క్సిస్టు సాహిత్య శాస్త్రానికి రాజకీయాలకు, సాహిత్యానికి ఉన్న సరిహద్దులకు చెరిపేస్తున్నారు. (సాహిత్యవ్యాసాలు)

"సాహిత్యవిమర్శ ఎంతో బాధ్యతాయుతమైన మనిశితమైన కార్యక్రమం. అదొక సామాజిక బాధ్యతకూడా. అందుచేత ఎన్నో కటువైన సత్యాలను సాహిత్య విమర్శకుడు చెప్ప వలసి వస్తుంది. ఒకవైపున ముతకవాదాలకూ, మరొక వైపున మొహమాటాలకు లొంగిపోకుండా తన్నుతాను రక్షించుకోవాలి. సాహిత్య విమర్శ ఇలా అసిధారావ్రతంలా కొనసాగించినపుడు మాత్రమే సాహిత్యానికి దోహదం, సమాజానికి చైతన్యం. (సాహిత్యవ్యాసాలు)

వల్లంపాటి స్థానానికి సంబంధించిన చర్చకు యిది ఒక చిన్న ఆరంభం. ఆయన రచనల్లోని నిష్కాపట్యాన్ని, నిష్కర్షతనూ తేలికగా గుర్తుపట్టవచ్చు. అది ఒక కొలబద్దగా తీసుకుంటే, ఆయన రచనలమీద యింక చాలా చర్చ జరగాలి. దాని ఫలితంగా సాహిత్యానికి ఉద్యమ స్వభావంతో బాటు ఆ సాహిత్యకారుని స్వంత వివేచనకు యివ్వవల్లసిన ప్రాధాన్యత మీద వెలుతురు ప్రసరిస్తుంది. విమర్శ ఎదుగుతుంది. దాని ద్వారా ఆధునిక తెలుగు సాహిత్యకారుడు స్వంతవివేచనతో సామాజిక సంవేదన వల్ల వ్యక్తీకరణలో క్రియాశీల [illegible] గలడని నేను నమ్ముతున్నాను. *

కవిత్వం

జంపన్న కవిత

కొనసాగింపు

అతడూ ఆమే ప్రయాణంలో
మార్గమూ స్పష్టమే లక్ష్యమూ స్పష్టమే
దారి మాత్రం సుదూరం
ఇద్దరిదీ ఒకేదారి
నడకలోనే తేడాలు
ముందూ వెనకా
ఇంకెంత....
ఈ మజిలీ పూర్తికానీ
రెక్కలు కట్టుకొని నీ ముందు వాలడూ
వెన్నెల జాలువారుతోన్న చూపుల్తో చేతిలో చేయి వేస్తాడతను
ఆ వెన్నెలను మది నిండా నింపుకుంటుందామె
వొస్తాడు అతనొస్తాడు
విజయహాసంతో అతనొస్తాడు
వొస్తాడు అతనొస్తాడు
వసంతం కోసం వేచి చూసే ప్రకృతి లాగే
వొళ్లంతా కళ్లు చేసుకుంటుందామె
ఎదురుచూపుల కనురెప్పలపై
డేగరెక్కల నీలినీడలు
ఉలిక్కిపడి చూస్తే
వికటాట్టహాసం చేస్తూ డాలర్ మొఖం!
పైశాచికానందంతో నాట్యమాడుతూ ఉక్కుపాదాలు!!
ఆమె ముందు సమస్త ప్రపంచమూ అస్తిత్వాన్ని కోల్పోతుంది
సమస్త భూగోళమూ చీకటి ముద్దలా మారుతుంది
భూమి నడి మధ్యనా?...
ఎడారి మధ్యనా ?
సప్త సముద్రాల మధ్యనా?
అగాధం మధ్యనా?
ఏమో
ఏదీ అర్థంకాని శూన్యంలో తానొక్కర్తే మిగులుతుంది
ఒకర్తి కూడా కాదు తనలోని సగభాగం చచ్చుబడినట్లు
తన ఉనికెక్కడో పారేసుకున్నట్టు...
అతనిక రాడు!
ఎన్ని భాషల్ని శోధించినా ఇంతకు మించిన కఠిన పదాలుంటాయా?
ఆ భావాన్ని స్వీకరించకలేక మనసు శూన్యమవుతుంది
ఆ మాటల అర్థం తాకి హృదయం ముక్కలవుతుంది.

* * *

రెపరెపల సవ్వడిని మోసుకొస్తూ
తూర్పు పవనం ఆమె తల నిమురుతూ సాగిపోతుంది
తలెత్తి చూస్తే రెపరెపలాడే ఎర్రని జెండా
ఎప్పటి కంటే మరింత ప్రకాశవంతంగా
మాయమయిందనుకున్న 'విజయహాసం పలుకరించినట్టుగా
జెండాను దృఢంగా భుజానికెత్తుకుంటుందామె
ఉక్కుపాదాల్ని ధిక్కరిస్తూ
ప్రజాగెరిల్లా సైన్యంతో కదం కలుపుతూ
వెనకల సైన్యం తానే అవుతూ
లక్ష్యం వైపు సాగిపోతూ...
(మార్చి 8, 2004న ఒరిస్సా రాష్ట్రం కొరియా ప్రాంతంలో జరిగిన 'ఎన్‌కౌంటర్లో'
అమరుడైన కా.శశి స్మృతిలో అతని సహచరి కోసం) *

[illegible]

మరణం అంచులమీద

ఇప్ప సారా మస్తుగా లాగించి
వన్‌బై సెవెంటి చట్టం
గిరిజన బిడ్డలను గేలిచేస్తూ
చట్టసభల్లో
చిత్తడి చిత్తడిగా చిందులేస్తూంది

సినిడైనమేట్ పేలుడు దెబ్బకి
కోయగుంపుల్లోని
రేలాపాటలు పెరమకోక్
ఫటా ఫట్

ఏబై మూడు ఎనభై ఆరులో
విలవిలలాడిన వింజరానికి
అభయ హస్తాన్నిస్తానంటున్న సర్కారు
మరింత
ముంపులోకి ముంచే ప్రయత్నం చేస్తోంది

ముంపులో మునిగిపోతున్న కూనవరం
ఎటువైపు వొరగాలో
చింతూరు చెట్టు చేమలే చెప్పాలి

విఆర్ పురం విలుకాడు
ఏకలవ్యుడు కాదు
బొటనవేలు కోరగానే కోసివ్వడానికి

వేలేరుపాడు వెంకటాపురం
కుక్కునూరు దుమ్ముగూడెం
భద్రాచలం అడవి బిడ్డలు
పోలవరం పోరులో
విల్లంబు లెక్కు పెట్టటానికి సిద్ధమవుతున్నా
సుత్తికొడవలిపై 'నక్షత్రం'

సారంలేని ఉద్యమంతో
పైపైనే హత్తుకుంటూ
లోలోన వారి ఆశయాన్ని అవహేళన చేస్తు
దండులో వెనకే నిలబడి
ఉస్కొ ఉస్కొ అంటూంది

చెట్టుపుట్ట
గాలి నీరు
చేలు సేద్యం
జీవితంతో మమేకమైన వాటిని విడదీస్తూ
తాయిలాల తుంపరలో తడిపేస్తు
మరణం అంచుల మీదకి నెడుతున్న
ప్రపంచ బ్యాంకు పాలేరు గాడు
బహుళ జాతి కంపెనీలకు బాటలు వేస్తూ
ప్రజా శత్రువై
సింహాసనం మీద వూరేగుతున్నాడు.

కోయ సాంప్రదాయ నృత్యాన్ని వారిభాషలో పెరమకోక్ అంటారు

గమ్యం చేరకుండానే

అద్దం లేకుండా
మనముఖం మనం చూసుకోగలమా!

పాము పడగనీడ కింద
ఒక్క ఘడియైనా గడపగలమా!

తుమ్మ వనంలో
ఎన్నటికైనా
ముళ్ళు లేని బాట వుంటుందా !

ఓజోన్ పొర పలుచనయ్యాక
వాతావరణమే వేడెక్కింది

మనిషి ఆయుధమయ్యాక
మాయాజాలంలో మునిగితేలుతున్న
మాటలు నేర్చిన చిలుకలో
సాలెపురుగు రూపం బహిర్గతమయిందిగదా

రక్షణ వలయం లేకుండా
క్రూరమృగం పక్కన
అతి నమ్మకంగా నిద్రించాలనుకోవడం
ఎంత అమాయకత్వం

ఎన్నో తూటాల గాయాల్ని తట్టుకుని
ఏపుగా పెంచుకున్న వనాన్ని
శ్వాసని ప్రేమించడం తెలియని
ఇనుపగొడ్డలి పదును కింద పేరిస్తే
అడ్డంగా నరికేస్తుందే గాని
ఒడిలో పెట్టుకొని
మృదువుగా స్పృజించదుగదా

చీకటిని చీల్చుకుంటు పోతున్న ప్రయాణంలో
గమ్యం చేరకుండానే
పొద్దున మజిలి చేసి
తూరుపు దిక్కు తెల్లబడక ముందే
నమ్ముకున్న నక్షత్రాలను వెంటబెట్టుకుని
మరలా చీకటి గుహలోకి పోతానంటుంటే ఎలా?

ప్రచండ పోకడలకు వ్యతిరేకంగా *

[illegible] కవిత

మనకాలం వీరుడు

ముసుగులు తొలగించండి
ముసుగులు
నాపై ఏ కఫన్ గుడ్డ కప్పొద్దు
నగ్నంగా ఉరికొయ్యకు వేలాడుతూ
న్యాయాన్ని ఎలుగెత్తి చాటుతాను
కనులు విప్పార్చి చూడండి
నా మొఖంలోకి
మీ పసిపిల్లల పాలుగారే చెక్కిళ్ళు
ప్రతిఫలిస్తుంటాయి
మా పసికూనల ఉసురు తీసినవాడ్ని
వెంటాడటమే నా నేరం
క్షతగాత్రుల ఆక్రందనలను నేల
నాలుగు చెరుగులా విన్పించడమే నా నేరం
నా మాతృభూమి స్తన్యంలోని చమురు పాలను
దొంగిలించిన వాడ్ని
దండించడమే నా నేరం
మా మెసపటోమియా ఎద్దును
చంపి తిన్నవాడ్ని పాతరెయ్యడానికి
సమాధి తవ్వడమే నా నేరం
మా కాందహార్ గుహల్ని ఆక్రమించిన వాడ్ని
కదనరంగంలో సవాల్ చేయడమే నా నేరం
పాలస్తీనా తల్లుల పేగుబంధాన్ని
తెంచిన వాడ్ని హలాల్ చేయడానికి
చురకత్తులు నూరడమే నా నేరం
వాడి దొంగ పేట్రియాట్స్‌కు
స్కడ్స్‌తో సమాధానం చెప్పడమే నా నేరం
నేను సద్దామ్‌ను
నేను సర్వసత్తాక ఇరాక్ ప్రజల అధ్యక్షుణ్ని
నా చివరి శ్వాస ఇసుక తుఫానై
వాడ్ని వెంటాడుతుంది. *

[illegible]

నందిగ్రామ్

మట్టి
మనిషి
భూమి
బువ్వ
వొకవర్తమానం
వొకభూతకాలం
వొక భవిష్యత్తు
భూ కక్ష్యలోనే
కాలపరిభ్రమణం

నక్సల్బరి నుండి
నందిగ్రామ్ దాక
భూమే
కథానాయిక!
భూమే
ఉద్యమాలకు ప్రాణంపోసే
గర్భసంచి!!

భూమంటే బతుకు
భూమంటే బంగారం
భూమంటే భుక్తి
భూమంటే ఆధిపత్యం
భూమంటే రాజ్యం
భూమంటే మహాభారతం
భూమంటే యుద్ధ చరిత్ర
భూమంటే మనిషి పరిణామం
రక్తం కొలిచిన భూమి పిండితే
రత్నాలు రాలే భూమే
ప్రేమల్ని కడుపుతీపుల్ని పంచే
పేగుబంధం!
మల్టీనేషనల్ మీద ప్రేమతో
పాలక ప్రతిపక్ష హిరణ్యాక్షులు
ప్రజల పాటపాడే
ప్రపంచీకరణ ఎర్రప్రియులు
పేద పంట భూముల ప్రాణాల మీదకు
పరుగులు పెడ్తుంటే
మెతుకుగాలిలో వేలాడ్తోంది!
బతికినకాలం
ఒడిసిన చెమటంతా
చతురస్రమో
దీర్ఘచతురస్రమో
భూమిపొతల్లోకి
దుఃఖక్లేశ నాలికలు విస్తరించి
ఒక డబ్బు బెబ్బులినవ్వుల మీద మాట్లాడే
ప్రత్యేక ఆర్థిక మండలి
అభివృద్ధి
అర్థాకలి కడుపునే
తొవ్వి పోయాలనుకుంటునప్పుడు
ఒళ్ళంతా
కందకాలు కందకాలుగా
తొవ్వుకొని
నందిగ్రామ్
పంటభూమి చుట్టూ
కంటికి రెప్పైంది
భూమి తల్లిని
ఒళ్ళో దాచుకొని
ఒళ్ళును యుద్ధానికప్పగించింది.
స్వదేశంలోని
విదేశం కాపలాయుధానికి
స్వదేశంలో
స్వతంత్ర విదేశ కాందిశీక నేల కోసం
పంట భూమిలాక్కోవడమంటే
వేర్లు మట్టిలో ఉన్న వాని
ప్రాణాలు లాక్కోవడమే!
భూమి గుంజుకోవడమంటే
మట్టిబుక్క బతికే వాని
బువ్వ నిషేధించడమే!

భూమికోసం
మమకార రక్తతర్పణంతో
మట్టి శిరసెత్తుతోంది
మట్టిమనిషి కోసం
పంటభూములు
పచ్చి నెత్తుటి సంద్రాలైయ్యాయి
హల్దినదిలోకి
ఆకలి శవాలు కాల్వలయ్యాయి
ఓట్ల మార్పిస్టు
ఒగలమారి ప్రేమ వలేసి
కూలి భూమి
కూలిరైతు భూమి
కోరి కోరి
కోటానుకోట్ల
కోటుతో
మూడుముళ్ళేస్తూ
పారిశ్రామిక ప్రపంచీకరణ
పాప్ గీతాల ప్యాకేజీతో
కడుపు నింపే మట్టి మీద
కడుపు నిండా ప్రేమలున్నోన్ని
కబేళాకు పంపుతుంటే
నయా పారిశ్రామిక జంతర్‌మంతర్
జమీందార్ల
నయవంచక శిఖండిపై
నందిగ్రామ్ చెకుముకిరాళ్ళ మందిగ్రామ్
నోరునెత్తిన పెట్టుకుంది
నర్మగర్భకలల
నయా ఈస్టిండియా కంపెనీల
నాటకరంగం మీది
నవభారత నిర్మాతల తోలు బొమ్మలాట
నగ్న రూపాన్ని
నందిగ్రామ్ పాడింది

భారతంనుండి
భవిష్యత్తు క్కూడా
భూమే
పోరాటాల భుజస్కంధాల మీద
వెలుగుతున్న ఎజెండాని
నిలువెల్లా
నినాదమైంది నందిగ్రామ్

మట్టి
మా ప్రాణం
మట్టి
మా దేహం
మా యుద్ధంలో
భూమే
మా అస్త్రం
మా శస్త్రం
మందీగ్రామ్
నందీగ్రామ్

నోయిడా అమీన్లు

అగుపించే
ఇల్లిల్లూ
అమ్మఒడే!

ప్రపంచమంతా
పాలబువ్వలా కన్పిస్తుంది

నవ్వుల ముఖాలన్నీ
చేతికందిన
చందమామలే!

సూర్యుడితో లేవడం
సూర్యుడితో నిద్రపోవడం
ఒక రాహువు తెలియదు
ఒక కేతువు తెలియదు
గాలిలా వీస్తారు
పువ్వులా నవ్వుతారు
చిలకల్లా పలుకుతారు
విధికొమ్మ మీద వాలి
విడిచిన బాణంలా జారుతారు

వాళ్ళు
నడిచే వెన్నముద్దలు
నవ్వే పాలకోవలు

వాళ్ళకు
అనుమానం గుర్తించే
తుచికల్లేవ్!

వెన్నెల జిలుగుతో
పన్నిన చాక్లెట్ల సాలెగూట్లో
చిక్కిన తూనీగలు వాళ్ళు!

రాత్రమ్మమ్మ
రాక్షసుని కథ చెప్పింది
కాని
మనిషిని తినేసే
మనిషి కథ చెప్పడం
తరతరాలుగా
మరిచిపోయింది

కసిదీరని కత్తై
గొంతు తొవ్వే గొడ్డలై
మైఖేల్ జాక్సన్లు
యిడీ అమీన్లు
యిండ్ల మధ్యనోళ్ళు తెరిచి
మొగ్గల మీద
దొర్లి దొర్లి
ఒక్కొక్క
గులాబిరేకులా
చీల్చుకొని
కడుపు నింపుకొన్నాక
కండ్లు కార్జాలు కిడ్నీలు
కార్పొరేట్ అంగడి వస్తువైనప్పుడు

ఇల్లు
పసి అడుగుల జాడ లేక
కన్నీళ్ళ కొలనవుతుంది
కాలగర్భం చీల్చుకొని
ముక్కు పచ్చలారని బొక్కలు
నెత్తుటినాళాలైన పసిగుడ్డలు
నిఠారికాల్వలోంచి
నిజాల వృక్షాలై లేచాయ్
ఇవ్వాళ
నోయిడా
ఒక తల్లుల తిరుగుబాటు
ఒక కడుపు తీపి కసాయి రాజ్యాం యుద్ధ భూమి
ఇవ్వాళ
నోయిడా
సామ్రాజ్యవాద సాంస్కృతిక
దుష్పరిమళాల విష దృశ్యకళ

అనగనగా భూమి కథ

మనిషీ మనిషీ!
ఆకలిచావెందుకయ్యావ్?
కైకిలి
కడుపు నింపలేదు!

కైకిలీ! కైకిలీ!!
కడుపు మీద నీళ్ళెందుకు చల్లలేదు?
పంట ఆకలి మందు
కైకిలి మనిషిదికాదు!

పంటా! పంటా!
ఆకలి కైకిలికెందుకు చెందవ్?
సృష్టి చెమట మాత్రమే
ఆకలి మనిషిది!

చెమటా! చెమటా!!
నీ ఫలం నీ కడుపెందుకు నింపదు?
కరిగే నెత్తురు నాది
భూమి కాదు!

భూమీ! భూమీ!
చిందిన చెమటకు ఎందుకు దక్కవు?
బానిస చాకిరి తప్ప
చెమట చట్టం చేయదు1

చట్టం! చట్టం!
చెమటెందుకు నీ కూపిరి పోయదు?
రాజ్యాధికార రాజకీయం
రంకు బొంకులు రావ్!
రాజ్యాధికార రాజకీయం!

రాజ్యాధికార రాజకీయం!
రాజ్యాధికార రాజకీయం!
సృష్టికర్తనెందుకు చేరదీయవ్?
ఖద్దరుధారి రాబందు
నా కడుపు పంట!
ఖద్దరు రాబందు! ఖద్దరు రాబందు!
చెమటెందుకు చిమ్మటీయవ్?
ఆక్రమణ విద్యకు
అధిపతిని జనపతిని

ఆక్రమణవిద్య! ఆక్రమణ విద్య!
అసలు కథేందో చెప్పు?
కంచెవేసి చేను వేసేది ఖద్దరు రాబందే!
చేనుమేసి కంచెవేసేది రాబందే!

2

మట్టి గోరింట ముద్ద
ముట్టని చేతులు
బురదబూట్ల
బురకేయని కాళ్ళు
మట్టి పువ్వులవాసన
చుట్టరికమే లేదు
దుబ్బ తూనీగ
దుస్తుల మీదా వాలదు

సుడిగాలి సుతారికట్టిన
మట్టి స్తంభంలో
సుడితిరిగిన స్పర్శే లేదు

నీటికౌగిలిలో కరిగిపోయి
మట్టివీచే పరిమళాలు
మనసుకు పడనోడు
మనిషి వీచే పరిమళాలు
మనసుకు పడనోడు
భూమిని
చాపచుట్టుకొని
బొర్రలోపల పెట్టుకొని

సత్యవాక్కుల బొడ్డుమల్లెలు
చంపి చంపి చల్లుకుంటూ
రాజకీయ రాక్షసుడు
రాజ్యమై
భూ సంస్కరణల భూతాలమ్రి
మాయాజాలంమీంచి
వీరొక్క భూముల చిటారు కొమ్మల
మిఠాయి పొట్లాన్ని
పాండవులు
చంపి వెళ్ళిన దారంతా నెత్తురు చేసి
తిరిగిరాని చర్చకు వెబ్‌సైట్ తెరిచి
చెమట నోటికి కూటికి
చెదిరిన సంబంధాల చరిత్రకు
స్వర్ణహరిత కిరీటం
పెడుతోంది పెను చీకట్లు చిమ్ముతూ

సాల్వజుడుం :
ఒక అశాంతి యాత్ర

జీవనదైపోయిన ఆకునే
జల పిడచగట్టిన ఆకు
ఆయుధమై
పోటాడుతోంది పాలిపగలా

జీవితం వెలుగుతున్న పువ్వునే
జీవం విరిగిన విరి
పుచ్చెగరగొట్టాలని చూస్తోంది
బలి రుచి మరిగిన తల్వార్లా -

పచ్చదనం పరిమళించిన చెట్టునే
పాలిపోయిన చెట్టు
మట్టుబెడుతోంది
మహా శత్రువులా -

మన్యకొలను
మర ఏనుగులు తొక్కాయ్
తెల్ల నిప్పుల పాలకపావురం
కొప్పుల బహుళ జాతి విషజ్వాలలతో
ఆదిమ జీవితానికి
ఆఖరికొరివి పెడుతోంది

ఇవ్వాళ శాంతియాత్రంటే
ఆకలి పాతాన్ని
ఆకలి కళ్ళే చిదపడం

ఇవ్వాళ శాంతియాత్రంటే
ఆదిమ చెమట గూడు కడుపుల
మట్టి గొట్టడం

ఇవ్వాళ శాంతియాత్రంటే

మట్టి దుఃఖపుకళ్ళల్లో
మృత్యువు చిత్రికపట్టడం
నేలను
చీల్చుకొని లేచిన
అగ్ని కడిగిన కలల పరిమళం
పీయడం

వేయి కన్నుల గోచిగుడ్డ
జీవితమై వెలిగి
పాదధూళి పరవశించడం

నేరమై
నెత్తిమాసిన మట్టి బిడ్డను
కౌగిలించుకొంది

గడుకం బలి గరక పోచల
నలిగిన
గజ్జెల సవ్వడి సుడిగాలి
విరిగిన వెదురు వనాల
మట్టిదరువు ఉరుములు
గొంగడి భుజానేస్కొని
ఒక అనాగరిక చంద్రుడు
వెన్నెల పాటల్లో
సూర్య శిఖల్ని ప్రవహించడం
ఒక ఆదిమ చెట్టు నవ్వులు
క్షుద్ర విలాస వ్యసన పాలన
విలవిల్లాడేలా విరాజిల్లడం
నేరావరణమైంది

ప్రాణాలు
మానాలు మింగే
పునరావాస ఇనుప శిబిరపు క్రూరమృగం
అడవి గుండె మీద
కళ్ళు తెరిచింది

నోటి నిండా
నెత్తురు తాగుతూనే
నెత్తిమీద
అంటరాని శాంతి నెత్తుకొంది

ఒక ఎడ్డి పోడు భూమి
పొద్దు పొడిచి
పండిన చెట్టులా
పకపకానవ్వి
మహా సింధువు కోసం
మంచు బిందు జతకట్టడం
నెర్రెలు బడ్డ చరిత్రకు
కంట్లో
కారమైంది

సంప్రదాయ ఆర్థిక ఆహార చక్రం

ముక్కలు చేసి
సప్తసముద్రాల విస్తార దుఃఖాల్ని
ముల్లెగట్టుకొన్న
కరడుగట్టిన సంతకాల
గద్దకన్ను
ఇద్దరు చూపులతోనే
భూగర్భంలో చొరబడ్డ
ముట్టడిలో
అజాతశత్రువుల అడవి పుత్రులు
అఖిల భారత రాజ్యానికి
అమెరికా రాజ్యానికి
ఆగర్భ శత్రువులై పోయారు

మట్టి మహా పుస్తకమై
పిట్టలు పుటలై
జంతువృక్షజాల -
జాజ్వల్యమానక్షరాలై
చలిస్తుంటే -
చదువుతున్న మనిషి
చరిత్రను మండించే గోళమై
విపన్న వదనం
విద్యుద్దీకరించబడి
మలయమారుతమానవీయ
స్పర్శై ఉదయించి
ప్రకృతి పరిణామం
నెమలిపింఛంలా విచ్చుకొని
చెమట తడ్సిన మట్టి
మనిషై మొలవడం
బురద తడ్సిన మనిషి
మట్టై పూయడం
మళ్ళీ మళ్ళీ మొలవడం
మళ్ళీ మళ్ళీ పూయడం
ఒక ఎర్రని విశ్వాసం తోడుగా
దుఃఖమే
పక్షై
సేంద్రియ ఎరువై
బతుకు పచ్చబడ్తోంటే -
ఒక మానవ కవచం తొడుక్కొని
శాంతి యాత్ర రాజ్యం చేతిలో
ఒక కీలుబొమ్మ పావురమైంది

చేపల కొలనులో
రాజ్యం
ఆకలిగొన్న మొసలి
సల్వాజుడుం
తప్పదు
చెట్టు పుట్ట పిట్టగుట్ట
జీవి నిర్జీవి అడవి అడివంతా
ఆయుధమై
ఉక్కుశాంతి యాత్రకు
ఉప్పెనలా ఎదురీదాల్సిందే
*

కె.రెడ్డెప్ప కవితలు రెండు

రాత్రి నిద్రపోయింది

రాత్రులు నాకు నిద్రపట్టదు
గాయాల శబ్దాలు విశ్రమించవు
నన్ను నిద్రపోనివ్వవు
కురవని మేఘంలా
పగలని నిశ్శబ్దంలా
హృదయ స్పందనకు అందకుండా
ముగ్గవిచ్చుకున్నంత
స్వేచ్ఛగా, నిశ్శబ్దంగా
అప్పుడే మేలుకున్న పక్షిలా
నిద్ర ఎటో వెళ్ళిపోయింది
నా కళ్ళు గాయపడ్డాయి.
నా శ్వాస గాయపడింది
అర్ధరాత్రి గడియారం కెలికింది.
దూరంగా తీతువు కూత
గుండెను ముక్కలు చేసింది
ఇళ్ళన్నీ కళ్లు మూసుకొని
నిద్రపోతున్నాయి.
నిద్రను రాత్రులు వెతికి
వెతికి విసిగిపోయాను.
నిద్ర అదృశ్యరూపంలో వుంటూ
నాతో ఆటాడుకుంటూ వుందేమో.
నా చూపులకు దొరక్కుండా
దోబూచులాడుతూ వుందేమో
నా ఆలోచనలకు విసిగిపోయి
కసి తీర్చుకుంటూ వుందేమో
మదిలో రగిలే ఉద్వేగాల సవ్వడికి
కిటికీలో నిద్రపోతున్న పిచ్చుకయి
భయంతో ఎగిరిపోయిన
స్వప్నమయింది.

అదృశ్యం

అక్కడే...
ఆ చెట్టు చల్లని నీడలో
అమ్మ కొసరి కొసరి
గోరు ముద్దలు తినిపించేది.
నాన్న బుడి బుడి నడకలు
నేర్పింది అక్కడే.
నాన్నమ్మతో కబుర్లూ అక్కడే.
తాతయ్యతో ఆటలూ అక్కడే
ఉదయాస్తమయ వేళల్లో
పక్షుల పాటలు అక్కడే
అమృతం వంటి ఫలాలు
అందించింది అక్కడే
ఆ చెట్టొక్కటి అలసిన వేళ
తల్లిలా సేదతీర్చేది
కొమ్మల సందుల్లో చంద్రుని చూపించి
కథలు చెప్పింది అక్కడే.
బడికి వెళుతుంటే
రెమ్మలతో టాటా చెప్పేది
పయనమై వెళుతుంటే
కొమ్మలతో ఆశీర్వదించేది
అటువంటి చెట్టు తల్లి
ఇపుడు అక్కడ లేదు.
ఒంటరి తనాన్ని
నాకు కానుకగా ఇచ్చి
అదృశ్యమైంది

*

శ్రీమన్నా కవిత

వెన్నెముక

శరీరాన్నంతా ఉక్కు కడ్డీలా మల్చి
రక్తాన్నంతా మరగించి
నరాలు బిగపటి
ఉచ్ఛ్వాస, నిశ్వాసల మధ్య
గుడ్డి వెలుతురులో
చెమటలు చిందిస్తూ
నల్లబంగారాన్ని తవ్వితీసి,
శరీరాన్ని ఓ ప్రభుత్వాసుపత్రి చేసుకొని
షాన్, నిషాన్‌ల మధ్య సర్వసుఖాలను
అనుభవిస్తున్న మాకు
మీరే వెన్నెముక
మిమ్మల్ని మరవడమంటే
మమ్మల్ని మేము మరిచినట్లే
మిమ్మల్ని యాది చేసుకోకపోతే
మా బతుకుల్ని బూడిద చేసుకున్నట్లే

*

ఉదయగీతిక కవిత

ప్రజల మనుషులు

ఓ అల్లూరి సీతారామరాజు టు
.... ఓ ఆల్వాలా సారయ్య (మధు)
వాళ్లు పత్రాల్లాంటివారు
అవి పత్రహరితాన్ని
త్యాగం చేసి ప్రజలకు ప్రాణవాయువునిస్తాయి
వాళ్ళు జీవితాలను
త్యాగం చేసి
ప్రజలకోసం ప్రాణవాయువు నిడిచాయి.
అవి నేల రాలుతాయి. పర్యావరణ హింసలో
చిగురిస్తాయి అదే స్థానంలో గుబురుగా...

వాళ్ళు నేలకొరిగారు - రాజ్యహింసలో
పునః జన్మిస్తారు వేలాది పూరిగుడిసెల్లో
'మధు' వరంగల్ ఖమ్మం డివిజన్ కమిటీ సభ్యుడు

పిన్నక శ్రీనివాస్ కవిత

అరుంధతి నక్షత్రం

జంబు ద్వీపం
హిమపాత మానస సరోవరం
వొంపు సొంపుల సంపంగి
సువాసనల లోగిళ్లలో
సప్తసింధు నది
అంటరాని పాయల
గుహలలో శమంతకమణి
విరజిమ్మే వెలుతురు
చినుకుల చిత్తడిలో
పులకరించిన
పుత్తడి ముత్తాత
జాంబవంతుడు
పౌరుషంతో మీసం మేలేస్తూ
అస్తిత్వ ఆయుధంతో
మండే గుండె తొప్పెట మోగిస్తూ
ఉత్తేజంతో చిందులేస్తూ
నిచ్చెనమెట్ల కులవ్యవస్థలోకి
నరనరాన ఇంకిన
బ్రాహ్మణతత్వాన్ని
ధ్వంసం చేస్తూ
చాతుర్వర్ణ వ్యవస్థను
చీల్చి చెండాడి
మాయవాద
కర్మ పునర్జన్మ
తర్క కుతర్క
తాత్వికతను
గుట్టురట్టు చేసి
నాగేటి సాలులన్నింటిని
పాటెత్తిన ప్రవాహంతో
తడుపుతూ
ఉమ్మడి దిగుబడిని
సమానంగా పంచుకుంటూ
స్వయంపోషక
గ్రామీణ వ్యవస్థను
దురాక్రమించిన
ఆర్యావర్త
హిందుత్వ కోటల
పరాన్న భుక్కుల
కులాధిపత్యాన్ని
భూస్థాపితం చేస్తూ
శ్రామిక కుల వర్గ సంస్కృతిని
ఆవిష్కరిస్తూ
ప్రసరించే కాంతి ప్రవాహమే
మేరు పర్వతమే
అరుంధతి నక్షత్రం

*

ఎం.ఎ. బాసిత్ కవిత

అయినా నేనొక నవాబును

ఇంట్లో తిండి గింజలు అసలే లేవు
బయటెక్కడా....
ఇంకో ఖజానా లేదు
అయినా నేనొక నవాబును!
ఒంటి మీద
చిరుగులు లేని చొక్కాలేదు....
ఇంకొక లుంగీ
అదనంగా లేదు....
అయినా (అయితేనేం) నేనొక నవాబును!
కప్పు మీద - పగిలి విరిగిన పెంకులు
గోడల మీద... మరకలైన దానీమా ఉమ్మిన జర్దా
దర్వాజకు వేళ్ళాడే.... చినిగి ఛిద్రమైన పరదా
మూసేసినగది.... సూర్య, చంద్రాదుల
సమావేశ మందిరము
అయినా నేనొక నవాబును!
తలమీద
బాధ్యతల బరువు...
రంగు నీళ్ళమ్ముకోవడమె
బతుకు తెరువు
అయినా నేనొక నవాబును!
గుండెలమీది కుంపటయ్యింది
పెరిగి పెద్దదైన బిడ్డ!
ఎన్ని యాతనలు పడ్డా....
దొరకదు రోజూ రొట్టె ముక్క!
అయినా నేనొక నవాబును!
ఇంట్లో.... మసీదులో
మదర్సాలోనే కదా, నా ఉర్దూ....
చెల్లదు కదా, సర్కారు బడిలో....
ఎందుకంటె, నేనున్నది హిందూ దేశంలో కద!
మెజారిటీ ప్రజల
ఆకాంక్షల కోసం....
బలిపెట్టవలసిందే కదా,
నా హృదయాకాంక్ష!
ఎందుకంటె, నేనున్నది హిందూ దేశంలో కదా!
ఏమని చెప్పనూ... నాకెదురయ్యే ఇక్కట్లు....
కలలో, మదిలో మెదిలేదేమో నా భాష!
బడి పుస్తకాల్లోనేమో ఏదో వేరే భాష!
ఎందుకంటె...
నేనున్నది హిందూదేశంలో కదా!
తెలుసుకోలేను....
సమాజ శాస్త్ర నియమాలు
తలకెక్కించుకోలేను....
గణిత విజ్ఞా శాస్త్రాల పరిజ్ఞానాన్ని
సర్కారి కొలువు లేదు నా తలరాతలో...
ఎందుకంటె...
నేనున్నది హిందూ దేశంలో కద!
అంతేకాదు...
రిజర్వేషన్ వాటా
నాకు దక్కడం న్యాయం కాదు...
ఎందుకంటె, నేను గరీబును కానే కాదుకద!
సచార్ కమిటి
విషయమొకటి... బయట పెట్టింది
మాల మాదిగల కంటె.... వెనక్కి నెట్టబడ్డానంది
అయినా తేడాలేదు... నేనొక నవాబునే!
ఇంకొక్క తీపి చేదు కబురు...
ఇంపుగానె చెప్పింది...
'ప్రజాస్వామ్య' పద్మవ్యూహం....
నన్నొక ఓటు బ్యాంకు మూటను చేసినదంది
రకరకాల స్కీముల రంగుల రాట్నంలో
గంతలు కట్టేసింది సర్కారు నా కళ్లకు
'రాజకీయ స్కీముల్లో.... నాకు బర్కత్ లేదంది'
అయినా సరే...
నాకు 'రిజర్వేషన్ భిక్షం' దక్కరాదంది
ఎందుకంటె.... నేను నవాబు వంశస్తుణ్ని కద !

*

ఎర్రమల్ల పాట

జంగు కేతనమైన కొడుకు

కొడుకా ఏటువోతివో ఏమి చేతురా....!
ఏ తోవ్వనొత్తువని నేను చూతురా
కాయకష్టం చేసి కలిగంజో తాగుతు
కంటికి రేప్పోలే కని పెంచుకుంటిరా ॥కొ॥

ఇంట్లో నా పెద్ద కొడుకు ఎదిగిండని మురిసిన
ఈ కటిక దరిద్రము కానరాదనుకున్న
బట్ట పొట్టకు ఏమి బాధలేదనుకున్న
లోకాన శోకాన్ని తుడిచివెయ్యాలని
జనసేన దారిలో జంగుకేతనమైయ్యి ॥కొ॥

దొరవారి భూముల్ల దుక్కి దున్నినట్లు
ఒడ్డు ఒరము చెసి గుడ్డినొక్కినట్టు
దాన కంచేల ఎడ్ల మలుపు కొస్తున్నట్లు
పొడిచేటి పొద్దోలో నీవు నడిచోస్తుంటె
పదిలంగా నీ రూపు నా మదిలో మెరిసెరా ॥కొ॥

నడిచేటి దారుల్లో నల్ల చీకటిలోనా
సాయుధంగా సాగే సైన్యమంత వెంట
పొయ్యాలి తొవ్వల్ల పొంచుండే శత్రువు
కీడును తలపెట్టి పగిడి కంటెల చూసి
మడమ తిప్పక అడుగు ముందుకేసి నడువు ॥కొ॥
అలసి పోయినప్పుడు అద మరిసి పడుకుంటే
అడవి జీవులార తోడుగ నిలువుండ్రి
విషపురుగులారా మీరు కసి పెంచుకోకుండ్రి.
పంచ భూతాలను శరణు కోరుకుంటు
పట్టుతి పట్టిన పంథా గెలువలాంటు - ॥కొ॥

ఏలేటోడు కుల ఎచ్చిలమె బతుకు
ఎట్టి బతుకు నూర పట్టినారు జెండా
మాటు గాసి మిమ్ము మట్టు పెడుతారేమో
ఎల్ల జనము మెచ్చ ముక్తి పోరాటంలో
నీతిబాటలో నీవు క్యాతి గడించరా ॥కొ॥

కష్టజీవుల వల్లే కలియ తిరిగే వేళ
ఆనవాలను చూసి ఆరా తీసెదరంటు
అనుమానము వుందంట జనమును కొట్టెదరంట
పూరిటిలున్న తల్లి తనకడుపులో దాసి
పునర్జన్మ నీకిచ్చి సాగనంపిందంట ॥కొ॥

కన్న ప్రేమ కన్నా పల్లెతల్లి మిన్న
తల్లెనిండా బువ్వేసి తనివి తీరా చూసే
గడ్డడేగలోలె ఖాకీల గుంపు చే
కట్టుకున్న వోడంటు కాళ్ళ వేళ్ళమొక్కే
కాపాడుకోని కండ్ల నీళ్ళు రాల్చి పంపే ॥కొ॥

కన్న కడుపు కాల్చే కటిక రాజ్యం
నాకు - గుండె కోతిచ్చినోని తలపండు పలుగరా
నన్ను యతల ముంచినోని బతుకు కాలికుల
కొడుక మరో జన్మంటె మళ్ళి నిన్నేకంట
నీవు నడిచే బాటలో నేనే ముందుంటారా ॥కొ॥
కొడుక జనములో ఎర్రజెండాయితివా
జనము గుండెలోన గూడైతివా ॥కొ॥

*

పుస్తక సమీక్ష

☆ చలసాని ప్రసాద్

నాయని కవితాత్మని ఆవిష్కరించిన చేరా

ముప్పయి ఏళ్ల నాటి ముచ్చట. హైదరాబాద్ (ద్వారకా హోటల్)లో సాహిత్య దర్బార్ జరుగుతోంది. దాని కేంద్ర బిందువు మిత్రుడు కాశీ. అతని పూర్తి పేరు కోడూరి కాశీ విశ్వేశ్వరరావు (1934-98). ఆయన్ని రాజమండ్రి భోజుడు అనడం కద్దు. సాహితీపరులకి అప్పుడు, కాని రాయని భాస్కరుడు, కవిత్వాన్నీ తూచేరాళ్ళూ అతని దగ్గరున్నాయని అనుకునేవాళ్లం. గురజాడనించి గద్దర్ దాకా తెలుగు కవిత్వం కాశీకి కంఠోపాఠం. విశ్వనాథవారి తెలుగు ఋతువులు పదాలు విరిచి, అన్వయించి అతను అనర్గళంగా వల్లెవేస్తుంటే మనం చెవులు అప్పగించవలసిందే. అతనిది అంతటి ధారణాశక్తి చెరబండరాజు అంటే పంచప్రాణాలు.

ఆ రోజు అంశం - 'ఎవరి అభిమాన కవి ఎవరు?' అందరి మధ్య కూర్చుని ఒక్కొక్కరినీ అడుగుతున్నాడు కాశీ. చేకూరి రామారావు వంతువచ్చింది. 'నా అభిమానకవి నాయని' అన్నాడు చేరా. అంతావిస్తూపోయారు. అక్కడున్న వారంతా, కె.వి.ఆర్‌తో సహా - చేరా అభిమాన కవి శ్రీశ్రీ అనుకున్నారు. సాహిత్య లోకంలో ఎక్కువ మందికి చేరా బాగా తెలుసు. కాని ఇదిమాత్రం చాలా మందికి తెలియని అంశం కనక దీనిని విశదపరచవలసిన అవసరం చేరాకి కలిగింది.

చేరా సహజంగా కవితాలోలుడు. దానికి లోనయి, ఎప్పుడైనా ఓవర్ స్టేట్‌మెంట్సు ఇస్తే రక్కున నిలేస్తారు విమర్శకులు, అప్పుడు అందరి మీదా అలిగి 'నాది భాషా శాస్త్రం' అని మాటమారుస్తాడు. కవిత్వం మీద ఇష్టంతో మళ్లీ కవిత్వంలోకి చొరబడతాడు. ఇది అతనికి పరిపాటి. అయితే అతను ఆధునిక తెలుగు కవిత్వానికి ఆత్మీయుడు. ఆ మాట ఎవరూ కాదనరు. అతని అభిప్రాయాలన్నీ మనకి ఆమోదం కాకపోవచ్చు. వాటితో మనం తలపడవచ్చు కూడా. అయితే అది వేరే కథ.

నాయని సుబ్బారావుగారితో చేరాకి చాలా సాన్నిహిత్యం వుంది. ఆయన్నించి తాను చాలా నేర్చుకున్నానని కూడా అంటాడు చేరా. కవిత్వ స్వరూప, స్వభావాలు నాయని పరిచయభాగ్యంవల్లనే తనకి అవగతమయ్యాయని కూడా చేరా చెప్పుకుంటాడు. ఇందులో మనం అభ్యంతరం పెట్టవలసిన అంశం అంటూ ఏమీ లేదు. నాయని జీవితయానంలో కీలకమైన మలుపులున్నాయి. అతని కవితాయాత్రని అవి అతి తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఆ వివరాలు, వైనాలు అన్నీ చేరాకి కొట్టిన పిండి. కనక వాటి అన్వయం అతని ద్వారా తెలుసుకున్నప్పుడు మనకు సరికొత్త నాయని దర్శనమిస్తాడు. వ్యక్తిగత జీవితంలోని ఒడిదుడుకులు కవితా వస్తువునీ, రీతులని కూడా తీర్చి దిద్దుతాయని మనకి అవగతమవుతుంది. నాయని జీవితం విషాదభరితం. తన 25వ యేట కన్నతల్లినీ, 70వ ఏట కన్న కొడుకుని పోగొట్టుకున్నాడు. కనుకనే నాయని గుండెల కొండల్లోనించి 'మాతృగీతాలు', 'విషాదమోహనం' జాలువారాయి. ఈ శోక తరంగాలు నాయనిని అతలాకుతలం చేశాయి. ఈ వేదన నాయని కవితని తీర్చిదిద్దింది. 'వేదనా వాసుదేవము'లో ఆత్మనివేదనం అధికంగా కనిపిస్తుంది. అందుకేనేమో 'బాధ కవిత్వానికి పర్యాయపదం' అన్నాడు శ్రీశ్రీ.

అయినా నాయని సుబ్బారావుగారనగానే ఎవరికయినా స్ఫురణకివచ్చేది మాత్రం 'సౌభద్రుని ప్రణయ యాత్ర', తొలినాటి తెలుగు భావకవుల సరసన నాయనికి చోటు దొరికింది ఈ కావ్యంతోనే. చాలామంది దీనిని అప్పట్లో చాలా ఆబగా చదివేవారు. చక్కని, చిక్కని కవిత్వం అంటే ఇదే అని నిక్కచ్చిగా అనుకునే వారు కూడా. ఎందుకంటే 'సౌభద్రుని ప్రణయ యాత్ర'లో తొలినించీ తుదిదాకా మనకి 'రూపకాలంకారం' తన విశ్వరూపాన్ని చూపంచింది. ఆల్ పొయెట్రీ ఈజ్ మెటఫారికల్ ఒక పాశ్చాత్య విమర్శకుడన్నాడు. రూపకాలంకారాన్ని అంత సజావుగా, సార్థకంగా వాడిన కవి నాయని. అయితే ఇది ఎక్కువగా మనకి ఆయన తొలి కావ్యం సౌభద్రుని ప్రణయ యాత్రలోనే కనిపిస్తుంది. తదుపరి కావ్యాల్లో ఇది కొంత తగ్గి వుండవచ్చు. రూపకాలంకార ప్రభావం కుందుర్తి తెలంగాణాలో మనకికొట్టచ్చినట్టు కనిపిస్తుంది.

కవుల్లో వైవిధ్యం ఉన్నట్లే ప్రతి కవిలోను కూడా వైవిధ్యం నిండి నిబిడీకృతమై వుంటుంది. నాయని ప్రధానంగా భావకవి అయినా, ఆయన "భావ కవిగానే మిగిలి పోలేదు. అభ్యుదయ కవిగా మారలేదు. చిక్కని కవిత్వాన్ని అపారంగా అందించిన చక్కని కవిగా మిగిలిపోయార"ని చేరా విశదీకరించిగాని విడిచిపెట్టలేదు. భావకవులెవరూ కూడా సమాజం గురించి పట్టించుకోలేదనుకునే అపవాదు ప్రచారంలో వుందని చేరా వాపోయాడు. ఇది పాక్షిక సత్యామేననీ భావకవులందరూ జాతీయోద్యమంతో అంతో ఇంతో మమేకమయ్యారనీ, వీరిలో నాయని సుబ్బారావుగారు (1899-1978) ఏమాత్రం వెనకబడలేదనీ చేరా సోదాహరణంగా సెలవిచ్చాడు. అంతేగాదు, చిట్టచివరలో నాయని రాజకీయ కల్మశాన్ని కడిగేసే కవితలు కూడా రాశారు. ఇంత ఓపిగ్గా చేరా వీటిని విశదీకరించకపోతే అవన్నీ కాలగర్భంలో కలిసిపోయేవేమోనని కూడా అనిపిస్తుంది. నాయని జీవిత గమ్యమే ఆయన కవితా గమనాన్ని కూడా నిర్దేశించింది. ఈ సంగతిని ఉదాహరణలతో సహా ఎత్తి చూపాడు చేకూరి. ఈ పని తెలుగు కవులలో ఒక్క బసవరాజు అప్పారావు (1894-1933) గారి గురించి ఆయన సహచరి బసవరాజు రాజ్యలక్ష్మి (1904 - 75) గారు చేశారు. వారి కుమార్తె మంగళప్రద చాలా చిన్నవయస్సులోనే కన్ను మూసింది. ఆ దుఃఖం ఆయన చేత గొప్ప కవితలు రాయించింది. అంతేగాదు. బసవరాజు అప్పారావుగారు జాతీయోద్యమంలోనూ, కాంగ్రెస్ కార్యకలాపాల్లోనూ కూడా చురుగ్గా పాల్గొన్నారు. ఆయా ప్రతిఫలనాలు ఆయన కవితల్లో కదలాడుతాయి. వీటన్నింటిని గుదిగుచ్చి ఆమె మనకి అందించారు. తెలుగు కవులకు ఆత్మీయ వ్యాఖ్యానాలు విరివిగా వెలువడలేదు. వీటిని వేళ్ళమీద లెక్కించవచ్చు. 'సౌభద్రుని ప్రణయ యాత్ర'తో నాయనికి భావకవుల్లో సముచితమైన స్థానం దొరికింది. తెలుగులో భావకవిత్వానికి సంబంధించినంత వరకు ఒక చమత్కారం వుంది. అదేమిటంటే మన భావకవుల్లో ఏ ఒక్కరూ మరెవ్వరికీ తీసిపోరు. అందరూ ఉద్దండులే. ఈ కవితా సత్యాన్ని చేరా చక్కగా పసిగట్టాడు. తొలి నించీ తుదివరకూ అందరు కవితా వ్యవసాయం సాగించిన వారే. మధ్యలో ఆగిపోయిన వారొక్కరూలేరు. తుదికంటా కవులు గానే మిగిలారు. ఆనాటి జమిందారీ కవిత్వం మీద భావకవిత్వం ఒక తిరుగుబాటు. కవిత్వాన్ని కోటల నించి పేటల్లోకి పట్టుకొచ్చారు భావకవులు. పైగా భావ కవిత్వం ఒక అనుభవం. అది ఒకేమూస మాత్రం కాదు. ఆత్మాశ్రయం అనేది దాని ప్రధాన లక్షణం.

ఈ పుస్తకానికి ముఖచిత్ర రచన మా మోహన్‌ది. చాలా అర్థవంతంగా ఉంది. అందరూ చూసి తీరాలి. ఈ మాట న్యాయానికి నేను మొట్టమొదటే రాయవలసింది. కాని కావాలనే చిట్టచివరి పేరాగా ఎంచుకున్నాను.

సౌభద్ర భద్ర కవితా వైవిధ్యం
నాయని కవితానుశీలనం
చేకూరి రామారావు
శ్రీమనస్విని ప్రచురణలు, వరంగల్లు
మొదటి ఎడిషన్ 2006 అక్టోబర్
ఖరీదు : రూ. 50/-

*

విమర్శ

ప్రపంచీకరణ : రెండు కథలు

☆ పాణి

ప్రపంచీకరణ సందర్భంలో వచ్చిన మంచి కథలుగా పేరుమోసిన 'గేటెడ్ కమ్యూనిటీ', 'యూటర్న్' కథల్లోని వస్తువు, దృక్పథం గురించి సాహిత్యలోకంలో యిప్పటికే చర్చ జరిగింది. ప్రపంచీకరణ అవగాహన నుండే ఈ కథలను మరో కోణంలో పరిశీలించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

అక్కిరాజు భట్టిప్రోలు రాసిన 'గేటెడ్ కమ్యూనిటీ', దగ్గుమాటి పద్మాకర్ రాసిన 'యూటర్న్'లోని కథా వస్తువులు రెండూ యించుమించు ఒకే సామాజిక నేపథ్యంలోనివి. అయినా కథగా దేని ప్రత్యేకత దానిదే కాబట్టి విడిగా చర్చించడమే మంచిది.

ప్రపంచీకరణ విధ్వంసంలో అణగారిపోతున్నవారి గురించి ఆర్తిగా, ఆవేదనగా అనేక కథలు వచ్చాయి. కానీ మన సమాజంలో ప్రపంచీకరణ ఫలాలను అందుకుంటున్న, అనుభవిస్తున్న వర్గం కూడా ఒకటి ఉన్నది. ఈ వర్గం యిప్పుడు విరాట్ స్వరూపాన్ని సంతరించుకున్నది. మధ్యతరగతి నుండి పై మధ్యతరగతిలోకి, సంపన్న వర్గంలోకి కొత్తగా చేరుతున్న బృందానికి రచయిత 'గేటెడ్ కమ్యూనిటీ' అని పేరు పెట్టారు. ఏ సమాజ పరిణామాల, విధ్వంసాల పర్యవసానంగా తాము ఈ స్థితికి వచ్చిందీ ఈ కమ్యూనిటీకి తెలియదు. తెలిసినా వాటి గురించి పట్టించుకోలేదు. నిజానికి వాటి గురించి ఆలోచించేంత వెసులుబాటు సహజంగానే వారికి ఉండదు. నిరంతరాయమైన అద్భుతవేగంలో వీళ్ళు తలమునకలవుతూ ఉంటారు.

ప్రపంచీకరణ యావత్తూ విధ్వంసమే అయితే దానికి అప్రతిహత స్వభావం వచ్చేదికాదు. విధ్వంసంలో విలవిల్లాడుతున్న వాళ్ళు ఎన్నిరూపాల్లో ప్రతిఘటిస్తున్నా, సమాజ ఆలోచనల్లోనే దానిపట్ల ఆరాధన, మోజ ఉండటానికి యింకోవైపున దాని ఫలాలను అందుకొనే వర్గం ఉండటమే కారణం. లేదా ఒక వైపున పరమ విధ్వంసం సృష్టిస్తూనే, యింకోపక్క ఒక చిన్న వర్గాన్ని తనతోపాటు ముందుకు నడిపించి, వాళ్ళకు కలలో కూడా అనూహ్యమైన ఫలాలను పంచిపెట్టడమే కావచ్చు.

ఈ కథలో సతీష్, సుధ అలాంటి ఫలాలు పొందిన వాళ్ళు. కథ సతీష్ వైపు నుండి ప్రారంభమై సుధవైపు నుండి ఫోకస్‌తో ముగుస్తుంది. రచయిత నిజాయితీగా ఈ కథా సంవిధానాన్ని ఎంచుకున్నారు. అట్లా కాకుండా కథలోని మరో జంట అర్జున్ - మంగ వైపు నుండి నడిచి ఉంటే - 'అభివృద్ధి' మీద - అందులో భాగం కాలేకపోయిన వారి వైపు నుండి విమర్శ ప్రకటించిన అనేక కథలవంటిదే యిదీ అయిపోయేది. ఆ రకంగా ఈ కథలోని గొంతుక వైవిధ్యమైనది. అందువల్లనే ప్రపంచీకరణ సందర్భంలో భిన్నమైన కథగా గుర్తింపు పొందింది.

సతీష్ తండ్రి మామూలు గ్రామీణ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేసేవాడు. అతను పల్లెటూరు నుండి ఖమ్మం ట్రాన్స్‌ఫర్ చేయించుకోవడం వల్ల సతీష్ చదువు బైటి ప్రపంచంలోపడి, యింటర్మీడియట్, యింజనీరింగ్‌లో ఎంటెక్ దాకా సాగింది. సాఫ్ట్‌వేర్‌లో చేరుతాడు.

అర్జున్ తండ్రి ఆ పల్లెటూళ్లో అందరికీ బట్టలుతికే చాకలి. నావారకాలుగా కష్టపడి చదువుకొంటాడు. పనులుచేస్తూ డబ్బుల్లేకుండా సైన్స్ సబ్జెక్ట్ చదవడం కష్టమని తెలిసి ఇంగ్లీషుని ఆశ్రయించాడు. నాగార్జునలో ఎం.ఎ చేసి ప్రభుత్వకళాశాలలో లెక్చరర్ అయ్యాడు. ఆ తర్వాత మూడేళ్ళ కిందట దాన్ని వదిలేసి హైదరాబాద్‌లో ప్రయివేట్ కాలేజీలో చేరాడు.

పదేళ్ళ తర్వాత చిన్నప్పటి మిత్రుడు, చాకలివాని కొడుకు అర్జున్ కలుస్తాడు. యిద్దరి మధ్యా చిన్ననాటి స్నేహం తిరిగి కొనసాగుతుంది. రెండు కుటుంబాలు గొప్పగా కలిసిపోతాయి. సతీష్ చాలా సంస్కారవంతుడు. 'గేటెడ్ కమ్యూనిటీ'లో భాగమైపోయినా యింకా సమాజంతో సంబంధాలు ఉన్నవాడూ, ఉండాలని కోరుకునేవాడూ. కథలో సతీష్ పాత్ర చిత్రణ పాఠకుల విశ్వసనీయతను సంపాదించుకుంటుంది.

తెచ్చిపెట్టుకొనైనా తెలంగాణయాసలో మాట్లాడ్డం, పదేళ్ళ తర్వాత కలిసిన మిత్రుడితో ఆప్యాయంగా సంబంధాలు పునరుద్ధరించుకోవడం, 'చిన్నప్పటి ఆవేశం యింకా ఈ మనిషిలో ఉండి ఉంటుందా?' అనుకోవడం, అంతకుమించి అర్జున్ గురించి ఆలోచిస్తే మాత్రం తాను సాధించింది గొప్పం కాదనిపించడం మొదలైనవి అతని సంస్కారాన్ని తెలియజేస్తాయి. అట్లాగే అర్జున్ యిక్కడిదాకా రాగలిగాడంటే నేను బిల్‌గేట్స్‌ని దాటితే తప్ప సమ ఉజ్జీని కాలేను అనుకోవడం - 'పైకి రావడం' పట్ల అతని ఉదారవాద పోటీ దృక్పథాన్ని కూడా తెలియజేస్తుంది.

'గేటెడ్ కమ్యూనిటీ' జీవన విధానానికి భిన్నమైన ఆలోచనలు, విలువలుకలవాడని చెప్పడానికి కథలో చాలా ఆధారాలున్నాయి. ఉదాహరణకు 'ఆఫీసుల్నుండి వచ్చేటైంలో ఎందుకు గేట్ వేస్తావ్. రాత్రిపూట వేస్తే అర్థం ఉంది' అని వాచ్‌మన్‌ని విసుక్కొంటాడు. 'గేట్' మీద అతని అసహం యిందులో అర్థమవుతుంది.

కానీ అర్జున్‌కు ఈ కమ్యూనిటీ మీద తీవ్రమైన కోపం ఉంటుంది. తనతో తన భార్యతో సతీష్ - సుధ ఎలా ఉన్నారు అనేదాంతో సంబంధంలేని కోపం అది. మామూలుగానైతే అంత పై స్థాయిలో ఉన్నా తమతో కలసిమెలసిపోయి, సహకారాన్నందిస్తూ ఉన్నందువల్ల సదరు గేటెడ్ కమ్యూనిటీ గురించి ప్రత్యేకంగా పట్టించుకోవలసిందీ, విమర్శించవలసిందీ అర్జున్‌కు ఏమీ ఉండనవసరం లేదు. కానీ అర్జున్ మనస్తత్వం, పరిశీలన అదికాదు. వీలైనన్నిసార్లు కోపాన్ని, అసహనాన్ని బైటపెట్టుకుంటాడు. ఎంతగానంటే మాటి మాటికీ మేం మీలాంటి గేటెడ్ కమ్యూనిటీకాదు అంటుంటాడు. సతీష్, సుధ బాధపడకపోగా అర్థం చేసుకునే ప్రయత్నం చేయడం వాళ్ళ సంస్కారాన్ని తెలియజేయవచ్చు గాని, అర్జున్ ఆగ్రహం సామాజికమైనది. తనకు - సతీష్‌కు ఉన్న అంతరంగా గాక, మామూలు మధ్యతరగతికి - గేటెడ్ కమ్యూనిటీకి ఉన్న సామాజిక అంతరం నుండి అతని గొంతు వినిపిస్తున్నట్టు మనకు తెలుస్తూ ఉంటుంది. రెండు కుటుంబాల మధ్య మంచి ప్రేమాభిమానాలు ఉన్నా అర్జున్ వాళ్ళు కొనుక్కున్న అపార్ట్‌మెంట్ కూల్చేసి ఔటర్ రింగ్ రోడ్ వేసే సమస్య ముందుకు వచ్చినప్పుడు "ఏ రోడ్డు వేసినా కొన్ని యిండ్లు పోక తప్పదుగా... అయినా కాంపెన్సేషన్ ఇస్తారా?" అని సుధ భయం భయంగా అంటుంది "మరి ఒక్క గేటెడ్ కమ్యూనిటీ కూడా పోవట్లేదే ఏ రోడ్డు కిందా?" అంటాడు అర్జున్. అతని గొంతులోని వెటకారం వ్యక్తిగతమైనదికాదు. స్నేహం వల్ల సుధ భయంగా అన్నా, అదే స్నేహం వల్ల అర్జున్ వెటకారంగా అన్నా అందులోని సామాజిక పార్శ్వం బలమైనది. అది సుధను ఎక్కడిదాకా తీసుకెళ్ళిందో ఈ కింది సంభాషణలో తెలుసుకోవచ్చు.

"గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న వాళ్ళ మంటే ఏదో పాపం చేసి, అన్యాయంగా దోచుకున్న డబ్బేదే తినేస్తున్నట్టుగా మాట్లాడుతుంటేనే బాధగా ఉంటోంది. మా మట్టుకు మేము నెలనెలా జీతాల్లోంచి ఖచ్చితంగా టాక్సులుకడుతున్నాం. మాకు తోచినంత చారిటీ పని చేస్తున్నాం. వ్యక్తులుగా మమ్మల్ని తప్పుపట్టే అర్హత ఎవరికీ లేదు" అంటుంది.

కథలో యిది అతిముఖ్యమైన భాగం.

ఈ కథను 'కథావార్షిక 2006' సంకలనంలో అచ్చువేస్తూ సంపాదకులు ఒక మాట అన్నారు - ఈ ఆధునిక దుర్గాల లోపలున్న కుహనా మానవ విలువల్ని ఎద్దేవ చేసే కథ - అని. ప్రపంచీకరణ పరిణామాలను చిత్రించే కథల్లో మామూలుగానే ఈ ఎద్దేవా, విమర్శ ఉన్నట్టు కనిపించవచ్చు. అర్జున్ మాటల్లో అవి తీవ్రంగానే వినిపిస్తాయి. కాని కథ ఫోకస్ చేస్తున్న అంశం సుధ వాదనే. కథాగమనం చాలా సహజంగా ఆ అంశం దగ్గరికి చేరుకుంటుంది. కాకపోతే ఈ మాట సతీష్ అనడు, ఆ పాత్ర మనస్తత్వానికి అతకదు కాబట్టి సుధ

అంటుంది. గేటెడ్ కమ్యూనిటీ గురించి అర్జున్ నిరసనకు సమాధానంగానే అట్లా అంటుంది.

దీనికి యిట్లా వివరణ యిచ్చుకుంటే తప్పులేదు.

ప్రపంచీకరణ ఫలాలు అనుభవిస్తున్న వాళ్ళ గురించి ఎవరికైనా దురభిప్రాయాలు, వ్యతిరేకతలు ఉంటే అది న్యాయంకాదు. వాళ్ళు ఏ పాపం చేయడంలేదు. ఎవరినీ దోచుకోలేవడంలేదు. చాలా సహజంగానే వాళ్ళకు ఈ అందలం దొరకింది. వాళ్లు తమ కష్టంలోంచి ఈ సుఖాలను ఏర్పాటు చేసుకొన్నారు అని.

దీన్ని యింకా కొనసాగించి సుధ యిట్లా అంటుంది.

"ఏం... మీరు చాకలి పని మానేసి ఈ ఫ్లాట్‌లోకి రాలేదా.... మీ కజిన్ యింకా శ్రీనగర్ కాలనీలో ఇస్త్రీ బండి పెట్టుకున్నాడని మీరే చెప్పారు... అతని దృష్టిలో మీరూ ఓ మాదిరి గేటెడ్ కమ్యూనిటీయే. రేప్పొద్దున మీ పిల్లలిద్దరూ చదువుకొని మా యింటి పక్కనే చేరొచ్చు. అప్పుడు మీకేమీ అనిపించదుగదా" అని ఎడాపెడా వాయించేస్తుంది. కన్నీళ్ళు కూడా పెట్టుకుంటుంది. ఈ కథ గేటెడ్ కమ్యూనిటీలాంటి ఆధునిక దుర్గాలను ఏం ఎద్దేవా చేసిందోలేదోగాని, ప్రపంచీకరణ పరిణామాలూ.., చిన్న చిన్న బృందాలుగా, వ్యక్తులుగా ఈ పురోగమనంలో భాగం కావడమూ అత్యంత సహజమని ఈ కథ చెప్పదలుచుకుంది. ఈ పురోగమనం యిట్లా ఉన్నది అని చిత్రించడంతో సరిపెట్టుకోకుండా దాన్ని అందిపుచ్చుకున్నవాళ్ళ తరపున సమర్థన ప్రకటించింది. యిందులో అనివార్యమనిపించే సామాజిక వాస్తవికతను చూచి ఎవ్వరైనా భ్రమపడవచ్చు. ఈ నూతన పరిణామాలకు పూర్వం కూడా సమాజంలో అనేక అంతరాలున్నాయి. వ్యక్తులుగా, చిన్న బృందాలుగా వాటిని అధిగమించి పైకి ఎదిగే క్రమం అప్పుడు కూడా ఉన్నది. కాని ఈ అంతరం, పైకి ఎదిగే క్రమం ఈ ప్రత్యేక సామాజిక సందర్భంలో విపరీతమైపోయింది. అర్జున్ గొంతులో మనకు వినిపించిన సామాజిక స్వరం అదే. కాని దానికి సుధ రెండు ఉదాహరణలతో సమాధానం చెప్పదలుచుకుంది. అర్జున్‌వాళ్ళ కజిన్ యింకా రోడ్డు మీద యిస్త్రీ డబ్బా నడుపుకుంటూ ఉంటే, అర్జున్ ప్రైవేట్ (కార్పోరేట్) కాలేజీలో లెక్చరర్ రావడం, రేప్పొద్దున అతని పిల్లలు కూడా ఏ సాఫ్ట్‌వేర్‌లోకో వచ్చి గేటెడ్ కమ్యూనిటీలో భాగం అవగలిగే అవకాశాలను ఎత్తిచూపడం... వీటి ద్వారా కళ్ళముందు కనిపిస్తున్న ఈ 'వాస్తవికతను' గుర్తు చేసి, దీన్ని సామాజిక దృష్టితో విమర్శించే అర్హత ఎవ్వరికీలేదని తేల్చేసింది.

సాఫ్ట్‌వేర్ ద్వారా ఎదిగిన నూతన సంపన్న వర్గానికి సుధ అచ్చమైన ఉదాహరణ. ఈ వర్గంలో ఎవరిని అడిగినా మా ప్రతిభవల్ల మా ప్రయోజకత్వం వల్ల యింత సంపాదించుకోగలుగుతున్నాం... మేమెవరినీ దోపిడీ చేయడం లేదని ఆత్మవిశ్వాసంతో చెప్తారు. ముప్పైరోజులకు యాభైవేలు, లక్ష, లక్షన్నర ఎట్లా వస్తున్నాయి? అనే ప్రశ్న వీళ్లకు తలెత్తదు. వ్యవసాయం, వృత్తులు, ఉపాధి అవకాశాలు అన్నీ నాశనమైపోయి రోజుకు ఇరవై ముప్పై రూపాయల కూలీ కూడా గిట్టక సంవత్సరానికి వేలాది మంది ఆకలి చావులకు, ఆత్మహత్యలకు పాల్పడుతున్న చోట, ఆకలికి తాళలేక బూడిద - చింతపండు కలుపుకొని తినే అసంఖ్యాక ప్రజలున్న చోట నెలకు లక్షల రూపాయలు ఎట్లా వస్తాయి? ఎందుకు వస్తున్నాయి? అనే ప్రశ్న అడగడానికి అవకాశం లేదని, అంతా సజావుగా, సహజంగా, అలవోకగా జరుగుతోందని, అందుకోగలిగినవాళ్ళకు అందుకున్నంత అని ప్రపంచీకరణ చెప్పదలుచుకున్నది.

యింకో విచిత్రమేమంటే - అర్జున్ విమర్శించినా, సుధ సమర్థించుకున్నా గేటెడ్ కమ్యూనిటీలోని వాళ్లకు యింత సంపద ఎట్లా వచ్చింది? అనే ప్రశ్న దగ్గరికే కథ వెళ్ళదు. అంత సంపద ఉన్నా ఎంత గొప్పగా మానవ సంబంధాలపట్ల తదాత్మ్యంతో ఉన్నారో చెప్పదలుచుకున్నది. సతీష్ "బయటి ప్రపంచంతో నాకింకా సంబంధం ఉంది... నేనేమీ వొదలుకోలా..." అని ఒకటికి రెండుసార్లు అంటాడు.

సతీష్ లాంటి ఉదారవాదులకు బైటివాళ్లతో సంబంధాలు ఎలా ఉన్నాయనేది సమస్యకాదు. ఉంటే ఏమవుతుంది? ఆ మేరకు గేటెడ్ కమ్యూనిటీ అనబడేవాళ్ళ జీవన విధానానికి మినహాయింపు. వాస్తవానికి యిదే నైతిక బలంగా పనిచేసి, 'మమ్మల్ని విమర్శించే అర్హత ఎవరికీ లేదు - మేం గొప్ప మానవతావాదులం అని సమర్థించుకొనే శక్తినిచ్చింది. సతీష్ తాను అర్జున్‌కు సాటి రావాలంటే బిల్‌గేట్స్‌ను కావల్సిందే అనుకుంటాడు. ఈ పోటీలో కూడా ఉదారంగా, చారిటీతో ఉండవచ్చునేమోగాని, యింత సంపద మన దగ్గర ఎట్లా పోగుపడుతోంది? అని ఈ వర్గం ప్రశ్నించుకోదు. పైగా సమర్థించుకుంటుంది.

అర్జున్ ఆవేశంలో సామాజిక స్వరం ఉన్నప్పటికీ - వ్యక్తిగా సతీష్ దంపతుల స్నేహం, తనకు వాళ్ళతో ఉన్న అనుబంధం రీత్యా సుధ మాటలకు సమాధానంగా, అనునయంగా - "మనం ఏం వదిలేసుకొని ఏం సాధించుకుంటున్నామని, బయటపడలేని ఏదో వెర్రిలోపడి కొట్టుకపోతున్నాం అందరం. ప్రతివాడి చుట్టూ గోడలే. మనందర్నీ కలిపి బాధించే విషయమేదీ కనబడదేం? ఎవరి మీద చూపించారో తెలియని కోపాన్ని మూర్ఖంగా మీ మీద చూపించాను" అంటాడు.

కథలో యిదే ప్రధానమైన అంశం అనేవాదన కూడా చేయవచ్చుగాని వాస్తవానికి ఈ డైలాగ్‌కు కథతో సంబంధం లేదు. ఒక సామాజిక పరిణామం మీద తనకున్న ఆగ్రహంపట్ల తనకే తెలియని అస్పష్టతతో అర్జున్ ఈ మాట అంటాడు. ఈ అస్పష్టత అర్జున్‌ది, ఈ కథా రచయితది మాత్రమే కాదు. ప్రపంచీకరణ మీద విలువైన సాహిత్యం రాస్తున్న మన రచయితల్లో చాలా మందికి ఈ అస్పష్టత ఉన్నది. ప్రపంచీకరణ పట్ల నిరసన ప్రకటిస్తున్న మధ్యతరగతి, పై మధ్యతరగతి మొత్తానికి ఈ సమస్య ఉన్నది. ప్రపంచీకరణలో అందరం ఏం పోగొట్టుకుంటున్నాం! అనే వ్యధ, అన్వేషణ - చూడ్డానికి మంచిగానే ఉంటుంది. అందులోని నిజాయితీని సందేహించనవసరం లేదు. సామ్రాజ్యవాదం అన్నిటినీ దిగమింగేస్తుందనే మాట, ఉమ్మడి శత్రువనే మాట పూర్తి నిజం. కానీ సతీష్ సుధ లాంటివాళ్ళు ఏం కోల్పోతున్నారని! ఒక ప్రణాళికాబద్ధంగా ప్రపంచీకరణవల్ల వొనగూరే ఫలాలు అన్నీపొందడానికి ప్రయత్నిస్తున్న నూతన సంపన్నవర్గం ఏమీ కోల్పోవడం లేదు. వీలైనంతగా సుఖాలను పొందడానికే ముమ్మరంగా ప్రయత్నిస్తూంటుంది. అర్జున్‌లాంటివాళ్ళు ఏ కొంచెమో కోల్పోవచ్చు. అందులో ఆర్థిక, సాంస్కృతిక అంశాలు ఉంటాయి. ప్రపంచీకరణ అందరికీ శత్రువే అయినా అందరూ కోల్పోయేది ఒక్కటి కాదు. అందరి వ్యథ ఒక్కటి కాదు. అన్ని కష్టాలూ ఒక్కటి కాదు. తెలుగు సాహిత్యంలో 'అందరం అనేకం కోల్పోతున్నామనే గుండుగుత్తవలపోత ఎక్కువైంది. 'అడవుల్లోని ఆదివాసులు, పల్లెల్లోని దళితులు, ఊళ్లలోని వృత్తిదారులు, వ్యవసాయదారులు కోల్పోతున్న వాటికి అర్జున్‌లాంటి వాళ్ళు కోల్పోతున్నదానికే ఏ సంబంధం లేదు. యింక సతీష్ లాంటి వాళ్లు ఏదో కోల్పోతున్నామని దు:ఖపడితే అర్థంలేదు. ప్రపంచీకరణ సందర్భంలో కథా సాహిత్యం సంపద్వంతం అవుతున్నదనడానికి, సృజనాత్మకంగా విస్తరిస్తుందనడానికి సతీష్‌లాంటి వాళ్ళ దు:ఖమో, నిజాయితీయో, సామాజిక సంబంధాలను నిలుపుకోవాలనే ఆరాటమో వస్తువు అయిందని మరీ అంతగా సంబరపడనవసరం కూడా లేదు. సమాజంలో నిర్లక్ష్యానికి, విస్మరణకు గురవుతున్న అసంఖ్యాక సామాజిక సమూహాల గురించి, కమ్యూనిటీల గురించి యిప్పుడిప్పుడే 'నాగరిక' సమాజం తెలుసుకొనే ప్రయత్నం చేస్తున్న తరుణంలో ఈ నియోరిచ్ కమ్యూనిటీల గురించి ఆసక్తి పెరగడం! నిజంగా ప్రపంచీకరణ ఎంత మాయలాడి అనిపిస్తుంది. ఇలాంటి కథలు రాయగూడదని ఏమీలేదు. నిజంగానే ఈ ఆధునిక దుర్గాల డొల్లతనాన్ని, కిందికి చూడలేని అంధత్వాన్ని చూపే కథలు అవసరం. ఏ కాలంలోనైనా ఆ కాలంలోని సంపన్న వర్గాల మానవీయత గురించి, సామాజిక వాస్తవికతతో సంబంధం కలిగి ఉండాలనే వాళ్ళ 'తపన' గురించీ, తమ దగ్గర పోగుపడ్డ సంపదకు సాధికార సమర్థన యిచ్చుకోవడం గురించీ బొచ్చెడు సాహిత్యం వచ్చి ఉంటుంది. యిప్పుడు గేటెడ్ కమ్యూనిటీలోని మానవతవాదుల గురించి, వాళ్ళ సమర్థనల గురించి ఈ కథ చిత్రించింది. అర్జున్ ఆవేశంలో సామాజిక కోణం ఉన్నదిగాని... ఒకటికి రెండుసార్లు సతీష్‌తో, సుధతో 'మీమీద నమ్మకం లేకకాదు' అని అంటాడు. ప్రపంచీకరణ మీద వ్యతిరేక వైఖరి స్థానంలో

వ్యక్తులుగా, చిన్న బృందాలుగా పైకి ఎదగడంలోని సంబద్ధతను అంగీకరించే వైఖరిని కథ ప్రదర్శించింది. అందుకే అర్జున్ నా పిల్లలూ గేటెడ్ కమ్యూనిటీగా ఎదగాలనే కోరుకుంటాను అని పరోక్షంగా అంగీకరించాడు. కాకపోతే అందరం ఏదో కోల్పోతున్నాం అనే బెంగ అతనికి ఉంది. ఆ మేరకు అనివార్యమనిపించే ఈ పరిణామాన్ని రచయిత నిజాయితీగా చిత్రించాడని, ఈ పరిణామం పట్ల యింకా సందేహం ఉన్నదని, యిదిట్లానే ఉండాలా? అనే ప్రశ్న కూడా ఉన్నదని తెలుస్తుంటుంది. ఎవరిమీద చూపించాలో తెలియని కోపం...! అనే అస్పష్టత కూడా అందులోంచి వచ్చిందే కావచ్చు.

ఈ కథలో సుధ 'వీలైనంత చారిటీస్ చేస్తున్నాం' అంటుందిగదా. అక్కడి నుండి నేరుగా పద్మాకర్ కథలోకి ప్రయాణించవచ్చు. అట్లా ఈ రెండు కథలకు ఒక నేపథ్యం భావజాలపరమైన సారూప్యతను తెచ్చింది.

'యూటర్న్' కథలో స్టాక్‌మార్కెట్లో సంచలనాలు సృష్టించగల మిస్టర్‌సేన్ అనే అపరకుబేరుడు ఉంటాడు. ఆయన సగటు సంపాదన రోజుకు పదిహేను కోట్ల పైమాటే. ఒక్కసారి హఠాత్తుగా మూడు, నాలుగు వందల కోట్ల ఆదాయం వచ్చిన రోజు నిద్రపట్టదు. మోతాదు మించి డ్రింక్ తీసుకున్నా నిద్రరాదు. అలాంటప్పుడు తనకు విశ్వాసపాత్రులయిన వాళ్ళకు తలా కోటి దానం చేసి ఆనందాన్ని దించుకొని తృప్తిగా నిద్రపోతాడు. ఈ సలహా ఆయన పర్సనల్ సైక్రియాట్రిస్ట్ డా.శాంతారాం యిచ్చాడు. అయినా ఆయన్ను అశాంతి, అసంతృప్తి వెంటాడుతూనే ఉంటాయి. ఆనందంకోసం ఏం చేసినా రొటీన్‌గా ఒన్‌వేలా అనిపించి, అనేక కొత్త పద్ధతులను ఆశ్రయిస్తాడు. మారువేషంలో చిన్న నగరాల్లో, గ్రామాల్లో తిరుగుతూ ఉంటాడు. రైల్లో జనరల్ కంపార్ట్‌మెంట్లో సుదీర్ఘ ప్రయాణాలు చేస్తుంటాడు. చివరికి ఓసారి తనచిన్ననాటి మిత్రుడు హెడ్‌మాస్టర్‌గా ఉండే ప్రభుత్వపాఠశాలలో మూడురోజులపాటు చిన్నపిల్లలకు పాఠాలు చెప్తూ కాలక్షేపం చేస్తాడు. అందులోని వైవిధ్యానికి మురిసిపోతాడు.

చివరిరోజు పిల్లలందరికీ తాను బహుమతులు యిచ్చి, వాళ్ళను కూడా తనకేదైనా గిఫ్ట్ తెచ్చివ్వమని అడుగుతాడు. పువ్వుల బొమ్మలు, జాతీయ జెండా బొమ్మ, కుక్కపిల్లబొమ్మ రకరకాల బహుమతులు పిల్లలు తెచ్చిస్తారు. శకుంతల అనే అమ్మాయి తానుదాచుకున్న బలపాలన్నీ తెచ్చిస్తుంది.

"యిన్నిబలపాలు ఎందుకు శకుంతలా?" అని సేన్ అడుగుతాడు.

"రాసుకునేందుకు సార్!" అంటుందా అమ్మాయి అమాయకంగా. యిన్ని బలపాలతో నువ్వు ఏమి రాస్తావు? మళ్ళీ కొంటూనే ముక్కలు చేసి దాచుకుంటావు. అవునా? ఇన్ని వేస్తే కదా! క్లాసులో కొన్నిసార్లు కొందరికి బలపం కూడ లేక దెబ్బలు తింటుంటారు కదా! నీవప్పుడు..." అంటుండగానే తన ఆస్తులు గుర్తొచ్చి ఏదోషాక్ తగిలినట్టనిపిస్తుంది.

శకుంతలకు దుఃఖంగా అనిపిస్తుంది. రెండేళ్ళుగా అపురూపంగా దాచుకున్న బలపాలు మంచి టీచర్‌కదా అని బహుమతిగా యిస్తే నన్నే ఎందుకు దోషిగా చూస్తున్నాడనుకుంది శకుంతల.

ఆ సమయంలో బలపాలన్నింటితోపాటు ఆత్మాభిమానం కూడా పోతుందన్న బాధ ఆ బాలికలో వ్యక్తమవుతుంది. శకుంతల తాను సంతోషంగా యిస్తున్నానని కూడా చెప్తుంది. యింక అప్పటి నుండి మిస్టర్ సేన్‌లో అంతర్మథనం మొదలవుతుంది. నిద్రపట్టదు. అలవికాని అశాంతి. అప్పటికప్పుడు ఫ్లైట్‌లో డా.శాంతారాంను పిలిపిస్తాడు. ఆయన ఈ కథంతా విని మీకు గనకను మీ తదుపరి తరాల వారిపై ప్రేమ మాత్రమే ఉంటే.... ఒక పదితరాలకు విల్లురాసి, మిగిలిన ఆస్తిని ప్రభుత్వరంగానికి తక్కువ నిధులు కేటాయిస్తోందో దానికి ఖర్చు చేయండి అంటాడు. పైగా అతను విద్యారంగానికి యివ్వమని సూచిస్తాడు. "మీ వంటి, మీ వారసురాలు శకుంతల వంటి సర్వస్వం త్యాగం చేయగల హృదయ వైశాల్యాన్ని పెంచే విద్యను దేశానికి అందించండి" అంటాడు.

దానికి మిస్టర్‌సేన్ 'శకుంతల వారసురాలు అనడాన్ని నేను అంగీకరించను. నేనే ఆమెకు వారసుణ్ణి' అంటాడు.

ఈ మాటలో డా.శాంతారాం సూచనను ఆయన అంగీకరించినట్టు మనకు అర్థం అవుతుంది.

కథలో ఈ చివరిభాగం ప్రధానమైంది కాబట్టి క్లుప్తంగానైనా మొత్తం చెప్పాల్సి వచ్చింది. ఈ కథ ఏం ప్రకటిస్తోంది? గత సంవత్సరం వచ్చిన మంచి కథల్లో దీనికి తగిన గుర్తింపు వచ్చింది. తెలుగులో వస్తున్న సగటు మంచి కథల్లో యిది వైవిధ్యమైనది. కొత్త సంపన్నవర్గం తయారవుతున్న నేపథ్యం నుండి ఈ కథ పుట్టింది. అపారమైన సంపద పోగుచేశాక, ఆ ఆనందమే ఉక్కిరిబిక్కిరిచేసి నిద్రపట్టనివ్వదు. దాన్నుండి బైట పడ్డానికి నానా యాతన పడుతుంటారు. అక్కడి నుండి పుట్టేదే ఈ దాతృత్వ భావజాలం. ఒక రకంగా యిది కొత్తదేమీకాదు. పాత సమాజాల్లో సంపన్నులందరికీ 'గొప్ప'పేరు దీన్నుండే వచ్చింది. అది ఫ్యూడల్ సంపాదన. యిది ప్రపంచం కుగ్రామంగా మారిపోయిన దశలో 'బిజినెస్' రూపంలో వచ్చిన సంపాదన. సేన్ స్టాక్ మార్కెట్ సంచలనాలు సృష్టించడం ద్వారా, అవసరమైతే అండర్ వరల్డ్ మాఫియాలను, వాళ్ళ వ్యాపారాలను మట్టికరిపించగల తెలివితేటలద్వారా యింత సంపద వచ్చిపడింది. అంతే తేడా. పాతకాలపు సంపన్న వర్గాలది భూస్వామ్య సంపద అయితే, వీళ్ళది లుంపెన్ సంపద. అప్పట్లో దాతృత్వ భావజాలాన్ని గుర్తుచేసే పని బ్రాహ్మణులు పూజారులు చేస్తే, యిప్పుడు చక్కగా ఈ కథలో సైకియాట్రిస్ట్ చేస్తాడు.

యిక కథ వరకే పరిమితమైతే - దీనికి విశ్వసనీయత దొరకడం చాలాకష్టం. సేన్‌కు నిద్రపట్టకపోవడం గురించి, శకుంతల ప్రశ్న తర్వాత అంతర్మథనానికి గురికావడం గురించి చాలా బాగా రాసినట్టనిపించవచ్చుగాని దీన్ని జీవిత సంఘర్షణ అని నమ్మడం కష్టం. కొంచెం గుర్తుచేసుకుంటే మనం చిన్నప్పుడు చదివిన కథలు గుర్తుకొస్తాయి. సంపద చుట్టూ తిరిగినవాడికి శాంతిలేక దిగులుతో, మథనతో దానధర్మాలు చేసి మహానుభావుడిగా మారిపోయిన వైనం వాటిలో ఉంటుంది. యిక్కడ సందర్భం మారిందంతే. అంతమాత్రాన జీవిత వాస్తవికత అని నమ్మదగిన అంశం యిందులో లేదు. యింత సంపద ఎట్లా వచ్చింది? అనికాక సంపదవల్ల కలిగిన ఆనందం నుండి అంతర్మథనానికి గురవుతారు.

శకుంతల బలపాలు యివ్వడంతో మిస్టర్‌సేన్‌కు షాక్ తగిలినట్టవుతుంది. తన సంపాదన గుర్తుకొస్తుంది అంటాడు రచయిత. కాని నిజానికి ఆయన అంతర్మథనం పాఠకులకు షాక్ వంటిది. నిజంగా సేన్‌లాంటివాళ్ళు యిలా ఆలోచిస్తారా? అని. అక్కడి నుండి కథ మీద అపనమ్మకం బలపడటం మొదలవుతుంది. వాదనకోసం యిదంతా నిజమే, జీవితంలోని వాస్తవికత అలాంటిది, ఈ కథ జీవితం నుండే పుట్టిందని అనుకున్నా - అయితే ఏమిటి? అనే ప్రశ్న తప్పించుకోలేనిది.

డా.శాంతారాం కొంచెం వేదాంతం మాట్లాడతాడు. 'లక్షల కోట్లు సంపాదించినా ప్రపంచంలోని ఏ ఒక్కరూ ఈ నిర్లిప్తభావాల నుండి తప్పించుకోలేరు.... వెయ్యి తరాలకు అవసరమైనంత డబ్బు ఒకచోట పోయగలంగాని మన జీవితమంతా తినవలసినదాన్ని ఒకేసారి తినివేయలేముకదా మిస్టర్ సేన్....' అని యింకా ఏమేమో చెప్తాడు. యింకో మాట కూడా అంటాడు. సంపదలో మీరు ఉన్నతంగా ఉండటం మీకు అభ్యంతరం కాదుగదా! అని. ఈ మాట అర్థం మీరు దానం చేసి ఉన్నతులుగా మిగిలిపోండి అని.

రంగం మీదికివచ్చిన కొత్త సంపన్న వర్గాలను దృష్టిలో పెట్టుకొని రాసిన కథ కాబట్టి సామాజిక పరిణామాల్లో ఓ పాయను గ్రహించిన కథ అని గౌరవించేవాళ్ళు ఉంటారు. కానీ ఈ కథ ఆ సంపన్నవర్గం కోసం రాసిన కథ. వాళ్ళలోని అంతర్మథనకు దాతృత్వ సిద్ధాంతాన్ని భూమికగా కల్పించి ఉదారవాద వైఖరిని ప్రకటించుకోజూసిన కథ. కానీ అది ఉదారవాద ప్రజాస్వామిక భావన కూడా కాదని చెప్పవచ్చు. అలాంటప్పుడు 'యూటర్న్' ఏం సాధిస్తుంది?

ప్రపంచీకరణ నేపథ్యంలో కథా సాహిత్యంలో వస్తు విస్తృతితోపాటు ఉదారవాద, యథాతథవాద, దాతృత్వవాద దృక్పథాలు ప్రవేశిస్తున్నాయా? అని అందరూ ఈ రచయితలతో సహా - బాధ్యతగా ఆలోచించాల్సి ఉన్నదని మనవి. *

సైన్స్ వ్యాసం

డా. కొడవటిగంటి రోహిణి ప్రసాద్

కాలం - అవగాహన 3

గడిచిపోయిన విషయాలను గురించి తలుచుకోవడమో, చదువుకోవడమో తప్ప మనం చెయ్యగలిగినదేమీ ఉండదు. ఫోటోలు, ఆడియో, వీడియో రికార్డింగ్‌లూ ఉన్న రోజులైతే వాటిని గురించి మరింత బాగా తెలుసుకోవచ్చు. అంతేకాని ఆ సంఘటనలలో మనం మళ్ళీ జోక్యం కలిగించుకోలేం. మనకు సంబంధించినంతవరకూ కాలం ఎప్పుడూ ముందుకే నడుస్తూ ఉంటుంది. గతం గతః. బతికినన్నాళ్ళూ బతికి మనమంతా "కాలధర్మం" చెందుతాం. మనకు కావాలన్నప్పుడల్లా గతంలోకిగాని, భవిష్యత్తులోకిగాని వెళ్ళడం సాధ్యంకాదు. అలా జరిగితే ఏమౌతుందో ఊహిస్తూ పంతొమ్మిదో శతాబ్దపు అంతంలో ప్రముఖ ఆంగ్ల రచయిత ఎచ్.జి.వెల్స్ టైమ్‌మెషిన్ అనే నవల రాశాడు. సైన్స్ ఫిక్షన్ రచనల్లో అద్వితీయుడైన వెల్స్ ఈ నవలలో మనుషులను భూత, భవిష్యత్తుల్లోకి తీసుకెళ్ళగల ఒక కాలయంత్రాన్ని వర్ణిస్తాడు. అందులో కథానాయకుడు 8 లక్షల సంవత్సరాల తరువాతి లోకానికి వెళ్ళి అక్కడ (అప్పుడు అనాలేమో) విచిత్రమైన అనుభవాలకు గురిఅవుతాడు. ఇది అప్పట్లో పూర్తిగా కాల్పనిక గాథే. అయితే సైన్స్ బాగా అభివృద్ధి అయిన ఈ ఆధునిక యుగంలో ఇటువంటిది జరగడం సాధ్యమేనా? ఎవరైనా ఉన్న చోటు నుంచి కదలకుండా కాలయానాలు చెయ్యగలరా? ఈ నవల ఇటువంటి ఊహలను మామూలు ప్రజల్లో రేకెత్తించి వారి భావనాశక్తిని తీవ్రంగా ప్రభావితం చేసింది. సాధ్యాసాధ్యాల మాట ఎలా ఉన్నా ఎవరైనా గతంలోకి వెళితే ఏమౌతుంది? అలా వెళ్ళినవాడు తనతాతనో, ముత్తాతనో చంపేస్తే అతని ఉనికికే మోసం రావచ్చు. ఎందుకంటే అతని పూర్వీకులు పెద్దయి, అతని తల్లిదండ్రులకు జన్మనిచ్చే అవకాశం లేకుండాపోతుంది. బాక్ టు ఫ్యూచర్ అనే సినిమాలో చూపినట్టుగా భవిష్యత్తు అంతా తారుమారవుతుంది.

ఎవరైనా నిజంగా కాలంతోబాటు పరిగెత్తదలుచుకుంటే కాంతివేగంతో ప్రయాణించాలి. అలా ఏ రాకెట్‌లోనో కూర్చొని వెళుతున్నవాటి సరసనున్న గడియారాన్ని బయట నిలబడి మనం చూడగలిగితే దాని ముళ్ళు కదలనట్టుగా అనిపిస్తుందని ఐన్‌స్టయిన్ సాపేక్ష సిద్ధాంతం చెపుతుంది. ఇదే థియరీ ఆఫ్ రిలెటివిటీ లెక్కన కాంతివేగాన్ని మించగలిగినదేదీ లేదు కాని మాట వరసకు అలా జరిగితే గడియారం వెనక్కు నడిచి మనం గతంలోకి వెళ్ళగలుగుతాం.

ఇది అర్థమవాలంటే ఒక ఉదాహరణ తీసుకోవచ్చు. ప్రస్తుతం మనకు అంతరిక్షంలో ఎంతో దూరాన జరుగుతున్నట్టుగా కనబడుతున్న సంఘటనలన్నీ గతంలో ఎప్పుడో జరిగిపోయినవేననీ, వాటి సమాచారం కాంతి, లేక ఇతర ఎలెక్ట్రోమేగ్నెటిక్ తరంగాల ద్వారా చాలా కాలానికి మనకు అందుతోందనీ తెలుసు. అలాగే భూమి మీద జరిగిన సంఘటనల వివరాలు కూడా కాంతి తరంగాల రూపంలో అంతరిక్షంలో ఇప్పటికీ ప్రయాణిస్తూనే ఉంటాయి. ఉదాహరణకు క్రీస్తుకు పూర్వం మూడో శతాబ్దంలో అశోకుడి కళింగయుద్ధం దృశ్యాలన్నీ రెండున్నరవేల కాంతి సంవత్సరాల దూరంలో అంతరిక్షంలో ఇంకా ప్రసారం అవుతూనే ఉన్నాయి. ఇందులో అబద్ధమేమీ లేదు. ధూళీ, మేఘాలూ అడ్డం రాలేదనీ, వాటిని వీక్షించగల టెలిస్కోప్‌తో ఎవరో చూస్తున్నారనీ అనుకుంటే ఇలా గడిచిపోయిన సంఘటనలన్నిటినీ రికార్డ్ చేసుకోవడం సిద్ధాంతరీత్యా సాధ్యమే. ఏటొచ్చీ ఆ తరవాతి కాలంలో పుట్టిన మనం గనక వాటిని చూడాలంటే ఒక ప్రత్యేక రోదసీనౌకలో కూర్చుని కాంతికన్నా వేగంగా ప్రయాణిస్తూ ఆ దృశ్యం వివరాలను దాటి ముందుకెళ్ళి, అవి చేరే లోపల "అవతల" ఉన్న టెలిస్కోప్‌ను అందుకోవాలి ఇలాంటిది సాధ్యపడితే గతంలో జోక్యం కలిగించుకోలేకపోయినా ఆ యుగాన్ని "కళ్ళారా" చూడగలుగుతాం.

ఐన్‌స్టయిన్ మొదట ప్రతిపాదించిన ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతం (స్పెషల్ థియరీ ఆఫ్. రిలెటివిటీ) ప్రకారం విశ్వంలో పరిశీలకుడు నిశ్చలనంగా నిలబడగలిగిన స్థానమేదీ ఉండదు. క్రమవేగంతో కదులుతున్న వ్యవస్థలన్నీ సమానమే. ఒక రాకెట్ మీద ఉన్న పరిశీలకుడు మరొక రాకెట్ సెకండుకు వందమీటర్ల వేగంతో కదలడం గమనించాడంటే అతను కదలకుండా ఉన్నాడనే అనుకోనవసరం లేదు. రెండు రాకెట్లూ విరుద్ధ దిశలలో సెకండుకు యాభై మీటర్ల వేగంతో కదులుతున్నట్టో, రెండు రాకెట్లూ ఒకేదిశలో ప్రయాణిస్తూ మొదటిదాని కన్నా రెండోదాని వేగం సెకండుకు వందమీటర్లు ఎక్కువగా ఉన్నట్టో ఇలా రకరకాలుగా అనుకోవచ్చు. రెంటి వేగాలకూ సాపేక్షంగా ఉన్న తేడాయే లెక్కలోకి వస్తుంది. ఇక ఒక రాకెట్లో ఉన్నవాడు రెండో రాకెట్‌లోని వివరాలను పరిశీలించడం మొదలు పెడితే వింత ఫలితాలు కలుగుతాయి. అవతలివాడి గడియారాల నడక మందగిస్తుంది. అసలు అందులోని వస్తువులన్నీ కదులుతున్న దిశలో నొక్కుకుపోయి పొట్టివైనట్టుంటాయి. వాటి బరువులు పెరుగుతాయి. అవతలి రాకెట్ వేగం కాంతివేగాన్ని సమీపిస్తున్న కొద్దీ ఈ మార్పులు పెరుగుతాయి. మారనిదల్లా కాంతివేగం ఒక్కటే. అవతలి రాకెట్ ముందు భాగంలో వెనక్కి తిప్పి ఉంచిన ఒక లైట్ వెలుగుతూంటే ఆ కిరణాలు ఆ రాకెట్ వెనక అంచుకు చేరడానికి ఎంత టైము పడుతుందో లెక్క కట్టామనుకోండి. కాంతివేగం పక్కన నిలబడ్డ మనకు ఎప్పటిలాగే సెకండుకు 3 లక్షల కిలోమీటర్లే ఉంటుంది. కాంతి ప్రయాణించే దూరం కాస్త తగ్గినట్టనిపిస్తుందిగాని దానికి తగినట్టే కాలం కూడా కాస్త నింపాదిగా నడుస్తుంది.

భూమి వాతావరణపు పైర పైభాగంలోకి నిత్యమూ వచ్చి పడే కాస్మిక్ కిరణాలు అక్కడ "మ్యూ" కణాలను ఉత్పత్తి చేస్తాయి. రేడియో ధార్మికత కారణంగా ఈ కణాలలో చాలామటుకు కిందికి చేరుకునే లోపల క్షీణించిపోవాలి కాని అలా జరగదు. అతి వేగంగా దూసుకొచ్చే ఈ కణాల విషయంలో కాలం అక్షరాలా మందగించడంతో ఇవి ఉండవలసినదానికన్నా ఎక్కువ సంఖ్యలో భూమి మీద పరికరాలను చేరుకుని, వాటిలో నమోదవుతాయి. ఇది సరిగ్గా ఐన్‌స్టయిన్ సాపేక్ష సిద్ధాంతం చెప్పినట్టే జరుగుతుంది.

ఐన్‌స్టయిన్ ప్రతిపాదించిన జనరల్ థియరీ ఆఫ్ రిలెటివిటీలో గురుత్వాకర్షణ కూడా పరిగణనలోకి వస్తుంది. ఇందులో కదులుతున్న వ్యవస్థల్లో వేగవృద్ధి కలిగితే ఏమవుతుందో వర్ణించబడింది. భూమి మీదికి జారవిడిచిన వస్తువులన్నీ భూమ్యాకర్షణవల్ల అంతకంతకూ పెరిగే వేగంతో భూమిని తాకుతాయి. అవి మొదటి సెకండులో 32 అడుగులూ, రెండో సెకండులో 64 అడుగులూ పడుతూ వేగవృద్ధిని సాధిస్తాయి. అంతరిక్షంలో అన్ని గ్రహాలకూ దూరంగా ఉన్న రాకెట్‌లోని మనిషి భారరహిత స్థితిలో తేలుతూ ఉంటాడు. ఆ రాకెట్ సరిగ్గా భూమ్యాకర్షణకు సమానమైన వేగవృద్ధితో "పైకి" కదిలితే రాకెట్ నేల అతని కాళ్ళకు వచ్చి తగులుతుంది. బయటేం జరుగుతోందో చూడలేకపోతే ఆ వ్యక్తికి భూమి మీద నిలుచున్నట్టే అనిపిస్తుంది.

జనరల్ థియరీ ఆఫ్ రిలెటివిటీవల్ల గురుత్వాకర్షణ అనేది రేఖాగణితపు సమస్యగా రూపొందింది. ఒక బిందువు నుంచి ప్రసరించే కాంతి మరొక బిందువును చేరటానికి వీలున్నంత తక్కువ టైములో - అంటే సరళరేఖలో ప్రయాణిస్తుంది. రెండు బిందువులను కలిపే గీతల్లోకెల్లా చిన్నది సరళరేఖ ఒక్కటే అయి ఉండాలని లేదు. ఉదాహరణకు ఒక గోళాకారపు వస్తువు మీద రెండు చుక్కలు పెడితే వాటిని కలిపే గీతలన్నీ వలయాకారంలో ఉండక తప్పదు. మనదేశం నుంచి ఏ అమెరికాకో పోవాలంటే భూమిని చొచ్చుకొని సరళరేఖలో పోలేం కనక వలయాకార మార్గంలో వెళతాం. అంతరిక్షంలో పెద్ద పెద్ద వస్తువుల గురుత్వాకర్షణ కారణంగా ఇటువంటి "వికృతి" ఏర్పడుతుందని ఐన్‌స్టయిన్ ప్రతిపాదించాడు. నాలుగు చెరుగులా సాగదీసి పట్టుకున్న రబ్బరు గుడ్డమీద బరువైన వస్తువును ఉంచితే అది దిగలాగుకుపోతుంది. ఆ పరిస్థితిలో దానిమీద చిన్న చిన్న గోళీకాయలను తిన్నగా దొర్లించడం వీలవదు. అదే పద్ధతిలో ద్రవ్యరాశి ఎక్కువగా ఉన్న సూర్యుడి పరిసరాల్లోని స్థలం వికృతి చెందుతుంది. ఇక దాని చుట్టూ తిరిగే గ్రహాలన్నీ దీర్ఘవృత్తాకార కక్ష్యలలో తిరగక తప్పదు. నారింజపండు మీద పాకుతున్న చీమల్లాగా సూర్యుడి చుట్టూ గ్రహాలూ, గ్రహాల చుట్టూ ఉపగ్రహాలూ అన్నీ వలయాకార కక్ష్యలలోనే తిరగవలసివస్తుంది. కాంతి కిరణాలు కూడా అటువంటి పరిస్థితుల్లో ఐన్‌స్టయిన్ చెప్పినట్టే అతి తక్కువ సమయం పట్టే వక్రమార్గాన్ని అనుసరిస్తాయని రుజువైంది. సూర్యబింబానికి వెనక భూమి మీదున్న మనకు కనబడకుండా ఉండవలసిన నక్షత్రం ఒకటి సూర్యగ్రహణ కాలంలో కనబడసాగింది. దాని కాంతిరేఖలు సూర్యుడి గురుత్వాకర్షణకు లోబడి, వంగి భూమిని చేరుకున్నాయి. స్థలకాలాలు గురుత్వాకర్షణవల్ల ప్రభావితం అవుతాయని ఐన్‌స్టయిన్ రుజువు చేశాడు.

మొత్తం మీద కాలం అనేది మన గడియారాలకే పరిమితం కాదు. అంతరిక్షంలోని బ్రహ్మాండమైన దూరాలూ, ఊహించరానంత పెద్ద గ్రహాలూ, నక్షత్రాలూ మొదలైన వాటి విషయంలో కాలానికి మరొకరకమైన అర్థం ఏర్పడుతుంది. "కాలజ్ఞానం" గురించి ప్రవచనాలు చేసే మూఢులకు ఇటువంటి విషయాలేవీ పట్టకపోవచ్చు అది వేరే సంగతి. **(ఇంకా వుంది)**

చర్చ

'ఆమె తలాక్ అన్నది' కథలో లోపాలు, విమర్శలో లోపాలు

☆ మద్దూరు లక్ష్మి

గత సంవత్సరం ఏప్రిల్ అరుణతారలో వడ్డెబోయిన్ శ్రీనివాస్ కథ 'ఆమె తలాక్ అన్నది' అచ్చయింది. దాని మీద అలీ అభ్యంతరం - బి.సైదులు, ఎన్. వెంకటేశ్వర్లు, బాసిత్, హజరత్ అలీగార్ల ప్రతిస్పందన వరుసగా అచ్చయ్యాయి. శ్రీనివాస్ కథలో అవగాహనాలోపాలు, నిర్మాణలోపాలు ఉన్నట్టే ఈ మొత్తం చర్చలో కూడ అయోమయం ఉన్నది. అయినా అందులో పట్టించుకోవలసిన, చర్చించవలసినవీ ఉన్నాయి. అవన్నీ ఎత్తిచూపి, విశ్లేషించి విమర్శించాలంటే పెద్ద వ్యవహారం అవుతుంది. కథలోకి పలాన విషయం ఎందుకు వచ్చింది? ఏ ప్రయోజనం కోసం? అందులో సహజత్వం ఉన్నదా? అనే ప్రశ్నలు తలెత్తేందుకు ఎంత అవకాశం ఉన్నదో, ప్రతిస్పందనలన్నిటిలో నేరుగా కథకు సంబంధం లేని యితరేతర అంశాలూ అట్లానే వచ్చాయి.

యిది మన చర్చా పద్ధతికి ఒక ఉదాహరణ.

ఏదైన ఒక సంఘటన, అనుభవం యధాతథంగా జరిగింది జరిగినట్టుగా కథ కాజాలదని, మానవ జీవితంలో జరగడానికి అవకాశం ఉన్నదీ, అలా జరిగేందుకు ఉన్న అనేక కారణాల, పర్యవసానాల రీత్యా విశ్వసనీయతను సంపాదించుకోగలిగిందే కథ అవుతుందనీ విమర్శకులు చెప్తుంటారు. శ్రీనివాస్ కథలోనూ, దాని మీద చర్చలోనూ ముఖ్యమైన అంశం - హిందూ ముస్లిం సంబంధాలు. యింకా బాగా చెప్పాలంటే హిందూ - ముస్లిం వివాహ సంబంధాలు. అంత సున్నితమైనదీ, సంక్లిష్టమైనదీ కావడం వల్లనే యింత చర్చ జరిగింది.

మన సమాజంలో ఈనాటికీ ముస్లింలు ఎదుర్కొంటున్న ఒక ప్రత్యేక పరిస్థితి రీత్యా హిందూ - ముస్లిం వివాహ సంబంధాల క్లిష్టత మీద మన అస్పష్టతకు, సందేహాలకు అవకాశం ఉన్నది. 'ఆమె తలాక్ అన్నది' లోకి అట్లా సహజంగానే క్లిష్టత వచ్చింది. మరికొంత అనవసరమైన క్లిష్టత కూడ వచ్చి వివాదస్పదమైంది. ఇది కథా నిర్మాణం మీద, రచయిత ఉద్దేశ్యాల మీద సందేహాలకు కారణమైంది.

పేదరికం వల్ల రజియా నలుగురు బిడ్డల ఇమాంసాబ్ యింటికి రెండో భార్యగావెళుతుంది. సుల్తానాకు జన్మనిస్తుంది. సుల్తానాను కనడం తండ్రికి ఇష్టంలేదని కథలో వుంది. మామూలుగా ఇమాంలాంటి వాళ్ళు తన పిల్లలకు తల్లి కావాలనే పెండ్లి చేసుకుంటారు కాబట్టి ఆమేరకు సుల్తానా పుట్టుక అతనికి ఇష్టంలేకపోవడం నమ్మశక్యమే. విచిత్రమేమంటే సవతి పిల్లలను అపురూపంగా చూసుకున్న రజియా సొంత బిడ్డను ఘోరంగా నిరాదరిస్తుంది. సవతిపిల్లల్ని ప్రేమించకపోతే, బాధ్యతగా లేక పోతే లోకం ఏమంటుందో అనే వెరపు ఉండవచ్చుగాని, సొంతబిడ్డను అంతగా నిరాదరించడం ఎట్లా సాధ్యమైంది? అనే సందేహం పాఠకులకు కలుగుతుంది. పిల్లలపట్ల ప్రేమ విషయంలో అంత ఔన్నత్యం చూపిన రజియాలో అదే యింకో పాపపట్ల (అదీ సొంత బిడ్డపట్ల) నిరాదరణ ఉండటం పాఠకులకు ఎంతకూ మింగుడుపడదు. ప్రేమతో నిండిన వ్యక్తిత్వంలో ఉండజాలని లోపంగా కనిపిస్తుంది.

ఇక్కడి నుండి కథపట్ల పాఠకుల అనుమానాలు ప్రారంభమవుతాయి. సవతిపిల్లల పెండ్లిండ్లు వగైరా అన్నీ అయిపోతాయి. సుల్తానాకు మేనరికం సంబంధం వస్తుంది. అప్పుడామె తన మెళ్లో ఉన్న తాళి తీసి చూపిస్తుంది. రామశాస్త్రిని పెళ్లి చేసుకొని ఉంటుంది. అప్పటిదాకా అది రహస్యమే. యిదెట్లా సాధ్యం అని యింకో సందేహం! సవతి అక్కలు, అన్న, తండ్రి ఆమెను తిట్టి, కొట్టి యింట్లోంచి గెంటేస్తారు. 'దాని గురించి మనం పట్టించుకున్నమా ?' అని తల్లి రజియా మొదటిసారిగా పశ్చాత్తాపంతో కూడిన సమర్థన పలికినందుకు ఆమెను కూడా గెంటేస్తారు.

రజియా పుట్టింటికి వస్తుంది. అక్కడ ముసలి తల్లిదండ్రులు, పేదరికం. తమ్ముడు - మరదలు ఆమె రాకమీద పోట్లాడుకోవడంతో సుల్తానా వచ్చి తల్లిని తమ యింటికి తీసికెళుతుంది. అదొక సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబం. సుల్తానాను ఆ కుటుంబం ఎట్లా స్వీకరించిందో కథలో లేదు. కాకపోతే పెళ్లి అప్పుడు జరగాల్సిన గొడవలన్నీ జరిగాయి కాబట్టి - అనే ఒక వాక్యం ఉంటుంది. దాంతో రజియాను కూడా రానిచ్చారు. అయితే ఒకపక్క బ్రాహ్మణ పూజాపునస్కారాలు సాగుతుంటే, యింకోపక్క రజియా నమాజ్... గొడవలకు కారణమవుతుంది.

భర్త, సవతిపిల్లలు, తమ్ముడు మరదలు తిరస్కారానికి గురయిన రజియా కూతురు - అల్లుడు యింట్లో తలదాచుకోవడానికి వెళ్ళి అక్కడ వున్న భిన్నమైన వాతావరణంలో నమాజ్ చేయడం, అదే ఘర్షణలకు దారి తీసి, ఉమ్మడి కుటుంబం చీలిపోయి రామశాస్త్రి సుల్తానా వేరే కాపురం పెట్టడం... రజియా అక్కడ ఏ అవంతరాలు లేకుండా నమాజ్ చేసుకోగలగడం... ఇదంతా ఎక్కడో పాఠకుల నమ్మకాన్ని దూరం చేసుకుంటుంది.

అయినా రజియాకు ఒంటరితనం, ఆత్మహత్య ప్రయత్నం, రెండు మతాలకు చెందిన ఇరు కుటుంబాల వాళ్ళు రామశాస్త్రి సుల్తానాలను వెంటాడి వేధించడం, కూతురు అల్లుడు కోసమైనా రజియా సంతోషంగా ఉన్నట్టు నటించడం, కాని ఆమెలో దాగి ఉన్న వ్యధను వాళ్ళు గుర్తించడంతో ఒక పరిష్కారం వెతకాలనుకుంటారు.

అదేమంటే, రామశాస్త్రి ముస్లిం మతంలోకి మారాలనుకుంటాడు. రెండు మతాలకు సంబంధించిన పెద్దలతో మసీదు దగ్గర పంచాయితీ పెడతాడు. రజియా ఖురాన్‌ను, రామశాస్త్రి భగవద్గీతను తీసుకుని పంచాయితీకి వెళతారు. రామశాస్త్రి భగవద్గీత మీద ప్రమాణం చేసి తను ముస్లిం మతంలోకి చేరుతానని చెప్తాడు. సున్తీ చేయించుకుంటానంటాడు.

దాని మీద అవతలి పక్షం వాళ్ళు మండిపడతారు. భగవద్గీత మీద ప్రమాణం చేసి ముస్లిం మతంలోకి వస్తాడట అని హేళన చేస్తారు. యిదికాదని, యిరు మతల పెద్ద మనుషులు కూడబలుక్కొని ఒక తీర్పునిస్తారు. యిప్పటికిప్పుడు సుల్తానా - రామశాస్త్రి విడిపోయి స్వమతంలో పెళ్లిళ్ళు చేసుకోవాలి. అప్పుడు రజియాను ఇమాంసాబ్ యింటికి తీసికెళ్తాడు అంటారు.

రజియాకు కోపం వచ్చి 'నేనే ఇమాంసాబుకు తలాక్ చెప్తున్నా' అని ఖురాన్ మీద ప్రమాణం చేసి వెనక్కి తిరుగుతుంది.

పంచాయితీ సన్నివేశం దగ్గర్నుండి కథలో డ్రామా మీద ఎక్కువైంది. రామశాస్త్రి - సుల్తానాల మతాంతర వివాహాన్ని రజియా సమర్థించినందుకు (బలంగా సమర్థించినట్టు కూడా కథలో లేదు) ఆమెను భర్త, పిల్లలు కలిసి కొట్టి బయటికి తోసివేయడం అనే ప్రధానమైన మలుపు కథలో నమ్మశక్యంగా లేదు. దీనికి పరిష్కారంగా రామశాస్త్రి ముస్లిం మతంలోకి వెళ్లాలనుకుంటాడు. దానికి రెండు మతాల పెద్దలతో పంచాయితీ ఎందుకు? హిందూ మతం నుండి పోదలుచుకున్నప్పుడు ఆ మతస్తుల సమ్మతికోరుకోవడం ఎందుకో అర్థంకాదు. స్వీకరించవలసిన ముస్లిం మతస్థుల సమ్మతి అవసరం అంటే కొంచెం అర్థం ఉంది. అంతకు మించిన సందేహం యింకోటి - భగవద్గీత మీద ప్రమాణం చేసి మతం మారుతానని చెప్పడం ఏమిటి? యిది తన మతం మీద విశ్వాసం పోలేదని సూచిస్తుంది. సహజంగానే అవతలి మతస్థులకు యిది మింగుడుపడదు. స్వీకరించవలసిన ఏ మతస్థులకైన యిది విచిత్రంగానే తోస్తుంది. విశ్వాసాలను మార్చుకోకుండా, మతాంతర వివాహమనే సామాజిక సంబంధం వల్ల తలెత్తిన సంఘర్షణను నివారించడానికి మతం మారుదాం అనుకున్నాడా? దీన్ని మత వ్యవస్థలు అంగీకరిస్తాయా? ఏదైనా కమ్యూనిటీ బైటివాళ్ళను తనలోకి తీసుకోవడానికి ఏ ప్రమాణాలను పెడుతుంది? నిజానికి అలాంటి ప్రమాణాలే కమ్యూనిటీ ఉనికికి చాలాసార్లు నిర్ణయాత్మకం అవుతుంటాయి. కమ్యూనిటీలోని సభ్యులకు అవి బలాన్నిస్తుంటాయి. వాటికి

లోబడకుండా ఆ కమ్యూనిటిలో భాగం అవడం అసాధ్యమే. రామశాస్త్రి యివన్నీ ఆలోచించాడా? అని సందేహం! తమ ముందున్న సమస్యకు యిది పరిష్కారమా? అనే దానితోపాటు దీన్ని ఏస్పృహతో ఎంచుకున్నాడు? అనే ప్రశ్న తప్పించుకోలేనిది. విచిత్రం ఏమంటే రెండు మతాల పెద్దలు మత స్పృహను చక్కగా ప్రదర్శించి తీర్పు చెప్పారు. దీనికి రజియా రామశాస్త్రి పద్ధతిలోనే ప్రతిస్పందిస్తుంది. ఖురాన్ మీద ప్రమాణం చేసి భర్తకు తలాక్ యిస్తుంది. తలాక్ అనే పద్ధతి ముస్లిం సమాజంలో వివాహ సంబంధాల రద్దు సూత్రం. కాకపోతే అది ప్రత్యేకంగా భార్యను వదిలేయదలచుకున్న భర్తకు ఉద్దేశించిన సూత్రం. దాన్ని ధిక్కరిస్తూ స్త్రీ అయి ఉండీ తనే భర్తకు తలాక్ చెప్పడం యిందులోని విశేషం. అయితే ఈ పనంతా ఆమె ఖురాన్ సాక్షిగా చేస్తుంది. పైగా ఆమె ఏ మతానికీ మనసుల్ని అర్థం చేసుకునే గుణం లేదని అంటుంది. యిది ఒక అవగాహనకు సంబంధించిన మాట. ఆమె తలాక్ ఎట్లా అంటుంది? యిస్లాం నియమాలు ఒప్పుకోవు అని అనవసరమైన చర్చ జరిగింది కాని, అది ఆమె ధిక్కారానికి గుర్తని చెప్పవచ్చు. కానీ ఖురాన్ మీద ప్రమాణం చేయడం ఏమిటో అర్థం కాదు. మతం మనసును పట్టించుకోదని చెప్పగలిగినా, భర్తను వదిలి ఒంటరిగా జీవించదలచుకున్నా, ఒక మత సంబంధమైన సూత్రాన్ని తలకిందుల చేయదలుచుకున్నా ఆమె కమ్యూనిటీని మాత్రం కాదనదలుచుకోలేదు అని అర్థం చేసుకోవాలేమో! అయితే రామశాస్త్రి ప్రవర్తన యిట్లా అనుకోవడానికి వీలులేదు. అతను మతం వదలాలనుకుంటాడు. కానీ ఆ మత విశ్వాసాన్ని వదలుకోదల్చుకోలేదు. పైగా ఆ మతం మీద ఆనతో ఈ మతంలో చేరతానంటాడు. ఈ కథలో హిందూ - ముస్లిం సంబంధాల సంఘర్షణలోకి రచయిత పూజలు - నవాజ్‌లు; భగవద్గీత - ఖురాన్‌లు తెలిసి తీసుకవచ్చాడో, తెలియక తీసుకొని వచ్చాడోగాని అవే చర్చనీయాంశం కావడం అటుంచి కథ నిర్మాణానికి, సహజత్వానికి, విశ్వసనీయతకు అవరోధంగా తయారయ్యాయి. కథ విశ్లేషణలో ముందు లోపాల గురించి పట్టించుకొని వుంటే అలీకి అనవసరమైన కోపం వచ్చి ఉండేది కాదు. మగవాళ్లే తలాక్ అంటారనేది మత నియమం. మత నియమాలకు, ధర్మశాస్త్రాలకు లోబడి ఆధునిక యుగంలో సాహిత్య సృజన జరగదు. రెండు మతాలకు చెందిన స్త్రీ పురుష సంబంధంలోని సంఘర్షణ యావత్తూ ఆ మతాల నియమాలకు లోబడి చిత్రించాలని, అందులోని పాత్రలు విధిగా వాటికి అనుగుణంగా ప్రవర్తించాలని నియమం ఎందుకు ఉంటుంది? అట్లా ఎవరైనా రాస్తారేమోగాని అది సామాజిక స్పర్శ కలిగిన రచన అని చెప్పడానికైతే వీల్లేదు. మతసముదాయపు జీవితాన్ని ధర్మం వైపు నుండి మాత్రమే చూడదలుచుకుంటే సామాజిక శాస్త్రాల అవగాహన ఎందుకు? ఈ కథలో రెండు మతాలకు చెందిన పెద్దలు మత స్పృహపరిధిలో తీర్పు ప్రకటిస్తే రజియా తనదైన పద్ధతులో ప్రతిస్పందించింది. నిజానికి ఆమె కూడా తన సమస్యను మతగ్రంథం సాక్షిగానే, మత నిమయం అనే మాధ్యమం ద్వారానే - కాకపోతే దాన్ని తిరగేసి ప్రవచించి పరిష్కారం వెతుకుటుంది. అంత వరకే తేడా. అలీ లాంటి వాళ్లు ఆందోళన పడాల్సిన పనిలేదు. ఎందుకంటే కథలోకి వచ్చిన పాత్రల మనస్తత్వంలో, అవగాహనలో విస్తృతి ఉన్నట్లుగానే పరిమితి కూడా ఉన్నది. సుల్తానాను మతాంతర వివాహం చేసుకున్న రామశాస్త్రి శుద్ధ బ్రాహ్మణుడిగానే కొనసాగాడు. వాస్తవ జీవితంలో అనేక సంక్షోభాలు ఎదుర్కొన్న రజియా అన్యమతస్తుడైన అల్లుని దగ్గరికి వచ్చినప్పుడు కాని, పంచాయితీలో నిర్ణయం ప్రకటించినప్పుడు గాని, మత విశ్వాసాల పునాదిమీదనే నిలబడింది. పాత్రలకు మత విశ్వాసాలుండటంకంటే, వాటిని ప్రదర్శించుకున్న సమయ సందర్భాలు, పద్ధతులు కథలో సహజత్వాన్ని భంగపరిచాయి. అవే వివాదాస్పదం అయ్యాయి. మతం వైపు నుండి ఆలోచించిన వాళ్లకు రామశాస్త్రి నిర్ణయం ప్రకటించిన తీరు కథలో సవతికొడుకు ఖాజావలెనే అభ్యంతరం అవుతుంది. సరిగ్గా అలీ ప్రతిస్పందనకు అదే కారణం అయింది. కాకపోతే ఏకంగా రచయితకు హిందూత్వ అపాదించేదాక వెళ్లిపోయి, ఆ తరహా భాషలోనే అంతా మాట్లాడారు. కనీసం కథ వరకే పరిమితమైనా అది నిజం కాదు కాబట్టి యితరులు తమతమ పద్ధతుల్లో ప్రతివాదన చేశారు.

పంచాయితీ ఉందనగానే రజియా బట్టలు సర్దుకొని, ఖురాన్ తీసుకుని బయలుదేరుతుంది. బహుశా పంచాయితీ అయితే తనను భర్త తీసికెళ్తాడనే ఉద్దేశ్యంతో కావచ్చు. పాఠకులకూ అదే స్ఫురిస్తుంది. కానీ అక్కడ రామశాస్త్రి ప్రకటనకు కంగారు పడుతుంది. కాసేపయ్యాక యిరుమతాల పెద్దలు తమ నిర్ణయం చదువుతారు. అప్పుడు రజియా పరిస్థితి ఏమిటి? తప్పని సరిగా ఆమె ప్రతిస్పందనే కథ ముగింపు అవుతుంది. మత స్పృహతో కూడిన పెద్దల నిర్ణయం పట్ల, అదే మత పరిధిలో ఒక సూత్రాన్ని ధిక్కరిస్తూ వాళ్ళ నిర్ణయం పట్ల తన నిరసన తెలియజేస్తుంది. ఒక వేళ ఆమె తలాక్ అనకుండా కూడా - తన సంసారం కుదటపడటానికి ఏ పంచాయితీలు అక్కర్లేదు, ఎవరూ విడిపోవనవసరం లేదు, నేనే ఆయనతో కలిసి ఉండదలుచుకోవడం లేదు, నేనే నాభర్తను వదిలేస్తున్నా అని ఉండవచ్చు. అలీకి రజియా తన భర్తను వదిలేసినందుకు అభ్యంతరం లేదనుకుంటాను, తలాక్ అన్నందుకే. కాని ఈ ముగింపు కోసం రచయిత కథను ఆ దిశగా ఉద్దేశపూర్వకంగానే నడిపించాడు. దానికోసం అనేకసార్లు అనవసరంగా భగవద్గీతను, ఖురాన్‌ను తీసుకొని వచ్చి కథను దెబ్బతీశారు కూడా. రజియా తలాక్ అనడం గురించే కాక, కథ మొత్తాన్ని సమగ్రంగా చూచి వుంటే చర్చ యింకోలాగ వుండేది. అలీ రాసిన దాని మీద స్పందించిన వాళ్లు కూడా కథలోపలికి వెళ్లలేదు. కథతో సంబంధంలేని అనేక విషయాలు రాశారు. ఇవన్నీ చెప్పుకున్నా కూడా- ఇంతకు కథ ఇట్లా ఎందుకు తయారయింది? అనే ప్రశ్న మిగిలే వుంటుంది. అది జీవితంలోని ఓ అనుభవం, సంఘర్షణ కథగా మారే ప్రక్రియకు సంబంధించింది. అది కేవలం కథా నిర్మాణానికి సంబంధించిందే కాదు. అది కూడా కావచ్చుకాని అంతకంటే లోతైందీ, గంభీరమైంది.

(ఈ చర్చ ఇంతటితో ముగిస్తున్నాం - సంపాదకవర్గం.)

అరుణతార ఎడిటర్ గార్కి,

లాల్‌సలామ్,

డిసెంబర్ 2005 అరుణతార సంచికలో, పాణి రాసిన 'రెండు విప్లవ కథలు : ఒక పరిష్కార మార్గం' అనే సమీక్ష చాలా బాగుంది.

నేను ఈ సంచికను ఫిబ్రవరి రెండవ వారంలో (2007) చదివాను. మాకు పత్రికలు లేట్‌గా అందుతాయని మీరూహించగలరనుకుంటా.

మేము అంటే విప్లవకారులం (ముఖ్యంగా నేను) కథ రాయాలనుకుంటే వస్తువును దానికి సంబంధించిన పాత్రలను ఊహించుకొని కథ అల్లుతూ పోతాను. ముఖ్యంగా జరిగిన ఘటనల ఆధారంగాకథ అల్లుతూపోతాను. కొన్ని కథలకు పరిష్కారం చూపుతాను. ఇంకొన్ని కథలల్లో పరిష్కారం పాఠకులే నిర్ణయించాలని వదిలేస్తాను.

అయితే పాణి సమీక్ష చదివాక కథను రాసే ముందు దాన్ని ఎంత లోతుగా చెప్పాలి అనేది కూడా అర్థమయ్యింది. పాణి అన్నట్టుగా నిజంగానే ఈ మధ్య వృత్తి విప్లవకారులు రాస్తున్న కథలల్లో ప్రజల 'సామూహిక పాత్ర' పోరాటంలో వ్యక్తమయ్యేలా రాసిన తక్కువగా వుంటున్నాయి. అలారాయాలి అని కూడా నాకైతే అర్థం కాలేదు ఇంతవరకు.

ఇదే సందర్భంగా నాకో సందేహం కూడా వచ్చింది. ప్రజల సామూహిక పాత్రను పోరాటంలో వ్యక్తమయ్యేలాగా అంత విస్తృతంగా కథను రాయగలమా అన్పించింది. నవలలో అయితే రాయగలమేమో అని కూడా అన్పించింది.

మాకున్న సమస్యల రీత్యా సాహిత్యాన్ని చదవడమూ తక్కువే. ఇక సాహితీ చర్చలనేవి దాదాపు మృగ్యం అని చెప్పుకోవచ్చు. మీకులాగా సాహిత్య పాఠశాలలు, క్లాసులు, చర్చలు మాకుండవు కదా. ఇలాంటి సమీక్షల ద్వారానైనా మాకు కొంతైనా అర్థమవుతాయి. ఇలాంటి చర్చలు ఇంకా విస్తృతంగా వస్తే కూడా బాగుంటుందని ఆశిస్తున్నాను.

పాణి రాసిన అంశాలు నాకైతే ఎంతో చెప్పాయి. ఇక ముందు కథలు రాసేటప్పుడు తప్పక దృష్టిలో వుంచుకుంటాను.

'తాయమ్మ' కరుణ.

నివేదిక

అమరావతిలో కథకుల సమావేశం

కొత్త తెలుగు సంవత్సరం ప్రారంభమై, ఎండలు పదునెక్కి కాస్త తాపం, ఉక్కపోత - రాత్రిళ్ళు వసంత రుతు ఆహ్లాదం కలగలసిన మూడు రోజులు (మార్చి 25,26,27) కృష్ణానదీ తీరంలో పన్నెండు మంది విప్లవ కథకులు తెలుగు కథ తీరుతెన్నుల గురించి కలబోసుకున్నారు. సమావేశం జరిగిన తీరుతో సహా చర్చించిన అంశాల్లో, అవగాహనల్లో కూడ వైవిధ్యం ఉన్నది.

అల్లంరాజయ్య, తుమ్మేటి రఘోత్తం రెడ్డి, రాధేశ్యాం, నల్లూరి రుక్మిణి, ఆర్.శశికళ, వడ్డెబోయిన శ్రీనివాస్, ఎం.ఎ.బాసిత్, ప్రశాంత్, పరిమళ్, ఎం.శ్రీనివాస్, పి.చిన్నయ్య, పాణి తదితరులు యిందులో పాల్గొన్నారు. మొదట యిప్పటిదాకా విరసం ఆధ్వర్యంలో జరిగిన కథా వర్క్‌షాపుల, కథకుల సమావేశాల రూపకల్పన, నిర్వహణ గురించి అందులో పాల్గొన్న వాళ్ల అనుభవాలు, తమ కథారచనలో, సాహిత్యావగాహనలో వాటి ప్రేరణ గురించి గుర్తుచేసుకున్నారు. అంతేగాక వాటి లోటుపాట్ల గురించి కూడా పరిశీలన జరిగింది. నిర్దిష్టమైన లక్ష్యం. ప్రణాళిక లేకపోతే వర్క్‌షాపుల వల్ల ఆశించిన ఫలితాలు రాకపోయే అవకాశం ఉన్నదని కూడ గుర్తించడం జరిగింది.

1984లో కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి, భూషణం, చలసాని ప్రసాద్ గార్ల పూనిక వల్ల వైజాగ్‌లో జరిగిన వర్క్‌షాపు విప్లవకథ వస్తువు, శిల్పం, భాష గురించి లోతైన చర్చలు జరిగాయి. కారా మాస్టారు ఒక్కో తరహా ప్రాతినిధ్యానికి సంబంధించిన పది కథలు ఎంపిక చేసి, అందరితో చదివించి విశ్లేషణ గావించారు. ఆ సమావేశంలో రావిశాస్త్రి చహోవ్‌కథల గురించి లోతైన పరిచయం చేశారు. చా.సో. 'బండపాటు' కథమీద అభిప్రాయాలు వచ్చాయి.

ఆ తరువాత 1996లో మహానందిలో జరిగిన వర్క్‌షాపుకు చాలా మంది విమర్శకులు, కొత్త కథకులు హాజరయ్యారు. కథా చరిత్ర, కథాసాహిత్యంలో దృక్పథం మొదలైన అంశాల మీద ఉపన్యాసాలు సాగాయి. కొత్త కథకులు చదివిన కథల మీద చర్చ జరిగింది. రచయితల మధ్య మంచి అనుబంధం ఏర్పడ్డానికి దోహదపడ్డ సమావేశం అది.

'లోపూడి'లో జరిగిన వర్క్‌షాపులు కారామాస్టారు 'కథాకథనం' వెలుగులో కథకు ఉండే గ్రామర్ గురించి వివరంగా చెప్పారు. మన కథా విశ్లేషణలో 'కథాకథనం' మంచి రచన. ఆ దృష్ట్యా కొత్త కథకుల రచనలను విశ్లేషించడం వల్ల కథానిర్మాణం పట్ల శ్రద్ధ పెరిగింది. అయితే అప్పటికే గత కథా వర్క్‌షాపుల అనుభవాలను సమీక్షించుకోవలసి ఉండింది. దాని మీద అంత శ్రద్ధ పెట్టలేదు. అలాంటి వాటి మీద సకాలంలో ఎరుకలేకపోవడం వల్ల వర్క్‌షాప్‌ల్లో రావాల్సిన ఫలితాలు రాలేదు. అప్పటికప్పుడు కొత్త కథకులు రావడం అనేది మంచి పరిణామమే అయినా పాత వాళ్ళందరూ కొనసాగకపోవడం వల్ల కూడా అనుభవాలను ముదింపు వేసుకొని వర్క్‌షాప్‌ల నిర్వహణలో పటిష్టమైన పద్ధతులు ఏర్పడలేదు. ఆ మేరకు కథా రచనలో కూడ మంచి పరిణామాలు చోటు చేసుకోలేదు. ఈ వర్క్‌షాప్‌లో సమాజం నుండి రచయితకు వచ్చే అనుభవం, వ్యక్తిగా సహజంగా కలిగే అనుభవం అనే రెండు పాయల్లో వచ్చే జీవితానుభవం ఒక దృక్పథంలో నిర్దిష్టమైన సామాజిక లక్ష్యం కోసం కథా రచనగా పరిణమించే క్రమం గురించి విశ్లేషణ సాగింది. ముఖ్యంగా తెలుగు సమాజం అన్ని ప్రాంతాల్లోని జనజీవితానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కథల గురించి మాట్లాడ్డం జరిగింది.

ఆ మరుసటి సంవత్సరం అరకులో జరిగిన వర్క్‌షాప్‌కు ఒక ప్రత్యేకత ఉన్నది. అప్పటిదాక ప్రధానంగా కథా చరిత్ర, వస్తువు, శిల్పం, కథా నిర్మాణం అనేవి ప్రధానాంశాలుగా ఉన్నాయి కాబట్టి అరకు సమావేశంలో కథాతాత్వికత చుట్టూ ఉపన్యాసాలు, చర్చలు జరిగాయి. చాలా మంది రచయితలు కొత్త కథలు తీసుకుని రావడం వల్ల రాత్రింబవళ్ళు కథాపఠనం, చర్చలు జరిగాయి.

మళ్లీ కొన్నేళ్ళ విరామం తరువాత 'కీసర'లో వర్క్‌షాప్ జరిగింది. ఈ సమావేశానికి సోదర రచయితలు, విమర్శకులు చాలా మంది హాజరయ్యారు. ఇక్కడ ఎక్కువగా ఉపన్యాసాలు నడిచాయి. ప్రముఖ కథా విమర్శకులు వల్లంపాటి వెంకటసుబ్బయ్య కథా నిర్మాణం గురించి, భాష గురించి ప్రసంగించిన సమావేశం యిది. ఆ తర్వాత పెద్ద ప్రణాళిక లేక పోయినా పోరంకిలో, హైదరాబాదులో వర్క్‌షాప్‌లు జరిగాయి. కొత్త రచయితలు కథారచనల్లో ఎదుర్కొంటున్న యిబ్బందుల గురించి, ముఖ్యంగా ఒక వస్తువును కథగా మలచడం ఎలా, అందులో వైవిధ్యాన్ని తీసుకురావడం ఎలా అనే అంశాలపై చర్చలు జరిగాయి. కథా రచనలో అనుభవం ఉన్నవాళ్ళు తమ అనుభవా వైపు నుండి ఈ సమస్యలపై మాట్లాడారు.

ఈ సమావేశాల్లో పాజిటివ్ విషయం ఏమంటే - ముందుగా ప్రణాళికను సిద్ధం చేసుకొని, దాని కోసం శ్రమించి నిర్వహించినవి కొన్నయితే పెద్దగా ప్రణాళిక లేకుండానే హాజరయిన వాళ్ళ అవసరాలు, అప్పటికి కథా సాహిత్యంలో చర్చనీయాంశాలుగా ఉన్న అంశాలు కేంద్రంగా సాగినవి మరికొన్ని. ఏదేమైనా ఉద్యమ దృక్పథంతో కథా రచనలోకి ప్రవేశిస్తున్న వాళ్లు, కొంత అనుభవం గడించిన వాళ్ల కథారచనలో నిలదొక్కుకోవడానికి ఈ సమావేశాలు దోహదపడ్డాయి. ఈ వర్క్‌షాప్‌ల నుండే అనేక మంది కథకులుగా తయారయ్యారు. అయితే నిర్దిష్టమైన ప్రణాళికతో నిర్వహించకపోవడం వల్ల, మళ్లీ ఇంకో సమావేశం ఎప్పుడు, ఎలా జరగాలో రూపకల్పన లేక పోవడం వల్ల ఆ సమావేశానికి వచ్చిన రచయితల కథల గురించి, అందులోని లోటుపాట్ల గురించి మళ్లీ సమిష్టిగా పట్టించుకొని వాళ్లు ముందుకు పోవడానికి మెరుగైన పద్ధతులు రూపొందించుకోక పోవడంతో యాదృచ్ఛికత కొనసాగింది.

అమరావతి సమావేశానికి వచ్చిన రచయితలు స్థూలంగా ఈ పరిశీలనలు చేశారు. వీరిలో చాలా మంది గత వర్క్‌షాప్‌లలో పాల్గొన్నవాళ్లే కాబట్టి గత అనుభవాలను మదింపు వేసుకుని ఈ సమావేశాన్ని ఎలా కొనసాగించాలి? అనే దాని మీద ముందుగా చర్చించారు.

ఈ సమీక్ష తర్వాత మూడురోజులు సమావేశాన్ని ఏ ఏ అంశాల ప్రాతిపదికపై కొనసాగించాలో ఒకసారి అందరూ మాట్లాడారు. అన్నింటిలో నుండి నాలుగు అంశాలు ముందుకు వచ్చాయి. 1. ఇప్పుడు వస్తున్న 'మంచి' కథలు అనే వాటిని ఎలా అర్థం చేసుకోవాలి? 2. విప్లవ కథ ఎలా ఉన్నది? 3. ప్రస్తుత సామాజిక, ఉద్యమ స్థితిలో విప్లవకథ ఎలా రాయాలి? 4. గత వర్క్‌షాప్‌ల అనుభవాల దృష్ట్యా విప్లవ కథా రచనలో ఉన్న సంప్రదాయం దృష్ట్యా కథారచనలో సమిష్టి కృషి కొనసాగించడానికి ఉన్న అవకాశాలు ఏమిటి?

ఈ నాలుగు అంశాలను విడివిడిగాను, కొత్త కథలు చదివినప్పుడు వాటిపై చర్చలో భాగంగాను అందరూ విశ్లేషించారు. ఆ రకంగా ఈ సమావేశం - రచనా క్రమంలో ఎదురవుతున్న యిబ్బందులు వాటికి పరిష్కారాల దగ్గరి నుండి కథ రాశాక లేదా ఏదైన కథ చదివాక కలిగే అనుభూతులను ఎట్లా అవగాహన చేసుకోవాలి? అనే దాకా విస్తరించింది. పాఠక, రచయిత, విమర్శక స్థాయిల నుంచి కథా సాహిత్య దృక్పథాన్ని కలబోసుకున్న సమావేశం ఇది.

ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగుకథలో వస్తు వైవిధ్యం పెరిగినప్పటికీ అవగాహనపరంగా చర్చించాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. వ్యవసాయం, వృత్తులు, కళా సాంస్కృతిక రూపాల విధ్వంసం గురించి రాస్తు... ల్లో ఆందోళన, ఆవేదన కనిపించినంతగా సామాజిక చలనాలపట్ల చారి... దృష్టిలో కూడిన స్పష్టత ఉండటం లేదు. గతాన్ని తలపోయడం గురించి రచయిత ఏమనుకున్నదీ గందరగోళంగా ఉంటోంది. వ్యవసాయ సంక్షోభం మీద, రైతుల ఆత్మహత్యల మీద వస్తున్న కథలన్నీ చావుతో ముగిసిపోతున్నాయి. నిజానికి. చావు దగ్గర మొదలు పెట్టి దానికి దారి తీసిన పరిస్థితులను, ఆ తరువాత

పరిణామాలను రైతాంగ జీవితంలో చిత్రించడం అవసరం. విధ్వంసం గురించి రాస్తున్నారుగాని దాని మధ్యనే మనుష్యులు నిలబడడానికి చేస్తున్న ప్రయత్నం అప్రధానం అయిపోయింది. గ్లోబలైజేషన్ గురించి ఇప్పటికి మనకున్న ఆలోచనలు, అవగాహనలు చాలవు. కొన్ని కథల్లోకి అసహజ వైరుధ్యాలు వస్తున్నాయి. వాస్తవిక సమస్యను అసహజ వైరుధ్యాల దృష్టితో చూచినప్పుడు కథా నిర్మాణం ఎంతబాగా కుదిరినా విశ్వసనీయత సంపాదించుకోవడం కష్టం.

ఇటీవల సాఫ్ట్‌వేర్ రంగం నుంచి కొన్ని కథలు వచ్చాయి. యిట్లాంటివి తప్పక రాయవలసిందే. సంపద పోగుబడే క్రమంలో మనుషులు పైకెదగడం, తద్వారా సంక్షోభాలు ఎదుర్కోవడం గురించి రాస్తున్నారు. ఇలాంటి కథలకు మంచి గుర్తింపు కూడ వస్తోంది.

మొత్తం మీద తెలుగు కథలోకి ఉదారవాద, సంస్కరణ దృక్పథం ప్రవేశించింది. మంచి కథలకున్న వాటి సంఖ్య, వాటికి వస్తున్న గుర్తింపు చూస్తే సాహిత్య ప్రపంచంలో ఈ ధోరణి బలంగా ఉన్నట్టే కనిపిస్తోంది. ప్రగతిశీల శిబిరంగా గుర్తించబడుతున్న చోటనే ఈ సమస్య తలెత్తింది. అలాంటి కథలకు బహుమతులు, అవార్డులు రావడం వల్లకూడ ఇది విస్తరించే ప్రమాదం ఉన్నది. వర్గ సంఘర్షణ తీవ్రంగా ఉన్నచోట పరిస్థితులతో సంబంధంలేని కథలు వస్తున్నాయి. చాలా వస్తువైవిధ్యం పెరిగిందని అనుకుంటున్న తరుణంలో కూడ గుర్తించవలసిన అంశం ఏమంటే - కథల్లోకి ఈ వైవిధ్యాన్ని తేవడానికి రచయితలు వ్యక్తిగా, సృజనాకారులుగా, ఆలోచన పరులుగా ఎంత శ్రమ చేస్తున్నారు? అని. కొన్ని కథల్లో కొత్త జీవితం, కొత్త సమస్య కనిపించవచ్చుగాని రచయితలు దాన్ని అలవోకగా గ్రహించి అంతే అలవోకగా రాశారని తెలుస్తుంటుంది. కొన్ని కథలను చదివితే పైకి మంచి కథలనే అనిపించవచ్చుగాని, సామాజిక, మేధో, సృజనాత్మక రంగాల్లో ఏ కొంచెం శ్రమ చేయజాలని వాళ్ళు కథా ప్రక్రియను ఎంచుకుంటున్నారా? అనే భయం కలుగుతుంది.

కొత్త పరిస్థితులు, విభిన్న జీవిత నేపథ్యాల్లోంచి రచయితలు రావడం, కొత్త యితివృత్తాలు తెలుగు కథకు మంచి బలాన్నే యిస్తున్నాయి గాని ఉదారవాద వైఖరి వల్ల, జీవితానుభవాన్ని - వాస్తవికతను పదేపదే తరచి చూసుకోగలిగే ఓపిక, శ్రమ, సంఘర్షణ లోపించడం వల్ల కథలు బలహీనంగా తయారవుతున్నాయి. రియాక్షనరీగా తయారవుతున్నాయి. అర్తితో కూడిన రిపోర్టులుగా మిగిలిపోతున్నాయి. సాహిత్య సృజన భావజాలరంగానికి సంబంధించింది. అలాంటప్పుడు భావనకు ఉండే బలం గుర్తించకపోతే రచన వల్ల చాలా ప్రమాదం వచ్చిపడుతుంది. మార్క్సిస్టు పరిభాషలో చెప్పాలంటే - ప్రజాస్వామిక దృక్పథం ఉన్నట్టు గుర్తింపు పొందిన రచయితల కథలు కొన్ని రివిజనిస్టు ధోరణికి, రియాక్షనరీ ధోరణికి చెందుతాయి. యిలాంటి కథల మీద దృక్పథస్థాయిలో జరగవలసినంత చర్చ జరగడం లేదని సమావేశానికి వచ్చిన రచయితలు కొన్ని కథలను ఉదాహరణ పూర్వకంగా తీసుకొని, రచనలోపలికివెళ్ళి కథ ఎట్లా వ్యక్తమయింది, ఏ వైఖరిని ప్రదర్శించింది? అనే విశ్లేషణ గావించారు.

అట్లాగే విప్లవ కథ గురించి ఒక పూటంత సంభాషణ జరిగింది. ఫ్యూడల్ సమాజ చలనల్లోని కొత్తరూపాలను విప్లవకథ అందుకోలేకపోతోంది. విప్లవకథలో వాస్తవికతా వాద పరిధిలో అనేక ప్రయోగాలు జరిగాయి. ఏదీ ప్రయోగం కోసం ప్రయోగంగా రాయలేదు. శిల్పం అనేది వస్తువును బట్టి, అందులో వచ్చే పాత్రలనుబట్టి, పాత్రల స్వభావాన్ని బట్టి ఉంటుందనే మాట విప్లవకథల్లో గొప్పగా రుజువయింది. వీటి వేటితో సంబంధం లేకుండా శిల్పం గురించి మాట్లాడ్డం, ప్రయోగం గురించి మాట్లాడం కొంతమందికి అలవాటు. వీళ్లకు విప్లవకథల్లోని శిల్పం గురించి ఆలోచించే సహనం లేదు, దృష్టిలేదు. గ్రామీణ జీవితంలోని వైవిధ్యమైన పాత్రలు, మనస్తత్వాలు విప్లవకథల్లోకి విరివిగా వచ్చాయి. గ్రామీణ వ్యవస్థలోని అనేకానేక వైరుధ్యాలు వాటి స్వభావాలు, వాటి పర్యవసానంగా తలెత్తిన ఉద్యమాలు, అల్లకల్లోలమై పోతున్న జీవితాలు రాస్తున్నప్పుడు వాటికి తగిన శిల్పం అందివచ్చింది.

విప్లవకథలో చోదకశక్తి ప్రదర్శితమైన తీరువల్ల వాస్తవ స్థితి చలనశీలంగా కనిపిస్తుంది. వాస్తవికతను యధాతథంగా కూడా గుర్తించవచ్చు. కాని విప్లవం వాస్తవికతలో చోదకశక్తిగా పనిచేస్తుంది కాబట్టి సంఘర్షణ వల్ల తలెత్తే కొత్త చైతన్యాలు, కొత్త వ్యక్తిత్వాలు, కొత్త మార్గాలు విప్లవకథలో చిత్రితమయ్యాయి.

ఈ మధ్య కొన్ని విప్లవ కథల్లో చాలా వైవిధ్యమైన యితివృత్తం ఉన్నా, సరైన వైఖరి ఉన్నా నిర్మాణపరంగా లోప భూయిష్టంగా ఉన్నాయి. కథ రాశాక మళ్ళీ మళ్ళీ తరచి చూచుకోకపోవడం వల్ల లోపాలతో అట్లాగే అచ్చవుతున్నాయి. ముఖ్యంగా క్లుప్తత లోపిస్తోంది. కథకు ఏది అవసరం, ఎందుకు అవసరం అని లోతుగా ఆలోచించాలి. కథ నడిచే కాలం ఎంత? ఎక్కడ మొదలై ఎక్కడ ముగిసింది? ఈ కథాకాలంలో చిత్రించిన పరిణామం ఎట్లా ఉన్నది? మొదలైన పరిశీలనలు అవసరం. విప్లవ కథలో భావజాలం గురించి, నిర్మాణం గురించి మళ్ళీ యింకోసారి కొత్తగా పట్టించుకోవలసిన సందర్భం యిది. కథలో విప్లవ సందేశాన్ని, ప్రస్తావనను తీసుకొని వచ్చేటప్పుడు వస్తువు, పాత్రలు, స్థలకాలాలు, ముఖ్యంగా కథ నడుస్తున్న తీరు ఎంత వరకు అనుమతి యిస్తాయో గమనించాలి. లేకపోతే విప్లవం ప్రస్తావన అసహజంగా వచ్చినట్టు కనిపిస్తుంది. ఇది కథకు నష్టం కలిగిస్తుంది. అసలు ఒక వస్తువును ఎన్ని వైపులనుండి కథగా రాయవచ్చు? అనే పరిశీలనచేస్తే చాలా సహజంగా కథలో విప్లవోద్యమ చిత్రణ సాధ్యమవుతుంది. లేదా సాధ్యమయ్యే పద్ధతిలోనే ఎంపిక చేసుకోవచ్చు. జీవితంలోని వాస్తవిక వైరుధ్యాలను ఎలా చూసి, ఎలా చిత్రిస్తున్నాం ? మనిషి సంఘర్షించడానికి, నిలబడటానికి చేస్తున్న సహజ ప్రయత్నాన్ని ఎలా ఎత్తిపడుతున్నాం? అనేది ముఖ్యం.

ఈ దృష్ట్యానే గతంలో మంచి విప్లవ కథలు వచ్చాయి. మారుతున్న పరిస్థితుల్లో కొత్త సామాజిక దశను చిత్రిస్తున్న కొత్త రచయితలు మళ్ళీ వీటన్నింటి గురించి తెలుసుకోవాలి. తెలుసుకోకపోవడం వల్ల కథ ఏమవుతుంది? అనే ప్రశ్నకు సమావేశానికి హాజరయిన వారి కథలను, మరికొన్ని కథలను ఉదాహరణగా తీసుకుని ఎక్కడెక్కడా ఎట్లా లోపం జరిగిందీ, ఏ లొల్యం వల్ల కథ ఎట్లా నడిచిందీ సునిశితమైన విశ్లేషణ జరిగింది.

యిప్పటిదాకా నడచిన విప్లవ కథను మారుతున్న సామాజిక, విప్లవోద్యమ దశలో ఎట్లా తీర్చిదిద్దాలనే అంశం మీద కూడా అన్వేషణ సాగింది. విప్లవకథ ప్రారంభం నుండి విప్లవోద్యమ దశలను చిత్రించుకుంటూ వచ్చింది. యిప్పుడు ఉద్యమం ఒక ప్రత్యేకమైన సామాజికదశలో, అంతర్గతంగా, బాహ్యంగా సంక్లిష్టమైన సన్నివేశంలోకి వచ్చింది. ఈ దశలో చోదకశక్తిగా ప్రజల క్రియాశీలతను చిత్రించాలి. జీవిత విస్తృతినంతా విప్లవోద్యమ కాన్వాసుమీదికి తీసుకొనివచ్చి, సంఘర్షణకు ఉండే బహుపార్శ్వాలను రాయాలి. అసలు ఇంత వరకు ఏ జీవితాలు, ఏ ప్రాంతాలు సాహిత్యంలోకి రాలేదో గుర్తించాలి. ప్రయత్నపూర్వకంగా వాటిని అనుభవంలోకి, అవగాహనలోకి తెచ్చుకొని రాయాలి. ఎవరికి ఈ అవకాశం ఎక్కువగా ఉంటుందో గుర్తించి వాళ్ళతో రాయించాలి. కథను స్థలకాలబద్ధంగా నిర్మించడానికి, శక్తివంతం చేయడానికి ఉండే అవకాశాలన్నింటినీ పూర్తిగా వినియోగించుకోవాలి.

ఉదాహరణకు పాలమూరు వలస జీవితాల మీద బలమైన, కల్పనా సాహిత్యం రావలసి ఉన్నది. అట్లాగే ప్రకాశంజిల్లాలో ఒక భాగం గురించి కథల్లో రాస్తున్నారు. కానీ యింకోభాగం గురించి రాయవలసి ఉన్నది. కరువు, వెనుకబాటుతనం, పేదరికం ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఉద్యమాలు కూడ సంఘర్షణాత్మకంగా నడుస్తున్నాయి. గత రెండు మూడేళ్ళలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం జిల్లాలాగా నెత్తురోడి అల్లకల్లోమైన ప్రాంతం ఇంకోటి లేదు. దీన్ని ఎవరైనా వ్రాయగలరా? పూనుకోవాలి. విప్లవకథలోని వస్తుబలాన్ని ప్రకటించగల దృక్పథ స్పష్టత పెంచుకుంటూ అందరినీ ఒప్పించగల నిర్మాణం కోసం

ప్రయత్నించాలి సంఖ్యరీత్యా తక్కువే వచ్చిన స్థాయిరీత్యా గణనీయ స్థాయికి తీసికెళ్ళాలి. యిటీవల దశలో కొత్త కంఠస్వరాలు, కథనపద్ధతులు ప్రవేశించడం సంతోషమే. కాని విప్లవకథ కోసం చేయవలసినది చాలా ఉన్నది. ఉద్యమకథ మొదటి నుండీ సమిష్టి కృషిలో భాగంగానే కొనసాగుతూ వచ్చింది. అయితే దానికి చేసిన ప్రయత్నం తక్కువే.

క్రమం తప్పకుండా కథకుల సమావేశాలు జరిగి, రాసిన ప్రతి కథమీద లోతయిన చర్చ జరిగి, తిరగరాసి అచ్చువేయాలి. ప్రతియేట ఒక ప్రణాళిక ప్రకారంగా కథలు సంకలనంగా తీసుకురావాలి. ప్రతి రెండు మూడు నెల్లకు కథలు రాస్తున్న వాళ్ళంతా సమావేశమై ఈ కృషి ముందుకు తీసుకెళ్ళాలి... అని అమరావతి సమావేశం భవిష్యత్‌లో విప్లవకథకు అవసరమైన సన్నాహాలు ఆలోచించింది. రాబోయే సమావేశానికి వచ్చే రచయితలు విధిగా కొత్తకథలు తీసుకొని రావాలని అనుకుంది.

మూడురోజులపాటు సాగిన సమావేశం చివర్లో హాజరయినవారు తమ ప్రతిస్పందన చెప్పడంతో, జరగబోయే సమావేశం ఏట్లా ఉంటే మంచిదో సూచనలు చెప్పడంతో ముగిసింది. ముందుగా నిర్దిష్ట ప్రణాళిక లేకపోయినప్పటికీ కథలగురించి అనేక విషయాలు ఉదాహరణ పూర్వకంగా చర్చించుకోవడం, సమయం వృథాకాకుండా క్రమశిక్షణతో నడవడం, హాజరయిన అందరూ చర్చల్లో సమస్థాయిలో పాలుపంచుకోవడం వల్ల సమావేశం అర్థవంతమైంది, ఆలోచనాత్మకంగా ముగిసింది.

అమరావతి అంటే - ఆహ్లాదకరమైన కృష్ణానది, ఒకనాటి బౌద్ధస్థావరం కావడం వల్ల రోజూ ఉదయం, సాయంకాలం కృష్ణానది స్నానాలు, బోటు ప్రయాణాలు, బౌద్ధ శిథిలాల సందర్శనల మధ్య కూడ కథా రచన గురించి జీవిత పరిశీలన గురించి, రచన అనుభవాల గురించిన కలబోత సంతృప్తినిచ్చింది. అట్లాగే రెండోరోజు సాయంకాలం సాహిత్య మిత్రుడు వావిలాల సుబ్బారావు గారు స్థానిక సాహిత్యాభిమానులతో చిన్న సమావేశం, ఏర్పాటు చేశారు. అందులో సాహిత్యం గురించి, సమాజం గురించి, భాషా సంస్కృతుల గురించిన సంభాషణ ఆసక్తికరంగా నడిచింది. అమరావతి సమావేశం విప్లవ సాహిత్యంలో యువతరం మరింత బాధ్యతగా, ఉత్సాహంగా, నిర్మాణాత్మకంగా కథా రచనలో నిమగ్నం కావడానికి అన్ని రకాలుగా ప్రేరణ అందించింది. *

పత్రికా ప్రకటనలు

కోర్టు తీర్పులు

రోజుకొక ప్రజా వ్యతిరేక తీర్పు చెబుతున్న దేశంలోకల్లా అత్యున్నత న్యాయస్థానం వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్ల పై కేంద్రం చేసిన చట్టాన్ని కూడా కొట్టివేసి తన అగ్రవర్ణ అగ్రవర్గ స్వభావాన్ని మరోసారి బయటపెట్టుకుంది. అంతటితో ఆగకుండా తన వ్యాఖ్యానం, తన తీర్పే అంతిమమని, అది శాసనమని దాన్ని ఉల్లంఘించే అధికారం ఎవరికీ లేదని ఫత్వా కూడా జారీ చేసింది. చివరకు ఎమర్జెన్సీ విలన్ ప్రస్తుత న్యాయశాఖ మంత్రి భరద్వాజ కూడా ప్రజా సమస్యలపై ప్రభుత్వం చొరవ తీసుకుని శాసనాలు చేయాల్సి వస్తుందని అనక తప్పలేదు.

ముస్లిం రిజర్వేషన్ల విషయంలోగాని, ఒ.బి.సి.రిజర్వేషన్ల విషయంలో గాని న్యాయసంబంధమైన జాగ్రత్తలేవీ తీసుకోకుండా ఓటు బ్యాంకు కోసం కంటి తుడుపు చర్యగా ప్రభుత్వాలు చేసే చట్టాలు కోర్టుల్లో సాంకేతిక కారణాలతో వీగిపోవడం కూడా ఒక ఆనవాయితీ అయ్యింది. అందువల్ల కేంద్ర ప్రభుత్వం వెంటనే ఒ.బి.సి రిజర్వేషన్లపై రివైజ్ పిటిషన్ వేస్తూ అవసరమైతే రాజ్యాంగ సవరణ చేసి అయినా ఒ.బి.సిలకు, ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించి ఈ విద్యా సంవత్సరం నుంచే అన్ని స్థాయిల్లో ఆయా సామాజిక వర్గాలు రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందేలా చర్యలు తీసుకోవాలని విరసం డిమాండ్ చేస్తున్నది. ఈ అంశంపై ఒ.బి.సి. వర్గాలు చేపట్టే ఏ పోరాటాన్నైనా విరసం బలపరుస్తుంది.

వెనకబడిన తరగతుల సంక్షేమ సంఘం ఏప్రిల్ 4న ఇచ్చిన రాష్ట్రబంద్ పిలుపును విరసం బలపరుస్తున్నది.

తేది : 2-4-2007	వి.చెంచయ్య కార్యదర్శి	వరవరరావు కార్యవర్గ సభ్యులు

వాసిరెడ్డి సీతాదేవి మృతికి విరసం సంతాపం

తన రచనల్లో రైతుకు భూమికి ఉండే సంబంధాన్ని, రైతు కుటుంబాల్లోని స్త్రీల పోరాట స్వభావాన్ని వాస్తవ పరిశీలనతో చిత్రించిన వాసిరెడ్డి సీతాదేవి గారు 'మట్టి మనిషి' నవల ద్వారా తెలుగు సాహిత్యంలో ఎల్లకాలం నిలిచే స్థానాన్ని పొందారు.

సీతాదేవి గారు వ్యక్తిగత జీవితంలో, మానవ సంబంధాల్లో నిర్మొహమాటంగా తన వ్యక్తిత్వాన్ని నిలుపుకున్నారు.

'మరీచిక' నవలలో విప్లవోద్యమం గురించి ఆమె అవగాహనను విరసం విమర్శించినా, కష్టకాలాల్లో నిర్బంధాల్లో, నిషేధాల్లో ఆమె విరసంకు అండగా నిలిచింది.

ఈ వ్యవస్థలో తన అభిప్రాయాలు దాచుకోకుండా ఒక స్త్రీ జీవించడమే ఒక పోరాటం. అందులోను ప్రభుత్వ శాఖల్లో బాధ్యతలు నిర్వహిస్తూ ఈ సమాజం గురించి తన అభిప్రాయాలు రికార్డు చేయడం సాహసమే. ఆ సాహసం స్ఫూర్తి కావాలని ఆశిస్తూ వాసిరెడ్డి సీతాదేవి గారి మృతికి విరసం సంతాపం ప్రకటిస్తున్నది.

తేది : 14-4-2007	వి.చెంచయ్య కార్యదర్శి	వరవరరావు కార్యవర్గ సభ్యులు

'చార్వాక' రామకృష్ణ గారి మృతికి విరసం నివాళి

జీవితమంతా చార్వాక దృక్పథంతో భారతీయ సమాజాల్లో హేతువాద భావాజాల వ్యాప్తికి పోరాడి, ఆ వెలుగులో బాల్యం నుంచే నిజమైన చదువులను తెలుగు ప్రజలకు అందించడానికి మంగళగిరిలో ఆశ్రమం నెలకొల్పి, నాస్తికులు మొదలుకొని విప్లవాదులవరకూ అందరికీ ఒక వేదిక కల్పించి ప్రశ్నించే చైతన్యాన్ని పెంచిన రామకృష్ణ గారి మరణానికి విరసం తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది.

మాకు అత్యంత సన్నిహితుడు, ఆప్తుడు అయిన రామకృష్ణ లేని లోటును విప్లవ సాహిత్య, సాంస్కృతిక రంగంలో మా అవగాహనతో పూరించడమే మేమాయనకు అర్పించగల జోహార్లుగా భావిస్తున్నాం.

తేది : 18-4-2007	వి.చెంచయ్య కార్యదర్శి	వరవరరావు కార్యవర్గ సభ్యులు

శికారి

నవలిక

సీరియల్

☆ పాణి

(గత సంచిక తరువాయి...)

మర్నాడు...
పైటాలప్పుడు... లీల కొట్యూరుకు పోదానుకుంది.
కానీ సవాస్సింగు కనబల్లా.
యాడికి పోయినాడబ్బా! అనుకుంటా కొట్టం ముందర ఆడుకుంటున్న సన్నదాన్ని ఎత్తి సంకలో వేసుకొని గేర్లో అటిటు తిరిగింది.

సన్నది ఉదరబీక్కొని కిందికిపోయి ఆటల్లో పడింది

లీల కొట్టం ముందర సతికిల పడింది.

ఈ దినం పవారి తంగెడంచకు పోవాల్సిండె - బ్యాండు మేలాలు తీసుకొని రాత్రికి పెండ్లో, సంబరమో ఉండాది. పోతాడో లేదో! గట్టారెడ్డి చేని కాజేసినాక పవారికి అదే ఎదారైంది. ఒప్పుకున్న చోట్లకు కూడా పోతేపోతున్నాడు, ల్యాకపోతేలా. తాగేదీ, ఆనాకొడుకుని నరుకుతా, సంపుతా అనుకుంట తిరిగేది.

లీలకు గౌర మతికొచ్చింది. ఆయాల్నుంచి కనబడ్డమేలేదు. యాడికి పోయిందో, యాడ తింటుందో. లీల కాపరానికి పోయినప్పుడు గౌర ఊళ్ళో లేదు. 'ముసల్ది ఎతిమతం మనిషి, తిరుగుతా ఉంటది' అన్నారు పెండ్లప్పుడు. వాల్లన్నట్లే - యాడాదిగ్గాని తిరిగిరాలా. వచ్చినాకైనా యింటికాడ ఉన్నదిలా. నాలుగిండ్ల కాడికిపొయ్యేది, అడక్కొచ్చుకొని తినేది, వాల్లనీల్లను ఒంగపోయి సారాయి తాగేది. రెన్నెల్లకో మూన్నెల్లకో కల్లుకోసరం ఎంపర్లాడుతంది. కల్లు దొరక్కపోతే ఒక్కతే యాడబడితే ఆడ నిలబడి, కూచోని ఓ... అని ఏడుస్తది. వామె ఏడుపుకు గేరంత శోకంపెట్టినట్టుంటది. లోపల్నుంచి ఎంత బాధ పార్లి వస్తదోకాని, వినేటోల్లకు పేగులు దుసిపడిపోతాయి, ఎట్లాంటోల్లు కూడా కదిలిపోతారు. పొద్దున మొదలు పెడితే పైటాలదాకా ఏడుస్తానే ఉంటది. తిండి కావాలనుకోదు, నీల్లు కావాలనుకోదు, ఒకల్లమాట వినేదీ ఉండదు. కండ్లు మూసుకొని ఒకటే ఏడుపు.

పవారీనో, యింకెవరన్నానో నాలుగు రూపాయలు చేతిలో పెడితే అప్పుడు ఊరుకుంటది. లేచి పడతా లేస్తా కల్లుకొట్టం కాడికిబొయ్యి యింత తాగితేగాని మనిషి కాలేదు.

లీల కాపరానికి వచ్చినాక గౌర కల్లునీల్లకు దిగుల్లేకుండెంది. అత్త అట్ల ఏడుపు అందుకోగానే దుడ్లు తీసిస్తుండె. అంచున ల్యాకపోతే ఎవరికాడన్నా బదులు తీసికొని యిస్తుంది. ముసిల్ది యింట్లో మెతుకు తినదు - ఎప్పుడన్నా కల్లుతాగనీకేగదా అనుకొనేది లీల.

అట్లాంటిది, యిప్పుడు అత్తమీద గొంతుకాడికుంది.

గట్టారెడ్డి అసలే బో లిగాడి మనిషి. వాన్ని సెలుక్కోను మనకేడైతది. చూస్నీక పూడుబాములెక్క ఉంటాడుగాని, వానితో ఎవారమంటే ఎవ్వరైనాసరే ఎనిక్కి తగ్గుతారు. లంగనాబట్ట... మాయమాటలు చెప్పి కాజేసినాడు... లీల యింగోతూరి గట్టారెడ్డిని తిట్టుకుంది.

'ఏంజేస్తాం! యింక దాన్ని మర్చిపోవాల్సిందే....' ఆ మాటనుకున్నప్పుడు, లీల కడుపులో కదిలాడినట్లయింది, బరువనిపించింది. ఆ యింత పిల్లోల్లకాదరువనుకుంటి' అని గొనుక్కుంది.

కొంచేపయినాక మనసు అనరమీదికిపోయింది.

బస్సెక్కేటప్పుడు యింగోసారి ఆస్పత్రికిబొయ్యి చూచిపోవాలి. మల్లా వచ్చేది యాపొద్దటికో! పలుకుదోడుల్యాక, చేతిలో దుడ్లుల్యాక ఆ పిల్లోడు ఆతరాన బాదపడ్తున్నా, చూస్తా ఊకోవాల్సిందేగాని, ఏం చెయ్యనీక ల్యాకపాయె. ఉసి ఉంటే ఏదైనా చేతిలో పెడితే బాగుండు... అనుకుంది.

బైట గలిబిలి అయితే తలతిప్పి చూచింది

గుమ్మి కొట్టంకాడ....

లీల లేచి ఆడికిపోయింది.

డొక్కోడు ఆ పొద్దన్నుంచి మల్లా యిదే గేర్లోకి రావడం. బయపన్నాడో, బీరుపోయినాడోగాని మూడు దినాల తర్వాత వచ్చినాడు. నేరుగా రానూ కొట్టంకెల్లి నడిచి, ఏమనున్నోగాని తిరిగి యింటికొచ్చినాడు.

వాకిలి కాడ తార కనిపిచ్చింది.

నడుముల దాకా ఎదిగిన బిడ్డను ఎత్తి చంకనేసుకుండాడు

ఆ పిల్ల తిక్కమొగమేసింది

దానికి తెలివొచ్చినాక నాయిన అట్లా ఎత్తుకోవడం అదే మొదలేమో!

డొక్కోడు పిల్లనట్లా గుండెల నిండా అదుముకుండాడు

లోన చెమ్మ ఊరినట్లయింది.

గోగునారలెక్క ఉన్న తార ఎంటికల్లోకి చెయిపోనిచ్చి నిమిరినాడు బుజం మీద ఆ పిల్ల మొకాన్ని రుద్దుకుండాడు. వాడికే తెలియకుండా లోపల్లోపల వెంటాడుతున్న గుబులు తగ్గినట్లనిపించింది. బయం నుంచి బైటపడ్డట్లయింది. ఎంత కాదనుకున్నా లోపల చెలరేగుతున్నదేదో కొంచెం తెరిపిచ్చినట్లయింది.

డొక్కోడు బయం అంటే ఏందో ఎరగడు. ఎన్ని అవులాపనులు చేసింటాడోకాని, ఎన్నడు యిట్ల నలిగిపోతా. ఆ పొద్దు లొంగ మొగం మీద తలకాయ ఎగిరేసి పోయినాడుగాని బయంతో తిరిగినాడో, బయం తరిమితే యిట్లా తిరగొచ్చినాడో....

యిప్పుడు కూతుర్ని చూచుకుంటేగాని తెలికబల్లా.

బుజం మీది నుండి తార దిగబోయింది.

డొక్కోడు పక్కన ఉండే మొండి గోడ మీద కూచ్చోని కూతుర్ని వొళ్ళోకి తీసుకుండాడు.

ఆ పిల్లకు కొత్తగా ఉంది.

యింతలో గుమ్మి యాన్నుంచి వచ్చిందోగాని, తారను మొగుని చేతుల్లోంచి లాక్కుంది.

డొక్కోడు బిత్తరపోయినాడు

తలకాయ ఎత్తి పెండ్లాం మొగంలోకి చూచినాడు.

ఆయమ్మ కళ్లలోని కోపం, అసయం, బాధ డొక్కోన్ని కలవరపెట్టినాయి.

"ముండనాయాలుకు కూతురంటే మొగం ఎలిసిందేమో! రాగానే బో ఎత్తుకుండాడు...." అని గయగయలేచింది.

లీల అప్పుడే ఆడికి వచ్చింది.

డొక్కోడు యింకా తేరుకోలా. అట్లనే చూస్తుండాడు. నోట్లోంచి ఒక్కమాట కూడా రాలా.

తార కనురెప్పలు కదిలిచ్చకుండ అటు ఇటు చూస్తా నిలబడింది.

గుమ్మికి ఎన్నిదినాల నుంచో లోపల పేరకపోయిన కోపమంతా బైటికొచ్చింది. రానూను నోటికొచ్చినట్లు తిట్టింది. దాన్ని పెండ్లి చేసుకున్న దానికంటే, తియ్యక అన్నే ఉంటు యింటికెల్లి తొక్కి చూడకపోవడమే గుమ్మి అరాయించుకో ల్యాకపోయింది.

లీల సర్ది చెప్పబోయింది

గుమ్మి వినేరకమైతే గదా

లీలను యిధిలచ్చి పారేసింది

లీలను గమ్మునైంది

యింకొంత మంది జమైనారు

"ఈ లిగాడి దినాం ఉండేదే" అని ఎవరో యాసిరికి పన్నారు.

గుమ్మి ఆ మనిషికెల్లి గుర్రున చూచింది.

'యిది నోరు తెరిచిందంటే ఒకతాయన మూతబడదు....' అనుకుంటా లీల వెనక్కి తిరిగింది.

'వీడు యాడికి పోయింటాడు? మబ్బులోకన్నా ఊరికిపోవాల. ఆడ ఏమయితుందో ఏమో.....' అని నాయిన కోసం అట్లా రోడ్డు మీదికి చూపు సారించింది.

అది సరిగ్గా మట్కా జోరుగ నడిచే టైం....

గుమ్మి గొంతు గంటకొట్టినెట్ల వినిపిస్తా ఉంది.

యింకే అలికిడీ లేదు

యింతలో షాహూ, లొంగ యింకొంత మంది మొగోల్లు రోడ్డు మీది నుంచి ఏందో అరుచుకుంటా వచ్చినారు. మాటిమాటికి షాహు లొంగకు అడ్డం తిరిగి చేతులు ఊపూపి అరుస్తాండు.

తక్కినోల్లు గూడ తలావొక మాట అంటుండారు

ఏందా? అని లీల ఎదురుబొయ్యింది

సవాస్సింగు యాన్నో ఎనకబన్నట్టుంది, గసపోసుకుంటా ఉరుక్కుంటా వచ్చి వాల్లలో చేరినాడు.

లొంగకు, షాహూకూ కొట్లాటపడిందేమో అనుకుంది లీల

ఎండ మిటమిటలాడుతా ఉంటే....

చెమటలు కక్కుకుంటా దావలో నిలబడి అరుచుకుంటుండారు.

లొంగ అందరి మాటలు వింటూ, వాల్లను తోసుకొని ముందుకు నడుస్తాండు.

సవాస్సింగు యిల్లు దాటిపోయినారు.

మొగోల్ల మాటలు విని గుమ్మి అరవడం ఆపేసింది. డొక్కోడు యిదే సందని ఆన్నుంచి లేచి గుంపులో కలిసిపోయినాడు.

అవతలగేర్లో యిండ్ల సందున మట్కా ఆడేటోల్లలో ఒకరిద్దరు ఉరికెత్తుకుంట యివతలికి వచ్చినారు. మామూలుగైతే ఆయాలప్పుడు గేర్లోకి యింగో పురుగు జొరబడదు. పదిగంటల్నుంచి పొద్దువాలేదాకా ఒక్కల్లి సారాయి కాగుతా ఉంటే, యింకొక్కల్లి మట్కా నడుస్తా ఉంటది. పేటంత గుసగుసలు తప్ప అరుపులు, కేకలు ఉండవు. గుమ్మి అరిచేది ఏంటికో తెలుసుగావట్టి దాన్ని వట్టిచ్చుకోలా. మొగోల్ల అరుపులు మాత్రం మట్కా ఆడేటోల్లకు కలవరపెట్టినాయి.

కొంచేపు నిలబడి సూటిగా పెద్దమంచుల కెల్లి చూచినారు.

ఏం తెలిసెనోగాని ఎనక్కిపోయి మల్లా మట్కాలో పడిపోయినారు.

"పుల్లూరు కొండాడ్డి తోట అమ్మేతప్పుడు శికారోల్ల గుడిజాగ అట్లానే వదలాల అని రాసిచ్చెగదా. యిప్పుడు ఈ నా కొడుకులు ఎట్లా లేపేస్తరు?" సవాస్సింగు తిట్లు లంకించుకుండాడు.

షాహూ కొంచెం తాగినెట్లుంది.

ఒకటేమైన వదులుతుండాడు.

"గేర్లో వాల్లందర్ని తోలకపోయి ఆనిగాల్ల కతేందో చూడాల" అని ఊగిపోయినాడు.

లొంగ లోపల్లోపల ఎట్లజెయ్యాలి? అనుకుంటా అందరి మాటలు వింటా ఉండు. కాని వాయనకు ఏంగాదులెమ్మనే బరూస ఉంది. గుడి పీకేసినోల్లను ఆయమ్మ బతుకనిస్తదా ఏంది? కాళియార్ జోలికిపోతే నెత్తరకక్కుకొని సావరూ? అవి.

"నీకు చాతగాకపోతే చెప్పు, నేను బొయ్యి అడిగొస్తా - శికారోల్లు ఎట్టికి పడింటరనుకుండేమో..." షాహూ కోపం లొంగమీదికి మర్లింది.

చూచ్చూచి లొంగకు మంట పుట్టింది.

"జంబం కూతలు కుయ్యగాకు. యిదేమన్నా పిల్ల ఎవారమా? ఉరికిపోనీక. ఎనకముందు చూసుకోవాల్నా లేదా?" అని గదిమినాడు.

సాహూ మొగం చిన్నగయింది.

ఎనక్కి తగ్గినట్లే తగ్గి, మల్లా అందుకునె

షాహూ పొద్దన్నే లేచి నిడ్జూరు పోయినాడు. ఆన్నే ఈ కత తెలిసింది. వస్తావస్తా దావలో మామిడి వనంలోకి చూచినాడు. దూరం నుంచే నలుగురైదు గురు కనిపిచ్చినారు. ఒకాయన సంకలో కాయితాల కట్ట పెట్టుకోనిండె. యింకోకాయన చేతులు అటుఇటూ చూపిస్తా ఉండె. తక్కినోల్లు ఆన్నుంచి ఈడిదాకా అని టేపులు పట్టుకొని కొలుస్తా ఉండిరి.

నిడ్జూరోల్లు చెప్పింది నిజమే!

ఉరికెత్తుకుంట బంగారుపేటకొచ్చినాడు

బైట టీ అంగల్లకాన్నే లొంగ బీడీ కాల్చుకుంట అగపడె.

"పాతగుడిని దేవసాయమోల్లు పడగొడతారంట...." అన్నాడు.

షాహూ మాటలకు ఆడున్నోల్లంతా కువ్వయినారు. గంటాయనేమో, ఆడ అరుచుకొని అరుచుకొని, గేర్లోకి వచ్చినారు.

లొంగ పోయి డొక్కోని కొట్టం కాడుండే మొండిగోడ మీద కూచ్చున్నాడు. కెనాలు కట్ట వారెంబడి ఉన్న కానిగె చెట్లు డొక్కోని యింటి మీదికి వొరిగి ఉండాయి. చల్లగ నీడ పరుచుకొని ఉంది. కొంత మంది కెనాలు దిగే మెట్ల మీద కూచ్చున్నారు.

బట్టీల కాడుండే ఆడోల్లు ఆదలబాదల లేచివచ్చినారు.

లీలకు అంతా అర్థమైంది.

డొక్కోని కొట్టంకాడికి పోయి గోడవారగ కింద నీడలో కూచ్చుంది.

దేవసాయం వాల్లు గుడిని పడగొడ్తరంట.... అనే మాట గేరంతా పాకిపోయింది. షాహు వస్తావస్తా దావలో ఆనందుటాకీసు గేటుకాడ శనిగ యిత్తనాలు, కలింగర యిత్తనాలు అమ్ముతా ఉన్న ఈరాకు చెప్పి వచ్చినాడు.

పూజారమ్మకు గుబగుబలాడింది.

పొద్దటి ఆట మొదలయి జనాలంతా లోపలికి పోయినాక, బండి గేటుకు కట్టేసి యిత్తనాల సంచులు తీసుకొని వచ్చింది.

రానూ కూడ ఆన్నే ఉంది.

వామెకాడ బ్లాకు టికెట్లు మిగిలిపోయినాయి. ఆట మొదలయినా యింకా ఎవరైనా వస్తరేమో అని ఎదురుచూస్తా ఉంది.

ఈరా కేకేసి రానూను పిలిచి గుడి సంగతి చెప్పింది.

ఆ రోజు రానూకు ఉరువు లాబం లేదు. సినిమాకు పెద్దగా రష్‌లేదు. ఆ ఎదారు మీదుండి ఈరా చెప్పిందాన్ని పట్టించుకోలేదు.

ఈరాకు కోపమొచ్చింది.

'గబ్బుది? ఏది కొబట్టదు. దుడ్లు రాలుతాయంటేనే మంచులతో మాట్లాడేది...? అని రానూకు యినబడేటట్లే తిట్టింది.

రానూ కోపంగ బరబరా నాలుగడుగులు వేసింది. ఆ ఊపు మీద ఈరా మీదబడి కొడ్తదేమో అనిపించింది - ఆడున్నోల్లకు.

మల్లా ఏమనుకున్నోగాని ఎనక్కి తగ్గింది.

ఈరా తిరిగి చూసుకుంటా గేర్లోకి వచ్చింది. సంచులు యింట్లో పడేసి, డొక్కోని కొట్టంకాడికి పోయింది. గుడి తీసేస్తే వచ్చే ఆపదలను తలుచుకొని ఆయమ్మ బీరుపోతాంది. ఎన్నేండ్ల కిందటి మాట! తమ గోత్రమోల్లే అమ్మను నిలబెట్టినారు.... ఈరాకు బాదయితాంది.

దాంతోని లడలడ అరసడం మొదలుపెట్టింది.

అంత మంది ఒకెత్తు, ఈరాగొంతు ఒకెత్తు యింది

లొంగ కసురుకుండాడు.

అయినా ఈరా తగ్గలా

షాహూ వచ్చి తల్లిని గదుముకునె.

యిక్కడ వీల్లు అరుసుకుంటా ఉంటే నానా సుంకులమ్మ కట్టమీద జోగుతా ఉండాడు. వాయినకు నాలుగు దినాల్నుంచి జరం. పెద్దాసుపత్రికి బోయి గులిగెలు తెచ్చుకొనెగాని, వాటికి నయంకాలా. ఒయ్యంత యిరగదీసినట్లు నొప్పులు. పరిగడుపున్నే గుమ్మిని బంగపోయి యింత సారాయితాగి మొబ్బుగ

పడుకున్నాడు. గుడ్డీగలు మూతి మీద వాలి చుర చురమని కొరుకుతా ఉంటే మెలకువ వచ్చింది.

లేచి గోడకు ఆనుకొని కూచ్చుండాడు

యాన్నుంచో అరుపులు వినిపిచ్చి, ఏందా? అని ఆలకించాడు. ఆరుగు దిగి తూలుకుంటా కూతురు యింటికాడికి వచ్చినాడు.

యింతకూ... దేవసాయం ఎత్తేందంటే....

ఫుల్లూరు కొండాడ్డి మంచంలో పన్నాక మామిడివనాన్ని అమ్మకం పెట్టినాడు. కర్నూలు నుండి ఒక సాయిబు పొయ్యి బేరానికి దిగినాడు. అంతా కుదిరినాక కాయితాలు రాసుకొనేటప్పుడు కొండాడ్డి సాయిబుతో

"చూడు సాయిబూ... ఎవరి దేవుడైనా ఒకటే గదా. వనంలో శికారోల్లు గుడి కట్టుకున్నారు. ఆ పొద్దు నేనే నాకు తోచినంత యిచ్చినా. నా గొప్పతనమేం లేదు, ఆ యమ్మ నాతోని చేయించుకుంది. అంతే. కొత్తగా కట్టిండేది ఓ వారకుండాదనుకో. అదెవరికి అడ్డంరాదు. శికారోల్లు మొదట నిలబెట్టుకున్న పాతగుడి ఉండదిగదా, అది మామిడి చెట్ల మధ్యలో ఉండది. రేప్పొద్దున ఏది ఏమైనా ఆ జాగ అట్లనే వదిలెయ్యాల, శికారోల్లను లోనికి రానిస్తా ఉండాల...." అన్నాడు.

దానికి సాయిబు... "అదేందన్నా.... నువు చెప్పినట్లే చేద్దాం. నీకుగిన నమ్మకం ల్యాకపోతే చెప్పు, కాయితాల్లో రాసుకుందాం. నా తరువాత మా పిల్లోల్లు ఏం జేస్తారో చెప్పలేం గదా...." అన్నాడు.

కొండాడ్డి సంబరపడిపోయి "నిజమే... గట్టిబద్రంగ ఉంటది..." అని రాపించినాడు.

యాడాది తిరక్కుండానే కొండాడ్డిపాయె

సాయిబు కూడా కాలంలో కలసి పాయె.

నెలకింద మునగాలపాడు దేవసాయం - సాయిబు కొడుకుల్ని పిల్పింపి "మామిడితోట అమ్ముతారేమో చెప్పండి... నేను కొంటా" అన్నాడు.

దేవసాయం యింట్లోంచే మామిడితోట అగపడతది. వాయినకు ఎప్పన్నుంచో దానిమీద కన్నుంది. మామిడిపంట తియ్యనీకగాదు. తుంగబద్ర గడ్డన కర్నూలు దాటంగనే రోడ్డుమీద... కండ్లు మూసుకొని తెరిస్తే లక్షలు పెరిగే పొలం!

దేవసాయం కోడుమూరు ఎమ్మెల్యే. యిప్పటికి శానాసార్లు గెలిచానాడు. వాల్ల జేజినాయన కాపోల్లిండ్లల్లో గాసం కొట్టినాడు. ఆ కాలంలో యాడాదికి వందో రెండొందలో యిస్తే శానా యిచ్చినట్టే. వాయిన బతికినంత కాలం కాపోల్ల చేలగట్లమీదనో, కల్లాల్లోనో, గాడిపాట్లకాన్నో నిద్రపోయింటాడు.

దేవసాయమోల్ల నాయిన గూడ అట్లానే బతికినాడు.

కాని కొడుకు యింగ కన్నగసాటు పడి పైకొచ్చినాడు. అదంతా చదుకొన్నంతవరకే. ఆ తర్వాత కలిసొచ్చె, అడ్డం ల్యాకపాయె. రాజకీయాల్లో దిగి లీడరైనాడు.

మునగాలపాడులో ముప్పై శికారిండ్లు ఉండాయి.

కానీ శానామంది మునగాలపాడు వదిలి బంగారుపేటకు పోయినారు.

యిది జరిగి కూడా పదేండ్లు కావచ్చె.

ఎవరన్నా దొంగతనం చేసినట్లుగిన తెలిస్తే. దేవసాయం మనుషులు శికారోల్లందర్ని కువ్వేసి దండించేటోల్లు. తప్పు చేసినోల్లు, చెయ్యనోల్లు అంతా దెబ్బలు తినాల్సి వచ్చేది. అది తట్టుకోల్యాక - ఆడయితే మంది బలం గూడ ఉంటదని శానామంది బంగారుపేటకు పోయినారు. షాహూవాల్లు అట్లనే వచ్చిండ్రే.

అట్లా పోయినా గూడా వాల్లకు దేవసాయం మంచులంటే కోపం పోలా.

'ఆ నా కొడుకులు ఏకున లేస్తే కర్నూలుకు రావాల్సిందే గదా. బంగారుపేట దాటుకొని ఎట్లపోతరో చూద్దాం' అనుకున్నారు.

శానా దినాలు కాచుకోనుండారు. ఆ సంగతి దేవసాయమోల్లకు తెలిసింది.

కాని రెండు దిక్కులా ఏం జరగలా.

అనుకున్నట్ల దెబ్బతియ్యల్యాకపోయిరిగాని, దేవసాయమోల్ల కండ్లల్లో పడి శానా అనుబగించాల్సి వచ్చె. ఈ కొట్లాటల్లో దిగితే ఎక్కిరామని ఊకుండిపోయినారు. ఈ నడమ కెనాలు కింద ఉండే భూముల్ని లాక్కున్నా గూడ, 'మనమేం సేద్దెం చేస్తామా, కలుపు తీస్తామా? మనకయన్నీ యాడైతాయి' అని గమ్మునుండారు.

దేవసాయం అడిగినాక సాయిబు కొడుకులు లెక్కల మీద లెక్కలు వేసినారు.

అయినా దేవసాయం ఎనిక్కి తగ్గలా.

వాయిన చూపు మామిడి వనం కాడికేలేదు.

ఆడికే అయితే సాయిబు కొడుకులు చెప్పినంత తూగేటోడు కాదు

మామిడి వనాన్ని ఆనుకొని ఆపక్క తుంగబద్ర వొడ్డున నాలుగెకరాల పోరంబోకు ఉండాది. దేవసాయానికి ఎప్పన్నుంచో దాని మీద కన్నుంది మామిడి వనం కూడ కొని కిందికి మీదికి అనుబగించవచ్చని ఈ ఎత్తేసినాడు. ఒక కొనాకు చెట్లలో శికారోల్ల పాత గుడి.

"మధ్యలో యిది ఎందుకురా, పీకెయ్యండి" అని గాసగాండ్లతో చెప్పినాడు.

వాయినకు అదేం అడ్డంరాలా కాని జాగా వదలడం దేనికి? వాల్లను చెట్లలోకి రానిచ్చేది దేనికి? అనుకుండాడు. కాయితాలు రాసిచ్చేటప్పుడు సాయిబు కొడుకులు కూడ దాని మాటే ఎత్తలా.

యిప్పుడు దానిమీదే కిందా మీదయితుండారు

"ఆ నాకొడుక్కి కొల్లబోయినంత ఉండె. యాడేడివన్నీ కొంటాడు. కొన్నీ, ఎవడు కాదన్నారు. మజ్జలో గుడి వాడికి ఏం అడ్డమొచ్చిందంట. మన మీద జిద్దుకు కాకపోతే...." సవాస్సింగు అన్నాడు.

నానా అంతా వింటున్నడే గాని పైకి ఏమనలేదు

వాడు బేకనై యిదంతా చేస్తుండు అని మాత్రం అనుకున్నాడు.

"తోటలోకి అడుగుపెట్టమను. ఆయమ్మ చూస్తా ఊకుంటదా? నాగు పామై పడిగలు పైకెత్తి కండ్లు పొడిచి పార్దెంగుతాది...? ఈ రా కుడిచేతి రెండువేళ్ళు కస్సున గాల్లోకి విసిరి ఊగిపోతా అనింది.

నానా చిన్నగాగి "అట్లనుకొని గమ్మునుండరాదు. ఆ మయిన అరిసేది లేనికి?" అన్నాడు.

ఆ మాట లొంగకు కూడా నచ్చలా.

ఎవరో సాయం పొట్టెగాడు నానా మీదయిరసబన్నాడు.

"ముందు నువ్వు మూసుకొని అవతలికిపా. ఈడుండి సొట్టకూతలు కూసినావంటే మెడకాయ యిరగదీస్తా...." అన్నాడు.

శామూ చచ్చిపోయినప్పన్నుంచి నానా బవానీకాడికి పోయిందీ లేదు. తలుచుకుందీ లేదు. కొడుకుతోపాటే వాయినకు బయం కూడా పోయింది. ఆయమ్మ ఉండదా? లేదా? అనే చింత లేదు. భయం పోయినాక నానాకు అంతా కొత్తగా ఉంది. దేవసాయంతోని గలాటకు దిగితే ఏమయితదో! అనే దిగులయితే ఉంది. ఆడున్నోల్లంతా తలావొకమాట అంటా ఉంటే లోపల దిగులు మర్లబడతా ఉంది.

ఆ పిల్లోడు అంతలావు మాట అన్నా, నానా వినిపడనట్లే కూర్చున్నాడు. తాగిండేది దిగిందేమో, షాహూ మెత్తబన్నాడు.

నేల మీద కాల్లు బారజాపుకొని కూచ్చొని తలకాయ కిందికి యాలేసినాడు

ఒట్టీల కాడున్న ఆడోల్లు జాంకులోసారి యిటుతొంగిచూచి మొగోల్లు ఏం మాట్లాడుకునేది ఆలకిస్తా ఉండారు. గుమ్మి కొంచేపు ఆ గడిబిడిలో ఉందేమోగాని, బట్టీకాడికి పోయి నిప్పు రాజేసింది.

మట్కా నంబర్లతో సతమతమయినోల్లు ఆ పొద్దటికి ఊపిరి పీల్చుకొని బైటికి పోయినారు.

ఎండ కిందికి వాలింది, కానీ చురచురమనడం తగ్గలా.

కెనాలు కట్టపక్కన మాత్రం చల్లబడింది.

అరిసే కాడికి అరిసి అంతా మెత్తబన్నారు.

కడాకు లొంగ "రేపు దేవసాయాన్ని అడుగుదాం. అంతకాడికి మనమేం జేస్తాం" అన్నాడు.

"ఆయమ్మ తల్చుకుంటే ఎనిక్కి తగ్గుతాడు, ల్యాకపోతే లేదు. వాని పిల్లలు పిల్లలుగూడ అనుబగిస్తారు...." సవాస్సింగు అని లేచినాడు.

నానా అప్పటికే సుంకులమ్మ కట్టమీదికి చేరినాడు.

సవాస్సింగు పోతా ఉంటే లీల ఎనికీడ్డి నడిచింది.

సన్నది యాడికి పోయిందా? అని అటు ఇటు దూరంగా చూసింది. ఎండలో, నెత్తిమీది నుండి చెమట కారిపోతా ఉంటే కొట్టంకాన్నే అది మట్టిలో ఆడుకుంటా ఉంది.

***

మాపటిదాం

సారాయి అమ్మకం అయిపోయింది.

షాహూకు శికారి మీద మనసుబోయింది. శానా రోజులాయె, మాంసంతినక. జివ్వ సచ్చిపోయినట్లుంది.

ఎట్లయినాగాని, నలుగుర్ని లేవగొట్టి యాటకుబోవాల్సిందే అనుకున్నాడు

సుంకురాత్రి పొయ్యి వారం దినాలాయె. చలి కొంచెం తగ్గింది. మామూలుగైతే చలికాలంలో యాటకు మొగమెక్కదు. కానీ షాహూకు ఏదైనా పడితే పోదు. యింట్లోంచి ఫోకసు లైటు, కర్రలు, వల తెచ్చి బైటపెట్టినాడు.

సవాస్సింగు అంచున రూపాయిగూడా లేక, బీడీలకోసరం షాహూకాడికి వచ్చి, "ఏందిరోయ్.... కుందేల్లకు బోతుండవా..." అని అడిగినాడు.

"ఎన్ని దినాలాయె.... తిని. అవి ఇవి తిన్లాక బేజారయితాంది...." అన్నాడు వల సవరిచ్చుకుంటా.

"అప్పుడే కుందేల్లు పడి, మాంసం తింటున్నెట్ల మాట్లాతుండావే..."

"నేనా పొద్దన్నా ఉత్త చేతుల్తో వస్తినా?...." సవాస్సింగు కళ్లలోకి లోతుగా చూచినాడు - చేసేపని ఆపి.

"అట్లయితే పా... నేను గూడ వస్తా...." అన్నాడు సవాస్సింగు.

షాహూ గట్టిగా నగినాడు.

"నీకు పొగులే చూపు ఆనదు... యింగ కుందేల్లను యాడ తరుముతావ్?" అన్నాడు.

సవాస్సింగుకు రోసమొచ్చె.

కండ్లు యింతలావు జేసుకొని, "ముందు నేనేదో ఊకె అంటిగాని, నీవు యింతలావుమాట అన్నాక ఆగేదే లేదురా" అని ఫోకస్ లైట్ అందుకునె.

వీల్ల మాటలకు యింగో నలుగురు పిల్లోల్లు జమయిరి.

షాహూకు ఉషారెచ్చె.

'సారాయి గొండబొయ్యి చలిలో యింత తాగి, కుందేలు మాంసంగిన కాల్చుకొని తింటే...' అనుకొని దబ్బున అంతా రడీ చేసినాడు.

సవాస్సింగుకు లీల మతికొచ్చింది.

"ఆ పిల్ల ఉండింటే మాంసం తినిపొయ్యేది..." అనుకున్నాడు.

ఆరు మంది ఉల్పాల రస్తా పట్టినారు.

వానా కాలమైతే కుందేల్లు పడవనే మాటే లేదు. మునగాలపాడు దాటితే తుప్పల్లోగూడ మస్తుగ దొరుకుతాయి. రేగడినేలగావట్టి తప్పించుకోలేవు. ఇట్లాంటి రోజుల్లో అయితే ఉల్పాలదాకా పోవాల్సిందే.

దావెంట శికారీ గురించే.

సవాస్సింగు తక్కినోల్లతోపాటు నడవలేక, బుసపోసుకుంట కూడా మాట్లాడుతానే ఉండు. వాయిన యాటకుపోక ఎన్ని దినాలాయనో. ఇయాల వల బుజానేసుకొని పోతా ఉంటే చిన్నప్పటివన్నీ మతికొస్తా ఉండాయి.

ఆయన్నీ కతలుకతలుగా చెప్తా ఉంటే షాహూ తట్టుకోల్యాక.

"రోయ్... నీ గప్పాలు చాల్లే. యింటా ఉండామని ఒకటేమైన చెప్తాన్నావ్..." అన్నాడు ఎనిక్కి తిరిగి.

ఆ మాటని అట్లానే నిలబన్నాడు.

సవాస్సింగు ఉలికెత్తుకుంటా మీదికిపోయినాడు.

"పిల్లనాయాల్లతో రాడం నాదే తప్పు..." అన్నాడు.

"ఆ మాటన్నీక ఉరికిపోవాల్నా...?" అని ఎవరో అన్నారు.

సవాస్సింగుకు ఏమనాలో తోచలా. బడబడ నవ్వినాడు.

మల్లా అంతా నడవడం మొదలుపెట్టినారు.

కొంచేపు సవాస్సింగు ఏం మాట్లాడలేదు. షాహూ వాగెంబటి తుప్పల్లోకి దారితీసినాడు. ఆకాశంలో నెల పొడిచింది. సన్నగా వెలుతురు కనిపిస్తా ఉంది. బిసమీద నడవడంతో చలిలో గూడ పైయ్యంత చెమటలు పట్టినాయి. వాగులో నీల్లు చూచి షాహూ బుజం మీదుండే కర్రలు దించినాడు. మోకాల్ల మీద వొంగి చేత్తో నీల్లు అట్లా ఇట్లా తోసి దోసిలితో తీసుకొని మొగం కడుక్కున్నాడు. నాలుగు గుక్కలు తాగి, గసపోసుకోనీక ఆగినాడు. పక్కన చెట్లల్లో చప్పిడయింది.

అందురు వొకేసారి చూచినారు

వెనక నడుస్తున్న మనిషి ఫోకస్ లైట్ వేసినాడు.

జరజర రెండు కుందేల్లు తప్పించుకున్నాయి.

కొట్టు... కొట్టు... అని సవాస్సింగు అరిచినాడు. అలికిడికి యింగోసాట కదిలినట్లయింది. కొంచేపు అంతా గమ్మునుండారు. ఎవరంతకు వాల్లే యింక ముందుకు పోదలుచుకోనెట్ల నిలబన్నారు. వాగు గడ్డెంబటి యిసకలో ఈ కొనానుంచి ఆకొనాదాకా వల పాతినారు. వెంట తెచ్చుకున్న సారాయి సీసా ఒకతాన గుర్తుగా పెట్టితలా ఒక కట్టె తీసుకొని కుందేల్లు పోయినకెల్లి ఎడందిక్కు నడిచినారు. వాల్లు నడుస్తా ఉంటే అడుగులు పడుతున్న చప్పిడి కూడా రావడం లేదు. సవాస్సింగుకయితే కాల్లకు చెప్పులు గూడక లేవు, గుండె కొట్టుకుంటున్న శబ్దం చెవులకు వినిపిస్తున్నట్లుంది. పోయినంత దూరం పొయ్యి చుట్టూతా చూచినారు. తలా ఒక్కల్లి పోయి, మధ్యలో నుండి ఫోకస్ లైట్ వేసినారు. మసక చీకట్లోకి పై నుండి మెరుపుతీగ రాలిపడ్డట్టయింది. షాహూ వొడుపుగ లైటు అటుయిటు తిప్పుతా ఉండు. సవాస్సింగు ఆ పక్కనే ఉండాడు. అల్లంత దూరంలో చెట్ల కింద జరజరపారిట్లయి, ఒక్క ఉదుపున ముందుకు పాయినాడు. లైటు కండ్లలో పడటాన కుందేలు అట్లనే నిలబడి పోయింది, దానికి దిక్కుతోచలా. సవాస్సింగు దూరం నుండే కర్ర యిసిరిపించి వేసినాడు. కుందేలు చప్పిడి చెయ్యకుండా పడిపోయింది.

సవాస్సింగు వొంగి ఒక చేత్తో కట్టె, యింకో చేత్తో కుందేలు కాలు పట్టుకొని లేచినాడు. షాహూ నిండుగా ముసలోనికెల్లి చూచినాడు. నేలమీద ఫోకస్ లైటు వెల్తురు పరుచుకొని ఉండటాన సవాస్సింగుకు షాహూ మొగం కనిపిచ్చలా. ఒకటి పడేటాలకు అందరికీ ఉషారొచ్చింది. కాని, ఎంత దూరం తిరిగినా లాబం ల్యాకపాయె.

"ఈయాల యింకింతేనేమో..." అన్నాడు దిగులుగా షాహూ.

"నువ్వు వచ్చినావంటే ఉత్త చేతుల్తో పొయ్యేదిలేదంటివే"

సవాస్సింగు కావలసీ ఎకసక్కెంగా అన్నాడు. ఈ వొక్కటి గూడ నేను కొట్టిండేదే.... అన్నెట్ల.

"మట్టసంగా మాట్లాడు ల్యాకపోతే ఈన్నే కుతిక పిసికి బూంచిపెడతా..." అన్నాడు రోసంగా.

సవాస్సింగు నవ్వుతా.

"తిక్కనాయాలా! ఎవరు చూసినారు, నీ కంటికే పది కనిపిస్తాయేమో. అప్పుడే ఏమైందని..." దువ్వినాడు.

ముసిలోని మాట యింగా బైటికి రాలా. గడ్డిపొదలో నుంచి రెండు కుందేలు

పిల్లలు తప్పించుకొని పోయినాయి. వాటికోసం అందరు ఓ... అంటే ఓ... అని అరుసుకుంటా పరిగెత్తినారు. యాడికి పాయెనోగాని కనిపించలేదు. కొంచేపయినాక దూరంగా వాగుకెల్లి పోయి వలలో పడినాయి.

యింకేడికి పోతయ్‌లే అని సవాస్సింగు నడుముల మీద చెయిపెట్టుకొని నిలబన్నాడు. షాహూ అట్లనే లైట్ వేస్తా ఉంటే తక్కినోల్లుపోయి కిసక్కున మెడకాయ యిరగదీసినారు.

"లంగనాయాల! నేను చెప్పలా... పడతాయని. ఆ యింతకే దిగాలు పడితే ఎట్లా?...."

సవాస్సింగు చెప్తా ఉంటేనే షాహు లైటు ఆర్పి ఉరికెత్తుకుంట ముందుకు పోయినాడు. తక్కినోల్లు గబగబా వల ఊడదీసి కువ్వేసినారు. సవాస్సింగు చెట్లల్లోకి పోయి ఎండు పుల్లలు, దుగ్గు తీసుకొచ్చి అగ్గిపుల్ల గీచినాడు. నాలుగోసారికి పుల్లలు రాజుకున్నాయి. షాహు బొడ్లోంచి జానెడు పొడుగున్న కత్తితీసి ఒక కుందేలును పై పైన అట్ల వొలిచి మంటలో పారేసి, బీడీ అంటించుకొని గుండెలనిండా దమ్ములాగినాడు.

మాంసం కాలుతున్న వాసనకు మైమరచిపోయినారు. సవాస్సింగు కఱ్ఱతీసుకొని నిప్పుల్లో పాట్లు పాట్లు పొర్లించి కాల్చినాడు. అందరికి గసదీరి, పై మీది చెమట ఆరిపోయి నడ్డీపున చలి మొదలైంది. వచ్చి మంట చుట్టూ కూచ్చుండారు.

షాహూ తల ఎగరేసి కండ్లతోనే సైగచేసినాడు.

ఒక పిల్లోడుపోయి సారాయి సీసా తెచ్చి, మూత తీసి యింత నోట్లో పోసుకున్నాడు. గుటక మింగుతా సీసా షాహూ చేతికిచ్చి ఎదురుంగ కూచ్చుండాడు.

సవాస్సింగు కఱ్ఱతో పొడిచి చూచి 'కాలిందిలే' అనుకొని మాంసాన్ని నిప్పుల్లోంచి బైటికి పొలిపినాడు.

యింకో పొట్టిగాడు జేబులోంచి ఉప్పుకారం ఉన్న సూపరుకాయితం తీస్తా ఉంటే, సవాస్సింగు "రొంచేపు ఆగాల... గొంతుకాలి సచ్చిపోతవ్" అన్నాడు.

పైకి ఆ మాట అన్నాడుగాని వాయిన గూడ తట్టుకోలేక పోతున్నాడు. నిప్పున్న పుల్ల తీసుకొని యింగో బీడీ అంటించుకుండాడు.

అందరి కండ్లు మాంసం మీదే.

చూచ్చూసి, "యింకంటది అయితెయ్..." అని సాహూ నడుంకు చుట్టుకున్న వల్లె దీసి యిసక మీద పరిచినాడు. చదరంగా ఉన్న రాయిదీసుకొని, దాని మీద పెట్టి మాంసాన్ని ఆలివైన కాడికి ముక్కలు చేసినాడు.

ముక్కలు అట్లా పడుతుంటే ఉప్పుకారం చల్లి కట్టెపుల్లతో అటిటు కలెదిప్పినారు.

చూచ్చొంటానే అందరికి నోట్లో నీల్లూరినాయి

అప్పటికే యింత తాగిన్నేరు.

తలా ఒక ముక్కతీసుకొని ఆ చేతిలోంచి ఈ చేతిలోకి తిప్పుకుంట ఊదుకొని నోట్లోసుకుండారు. నాలిక కాలి గుటుక్కున మింగినారు. కాకమీద కారం తగిలి నోరు బగ్గుమంది. కండ్లింతయ్యి, నోట్లోంచి శబ్దం వచ్చింది.

అయినా, ఏం రుచి! అనుకుండారు

మజ్జ మజ్జలో ఒక్కోగుక్క సారాయి తాగుతా, తింటా ఉంటే, మంట ఆరిపోయినా కూడా చలి అనిపించనేలేదు. పూరా చల్లారి పొద్దేమో అని సవాస్సింగు రెండు పుల్లలేసి గప్పుగప్పున ఊదినాడు.

మంట రాజుకుంది

ఆకాశంలో వెన్నెల ఎక్కువైంది

నల్లగ, గోదుమ రంగులో ఉండే మోడాలు చంద్రుని మీద అటుయిటు తిరుగులాడుతుండాయి.

షాహూ ఆకరి ముక్కను తానే నోట్లో పెట్టుకొని, వల్లె యిదిరించి బుజం మీదేసుకొని నిక్కర మీదనే బయల్దేరినాడు. కఱ్ఱలు, వల, లైటు తలావొకటి తీసుకుండారు. కుందేల్ల కాల్లను చెట్ల తీగతో కట్టేసి, బుజంమీద ముందుకొకటి, ఎనిక్కి వొకటి యాలాడేటట్లు తగిలించుకొన్నాడు సవాస్సింగు.

పొయ్యేటప్పుడు ఒకటేమైన మాట్లాడిన సవాస్సింగు తిరిగి వచ్చేటప్పుడు ఒక్కమాట కూడా మాట్లాడలా. కొద్దిగా తగిందానిమీద నడుస్తా ఉంటే అందరికీ బరువుగా ఉంది.

పేటకు వచ్చే వరకు సగం రాత్రయ్యింది.

పొద్దున ఎండబన్నాక లొంగ గేర్లో నిలబడి అందర్ని కేకేసినాడు. ఓ పది మంది గుంపయినారు. రాత్రంత తుప్పల్లో తిరిగి సవాస్సింగు బెట్టపొయినాడు. అప్పుడే లేచి బైటికొచ్చినాడు.

రాత్రి శికారి పాయినారని లొంగకు ఏకునే తెలిసింది. సవాస్సింగు, ఆలెస్యంగ రావడంతో "ఏందిరా, దేవసాయం కాడికి పొయ్యేది ఉందా? లేదా?" అని కసురుకున్నాడు.

దానికి సవాస్సింగు మొకం చీకరించుకొని 'నేను రడీ' అన్నెట్ల చూచినాడు. అందరు కలిసి షాహూ గానింటికి పోయినారు.

షాహూ యింకా లెయ్యలా.

వాని పెండ్లాం ఊపూపి లేపితేగాని లెయ్యలేదు.

ఏందే... అని తిట్టుకుంట బైటికొచ్చెగాని, వాకిట్లోనే కూలిపోయినాడు.

"దేవసాయంగాడు యింటికాన్నే ఉండంట... పోతున్నం" లొంగు ఒక మాటని ముందుకు కదిల్నాడు. వాడు వచ్చేతట్ల లేడని తెలుస్తానే ఉంది.

షాహు వాకిట్లోనే బండల మీద పడిపోయినాడు. "బరుగొడ్డులెక్క పన్నాడు..." అని పెండ్లాం తిట్టుకుందిగాని, సవాస్సింగు తీసుకోకపోయినా తక్కిన అయిదిండ్లకు తలాయింత కుందేలు మాంసం పడినందుకు వామె సంబరంగా ఉంది. మొగుడు వాకిలికి అడ్డంగా పడిపోతే, అటిటు దాటుకొని తిరిగిందేకాని షాహూను లేవగొట్టలేదు.

మునగలపాడు పోయినోల్లు దేవసాయంతో మాట్లాడి, వాయిన బంకులో యిప్పించిన రూపాయి టీ తాగి మల్లా తిరిగొచ్చే వరకూ షాహూ వాకిట్లో అట్లనే పడి ఉన్నాడు.

లొంగ నేరుగా యింటికిపోయెగాని, సవాస్సింగు షాహూ యింటి కాడికి వచ్చినాడు. షాహూ అప్పటికి లేచి కాల్లు బారజాపుకొని కూచ్చుండాడు.

సవాస్సింగును చూడగానే, "ఏమనె" అని అడిగినాడు.

"యింతమందిమి పోయిన్నా... ఏమనుకున్నో ఏమోగాని 'తిక్కనాకొడుకుల్లారా! నేనెట్ల కనిపిస్తుండా, గుడి పడగొడతనా! ఏంది...' అనె. కొండాడ్డి కాన్నుంచి కతంత చెప్పినంలే. ఆయమ్మ తల్చుకుంటే ఎట్లాంటోనికి కూడా మంచిమాట యిస్తుంది..." అన్నాడు సవాస్సింగు.

"అట్లానో... నాకదే దిగులయితాండె. యింకో పద్దినాల్లో బల్లారి పున్నమి వస్తా ఉండె... మజ్జలో యిదేంది... అనుకుంటి" అన్నాడు షాహూ

దేవసాయం పైకి ఆ మాటలని, లోపల్లోపల ఏమనుకుందో ఆడిదాకాపోయి మాట్లాడినోల్లకే తెలేలా. యింగ షాహూకు ఏం తెలుస్తుంది?

"ఏంగాదులే.... మనం ఊకె బయపన్నం..." అని సవాస్సింగు యింగోతూరి బరూసగా అని ఎనక్కి తిరిగినాడు. *(ముగింపు వచ్చే సంచికలో)*

డాక్టర్ గురుకుల మిత్రకు నివాళి

ప్రముఖ హేతువాద ఉద్యమకారుడు, వామపక్ష విప్లవ సానుభూతి పరుడు డాక్టర్ గురుకుల మిత్ర ఏప్రిల్ 13వ తేదీన మరణించాడు. ఆయన వయస్సు 77 సంవత్సరాలు. గుంటూరు జిల్లా రేపల్లెలో జన్మించిన మిత్ర తెలుగు సామాజిక ఉద్యమ దశలన్నింటితో సంబంధం ఉన్నవారు. హేతువాద నాస్తిక ఉద్యమాల వెలుగులో అనేక సంచలనాత్మక వాద వివాదాలు పాల్గొన్నారు. ముఖ్యంగా పుట్టపర్తి సాయిబాబ మహిమల్లోనే మోసకారి తనాన్ని ఆయన వెలుగులోకి తీసుకొని వచ్చారు. ఆయన మృతికి విరసం సంతాపం.

BCT




WOMEN OF
DIFFERENT AREAS
VILLAGE GIRL
CITY GIRL
A GIRL OF TOWN

KLVA101 M137
Bc

ARUNATARA
RNI REGISTERED NO. 21152/72 March-April-2007

Printed Published Edited and Owned by CHALASANI PRASAD 33-13-3, Seetharamapuram, Vijayavada-520002.
Printed at Nagendra Printing Press, Govinda Rajulu Naidu Street, Vijayavada-2. Editor : Chalasani Prasad.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M137
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	53
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Bhanu
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Paiyaulee
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good